

# మార్పు ఉన్నది కానీ మరణం లేదు

నీలంరాజు లక్ష్మీప్రసాద్

# మార్పు ఉన్నది కానీ మరణం లేదు

నీలంరాజు లక్ష్మీప్రసాద్

**మార్పు ఉన్నది కానీ మరణంలేదు**

*By*

నీలంరాజు లక్ష్మీప్రసాద్

**© Author**

మొదటి ముద్రణ : 2020

కాపీ రైటు కలదు

**వెల : రూ. 150/-**

సోల్ డిస్ట్రిబ్యూటర్స్ :

**(నవోదయ బుక్ హౌస్)**

ఆర్యసమాజ్ మందిర్ ఎదురు వీధి,

కాచిగూడ, హైదరాబాద్-27.

ఫోను : 24652387

రచయిత అడ్రసు :

**నీలంరాజు లక్ష్మీప్రసాద్**

91/3 ఆర్.టి., విజయనగర్ కాలనీ,

హైదరాబాద్-500 057.

ఫోన్ : 23346115

ముద్రణ :

**అనుపమ ప్రింటర్స్**

గ్రీన్‌వ్యూ, 126, శాంతినగర్, హైదరాబాద్-28.

ఫోన్ : 23391364, 23304194

Email: anupamaprinters@yahoo.co.in

# అంకితం



***యమ్.వి.ఆర్. శాస్త్రి***

శ్రీ యమ్.వి.ఆర్. శాస్త్రిగారు, ఆంధ్రభూమి డైలీకి తాను ఎడిటర్‌గా వున్నప్పుడు, అంతకుమునుపు నేను మరో పత్రికకు రాసి విరమించిన వీక్లీ కాలమ్ 'ఆలోకన' ఆంధ్రభూమి డైలీకి రాయమన్నారు. కొన్నేళ్ళు రాసి విరమించాను.

మళ్ళీ 2008 సంవత్సరంలో 'నీలంరాజు నోట్‌బుక్' అనే పేరుతో, వారం వారం కొత్త శీర్షిక 2012 వరకూ రాశాను.

ఈ సుదీర్ఘ కాలంలో అనేక అధ్యాత్మిక, ఆధ్యాత్మికేతర విషయాలను గురించి రాయడం జరగింది. అన్నిటినీ సమాదరిస్తూ ప్రోత్సహిస్తూ వచ్చారు. ఈ పుస్తకంలోని వ్యాసాలు అనాటి ప్రచురణలు.

ఇందుకు ఎడిటర్ గారికీ, ఆంధ్రభూమి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ పుస్తకం శ్రీ యమ్.వి.ఆర్. శాస్త్రి గారికి అంకితమిస్తున్నాను.

***నీలంరాజు లక్ష్మీప్రసాద్***

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | మార్పు ఉన్నది కానీ మరణం లేదు | 7 |
| 2. | మార్పు అంటే భయం | 11 |
| 3. | ఎల్లెడలా చైతన్యం | 15 |
| 4. | నలభై సమీపిస్తున్నప్పుడు | 18 |
| 5. | జరా మృత్యు భయాలు | 21 |
| 6. | దుఃఖ విముక్తి : మహాసుఖప్రాప్తి | 23 |
| 7. | సైన్సు, మతధర్మం | 26 |
| 8. | మతధర్మం సమాధి నుండి పుట్టుకురావాలి | 29 |
| 9. | లల్ల, కబీరు | 32 |
| 10. | కప్పగంతులు | 35 |
| 11. | ఓ తండ్రి వ్యథ | 37 |
| 12. | రాజాజీ  వ్యక్తిత్వం | 40 |
| 13. | మన గాయం మానాలంటే... | 42 |
| 14. | జెన్ తీరు | 44 |
| 15. | సదా సమాధి స్థితి | 47 |
| 16. | దర్శకుడు దార్శనికుడై వుంటే? | 50 |
| 17. | భగవంతునిపై భారం వేయడం | 54 |
| 18. | అయితే  ఏమిటిట? | 56 |
| 19. | అనుభవాల్ని అడ్డుకోకు : అర్థం చేసుకో | 58 |
| 20. | దైవం సేవలో హకీమ్ సనాయ్ | 62 |
| 21. | సన్యాసి ఆహారం | 66 |
| 22. | జగమంతటి హిందువుల నాథుడు | 68 |
| 23. | సభా మర్యాదల అతిక్రమణ | 70 |
| 24. | దేవుణ్ణి చూడాలని ఉందా? | 72 |
| 25. | మురికి | 73 |

26. అక్బర్ భారతం 75
27. కఠిన నియమావళి 77
28. ప్రశ్న ఉదయించడమే ప్రారంభం 79
29. పిలిచిన పలికెడివాడు 81
30. జీవితానికి ఆభరణం 83
31. ఆత్మలు దేహం ధరించక ముందు 85
32. పరిశీలించనిది జీవితమే కాదు 87
33. రక్తమివ్వండి: స్వాతంత్ర్యం అందుకోండి 89
34. 'తాళగతిని భంగపరచకు' 91
35. నేర్వడానికి అర్హతలు 93
36. శస్త్ర చికిత్స ముందు యోగాభ్యాసం 95
37. సమస్యలు సృష్టించే మనసు 97
38. వివేకానందుని అసాధారణ మేధ 99
39. భాషలు వేరైనా పలికింది ఒక్కరే 103
40. కోరిక 105
41. నిజానికి మనం ఆత్మలం 107
42. అనుభవాన్ని పూర్తిగావించడం 113
43. మానవ స్వభావం 119
44. నిరాధార జీవితం 121
45. పలక తుడిచెయ్ 123
46. మనిషి దేనియెడల మరణించాలి? 125
47. ధ్యానమంటే? 127
48. అహం వదలాలంటే 129
49. హృదయ సౌందర్యం 131
50. ఛోనీ దీర్ఘ నిద్ర 133
51. మన కర్మలకు మనమే బాధ్యులం 135
52. భగవంతుడిపై భారం 137
53. విభిన్న సంస్కృతులు 138

# మార్పు ఉన్నది కానీ మరణం లేదు

శ్రీ రజనీష్ శిష్యుడైన ఓ యువకుడు ఆయనతో మాట్లాడుతూ 'ఈమధ్య నాకు కాన్సర్ వ్యాధి వున్నదని డాక్టర్లు నిర్ధారించారు. అవ్యక్తమైన స్థితిలో మరణిస్తానేమోనని, ఇక మీవద్దకు చేరలేనేమోనని తగని భయమేసింది. అదృష్టవశాత్తూ మీ దయవల్ల బతికి బయటపడ్డాను.

మరణించే వేళ ధ్యానం ఎలా జరగాలో తెలియజేయండి. స్పృహ లేకుండా పోయే మందులూ మాకులూ డాక్టర్లు ఇచ్చేవేళలో, ధ్యానించడం సాధ్యమేనా? ఎనిస్తీషియా ఇచ్చిన సందర్భంలోనూ, నిద్రించే సమయంలోనూ, 'కోమా'లోకి వెళ్ళిన పరిస్థితిలోనూ, వారి వారి చైతన్యం గతి ఏమవుతుంది?"

అందుకు శ్రీ రజనీష్ సమాధానమిస్తూ, "మొదటి సంగతి, మరణమనేది లేదు. అది అర్థం చేసుకో. మరణమనేది ఒక పెద్ద భ్రమ; అది ఎప్పుడైనా మరొకరికి సంభవిస్తున్నట్లు తోస్తుంది. నీకది సంభవిస్తున్నట్లు స్వయంగా ఎరుగవు. దానిని బాహ్యంగా మరొకరి విషయంలో చూస్తావే కానీ, నీలోన నీకు మరణానుభవం జరగదు, అదేమిటో నీకు తెలియదు. లోలోన నీ అసలు కేంద్రంలో ఏమి జరుగుతున్నదో నీవెరుగవు. లోన అతి విలువైన అమూల్యమైన ప్రక్రియ ఏదో సంభవిస్తున్నది. నీకు తెలిసేదల్లా ఆ మరణించే మనిషి మాట్లాడగలిగి లేడనీ, శ్వాసాడడం లేదని, నడువగలిగి లేడనీ మాత్రమే అర్థమవుతుంది. నాడి ఆడడం లేదు, గుండె కొట్టుకోడం లేదు – మరణించాడంటున్నారు.

ఇది నిజం కాదు. ఇది ఎలా వుందంటే, ఎవరైనా 'నేను ప్రేమిస్తున్నాను' అంటాడనుకోండి. అతడి గుండెను చీల్చి ఈ ప్రేమ ఎక్కడుంది? అని వెతకనారంభించి నట్లుంటుంది. అది భౌతిక పదార్థం కాదు కాబట్టి ఎంత వెతికినా కనిపించదు. అది ఓ గుణం. దానిని అనుభవించే వీలుంది కానీ, దానిని కంటితో చూడలేవు, చేతితో ముట్టుకోలేవు. జీవం అవ్యక్తంలో ఉద్భవిస్తుంది. అది అలాగే ఉద్భవించాలి. ఆ శిశువు, తల్లి గర్భం నుండి అమిత ఇరుకైన సందుగుండా బాహ్య ప్రపంచంలోకి రావాలి. అలా శిశువు బయటికి

రావడమంటే, ఆ అవస్థ మరణంతో సమానం. అంతకుముందు తొమ్మిది నెలలపాటు శిశువు ఎంతో సుఖంగా బ్రతికింది. ఇప్పుడా సుఖశాంతుల ప్రపంచంలో నుండి బయటికి రాక తప్పడంలేదు.

తల్లి గర్భంలో వున్నంతకాలం అది స్వర్గంలా వుండేది – ఏ సమస్యలూ ఏ బాధలూ లేవు. అటువంటి స్వర్గం నుండి ఈ నిత్య సంఘర్షణలతో, ఈ రణగొణ ధ్వనులతో, ఈ అసుఖ అశాంతులతో నిండిన లోకంలోకి రావడం నరకంలోకి ప్రవేశించి నట్లుంటుంది.

ఒకప్పుడు శిశువుగా రూపొందుతున్న తరుణంలో గర్భసంచిలో తనకెంత సుఖంగా వుండెనో దానినే మనసులో చిత్రించుకొని, 'ప్రొజెక్ట్' చేసుకున్నదే, మనిషి 'స్వర్గం' అంటున్నాడని మనస్తత్వ శాస్త్రజ్ఞులంటున్నారు. శిశువు తల్లితోకలిసిపోయి, తాను విడిగా ఒక జీవినని కూడా తెలియకుండా, తాను నివసిస్తున్న పర్యావరణం నుండి కూడా వేరుగా వున్ననే భావం లేకుండా బ్రతికిన ఆ సుఖ జీవనం నుండి, పరిచయంలేని ఈ పరాయి లోకంలోకి వచ్చి పడుతున్నాడు. ఇక్కడ వచ్చిపడినప్పుడు ఇక్కడి వారి ప్రవర్తన కూడా అతడి భయాలను రుజువు చేయనారంభిస్తుంది. అతడు తన అమాయకత్వంలో ప్రేమ, ఆదరం మంచితనం స్నేహం, సహవాసం ఆశిస్తాడు. వాటికి బదులు దుర్మార్గం, మోసం, కపటం, వంచన మొదలైనవి అతడికి తారసిల్లనారంభిస్తై. ఈ జీవితమింతే కాబోలు, మనమూ మోసం, వంచనా అవలంబిద్దాం. అనుకున్న తర్వాత కూడా, దుఃఖమూ బాధా వెన్నాడుతూనే వుంటై. భూలోక జీవితం నరకప్రాయమని తేల్చుకుంటాడు. వీటన్నిటికీ అలవాటుపడి రాటుతేలిపోతాడు. అంతటితో, ఇక తరుణోపాయం లేనట్లే. జీవితం ఇలానే వుండాలా, లేక మరో రకంగా ఆనందమయంగా జీవించే వీలుందా అనే విచారణ చేయాలని కూడా తోచదు. తనలోకి తాను చూచుకోవాలనిపించదు, లోకమంతా కలిసి, 'ఈ జీవితం దుఃఖభాజనం అని కోడై కూస్తుంటే, ఆ మాటకాదని, "నేను స్వయంగా కనుక్కుంటాను, ఉండు" అని అతడు తీర్మానించుకునేనా?

మరణమనే దానిని గురించిన నీ భయం తొలగాలంటే, నీ జీవనంలో ఓ విప్లవం సంభవించాలి. నువ్వు పుట్టడమే ఒక మరణావస్థలో పుట్టావు. కాబట్టి భావరూపంలోనైనా, మరణమంటే ఏమిటో నీకు కొద్దిగా తెలుసు. ఇప్పుడు మళ్ళీ మరణాన్ని గురించి ఆలోచించి నప్పుడు, ఆనాటి దానికన్నా ఇది చాలా పెద్దదని నీకు అనిపిస్తుంటుంది. అప్పటి ఆ పుట్టేటి 'మరణావస్థకు'ముందు తల్లి గర్భంలో హాయిగా వుండిపోయావు. ఇప్పుడీ రానున్న

## మార్పు ఉన్నది కానీ మరణం లేదు

'మరణానికి' ముందు అరవై డెబ్బై ఏళ్ళ జీవితం గడిపావు. ప్రారంభమైన చోటికే మళ్ళీ వస్తున్నావు. ఇప్పుడ భయమెక్కువగా వుంది; ఈ అరవై డెబ్బై ఏళ్ళ జీవితానుభవాలన్నీ అంతం కాబోతున్నాయే అనే భయం. కానీ నువ్వు 'మరణాన్ని వెలుపల నుండి చూచిన అనుభవమే ఉన్నది. ఆ మరణిస్తున్నట్లు కనిపించే మనషి మరణించడం లేదు. ఈ లోకంలో ఏదీ చావదు.

ఒక మాట అడుగుతాను చెప్పు. యువతీ యువకుల జంట ప్రేమించుకుంటున్నారు, అని మనమంటామనుకో. వాళ్ళు ఒకరి చేతులు ఒకరు పట్టుకుంటే ప్రేమించుకుంటున్నారని తెలుస్తుందా? వారిద్దరూ ఆలింగనం చేసుకుంటే మాత్రం మనకు తెలుస్తుందా?

ప్రేమలో సంభవించే మానసికానుభవం వారిద్దరకి మాత్రమే తెలుస్తుంది. ఆ ఇద్దరిలోనైనా ఎవరిది వారికే తెలుస్తుంది. కానీ, రెండవ వారి ప్రేమ నిజమైనదా లేక నటనేనా అనేది ఒక పట్టాన తెలియదు. ఖాయంగా నిక్కచ్చిగా మనిషికి తెలిసేది కేవలం తన అంతర్గత ప్రేమ మాత్రమే. అలాగే నీ మరణం మాత్రమే నీకు ఖాయంగా తెలుస్తుంది. బాహ్యంగా 'ప్రేమ' అనేది ఒక ఊహ, మరణమనేది కూడా నీలో కలిగే భయమూ, ఎవరో వెంటాడి నిన్ను చంపనున్నారనే భీతి – అంతకన్నా అందులో ఏమీలేదు. కానీ నీకు వయసు మీదపడుతున్నకొద్దీ మరణమనే భ్రమ పెద్దదవుతూ వుంటుంది. జీవితమేమో తరిగిపోతూ వుంటుంది. ఇది తరిగిపోతుండడంతో భయం ఇనుమడిస్తుంటుంది. తమ ఊహాలోకంలో, ప్రతివాని అవ్యక్త చేతనలో మరణమనేది ఎక్కడో పెను చీకటితో నిండిన ఒక మహా భయంకర భూతంగాతోస్తుంది. అయితే విచిత్రమేమంటే మరణమనేది లేదని నేను చెప్తున్నాను.

'కోమా'లో అవ్యక్త స్థితిలో, ఎనీస్తీషియా మొదలైన పరిస్థితుల్లో చనిపోయేవారు – వీరందరి గతి ఏమిటి అని నువ్వు అడిగావు. నువ్వు కోమాలో, ఎనీస్తీషియాలో ప్రమాద వశాత్తు మరే పరిస్థితిలో చనిపోయినా – తమనితాము కనుక్కున్నవారు, ఆత్మసాక్షాత్కార మందుకున్నవారు తప్పితే – మిగతా అందరూ, అందరూను మరణించే ముందు అవ్యక్త చేతనులై పోతారు. కాబట్టి ఓ కొద్దిమంది కోమాలో గానీ, ఎనీస్తీషియా సమయంలో గానీ, ప్రమాదవశాత్తూ హఠాన్మరణం చెందినవారు కానీ – వీరే కాదు, అందరూ – ఒక్క సాక్షాత్కారమందినవారూ, తమని తాము కనుగొన్నవారు మినహా – సమస్తమైన వారూ ఏమీ ఎరుగని సమయంలోనే చనిపోతారు. వీరంతా అవ్యక్తస్థితిలోనే జారుకుంటారు.

మరణం సమీపించినకొద్దీ – అంటే నీ ప్రాణం శరీరాన్ని వదలి వెళ్ళిపోయే క్షణం దగ్గర పడుతున్నకొద్దీ, ప్రకృతి ఒక ఏర్పాటు ముందే చేసిపెట్టింది. మనిషి వొళ్ళు తెలియని స్థితిలో పోతాడు, ఇప్పుడిక జరుగనున్నది అన్నిటికన్నా పెద్ద శస్త్రచికిత్స. ఆ శరీరం నుండి 'మొత్తం సత్తను' తీసివేయాలి – ఆ సత్తలోనే నిన్నమొన్నటి వరకూ, అరవై డెబ్భై ఏళ్ళు ఆ జీవి బ్రతికాడు, అదే తాననుకున్నాడు – ఆ సత్తను అక్కడి నుండి తీసేసి మరో గర్భంలో ప్రవేశపెట్టాలి.

మరణం లేదు. కానీ ఉనికిలో సతతం మార్పు జరుగుతూనే వుంటుంది – పునః ప్రారంభం, పునరుద్ధరణ, నవీకరణ సంభవిస్తూనే వుంటుంది. అందుకే రుతువులు, అందుకే శైశవం, యవ్వనం, వృద్ధాప్యం, మరణం. జీవితం నూతన శరీరాలను సృష్టిస్తూనే వుంటుంది. ఉన్నత శ్రేణి మనసులను మేధలను కల్పిస్తుంటుంది. నవ చైతన్యాన్ని ప్రవేశపెట్టూనే వుంటుంది. ఈ నవ్యతనంతా మనం వినియోగించుకోకపోతే, తప్పు మనదే అవుతుంది.

నువ్వు మరణాన్ని గురించి చింతిస్తున్నావు. నిజానికి నువ్వు చింతించాల్సింది ధ్యానాన్ని గురించి. ఒక్క ధ్యానించడం ద్వారానే, నువ్వు సజీవంగా వున్న సమయాన్నే మరణం లేదని తెలుసుకోగలవు. ఇక మిగతావారి సంగతంటావా? వారందరూ, ఏమీ తెలియని స్థితిలో, మరో శరీరంలో నూతనంగా ఆవిర్భవిస్తారు.

ఇక్కడ లోకంలో మిగిలిపోయిన వారందరూ, ప్రాణం కోల్పోయిన ఆ శరీరాలను చూస్తూ ఫలాని వారు చనిపోయారంటూ వుంటారు. నిజానికి అదేమీ లేదు. కేవలం కొత్త రూపం, కొత్త స్పృహ, కొత్త తెలివిలోకి వెళ్ళి వుంటారు.

ఈ జీవితం ఒక మహా విశ్వవిద్యాలయం. ఇక్కడ మనం నేర్వాల్సింది ఒక్కటే – మరణమనేది లేదని, జీవితం శాశ్వతమైనదనీని. కానీ ఇది నీ అనుభవంలోకి తెలిసి రావాలి.

మరణించే వేళ పూర్తి ఎరుకతో గనక ఉండగలిగావంటే, జీవన్మరణాలు రెండు ఎలా సంభవిస్తుంటై అని నీకు స్వయంగా తెలిసి వస్తుంది – మహా రహస్యాల్లో ఇదొకటి.

కొత్త గర్భసంచిలోకి పూర్తి సావధానతతో ప్రవేశించగలవు. జీవితానికి విజయమనేది ఒకటుంటే, నా దృష్టిలో, జీవితానికి ఇదే నిజమైన విజయం.

# మార్పు అంటే భయం

ఓ చిన్న అమ్మాయిని గురించి, తానెక్కడో చదివిన ఓ ప్రేరణాత్మక కథను చెప్ప నారంభించాడు మిత్రశ్రీ. "ఒకనాడు ఓ బూడిద రంగు కంబళి పురుగు ఓ చెట్టుకొమ్మ నుండి తలక్రిందులుగా వ్రేళ్ళాడడం చూచి ఆశ్చర్యపోయింది. ఆ చిన్నది ఆ పురుగు ఏదో వెంట్రుకల పోగులో చిక్కుకున్నట్లు అనిపించింది.

"నీవేదో బాధలో వున్నట్లున్నావ్, నన్నేదైనా చేయమంటావా?" అని అడిగింది.

"లేదమ్మా. నేను సీతాకోక చిలుక నవడానికి ఈ అవస్థ పడక తప్పదు" అన్నది ఆ కంబళి పురుగు. చిన్నదాని అంతర్ భాగాలన్నీ ఒక్కసారి గెంతినట్లయింది. 'సీతాకోక చిలుక నవడానికని అంటున్నదా? అదేమై వుంటుందబ్బా!' అని అనుకుంటూ కంబళి పురుగుతో, "సీతాకోక చిలుక అంటే ఏమిటండయ్యా?" అని అడిగింది.

"నువ్వవాల్సింది అదే; నీకిచ్చిన ఈ బ్రతుకు అందుకే. అది అత్యంత సుందరమైన రెక్కలతో ఎగురుతూ భూమ్యాకాశాలను కలిపేస్తూ వుంటుంది. పుష్పాలలోని అమృతాన్ని మాత్రం గ్రోలి, ప్రేమ విత్తనాలను ఒక పూవు నుంచి మరో పూవువద్దకు కొంపోతుంటుంది. ఈ సీతాకోక చిలుకలు లేకపోతే, లోకంలో పుష్పాలిన్ని వుండవు."

"ఇదంతా నిజమై వుండదు', అనుకున్నదా చిన్నది. 'నీలో కానీ నాలో కానీ ఒక సీతాకోకచిలుక రూపం ధరించడానికి సిద్ధంగా వున్నదని, నేనెలా నమ్మాలి? కేవలం వెంట్రుకలతో కప్పేసిన పురుగు మాత్రమే నా కంటికగుపిస్తున్నది. ఇందులో అందమైన ఆ సీతాకోకచిలుక వుందని నమ్మమంటారా? సీతాకోక చిలుక ఎలా అవాలో చెప్పరూ?" అని విచారంగా అడిగింది.

"ఆ చక్కని రెక్కలతో గాలిలో ఎగరాలనే కోరిక బలీయంగా వుంటే సాధ్యమే. ఆ వాంఛ ఎంత గాఢంగా వుండాలంటే, ఈ కంబళి పురుగు బ్రతుకును త్యజించగలిగి వుండాలి."

అంతకు మునుపు ఆకాశం నుండి వూడిపడ్డట్టుగా కిందపడిన మూడు పురుగుల్ని గుర్తుతెచ్చుకుంటూ, "అంటే చనిపొమ్మనా మీ ఉద్దేశం?" అని అడిగిందా చిన్నది.

"అందుకు సమాధానం 'అవును, కాదు' అని చెపాల్సి వుంటుంది. ఇప్పుడు నీవుగా కనిపిస్తున్న ఈ రూపం అంతరించి, నీలోని నిజమైన నువ్వు సజీవంగా వెలివడుతుంది. జీవితాన్ని కోల్పోవు; జీవితం మారిపోతుంది. సీతాకోక చిలుకలుగా రూపొందకుండా చచ్చిపోయే వారికీ, వీరికీ తేడా కనిపించడం లేదూ?"

"మరి నేను సీతాకోకచిలుక నవాలి అని నిశ్చయించుకుంటే, నే చేయాల్సిందేమిటి?" అని తటపటాయిస్తూ అడిగింది చిన్నది.

"నన్ను గమనించు. నేనొక పట్టుకాయ తయారుచేస్తున్నట్లు చూస్తున్నావు కదా? నేనందులో దాక్కోనున్నట్లు నీకు అనిపిస్తున్నది. కానీ ఈ పట్టుకాయలో ప్రవేశించడం, 'తప్పించుకోడం'కాదు. మార్పు సంభవించడానికి, పాతది అంతమై కొత్తది ఆవిర్భవించ డానికి ఉపకరించే నివాసం. ఇది చాలా పెద్ద మార్పు సుమా. ఒకసారి సీతాకోకచిలుకవైనా వంటే, ఇక ఏనాటికీ మళ్ళీ కంబళి పురుగయ్యే అవకాశముండదు. ఈ మార్పు జరుగు తున్నప్పుడు నీకు గానీ, ఆ పట్టుకాయలోకి తొంగి చూసే మరెవరికైనా గానీ, ఏ మార్పూ సంభవిస్తున్నట్లు తోచదు – కానీ సీతాకోకచిలుక తన రూపాన్ని సంతరించుకుంటున్నది. కాస్త కాలవ్యవధి వుంటుంది – అంతే.

మరో విషయం. ఒకసారి సీతాకోక చిలుకవైతే, నిజంగా ప్రేమించడమంటే ఏమిటో నీకు తెలుస్తుంది. ఈ రకమైన ప్రేమ నీకొక నూతన జీవితాన్ని ప్రసాదిస్తుంది. ఈ కొత్త ప్రేమ, కంబళి పురుగులు పరస్పరం బిగి కౌగిలిలో అనుభవించే సుఖంకన్నా చాలా పెద్ద సుఖం."

"అయితే నేను వెళ్ళి నా చెలికాడ్ని కూడా పిలుచుకువస్తాను" అన్నది ఆ చిన్నది. కానీ చెలికాడు, ఇప్పటి జీవితంలో అమిత లోతున కూరుకుపోయాడని గుర్తొచ్చి, అక్కణ్ణించల్లా అతణ్ణి తీసుకురాగలిగి వున్నానా, అని విచారించింది.

"విచారించకు చిన్నీ, నువ్వు మారితే అందమైన రెక్కలతో గాలిలోకి ఎగిరి, సీతాకోక చిలుకలు ఎంత ముచ్చటగా, స్వేచ్ఛగా గాలిలో విహరించగలవో నీ చెలికాడికి చూపించ వచ్చు. అప్పుడు అతడు కూడా, 'నేనూ సీతాకోకచిలుకనైతే బాగుణ్ణు' అనుకుంటాడేమో."

కానీ చిన్నది మాత్రం చాలా ఆదుర్దా పడసాగింది. "మరి నా చెలికాడు తిరిగివచ్చి, నే కనిపించకపోతే అతడి మనసేమైపోతుంది? నా కొత్త రూపాన్ని చూసి నన్ను గుర్తించక పోతే ఏమయేను? ఒకవేళ తాను కంబళి పురుగుగానే ఉండిపోవాలని నిశ్చయించుకుంటే, అప్పుడు నా గతేమిటి?"

కంబళి పురుగులుగా వుండిపోతే కనీసం ఏదో ఇంత తింటూ, అలా అలా బ్రతుకు వెళ్ళదీయచ్చు; ఏదోలా మాకు చేతైనట్లు ప్రేమించుకోవచ్చు. రెండు పట్టుకాయలు కలిసే మార్గమేమిటి? ఇలాంటి పట్టుకాయలో చిక్కుకోడం ఎంత భయంకరం?' అనుకున్నది.

రెక్కలు మొలిపించుకున్న అద్భుతమైన పక్షి ఆకారం దాలుస్తాననే హామీ ఏమి లేనప్పుడు, తాను ఇప్పటివరకూ ఎరిగివున్న ఈ కంబళి పురుగు జీవితాన్ని చూస్తూ చూస్తూ ఎలా వదలుకోడం? దేనిపై ఆధారపడి, తానీ సాహసయాత్రలోకి అడుగు పెట్టాలి? మరో కంబళి పురుగు అత్యంత విశ్వాసంతో తానొక పట్టుకాయ నిర్మించుకొని ధైర్యంచేసి, అందులోకి ప్రవేశించింది కాబట్టా? సీతాకోక చిలుకలను చూచి, ఎవరో చెప్పగా విని, వారి మాటలు నమ్మి, తాను అలా అవగలననే ఆశతో ఇలాంటి ప్రయత్నం ప్రారంభించింది, కాబట్టా?

ప్రయత్నం కొనసాగిస్తున్న కంబళి పురుగు తన పట్టుకాయను పూర్తి చేసుకుంటున్నది. తన తల చుట్టూ కూడా ఆ గూడును నిర్మించుకుంటూ, "నువ్వూ ఒక చక్కని సీతాకోక చిలుకవవచ్చు. మేమంతా నీకోసం నిరీక్షిస్తూ వుంటాం" అని ప్రకటించింది.

ఇక చిన్నది 'ఏది ఏమైతే అదే అవుతుంది,' అని తెంపుజేసి సీతాకోకచిలుక అవడానికి ప్రయత్నం ప్రారంభించింది. తనకుతాను ధైర్యం చెప్పుకోవడానికి ఆ కంబళి పురుగు ఏ కొమ్మవద్ద తన పట్టుకాయను నిర్మించుకున్నదో, తానూ దాని పక్కనే నిర్మించుకో నారంభించిది. 'నేనసలు ఈ మాత్రం ప్రయత్నం కూడా చేస్తానని అనుకోలేదు సుమా! కనీసం సరైన మార్గంలో నడుస్తున్నానని అనుకోడం, అదే కొంత ప్రోత్సాహం ఇస్తున్నది. పట్టుకాయను తయరుచేసుకోగలిగిన పదార్థం నాలో వుందంటే, సీతాకోక చిలుకనవ గలిగే పదార్థం కూడా ఉండే ఉంటుంది.'

సీతాకోకచిలుక రూపం ధరించిన చిన్నదాన్ని చూసినప్పుడు, దాని చెలికాడు మొదట దానిని గుర్తుపట్టలేకపోయాడు. కానీ దాని కళ్ళల్లోకి చూచినప్పుడు, ఆ నేత్రాల్లో

కనిపించిన అసాధారణ ప్రేమను ఓర్చుకోలేకపోయాడు. తాను అంతటి అసాధారణ ప్రేమకు అర్హుణ్ణి కానని అనిపించింది.

తానేమి చేయాలో అతడికెలా తెలిసిందోకానీ, మొత్తానికి తెలిసింది. చిన్నది, చెలికాడు ఇద్దరూ కలిసి, అక్కడ వ్రేలాడుతున్న చినిగిన సంచుల్లోకి ప్రవేశించారు.

మొదట్లో తనకుతానే పట్టుకాయ నిర్మించుకున్న కంబళి పురుగు సీతాకోక చిలుక అయిన తర్వాత, ఈ కొమ్మవద్ద కొచ్చి, మొదట్లో తన తల ఆ సందుల్లోకి దూర్చి, అటు తర్వాత తన తోకను దూర్చింది. అటుపైని చెలికాని వద్దకొచ్చి, అతణ్ణి ముట్టుకునేది. అలా ముట్టుకుంటూ వున్నప్పుడల్లా, చెలికానికి ఆ సీతాకోకచిలుక తనకేదో చెప్తున్నదని అర్థమయింది. ఏమి చెప్తున్నదో దెలియలేదు. కానీ, చివరకు దాని సందేశాన్ని తాను గ్రహించగలిగాడు; తాను చేయవలసిందేమిటో అతడికి అర్థమయింది.

**దేహస్పృహ**

యోగవాశిష్టంలోని ఇంద్ర – అహల్య కథ చదవండి. ఆ కథలో మరణమనేది ఒక మానసిక చర్యగా అభివర్ణించబడింది.

**–అరుణాచల శ్రీరమణులు**

# ఎల్లెడలా చైతన్యం



'దృష్టి ఏ వైపున మళ్ళినా కనిపించేది చైతన్యమే. ఈ చైతన్యమే చరాచర ప్రపంచ మంతటా నిండి వున్నది. చరించే ప్రాణుల్లో ఉండడాన్ని ఎవరూ సందేహించరు. చరించని ప్రాణం లేని వస్తువులలో కూడా చైతన్యం వుంటుందనే మాట విషయంలో కొందరికి సందేహం వుండవచ్చు. కానీ కొద్ది స్థాయిలో వాటిలో కూడా చైతన్యముంటుందని విజ్ఞుల మాట. ఈ సత్యాన్ని ఎరిగి తదనుగుణంగా జీవించగలిగితే, మనిషి, జీవితం ధన్యమవుతుంది; ఏ జీవిని చేజేతుల బాధించడు అనేది అట్లా వుంచి, ఏ వస్తువును కూడ పాడు చేయడం కానీ నిర్లక్ష్యంగా విసిరేయడం కానీ, చేయలేడు. నేటి 'వినియోగించు – విసిరేయ్' సంస్కృతిలో, నే చెప్పే మాటలు అందరికీ రుచించవు, అనేది నాకు తెలుసు. కానీ నే చెప్పదలచుకున్నది చెప్పక తప్పదు' అన్నాడు మిత్రశ్రీ.

లిన్‌చీ అనే జెన్‌మాస్టర్ తన కుటీరంలో కూచోనున్నాడు. ఆయన్ని దర్శించుకోడానికి ఎవరో ఒక అగంతకుడు వచ్చాడు. అతడెందుకో బాగా కోపంగా వున్నాడు. తలుపు దభాల్న తోసి, తన బూట్లను చిరాకుతో కిందికి కొట్టి లోనికి ప్రవేశించాడు. అటు తర్వాత, మాస్టర్‌కు గౌరవ పురస్సరంగా, వంగి అభివందనం తెలిపాడు.

లిన్‌చీ అతడ్ని చూస్తూ 'ముందు వెళ్ళి ఆ తలుపును, ఆ బూట్లను క్షమించమని అడిగి రా' అని ఆజ్ఞాపించాడు. వచ్చిన వాడికి, ఈయన ఎందుకిట్లా అంటున్నాడో అర్థం కాలేదు. అక్కడ కూచున్న వారందరూ నవ్వ నారంభించారు. 'మీరు నవ్వులాపండి' అని వారందరినీ మందలిస్తూ లిన్‌చీ కొత్తగా వచ్చిన వానితో 'నే చెప్పినట్లు చేయలేని పక్షంలో, నీవు వెళ్ళచ్చు. నీతో నేను వ్యవహరించను' అనేశాడు.

'కానీ ఆ బూట్లను, తలుపునీ క్షమించమని అడగడం వెర్రి వ్యవహారంగా వుంటుందండీ' అన్నాడు ఆ మనిషి.

'నువు కోపంతో తలుపును దభాల్న తోసినప్పుడూ, బూట్లను కిందికి వేసి కొట్టినప్పుడూ వెర్రిగా లేదు కాబోలు. ఇప్పుడు వెళ్ళి వాటిని క్షమాపణ కోరమంటుంటే, ఇది వెర్రిగా కనిపించిం దన్నమాట. ప్రతి వస్తువుకీ చైతన్యమున్నదని గుర్తుంచుకో. అందువల్ల నే చెప్పినట్లు చేయి, ఆ తలుపూ, బూట్లూ నిన్ను క్షమిస్తే తప్పతే నేను నీతో మాట్లాడేది లేదు' అన్నాడు లిన్‌చీ.

లిన్‌చీ ఆజ్ఞను శిరసావహింపక తప్పలేదు ఆ మనిషికి. అతడు వెళ్ళి ఆ తలుపును, బూట్లను క్షమించమని వేడుకున్నాడు. మొదట్లో అతడి కిదేదో పిచ్చిగా కనిపించింది. కానీ క్షణాలు గడుస్తున్న కొద్దీ తలుపూ బూట్ల యొక్క మనసులు కరగ నారంభించినట్లూ, అవి తనని క్షమిస్తున్నట్లు, అతడికో వింత అనుభూతి కలగ నారంభించింది.

లిన్‌చీ అతడ్ని గమనిస్తూనే ఉన్నాడు. క్షమించమని అడుగుతున్న ఆ వ్యక్తి చిత్త శుద్ధితో మనసారా అడుగుతున్నాడనీ, తలుపుకీ బూట్లకీ కలిగిన మానసిక బాధ కరిగిపోవ నారంభించిందనీ, లిన్‌చీకి అనిపించినప్పుడు, ఆ మనిషిని తన వద్దకు రమ్మని పిలిచాడు. ఆ వ్యక్తి అటు తర్వాత సన్యాసిగా లిన్‌చీ వద్దనే వుండిపోయాడు.

భౌతిక వస్తువులైనా గడ్డకట్టిన చైతన్యమేనేమో! వాటిని కూడా వొకింత మర్యాదగానూ గౌరవంగానూ చూడాల్సి ఉంటుంది. అసలు మనల్ని మోసే చెప్పుల్ని మన కోసం అవి కంకర రోడ్ల మీద ముళ్ళ బాటల మీద పడ్డ బాధల్ని గుర్తుంచుకుంటే, భరతుడు రామ పాదుకల్ని మోసినట్లు, ఈ మన చెప్పుల్ని కూడా మోస్తే మన రుణం తీరుతుందేమో ఆలోచించండి' అన్నాడు మిత్రశ్రీ.

**తెలియరావడం లేదు**

సూంగ్ వంశపు జెన్ మాస్టర్ ఒకరు ఇలా ప్రకటించాడు. 'జీవులన్నీ ఈ చైతన్యాన్ని నిత్య జీవితంలో వినియోగించుకుంటున్నె కాబట్టే, వాటికీ సంగతి తెలియడం లేదు. ఉదాహరణకు ఈ విశ్వంలోని సమస్తమైన సూర్యులు, చంద్రులు, నక్షత్ర సముదాయాలూ, గ్రహాలు, నదులు, సముద్రాలు సమస్త జీవరాశి యొక్క ప్రాణశక్తి, అన్నీ కూడా మనిషి చర్మం మీది రోమ రంధ్రాల గుండా, ఒక పొర నుండి మరో పొరలోకి చొచ్చుకు పోతున్నప్పటికీ, ఆ రోమ రంధ్రాలు పెరిగి పరిమాణంలో పెద్దవి అవడం లేదు కాబట్టీ,

## మార్పు ఉన్నది కానీ మరణం లేదు

ఈ మొత్తం విశ్వం యొక్క పరిమాణం ఏ కొద్దిగా కూడా తరగడం లేదు కాబట్టీ, ఇదంతా తనలో సంభవిస్తున్నదని మనిషికి తెలియదు. ఒకవేళ ఇది మేధాపరంగా అర్థమైనా, ఈ మొత్తం ప్రక్రియ యథావిధిగా సాగిపోతున్నదని అతడికి తెలియరావడం లేదు.'

**చేతన : అచేతన**

ఒక అచేతన వస్తువును విశ్లేషించి ఇదమిత్థమని నిర్దేశించగలిగినట్లు, పరిణామ శీలురైన వ్యక్తులను వర్గీకరించలేము. ఏమనిషీ సరళరేఖ కాదు. ప్రతి వ్యక్తీ వివిధ వైరుధ్యాలతో కూడిన సంకీర్ణ రూపం.

### *నీ ప్రతిబింబాలే*

*ప్రాచీన కథకుడు ఈసప్ గ్రీసు దేశంలో ఏథెన్స్ నగరంవద్ద ఒక రోడ్ అంచున కూచున్నాడు. ఎవరో ఒక మనిషి అటు వెళుతూ, 'ఈ ఏథెన్స్ నగరంలో ఎలాంటి వారు జీవిస్తుంటారు?' అని అడిగాడు.*

*అందుకు బదులుగా ఈసప్ ఆ వ్యక్తితో "నువ్వెక్కడి నుండి వస్తున్నావో, అక్కడి మీ మనుషులు ఎలా వుంటారో అది చెప్పు" అన్నాడు. ఒకింత చిరాకు ప్రకటిస్తూ ఆ వ్యక్తి "నేను అర్‌గోన్ నుండి వస్తున్నాను. అక్కడివారు అబద్ధాలకోర్లు, దొంగలు, నిత్యం పోట్లాడుకుంటూ వుంటారు."*

*"నేనిలా చెప్పాల్సి వచ్చినందుకు విచారిస్తున్నాను. కానీ ఈ ఏథెన్స్‌లోని ప్రజలు కూడా దాదాపు మీ ప్రజల వంటివారే"నన్నాడు ఈసప్.*

*కాసేపటికి మరో మనిషి అటు వస్తూ, ఈసప్‌ను అదే ప్రశ్న అడిగాడు. ఈసప్ పూర్వం లాగానే, 'నీ రాక ఎక్కడి నుండి? అక్కడి నీ ప్రజలు ఎటువంటివారు?' అనే ఎదురు ప్రశ్న వేశాడు.*

*ఆ మనిషి ముఖం సంతోషంతో వికసించింది. "నేను ఆర్గోన్ నుండి వస్తున్నాను. అక్కడి మనుషులు స్నేహపాత్రులు; ఇతర్ల యెడల దయగానూ, మర్యాదతోనూ ప్రవర్తిస్తుంటారు. సదాలోచన వున్నవారు, వారిని వదలిపెట్టి వెళ్తున్నందుకు విచారిస్తున్నాను' అన్నాడు.*

*ఈసప్ 'బాగుబాగు' అన్నట్లు తల ఊపి, "బాబూ ఇక్కడి ఏథెన్స్‌లోని మనుషులు కూడా అలాంటివారేనని నీకు తెలుస్తుంది" అన్నాడు.*

# నలభై సమీపిస్తున్నప్పుడు



సుప్రసిద్ధ మనస్తత్వ శాస్త్రవేత్త కార్ల్‌గస్తావ్ యూంగ్, మనిషి ముప్ఫై ఆరవ సంవత్సరాన్ని కీలకమైనదిగా పరిగణించాడు. 'మనుషుల జీవిత చరిత్రలు చదివివే వారి వారి ముప్ఫై ఆరవ ఏట, వారికి తెలియకుండా అంతర్గతంగా బ్రహ్మాండమైన మార్పు సంభవిస్తుంటుంది. జీవన భానుడి అధోముఖ యాత్ర ప్రారంభమయ్యే సమయం; అందు వల్ల జీవితం యెడల వారి వైఖరి అసాధారణంగా మారిపోవచ్చు.

నలభై ఏళ్ళు వచ్చేసరికి, గడచిన జీవితాన్ని జాగ్రత్తగా చూచుకోడం అలవాటై పోతుంది. ఆ జీవితాన్ని ఎంత అసహ్యించుకున్నా, ఎంతగా అణచిపెట్టుదా మనుకున్నా, దాని వంక మళ్ళీ మళ్ళీ తీరికగా చూడటం, సమీక్షించుకోడాన్ని ఆపలేదు. అలవాటైన పనులు చేయడ మొక్కటే నిజ జీవితం అయిపోయేటప్పటికి, సంతృప్తి కొరవడ నారంభిస్తుంది. రోజూ రోజూ చేసే ఈ 'రొటీన్' పనులు తప్పితే, నూతనమైనది ఏదీ సంభవించే అవకాశం లేదు అని అనిపించడం మొదలైతే, జీవితం తనని తాను నవీకరించుకోగలిగి ఉండదు. అప్పుడా జీవితం రుచిహీనమై, సారంలేనిదై, గట్టిపడి శిలారూపం ధరిస్తుంది.

జీవనం అనే పదం సర్వ జీవరాశికీ, సర్వ మానవులకూ వర్తించేదే అయినప్పటికీ, మనిషి మనిషికీ ఆ జీవనానుభవంలో తేడా ఉంటుంది. ఏ మనిషికా మనిషే కానీ, అందరికి జీవితం ఒకలా ఉండదు. వ్యక్తిగా ఒక మనిషి ప్రత్యేకమైనవాడు, అసమానుడయినవాడు; అందువల్ల ఒక మనిషి జీవితాన్ని పరిగణించాలి కానీ, సామూహిక జీవనం గురించి మాట్లాడటం సరియైన పద్ధతి కాదు; అలాంటిదేమీ లేదు.

ఈ లోకంలో మానవుడున్నాడే కానీ – అంటే నువ్వున్నావు, నేనున్నాను కానీ, మానవాళి అంటూ ఏదీ లేదు. మానవజాతి అనేది ఒక పదం మాత్రమే. నువ్వు ఏమై ఉండాలని భగవంతుడు భావిస్తున్నాడో, నీవు అదిగానే వుండు; మానవాళిని గురించి

అట్టే చింతించకు. ఈ మానవ సమూహం గురించి – పద రూపంలో తప్పితే నిజానికి, లేని దానిని గురించి చింతించడం ద్వారా ఏదైతే నిజంగా ఉన్నదో, అనగా నీ 'సెల్ఫ్' వంక చూడకుండా తప్పించుకుంటున్నావు. పొరుగువాడి కాంపౌండ్ గోడ మీద గుండా అతడి తోట వంక చూస్తూ 'అదుగో అటు చూడు, అక్కడో కలుపుమొక్క కనిపిస్తున్నది. అలాగే అక్కడ ఆ చెట్ల మొక్కలు మరింత ఎడంగా వేయకపోయావూ? అన్ని మొక్కలకూ సమంగా నీళ్ళు అందుతున్నట్లు లేదు' అనేసి, ఇవతల తన తోట యావత్తూ కలుపు మొక్కలతో నిండిపోయిందని గ్రహించని వానిలాగా వ్యవహరిస్తున్నావు.

ఆత్మ పరిశీలన, ఆత్మజ్ఞానం ప్రజాదరణ పొందనిదైనప్పటికీ, ఎప్పటికప్పుడు లోతుల్లోకి వెళ్తూ, తనని తాను తెలుసుకోడం మనిషికి ఎంతైనా అవసరం; ముఖ్యంగా వృద్ధాప్యంలో అతడి నిజ జీవితం సాగడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. వృద్ధులైన వారు వయసులో ఉన్నవారి పోకడలు పోతూ బతకజూడడం కన్నా అనుచితమయిన హాస్యాస్పదమైన విషయం మరొకటుండదు. నిన్ను నువు కనుగొంటే నీ మొత్తం వ్యక్తిత్వం నీ చేతి కందుతుంది. నీవెందుకు జన్మించావో తెలిసి వస్తుంది. దేని ద్వారా నీవు జీవిస్తున్నావో, దేనికై నీవు జీవిస్తున్నావో స్ఫురిస్తుంది.

నీ మొత్తాన్ని గనక పరిగణిస్తే, నీవొక తర్క విరుద్ధమైన జీవివి అన్నట్లు కానవచ్చి నప్పటికీ, నిజానికి నువ్వు అదేననేది గుర్తుంచుకో. నీకు కలిగే ప్రత్యేక జీవితానుభవాలు మరొక జీవిలో కానవచ్చే అవకాశం లేదు; ఇప్పుడే కాదు, గతంలో కానీ భవిష్యత్తులో కానీ వుండవు. అందువల్ల ఇప్పుడు నీ స్వభావంలో కనిపించే ఈ జీవిత ఖండాన్ని జాగ్రత్తగా గమనించవలసి ఉంటుంది. అందుకు నీ అంతఃకరణ శుద్ధి చెందాలి. నువ్వేదై వున్నావో, అది అవడానికి కృషిచేయమన్నాడో గ్రీకు కవి. నీలో ఉన్న న్యూరోసిస్ అనే నరాల దౌర్బల్య వ్యాధి తొలగాలి. శారీరక అనారోగ్యం యావత్తూ ఒక రకమైన నీరుగారిన మరణావస్థ అని ఎలా వర్ణించవచ్చో, అదే విధంగా ఈ న్యూరోసిస్ కూడా నీరుగార్చిన ఆత్మహత్యగా భావించవచ్చు.

మధ్య యుగాల నాటి మనిషికీ ఆధునిక మానవునికీ తేడా వున్నది. మాట వరసకు మిమ్మల్ని నా ఇంట్లో వుండమని ఆహ్వానిస్తాననుకోండి. 'ఇది బాగా నిర్మించిన ఇల్లు; ఇక్కడ సుఖంగా ఉంటుంది. ఇక్కడ మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటున్నాము.

ఇక్కడ మా తోటలో చక్కగా చెట్ల మధ్య విహరించవచ్చు' అనే మాటలు మీతో చెప్తే, మీరు మా ఆతిథ్యం స్వీకరించాలనుకుంటారు. సుఖంగా ఉండి వెళతారు.

అలా కాకుండా నేను మీతో 'ఈ ఇంట్లో వుండడం కాస్త ప్రమాదభూయిష్ట మనుకోండి. పునాదులు వేసినవాడు అంత సరిగా వేసినట్లు లేదు. ఈ ప్రాంతంలో భూకంపాలు కాస్త ఎక్కువేనని చెప్పాలి. అదట్లా వుంచి, ఈ ఇంట్లో మనుష్యులు జబ్బున పడటం సర్వసామాన్యం. ఈ గదిలో ఈ మధ్యనే మా బంధువు ఒకాయన క్షయ వ్యాధితో మరణించాడు' అని అంటాననుకోండి. ఆ మాటలవల్ల మీలో ఏర్పడిన మానసిక పరిస్థితితో మీరీ ఇంట్లో వుండగలరా?

నవీన మానవుడి పరిస్థితి ఇట్లాగే తయారయింది. మధ్యయుగాల నాటి మనిషికి భగవంతుడితో ఓ చక్కని సంబంధముండేది.మంచివారిని ఆ దేవుడు రక్షిస్తాడని, చెడ్డవారిని శిక్షిస్తాడని ఓ బలీయమైన విశ్వాసముండేది. మానసికంగా ఆధ్యాత్మికంగా తాను భద్రంగా వున్నాననే ధైర్యముండేది. కానీ ఒక దశలో సైన్సు రంగ ప్రవేశం చేసి 'నిన్ను కాపాడుతున్న వారు ఎవరూ లేరు సుమా' అని ప్రకటించింది. అందుచేత నేటి మానవుణ్ణి భయమూ, అభద్రతా భావం పట్టి పీడిస్తుంటై.'

# జరా మృత్యు భయాలు

**త**న చావును గురించి మనిషి పడే నిర్హేతుక భయానికి కారణం జీవితాన్ని వ్యర్థంగా జీవించి వుండడమే; దైవం అనుగ్రహించిన ఈ మహత్తర జీవితాన్ని, దాని సామర్థ్యాన్ని సరిగా, ఉత్పత్తిదాయకంగా వినియోగించుకోక వృధా చేసుకున్న కారణం వల్ల 'అపరాధం చేశాననే' భావం అలముకుంటుంది. ఆ భావమే ఈ భయాన్ని సృష్టిస్తుంది.

వృద్ధాప్యాన్ని గురించిన వివేచనా రహితమైన భయం కూడా అలాంటిదే. వృద్ధాప్యం సమీపించకముందే తన శక్తి సామర్థ్యాలతో ఉత్పిత్తిదాయకమైన జీవితం గడపనేర్చినవాడు క్షీణించడు సరికదా, ఫలవంతమైన జీవితం గడిపే సందర్భంలో తాను అభివృద్ధి గావించిన మేధ, హృదయ సంబంధమైన గుణాలు, శరీరాన్ని వార్ధక్యం కమ్ముకుంటున్నా, దార్ఢ్యం తగ్గుతున్నా – ఆ గుణాలు మాత్రం పెరుగుతూనే వుంటై.

జపనీస్ తైలవర్ణ చిత్రకారుడు హోకుసాయ్ ఇలా రాస్తాడు; నా ఆరేళ్ళ బాల్యం నుండీ ప్రతి వస్తువు యొక్క రూపం చిత్రించడం నాకొక పిచ్చిలా ఉంటూ వచ్చింది. నాకు యాభై ఏళ్ళు వచ్చేసరికి లెక్కలేనన్ని చిత్రాలు ప్రచురించాను. కానీ నా డెబ్భై ఏళ్ళ వరకూ నేను ప్రచురించిన చిత్రాలన్నీ అంతగా పరిగణించతగినవి కావు. డెబ్భై మూడేళ్ళకి, ప్రకృతి, జంతువులు, మొక్కలు, పక్షులు, చేపలు, పురుగులు మొదలైన వాటి అసలు స్వరూప స్వభావాలు కొద్దిగా గ్రహించాను. తత్పర్యవసానంగా నాకు ఎనభై వచ్చేనాటికి మరింత ప్రగతి సాధించ గలననుకుంటాను. తొంభై ఏళ్ళకి వీటన్నిటి యొక్క అసలు రహస్యం కనుగొంటా ననుకుంటాను. నూరేళ్ళ వయసుకు అద్భుతమైన స్థితినందుకుంటాను. నూట పదేళ్ళకు, నేనేమి చేసినా, ఆఖరికి కుంచెతో ఒక చుక్కపెట్టినా ఒక గీటు గీసినా, జీవశక్తితో తొణికిసలాడుతూ ఉంటుంది.

(ఇవి నా డెబ్భై ఐదవ ఏట రాసిన వాక్యాలు అని లిఖించుకున్నాడు హోకుసాయ్)

**పిచ్చి : భక్తి**

రఘునాథుడు సాంసారికుల దృష్టిలో పిచ్చివాడు. అందుచేత ఇంట్లో వాళ్ళు అతణ్ని ఒక కంట కనిపెట్టి ఉండేవారు. ఇతడ్ని గొలుసులతో కట్టివేయమని కొందరు సలహా

ఇవ్వగా, రఘునాథుని తండ్రి గోవర్ధనదాసు 'నాయనలారా, రఘు పిచ్చివాడు కాదు. అతని పిచ్చి సాంసారిక బంధములను ఛేదించ కోరుచున్నది. అపారమగు సంపద, సౌందర్యవతియగు భార్య అతణ్ణి ఇంట నుంచలేకపోయినచో, గొలుసులు ఇంట నుంచగలవా?' అన్నాడు.

ఒక రోజున అతడి గురువు బలరామాచార్యులు తమ ఇంటికి వచ్చినందువల్ల ఆయనతో మాట్లాడుతూ ఆచార్యుల ఇంటి వరకూ వెళ్లెను. 'అయితే వెళ్ళుదునా?' అని అడిగెను. ఆచార్యులు 'ఓహో, మాటలలో ఏమియు తెలియనే లేదు. ఇంటి నుండి చాలా దూరము వచ్చివేసితివి, వెళ్ళుము. వెంటనే వెళ్ళి చేయదగిన పని చేయుము'. ఇది గుర్వాజ్ఞగా భావించి, రఘునాథుడు అచ్చటి నుండి తిన్నగా పూరీ వెళ్ళెను; గౌరాంగ ప్రభువుల చెంత నుండెను.

తండ్రి పంపిన డబ్బును, సేవకుని ద్వారా తిరిగి పంపించి వేసెను. 'ధర్మము, అర్థము, కామము అను మూడు పురుషార్థములను ఇచ్చు గృహస్థాశ్రమము నుండి - ఇంటి నుండి బయటికి వచ్చి సన్యాసము తీసికొనిన తర్వాత గృహస్థ ధర్మములను - విషయాదులను సేవించినచో, ఆ సన్యాసికి సిగ్గులేదని చెప్పవచ్చును. అతడు కక్కిన కూడు తినుచున్నాడు. కావున నేను ఆ డబ్బు స్పృశించుటకు కూడ తగను'.

జనులు అతణ్ణి 'గుర్తించారు.' అందుచే అతడికి భిక్ష అధికముగా లభించుచుండెను. ఇది కాంచి, భిక్షాటనమును మానివేసెను. అంతటి నుండి భిక్షుకులతో బాటు క్షేత్రమునకు వెళ్ళి ప్రసాదమును తీసుకు వచ్చెడివాడు. అన్నక్షేత్రమునందు కూడ ఆయనకు పారతంత్ర్యము కానవచ్చుచుండెను.

★ ★ ★ ★

**సన్యాసి : కుక్క, నక్క జీవితం**

పట్టణ స్వామి ఇట్లు చెప్పెను : సన్యాసి కుక్క వలె తినవలెను. నక్కవలె తిరుగవలెను. కుక్క ఇంటింటికి తిరిగి ఏది దొరికితే అది తిని సంతోషించును. అటులనే సన్యాసి కూడ మానావమానములను లెక్కసేయకుండా ఏ భిక్ష దొరికినా దానితోనే తృప్తిని పొందును.

నక్క ప్రాణులన్నింటి కంటెను ఎక్కువ జాగ్రత్త కలది. అందుచే జీవహింస చేయు ఇతర ప్రాణులు ఏవియు దానిని చంపలేవు. అటులనే సన్యాసి కూడ జగత్తునందు జాగ్రత్తగా వుండి, మాయాపాశమున చిక్కుకొనరాదు.'

'వార్తాలాపం' గ్రంథం నుండి.

# దుఃఖ విముక్తి : మహాసుఖప్రాప్తి



ఉరువేల కశ్యపుడు గౌతమ బుద్ధుణ్ణి, తనని చాలా కాలంగా వేధిస్తున్న ప్రశ్న నొకటి అడుగుతాడు. 'స్వ అనేది కానీ, ఆత్మ అనేది గానీ లేకపోయినట్లయితే నిర్వాణ సాధనకై మనిషి అసలు ఆధ్యాత్మిక మార్గాన్ని ఎందుకు అనుసరించాలి? మోక్షమందుకునేది, నిర్వాణం చేరుకునేది ఎవరు?'

బ్రాహ్మణుని కళ్ళలోతుల్లోకి తిన్నగా చూశాడు బుద్ధుడు. ఆ చూపు సూర్యకిరణాలంత వేడిగానూ, చంద్ర కిరణాలంత మృదువుగానూ ఉన్నవి. మందహాసంతో, 'కశ్యపా, సమధానానికి నీలోనే నువ్వు వెతుక్కో...దుఃఖం సత్యమని నువు ఒప్పుకున్నావు గదా. దానికి కొన్ని కారణా లున్నాయని, ఆ కారణాలు గనక తొలగిస్తే, ఆ దుఃఖం కూడా తొలగు తుందని అంగీకరించావు. దుఃఖ కారణం అజ్ఞానం; అనగా అశాశ్వత మైనదానిని శాశ్వతంగా భావించడం; లేని ఆత్మను, ఉన్నది అని అనుకోడం. అజ్ఞానం దురాశను, ఆగ్రహాన్ని భయాన్ని అసూయను జనింపచేస్తుంది. ప్రతి దాని యొక్క ఆశాశ్వతత్వాన్ని తెలుసుకోడానికి లోతుగా చూడడమే విముక్తి మార్గం. అజ్ఞానాన్ని ఎప్పుడైతే జయిస్తావో, దుఃఖాన్ని దాటుతావు. అదే నిజమైన విముక్తి. విముక్తి సాధించడానికి ఆత్మ అనేది ఒకటి ఉండాల్సిన అవసరం లేదు.

జీవితానికి దుఃఖమనేది ఒక పార్శ్వం మాత్రమే. మరో పార్శ్వం, ఆశ్చర్యాద్భుతాలున్నై. ఆ పార్శ్వాన్ని గనక చూడగలిగితే, మనకు సంతోషం, శాంతి, ఆనందం కలుగుతై. మన హృదయ గ్రంథులు తెగిపోతే, మనకు ఆ ఆశ్చర్యాద్భుతాలతో ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది.

ఆశాశ్వతత్వాన్ని అర్థం చేసుకొని 'స్వ' అనేది ఏదీ లేదని గ్రహిస్తే, మన హృదయాలు మనస్సులు ఎంత అద్భుతమైనవో మనకు తెలియ నారంభిస్తుంది; మన శరీరం కూడా ఎంత అద్భుతమైన నిర్మాణమో తెలియవస్తుంది.

మన దుఃఖంలో మనం బంధింపబడి వున్నాం కాబట్టి, జీవితం యొక్క అద్భుతాశ్చర్యాల్ని అనుభవించలేకుండా ఉన్నాం.

ఇవతల వొడ్డున నుంచొని అవతలి వొడ్డుకు చేరడానికి, పడవ సహాయంతోనో, ఈదే ప్రయత్నం ద్వారానో, కృషిసల్పక, ఏవో ప్రార్థనలు, పూజలు పునస్కారాలు చేస్తే, చేరగలమనుకోం భ్రమ. అందుచేత మనుషులు లోతుగా విచారించాలి, ధ్యానించాలి.'

★ ★ ★ ★

**చిత్త వైకల్యం**

మోట్సే అనే చైనీస్ బోధకుడు, క్రీ.పూ. 468 నుండి 401 వరకూ, అరవై ఏడేళ్ళు జీవించినట్లు చరిత్రను బట్టి తెలుస్తుంది. ఒకప్పుడు అతడి బోధ చైనీయులను చాలా ప్రభావితం చేసింది. అటు తర్వాత నిన్నా మొన్నటి వరకూ ఎవరూ ఆ బోధలను పట్టించుకున్న వారు లేరు. చైనీస్ వేదాంతు లందరిలోకీ మోట్సే బోధనలు క్రిస్టియన్ బోధలకు సమీపంగా వుంటవని చెప్పవచ్చు.

ఒకసారి వూమాట్సే అనే చైనీస్ గురువు మోట్సేతో ఇలా అన్నాడు: 'నువ్వింత ధర్మంగా బతుకు తున్నప్పటికీ, మనుషులు నీకే విధంగానూ సహాయ పడుతున్నట్లు కనిపించదు. ఆ దేవతలేమో నిన్ను దీవిస్తున్నట్లూ లేదు – అయినప్పటికీ నీ ధర్మం నువు పాటిస్తూనే వుంటావు. ధర్మాకార్యాలు చేస్తూనే వుంటావు. నీ మనసు, చిత్తవైకల్యానికి గురై ఉంటుంది అనుకోవాలి' అన్నాడు.

అందుకు మోట్సే : 'మీ వద్ద ఇద్దరు పనివాండ్రు ఉంటానుకోండి. అందులో ఒక పనివాడు మిమ్మల్ని చూడగానే పని చేయనారంభిస్తాడు. కాని మీరు అక్కడి నుండి అవతలికి వెళ్తే, పనిచేయడం మానేస్తాడు. రెండో పనివాడు మీరు కనిపించినా, కనిపించకపోయినా తన పని తాను చేసుకుంటూనే ఉంటాడు. ఆ ఇద్దరిలో, మీరు ఎవర్ని ఎంచుకుంటారు?' అని అడిగాడు.

## మార్పు ఉన్నది కానీ మరణం లేదు

'నేను ఎదురుగా కనిపించినా కనిపించకపోయినా, కష్టించి పనిచేసేవాడినే మెచ్చుకుంటాను, ఎంచుకుంటాను' అన్నాడు వూమాట్సే.

'అలాగైతే, మీరు చిత్తవైకల్యమున్న వానిని ఘనంగా భావిస్తున్నా రన్నమాట' అన్నాడు మోట్సే.

★ ★ ★ ★

## దుర్గుణం లేకుండా ఉండమే సుగుణం

హ్యేహోయ్ అనే చైనీస్ వేదాంతిని ఎవరో అడిగారు : 'పది పాపాలు లేక దుర్గుణా లేవి, పది సుగుణాలేవి?' అందుకతడు : 'పది దుష్కర్మలేమిటంటే, చంపడం, దొంగిలించడం, స్వైరవిహారం, కాముక సంభాషణ, అపనింద వేయడం, అబద్ధాలాడటం, ముతకమాటలు, దురాశ ఆగ్రహం, అసత్య దృక్పథం కలిగుండడం మొదలైనవి. ఇక పది సుగుణా లంటారా, ఈ పది దుర్గుణాలు లేకుండా వుంటమేనని చెప్పవచ్చు' అన్నాడు.


★ ★ ★ ★

## దేవతా వరం

దేవతా వరాన్ని గుర్తించకపోవడం ఎంత తప్పో, అలాంటిదేమీ లేకున్నా మాకావరం ఉన్నదన్నట్లు నటించటం అంతే తప్పు.

–ప్రథమ జర్మన్ కవయిత్రి హ్రోశ్వితా (సుమారు 935–1000)

# సైన్సు, మతధర్మం



'ఆలోచనా సహితమైన జ్ఞానం మనమందరం ఎరుగుదుము. మరోరకమైన జ్ఞానం వున్నది. దానికి ఈ మామూలు జ్ఞాన లక్షణాలుండవు; అది హెచ్చు భాగం ప్రేమలాగా ఉంటుంది. అది నీకు ఎంత సమీపంగా ఉందంటే, జ్ఞానమనే మాట దానికి అంతగా అతకదు అనిపిస్తుంది. ప్రేమ అనే మాట, దానికి తగునేమో ననుకుంటాను' అని వివరిస్తాడు శ్రీ రజనీష్.

'మానవ చైతన్యంలో ప్రథమంగా ప్రారంభమైనది మాజిక్ లేక మంత్రవిద్య, మంత్ర విద్యతో కూడుకున్న ఇంద్రజాలం. సైన్సు, మత ధర్మం, ఈ రెండూ కూడా ఆ మాజిక్‌లో భాగాలు. ఆ మాజిక్‌లో కొంత మనసు భాగమూ ఉండేది. మరి కొంత మనసులేని భాగమూ వుండేది. ఆ మాజిక్ లోనుండే ఫిలాసఫీ పుట్టుకొచ్చింది. ఫిలాసఫీ నుండే సైన్సు పుట్టుకొచ్చింది. మాజిక్‌లో మనసూ మనోరాహిత్యమూ రెండు ఉండగా, ఫిలాసఫీలో ఒక్క మనసు మాత్రమే ఉన్నది. అటు పైని మనసూ, అది చేయగలిగిన ప్రయోగాలు కలిసి సైన్సుగా రూపొందింది. మత ధర్మం మనోరహితమైనది.

సైన్సు, మత ధర్మం, వాస్తవానికి రెండు మార్గాలు. సైన్సు, అప్రధానమైన గౌణ మార్గం ద్వారా చేరాలని చూస్తుంది; మత ధర్మం నేరుగా వెళ్ళాలని చూస్తుంది. సైన్సు పరోక్ష మార్గాన్ని తొక్కుతుంది. మత ధర్మమే తక్షణ ప్రత్యక్ష మార్గాన్ని ఎంచుకుంటుంది.

సైన్సు వాస్తవం చుట్టూ తిరుగు తుంటుంది. మత ధర్మం 'వాస్తవం' యొక్క హృదయంలోకి నేరుగా చొచ్చుకుపోతుంది.

ఆలోచన తెలిసిన వాటిని గురించి మాత్రమే ఆలోచించ గలదు. నమిలిన దానినే మళ్ళీ మళ్ళీ నములు తుంటుంది. ఆలోచన ఏనాడూ ఉపజ్ఞతతో కూడుకుని ఉండదు. తెలియని దానిని గురించి ఎలా ఆలోచిస్తావ్? నువు ఏది ఆలోచించ గల్గినా, అది తెలిసినదే అయి ఉంటుంది. నీకిప్పటికే ఒకటి తెలుసు కాబట్టి దాన్ని గురించి ఆలోచించగలవు; మహా అయితే ఆలోచన నూతన కలయికలు, కూర్పులు, చేర్పులు చేయగలదు. ఆకాశంలో ఎగిరే గుర్రాన్ని ఊహించుకోవచ్చు, ఆ గుర్రం బంగారంతో నిర్మితమైనది అని ప్రదిపాదించ వచ్చు. కానీ అందులో కొత్తేమున్నది? పక్షులు ఆకాశంలో ఎగురుతయ్యని నీకు తెలుసు; బంగారం తెలుసు, గుర్రాలు తెలుసు. మూడింటినీ కలిపి ఆలోచిస్తున్నావ్. ఆలోచన కొత్త విషయాలను ఊహించగలదే కానీ, తెలియని దానిని తెలుసుకోజాలదు. 'తెలియనిది' ఆలోచన పరిధిని దాటినటువంటిది. అందువల్ల ఆలోచన, తెలిసిన దానిని గురించే ఆలోచిస్తుంటుంది. తిన్నదానినే నెమరువేస్తూ ఉంటుంది. ఆలోచన ఏనాటికీ ఉపజ్ఞతతో కూడుకున్నది కాదు.

ఇక వాస్తవాన్ని దర్శించమంటే, ఏ మధ్యవర్తీ లేకుండా, నేరుగా ప్రత్యక్షంగా, నీ అంతట నువ్వే, ఈ లోకంలో మరెవరితో నిమిత్తం లేకుండా, నీవు తప్ప వేరెవరూ లేనట్టూ నీవే ప్రథముడివైనట్టూ, వాస్తవం ముంగిట నిలవడం; ఇది ముక్తిదాయకం. ఆ క్రియ యొక్క కొత్తదనం, ఆ నూతనత్వం నిన్ను విముక్తుణ్ణి చేస్తుంది.

ఈ విధంగా నీవు వాస్తవాన్ని ప్రత్యక్షంగా తెలుసుకుంటే, అది 'తెలిసిన' వస్తువుగా ఏనాటికీ పరిణమించదు; దాని రహస్యమలాగే ఉండిపోతుంది. నిజానికి మునుపటికన్నా మరింత లోతైన రహస్యంగా కనిపిస్తుంది. తెలిసిన కొద్దీ, తెలియనిది ఎక్కువనిపించడం ప్రారంభమవుతుంది. కనుక్కున్నకొద్దీ దాని రహస్యం మరింత విస్తరిల్ల నారంభిస్తుంది. మతధర్మమంటే మనోరాహిత్యంతో సాధించేది కాబట్టి అది మార్మిక యోగం (Mysticism) మంత్ర విద్య (Magic) అవుతుంది.

ఆలోచన, చేసిందే మళ్ళీ చేస్తుంటుంది. ఫిలాసఫీ కూడా అంతే. ఫిలాసఫీ పుస్తకాలు చూడండి, అప్పటికీ ఇప్పటికీ కొత్త పదాలు, కొత్త సమాసాలు, కొత్త నిర్వచనాలు, కొత్త వాక్యాలు ఇవే కనిపిస్తై కానీ, మౌలికంగా తేడా ఏమీ ఉండదు. తాలేజ్ (Thales) నుండి

బెర్ట్రాండ్ రస్సెల్ వరకూ, చెప్పిందే మరో విధంగా చెప్తూ వుంటారు. చక్రం తిరుగుతూనే ఉంటుంది, చక్రంలోని ఆకులు మళ్ళీ మళ్ళీ పైకి వస్తూనే వుంటై.

సైన్సు, బయట కనిపించే వస్తువుతో మాత్రమే ప్రయోగాలు చేయగలదు; ప్రయోగ మనేది, అలా కనిపించే వస్తువుతోనే సాధ్యం. ప్రయోగకర్త మీద, నువు ప్రయోగం చేయ గలిగిలేవు. ఎలా చేస్తావు? ప్రయోగకర్త యొక్క జీవాత్మ సంబంధిత అంతఃకరణ, సైన్సు పరిధిని అతిక్రమించి ఉంటుంది.

సైన్సు వస్తుగత ప్రపంచాన్ని మాత్రమే పరిశోధించగలదు. ఫిలాసఫీ తెలిసిన విషయాల గురించే ఆలోచించగలదు. ఇక వాస్తవమేమో ఈ రెంటికీ ఆవలనున్నది; వాస్తవం తెలియనటువంటిది అనేది ఒకటే కాదు, అది తెలియరానటువంటిది కూడాను. ఈ వ్యక్తి అంతఃకరణం, ఆ వాస్తవంలో వున్నది. అందువల్ల సైన్సు ఫిలాసఫీ అవలంబించే పరిశోధన విధానాలు ఈ మౌలికమైన ప్రథమ సూత్రం వద్దకు వెళ్ళజాలవు. వాస్తవం చేరువకు వెళ్ళాలంటే నువు మత ధర్మం అనే తలుపు ద్వారా ప్రవేశించాల్సి ఉంటుంది.

# మతధర్మం సమాధి నుండి పుట్టుకురావాలి



ఇక మతధర్మమంతా కలిపి ఒక్క ముక్కలో చెప్పాలంటే, అది ధ్యాన మనవచ్చు, లేక నిశ్శబ్ద మనవచ్చు. నువు లేని నిశ్శబ్దం, నీలోని నిశ్చలత్వం. అయితే ఆ నిశ్చలత్వంలో ఏదో కదలాడుతుంటుంది. ఆ నిశ్చలత్వంలో మాత్రమే నీకో చిన్న స్వరం వినిపిస్తుంది. ఆ స్వరమే ప్రథమ సూత్రమనచ్చు. దానిని పరమాత్మ అంటావో, ఆత్మ అంటావో, ఏదైనా అను. అప్పుడే జీవితం, జీవితాన్ని పిలుస్తుంది. అప్పుడే మూలం మూలాన్ని కేకేస్తుంది. అప్పుడే నువు వాస్తవానికి సమీపంగా ఉంటావు. నీ మౌలిక పదార్థంతో నువు చేతులు కలుపుతావ్. అది తెలిసేవరకూ, అది సాధించేవరకూ, అది మనకు నిజమయ్యే వరకూ, మనం కృతకృత్యులం కాలేము అంటాడు శ్రీ రజనీష్.

ఆలోచన లేనప్పుడు, నీవు ప్రథమ సూత్రం వద్దనే వుంటావు. అది ఎల్లప్పుడూ నీలోనే వున్నది. నీ ఆలోచన వల్ల నువు దానితో వుండలేకపోయావు. కానీ ఇప్పుడు ఆలోచన విరమించావు కాబట్టి, దానితోనే వున్నావు. సామాన్యంగా నీ ఆలోచనలో నువు ఎక్కడికో పడిపోతావు. ఆలోచన లేకపోతే ఎక్కడికి వెళ్తావ్? ఆలోచన నిన్ను గతంలోకి, భవిష్యత్తులోకి తీసుకు వెళ్తుంటుంది. ఆలోచనా రాహిత్యం నిన్ను వర్తమానంలో నిలబెడుతుంది. నిజానికి ఉన్నది వర్తమానమొక్కటే. ఎల్లవేళలా ఉండేది ఈ ప్రత్యక్ష క్షణమే.

అయితే ఆలోచన అదృశ్య మవడం గురించి మాట్లాడుతున్నానంటే, 'నిద్రించినప్పుడు కాదు'. మనకు మేలుకున్న స్థితి, స్వాప్నిక స్థితి, నిద్రించే స్థితి, ఈ మూడూ తెలుసు. ఇక

నాల్గవ స్థితి ధ్యానస్థితి. దీనిని సమాధి స్థితి, తురీయ స్థితి అంటారు. ఇది 'ఆలోచనా రహితమైన, మేల్కొని వుండే చైతన్యం.' చైతన్యంతో ఆలోచన కూడుకొని వుంటే, మేల్కొన్నట్లు. ఆలోచనా రహితమైన చైతన్యమయితే సమాధి. చైతన్య రాహిత్యంతో కూడుకున్న ఆలోచన స్వాప్నిక స్థితి. ఆలోచన లేని చైతన్య రాహిత్యం నిద్ర.

అందువల్ల సమాధి, కొంతమేరకు మెలకువ వున్నట్లు, కొంత భాగం నిద్రిస్తున్నట్లుగా నిర్వచించవచ్చు. పతంజలి మహర్షి ఈ స్థితిని 'మేల్కొన్న నిద్ర'గా నిర్వచించాడు. ఈ స్థితిలో ఆలోచలు లేవు కాబట్టి, స్వప్నాలు లేవు కాబట్టి, దీనిని నిద్రగా వర్ణించవచ్చు. కానీ చైతన్యం ఉంటూ, అందులో ఎరుక, దాని యొక్క వెలుతురు మాత్రమే ఉన్నది కాబట్టి, ఏరకమైన జ్ఞానం, తత్సంబంధమైన ఆలోచన కానీ, ఏ రకమైన స్వప్నం కానీ ఊహ కానీ లేనందువల్ల, అది ఒక మేల్కొన్న శూన్యస్థితి కాబట్టి, అందులో నువు లేవు; మేల్కొన్న ఒక స్థితి మాత్రమున్నది.

ఒకప్పుడు ప్రాచ్య దేశాలు ఈ స్థితిని సాధించడానికి ప్రయత్నించినై – పశ్చిమ దేశాలు, సైన్సులో మునిగిపోయినై. అందువల్లనే పశ్చిమ దేశాలు నిజమైన మతధర్మం లేకుండా చేసుకున్నై. ప్రాచ్య దేశాలు సమాధిలో మునిగి, సైన్సును అభివృద్ధి చేసుకోలేక పోయినై.

సమాధియే మత ధర్మానికి జన్మనిస్తుంది. జీసస్ సమాధి సాధించేసరికి క్రైస్తవం పుట్టింది. గురునానక్ సమాధి నందుకునేసరికి సిక్కుమతం జన్మించింది. బుద్ధుడు సమాధిలోకి వెళ్ళగలిగి నందువల్లనే బౌద్ధం జన్మించింది.

సమాధి కష్టమే కానీ, అసాధ్యం కాదు. మేల్కొని వుంటూ ఆలోచించకుండా ఉండడం కష్టమే. పరిణామవాదంలో ఇది సాధ్యమయ్యేది కాదు. ఇది ఒక విప్లవం. ఇది ప్రకృతి తనంతట తాను నీకిచ్చేది కాదు. నువు సాధించాలి.

మనిషికున్న సవాల్ ఇదే. ఈ సవాల్‌ను స్వీకరించినవారు ఎక్కువమంది లేరు. ఈ సవాల్‌ను స్వీకరిస్తేనే నువు మనిషివి. మిగతా వారు నామమాత్రపు మనుషులు. మనందరికి, మనిషి అయ్యే అవకాశం ప్రకృతి కల్పించింది. మనమవ దలచుకుంటే బుద్ధుడూ అవచ్చు, క్రీస్తూ అవచ్చు. కానీ ఇప్పటి వరకూ అది జరగలేదు. మనం కేవలం విత్తనం స్థితిలో వున్నవాళ్ళం. అదే మన దుఃఖం. విత్తనం వృక్షమయి కాయలు

కాసేంతవరకూ దానికి తృప్తిలేదు. విత్తనం లోలోన దుఃఖిస్తూ ఉంటుంది. 'నేను ఏది అయి ఉండాల్సిందో అది కాలేకపోయాను' అనుకుంటుంటుంది.

విత్తనానికి వృక్షం దూరం కాదు. విత్తనానికి సరియైన నేల లభించి, సంతోషంగా ఆ నేలలో కలసి, కరిగిపోతే, వృక్షం ఎంతో దూరం కాదు. సరియైన తరుణంలో విత్తనం మొలక వేస్తుంది. ఓ చిన్న మొక్క మొలుస్తుంది. విత్తనానికి వెలుతురు కనిపిస్తుంది. విత్తనం మొక్కగా మొలిచిన తర్వాతే దానికి గాలి అంటే ఏమిటో ఆ గాలి వీచినప్పుడు తనకెలాంటి ఉల్లాసం కలుగుతుందో, సూర్యకాంతి తనకు తగిలినప్పుడు తన ఆనంద మెటువంటిదో తెలుస్తుంది. అప్పుడే అది పెరగనారంభిస్తుంది. ఏ రోజుకారోజు దృఢమవుతుంటుంది. ఏదో ఒకనాడు ఆ చెట్టు మ్రానై, ఆకాశంతో ఆడుకో నారంభిస్తుంది. దాని పుష్పసుగంధం నలుదెసలా వ్యాపిస్తుంది.

విత్తనం నేలను నమ్మాలి. శరణాగతి అవాలి. అందులో కలసి పోవాలి. తనని తాను కోల్పోవాలి, చనిపోవాలి. అప్పుడే ఒక కొత్త ప్రాణి పుట్టుకొస్తుంది. విత్తనం మరణం, మొక్క పుట్టుకకు కారణం. మరణం నూతన ప్రాణప్రతిష్ఠకు సోపానం. కొత్త మనిషి పుట్టుకు రావాలంటే, నీలోని పాత మనిషి మరణించాలి.

★ ★ ★ ★

## 'స్వ'ను మరచిపోవడం

భగవంతుని స్మరించడం, భగవంతుని ద్వారా భగవంతుని తెలుసుకున్నవారు, సజీవులుగా జీవిస్తారు. 'స్వ'ద్వారా భగవంతుని ఎరిగిన వారు మృతి చెందుతారు.

–అబు యాజిద్ ఆల్–బిస్తామీ (9వ శతాబ్దం)

# లల్ల, కబీరు



పద్నాల్గవ శతాబ్ది కాశ్మీరాలలో లల్ల పుట్టింది. ఆత్మాన్వేషణకు అంకితమయింది. ప్రాచీన కాశ్మీరిలో కవిత్వం కట్టింది. ఈమె కవితలో శివద్వైతం, అద్వైతం, తంత్రం, ప్రత్యభిజ్ఞ, సూఫీ సంప్రదాయం కనిపిస్తవి. తత్త్వద్వేషులు వీనినే లల్లాయి పదాలు అని అన్నారా లేక తెలుగు వారిలో ఆ ల(లొ)ల్లయ్య పదాలనే ఇలా అన్నారా అనే సంశయం కలుగుతుంది.

ఈమెకు హిందువులలో లల్ల, లల్లాదేవి, లల్లేశ్వరి, లల్లా యోగిని అనిన్నీ, ముస్లింలలో లల్లా అరీఫ్రీఫా అనిన్నీ ప్రసిద్ధి.

'నేను విభుని కోసం దేశదేశాలు తిరిగి వేసారిపోయాను. పొరపాటు పడ్డాను. ఊపిరి నిలిపి, జ్ఞానదీపం వెలిగించి చూతును కదా, తీరా ఇంట్లోనే చిత్ స్వరూపుడు కనపడ్డాడు.

ముక్తి కోసం పాపం ఈ సన్యాసులు తీర్థాలు పోతారు. ముక్తి చిత్త సాధ్యం కాని, తీర్థ సాధ్యం కాదు. దూరపు కొండలు నునుపు. చిత్తం అనే అద్దం నిర్మలం అయింది. ప్రత్యభిజ్ఞ కలిగింది. దైవం నా స్వరూపంగానే కనిపించింది. నేనూ హుష్, ఈ ప్రపంచమూ హుష్.

అమ్మలక్కలు నన్ను వేవిధాల తిట్టనీ; ఉదాసీనమైంది నా మనస్సు. దానికి మకిల పట్టదు. ఉదాసీనమైన(పైన వ్రేలాడదీసిన) అద్దాన్ని (నేలమీది) దుమ్ము ఏం చేస్తుంది?

నన్ను తిట్టుకోండి, తిమ్మకోండి. పూలతో పూజించుకోండి, రాళ్ళతో కొట్టుకోండి. నాకు దుఃఖమూ లేదు, సంతోషమూ లేదు. బోధామృతం తాగి నాలో నేనున్నా.

అంతా తెలిసి మొద్దులా ఉండు! అంతా విని చెవిటివికా! అంఆ చూచి గ్రుడ్డివవు! ఇదే తత్వాభ్యాసం.

అభ్యాసం చేత దృశ్యం శూన్యమైతే సాక్షి రూపం మిగులుతుంది. శాంతమైన ఆ సాక్షిన్నీ శూన్యమైతే ఇక అనామయం.

వాక్కూ మనస్సు, శివుడూ, శక్తీ, సమస్తమూ దేంట్లో లయమైతే అదే – అభ్యాసం.

తంత్రమంతా మంత్రంలో, నాదమూలమైన మంత్రమంతా చిత్తంలో లయమవుతుంది. చిత్తం లయమైతే, దృశ్యమూ ద్రష్టా కూడా చిత్ స్వరూపంగా శేషిస్తుంది.

సూర్యుడస్తమిస్తే చంద్రుని వెలుగు, చంద్రుడస్తమిస్తే చిత్తం వెలుగు, చిత్తం అస్తమిస్తే దృశ్యజాతమంతా లీనమవుతుంది.

నీవెవరో తెలియదు, నేనెవరో తెలియదు. దేహమే నేనని అనుకోవడం వల్ల, 'నీవెవరు, నేనెవరు' అని సంశయం.

చలికి మాత్రం గుడ్డ; ఆకలికి మాత్రం కూడు.

సహజ స్థితిలో భేదం అనేది కలికానికి కూడా కానరాదు! బయలులో బయలు కలిసినటుల కలిసిపోవడం సహజ స్థితి.

అయ్యా, దేహాదులైన ఆరు కోశాల అడ్డువల్ల నిన్ను కానక చాలాకాలం దుఃఖపడ్డాను. ఇప్పుడో ఉపాధి బద్దలయింది; విశ్రాంతి దొరికింది.

ఆడుతూ పాడుతూ నవ్వుతూ నసుపుతూ నీ దేహంలోనే వున్న ఆత్మదేవుణ్ణి చూడు; దేశాంతరంలో ఏమి వెతుకుతావు?'

లల్లను గురించి సర్ ఆర్.సి. టెంపిల్ ఇలా రాశాడు: Thine is a song that enslaveth me, son of an alien kin and clime.

–శ్రీ వేలూరి శివరామశాస్త్రి

★ ★ ★ ★

నీటికీ వాటిపై నుండే అలలకూ భేదమిమిటా అని ఆలోచిస్తూ వచ్చాను.

పైకి లేచే జల అయినప్పటికీ, జలమే కదా? వెనక్కి పడిపోయేప్పుడు కూడా జలమే మరి.

ఆ రెంటినీ ఎలా వ్యవహరించాలో కాస్త చెప్పవూ? ఎవరో 'అల' అనే పేరు పెట్టారు కాబట్టి, నీటి నుండి దానిని వేరుగా భావించాలా?

★ ★ ★ ★

భగవంతుడు మసీదులో మాత్రమే వుంటే మిగిలిన ప్రదేశాల మాట ఏమిటి? దేవుడు విగ్రహాలలోనూ తీర్థయాత్రా స్థలాల్లోనూ వున్నాడంటారు. ఆ రెంటిలోనూ ఆయన్ని దర్శించిన  వారెవరూ కన్పించరు.

జ్ఞాని అనుదినమూ మరణిస్తూనే వుంటాడు. ఆరగించటమే పరమ లక్ష్యంగా ఎంచుకునే అజ్ఞానికి సద సద్వివేకం వుండదు. ఇంట్లో పెత్తనం చెలాయిస్తూ వుంటాడు.

★ ★ ★ ★

వెతుకుతూ, వెతుకుతూ కబీరు చివరికి తనని తాను కోల్పోయాడు. సింధువులో లీనమై పోయిన బిందువును ఎవరు గుర్తించగలరు?

★ ★ ★ ★


ఇప్పుడు మనస్సు వెలుపలికి రావాలని కోరటం లేదు. లోపల నిలబడి పోవటం లోనే తృప్తి కనుగొన్నది. అగ్ని చల్లారిపోయింది. జ్వాలలు జలధారలుగా మారిపోయాయి.

★ ★ ★ ★

దేహమంతా సంగీతంతో ముఖరిస్తున్నది. తీగలు లేకుండానే వీణ రాగాలాపన చేస్తున్నది. ఇప్పుడు లోపలా వెలుపలా గంధర్వ గానమే. భ్రాంతులన్నీ పటాపంచలయి పోయినై.

–కబీరు

# కప్పగంతులు





కప్పలు కొన్ని అడవిగుండా వెళ్తున్నై. అందులో ఓ రెండు కప్పలు ఓ లోతైన గుంటలో పడిపోయినై. మిగతా కప్పలన్నీ గుంట చుట్టూ చేరినై. గుంట లోతు చూచేసరికి, చుట్టూ చేరిన కప్పలు, గుంటలోని కప్పల్ని చూసి జాలిపడుతూ 'మీరీ గుంట నుండి బయటపడడం అసాధ్య మనిపిస్తున్నది' అని తమ దుఃఖాన్ని సానుభూతినీ ప్రకటించినై.

వాటి మాటల్ని పట్టించుకోకుండా గుంటలోని రెండు కప్పలు తమ శాయశక్తులా బయట పడటానికి ప్రయత్నించ నారంభించినై. బయట నేలమీది కప్పలు తమ నైరాశ్యాన్ని ప్రకటిస్తూ 'మీరు వెలుపలికి రాలేరు, ఇక ప్రాణం మీద ఆశలు వదలుకోండి' అని సలహా ఇచ్చినై.

ఈ బయటి కప్పట మాటల నాలకించిన గుంటలోని ఓ కప్ప, తన ప్రయత్నాలు వ్యర్థమని తోచినందువల్ల, ఆ యత్నాలు విరమించింది; ఆ గుంటలోనే చచ్చిపోయింది. రెండో కప్ప మాత్రం ఆ వెలుపలి కప్పల మాటలను పరిగణించలేదు. పట్టుదలగా ప్రయత్నాలు కొనసాగిస్తూనే వచ్చింది. బయటి కప్పలు, 'ఎందుకు అనవసరంగా శ్రమిస్తావు? చచ్చిపోయే ముందు ఈ యాతన కూడా దేనికి? ఈ బాధంతా పడిన తర్వాత కూడా చావు ఎలాగూ తప్పదు కాబట్టి, ఉన్నట్లు ఉండిపోయి ప్రశాంతంగా చనిపోవడం మేలు కదా?' అని సలహా ఇచ్చినై.

కాని అందరూ ఆశ్చర్యపోయేట్లుగా గుంటలోని కప్ప మరింత పట్టుదలతో ఎగిరి గంతేసి గుంట వెలుపల నేలమీదికి వచ్చి పడింది. మిగతా కప్పలు దాని చుట్టూ చేరి,

'నీ పాటికి నువ్వలా ఎగురుతూనే ఉన్నావే? మా మాట నీకు వినిపించలేదా?' అని అడిగినై.

ఆ కప్పకు చెముడనేది వాటికి తెలియదు. ఆ గుంటలోని కప్ప పొడుగూతా, ఆ బయటి కప్పలు తనని ప్రోత్సహిస్తూ, 'మరింత గట్టిగా ప్రయత్నించు' అంటున్నాయని అనుకున్నదిట. వాటికి ఆశాభంగం కలగజేయకూడదని భావించి, తన శక్తినంతా పుంజుకొని ఎగరసాగిందిట. చివరకు బయటపడ గలిగింది.

పట్టిన పట్టు వీడరాదనే తత్వం మనిషికైనా అవసరమే. సాక్షాత్తూ చెముడే వుండక్కర లేదు గానీ, ఒక కార్యం తలపెట్టినప్పుడు, ఇతరులు పెట్టే భయ సంకోచాలను, చెవిని పెట్టకుండా ముందుకు సాగే ధైర్యముండాలి. అప్పుడు గానీ విజయలక్ష్మి వరించదు.

ఉత్తర కేరళలో ఆనందాశ్రమం స్థాపించిన స్వామి రామదాస్ కూడా రెండు కప్పల కథ ఒకటి చెప్తాడు; కానీ ఆ కథ ఉద్దేశం వేరు. పాతకాలంలో ఒక ఇంటి వంటగదిలో ఓ కుండెడు పెరుగుపెట్టి దాని మీద మూత పెట్టడం మరిచిపోయారు. రెండు కప్పలు – ఒకటి పెద్దది రెండవది చిన్నది – వంట ఇంట్లో అటూ ఇటూ గెంతుతూ, ప్రమాదవశాత్తూ ఆ పెరుగుకుండలో పడ్డై. కుండ నుండి బయట పడడానికి రెండు కప్పలూ చాలా ప్రయత్నం చేసినై. నెగ్గలేకపోయాయి. పెద్ద కప్ప ఆశ వదలుకొని ఊరకుండిపోయింది. కుండ అడుగున పడి చనిపోయింది. చిన్న కప్ప అంత సులభంగా ఆశ వదులుకోలేదు. గంటల తరబడి ప్రయత్నిస్తూనే ఉంది. ఆ ప్రయాసతో పూర్తిగా అలసిపోయింది; అందుకని ఒకింత విశ్రాంతి తీసుకుంటూ కదలక మెదలక అలాగే ఉండిపోయింది. కప్ప అటు ఎగిరి, ఇటు ఎగిరి పడుతుండటంవల్ల కుండలోని పెరుగును చిలికినట్లయింది. మజ్జిగ రూపం దాల్చిన పెరుగు మీద, వెన్నముద్ద ఒకటి తయారైంది. కప్ప ఎప్పుడైతే అలసట కారణాన, తన ప్రయాస విరమించి నిశ్శబ్దంగా నిశ్చలంగా ఉండిపోయిందో, వెన్న తయారై ఒక ముద్దగా రూపొందింది. అప్పుడు కప్ప, మజ్జిగపైన తేలియాడుతున్న ఆ వెన్న ముద్ద మీది నుండి కుండ బయటికి ఎగిరి గంతేసింది.

వేదన అనండి, సాధన అనండి, ఏదైనప్పటికీ, ప్రాపంచిక విషయాల నుండి మనిషి విముక్తుడవడానికి, అది ఎంతైనా అవసరం. మనిషి పూర్తిగా అలసిపోయినప్పుడు, అంటే తన స్వప్రయత్నంతో ఏదైనా సాధించ గలననే అహం చల్లారినప్పుడు, అలసిపోయి భగవంతుణ్ణి శరణాగతి చొచ్చి, అతడి చరణాల వద్దే కదలకుండా ఉండిపోతే మనిషిని రక్షించడానికి 'అతడు' దిగి వస్తాడు, అంటాడు పాపారామదాస్.

# ఓ తండ్రి వ్యథ



**జా**న్ గంథర్ అనే ప్రముఖ పాశ్చాత్య గ్రంథకర్త, పాశ్చాత్య ప్రాచ్య దేశాలన్నిటి లోనూ విస్తృతంగా అమ్ముడుపోయిన ఇన్‌సైడ్ యూరప్, ఇన్‌సైడ్ ఆసియా అనే బృహత్ గ్రంథాలు రాసినవాడు. వాటిల్లో ఆనాటి ప్రపంచ నాయకులు, ప్రముఖ వ్యక్తులనందరినీ కలిసి, వారి విధానాలు, వారి ఆలోచనలు, ప్రపంచ రంగంలో వారి ప్రాధాన్యం, ప్రత్యేకమైన తన శైలిలో తెలియజేశాడు.

అతడి స్వంత జీవితంలో తన కుమారుడు మార్క్‌ను గురించి పడిన వ్యథ, గుండెలు తరుక్కుపోయేట్లు చెప్పుకొస్తాడు. తండ్రు లొక్కొక్కసారి పెరిగి పెద్దవుతున్న తమ పిల్లల గురించి పడే బాధ ఎంతగా వుంటుందో చదవండి.

"మార్క్ అనుభవించిన ఒత్తిళ్ళు అతణ్ణి ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడేట్లు చేశాయేమో మరి! కానీ ఏ కుటుంబమైనా, అనేక రకాల క్లిష్టతలతో కూడుకున్న గూడే! సరళంగా ఎలాగూ వుండదు. ఆ క్లిష్టతల నన్నిటినీ విడమర్చి, విశ్లేషించి, ఇవి ఇట్లా అని తేల్చిచెప్పటానికి, పిల్లవాడి పుట్టుక వెనక్కి వెళ్ళవలసి వస్తుందనుకుంటాను.

ప్రతి కుటుంబమూ, తమ పిల్లవాడికి తనదైన రీతిలో సహాయపడనూ పడుతుంది. బాధపెట్టనూ పెడుతుంది. పోతే, ప్రతి పిల్లవాడూ కూడా తన పర్యావరణం, సాంఘిక పరిస్థితులను బట్టి, ఒక 'స్వ'ను పెంచుకుంటాడు. ఈ 'స్వ' తన చుట్టూ వున్న ప్రభావాలు,

తన ఆత్మయొక్క సారంతో మిళితమై వుంటుంది. వాటిలో ఏదో ఒక చేదు రహస్యం ఉన్నదనిపిస్తుంది.

నిజాయితీగల ఒక కుర్రవాణ్ణి, పెద్దవాళ్ళంగా మనం విశ్వసించకుండా ఉండలేము; ఎందుకంటే మనలోని విశ్వాసమే గనక కోల్పోయామంటే, ఆధారపడేందుకు మరేమి మిగులుతుంది?

మరి ఎందుకని ఇతడు తన జీవితాన్ని ముక్కలుచెక్కలు చేసుకుంటున్నాడు? ఆ చేసుకునే సందర్భంలో ఇటు మా తల్లిదండ్రుల గుండెల్ని ఎందుకు ఇలా చీల్చేస్తున్నాడు?

అతడి వైఖరి నా వాచ్యంలో కఠినమైన ధోరణిని రగిలింపజేసింది. అనేక దఫాలు అతడికి నే చేసిన హెచ్చరికలు, 'అంత్య సందేశాలు' నిజంగా అమలు జరపాలని నాకు లేదు. "స్కూలులో చదువు మానేశావంటే నువ్వు ఈ ఇంట్లో కాలుపెట్టటానికి వీలుండదు సుమా" అని అంటుండేవాణ్ణి.

అతడి యెడల ఒకప్పుడు ప్రేమ తప్పితే మరో భావం లేని నా హృదయంలో, ద్వేషం తప్పితే మరొక అనుభూతి లేని రోజులు దాపురించాయి.

మనస్తత్వవేత్త పంపిన రిపోర్టు చూచినప్పుడు మనసు కాస్త కుదుట పడింది. ఏదో అయోమయంలో పడి దారిగానలేక, ఏవేవో ఆలోచనలు చేశాం. కాని పిల్లవాడు మారలేదు.

నేను నా విశ్వాసం కోల్పోయినప్పుడు కూడా, అతనిపై తన విశ్వాసాన్ని అలాగే వుంచుకున్న అతడి తల్లి, మార్క్‌ను ఇల్లువదలి వెళ్ళమని, ఇక తిరిగి రావద్దని చెప్పేంత వరకూ, అలాగే  కొనసాగాడు. తీరా ఆ మాట  మార్క్‌తో అనిన రోజున ఆవిడ పడిన బాధ అంతా ఇంతా కాదు. స్కూల్ బస్ బజార్లో వెళ్తున్నప్పుడూ, ఎవరైనా మా స్నేహితులు మార్క్‌ను గురించి అడిగినప్పుడూ, ఆవిడ ఎంత కుమిలిపోయేదో, ఆవిడ మానసిక శారీరక ఆరోగ్యం ఎంత దెబ్బతిన్నదో, ఎలా తెలియజేసేది?

ఆ రోజులన్నీ మసకమసకగా అయిపోయినై. అతడు ఇంట్లో వుంటే, ఒకరకమైన నరకం, అతడు బయటికి వెళ్తే మరో రకమైన నరకం. అతడు వెలుపలికి బయలుదేరినప్పుడల్లా ప్రేమ, భయం ఈ రెండూ కూడా మమ్మల్ని ముంచెత్తుతూ వుండేవి. ఒకప్పుడు మార్క్ ఎలా వుండేవాడో ఈనాడు ఏమైపోయాడో, ఈ జ్ఞాపకాలు తోసుకొచ్చి, రంపపు

కోత అనుభవిస్తూండే వాళ్ళం. ఏదో ఒక అద్భుతం జరిగి అతడు మారతాడేమోననే ఆశాకిరణం తళుక్కున మెరిసి మాయమవుతూ వుండేది.


(చివరకు చనిపోయిన తన కొడుకు మార్క్‌ను గురించి గంథర్ రాసిన ఓ చిన్న పుస్తకం నుండి అనువాదం)

ఈ రాసినదంతా సుమారు నాలుగు దశాబ్దాల క్రిందటే అయినప్పటికీ, ఆనాటికి నాకు జీవితంలో రావలసిన వ్యథలు ఇంకా దిగిరానప్పటికీ, ఈ రకమైన బాధ పిల్లల్ని కన్న తల్లిదండ్రుల్లో ఏ కొందరైనా అనుభవించే వుంటారు. అనుకుంటాను.

జిడ్డు కృష్ణమూర్తిగారిని కలిసిన ప్రాక్పశ్చిమ దేశాల్లోని కొందరు తల్లిదండ్రులు, “అసలు ఈ పిల్లల్ని ఎందుకు కన్నామండీ?” అని వలవల ఏడ్చిన వారి సంగతి, ఆయన ఒకసారి నాతో ప్రస్తావించడం జరిగింది.

జాన్ గంథర్ పుస్తకం నుండి ఆనాడు నేను రాసుకున్నప్పుడు నా కళ్ళల్లో నీళ్ళెట్లా తిరిగాయో, మళ్ళీ ఈనాడు ఇది అనువదించి పంపించేటప్పుడు, అంత బాధా అనుభవించాను. కలం ఈ కన్నీటి కడలిలోనే కదలాల్సి వచ్చింది.

# రాజాజీ వ్యక్తిత్వం



అఖిల భారత కాంగ్రెస్ కమిటీ గోవాలియా చెరువు మైదానంలో 7, 8 ఆగస్టు 1942 సమావేశంలో పాల్గొనడానికి బొంబాయి వచ్చాడు రాజాజీ (చక్రవర్తి రాజగోపాలా చారి). మాతుంగాలోని నపూహాల్‌లో రాజాజీ 5 ఆగస్టునాడు ప్రసంగించాల్సి వుంది. కాంగ్రెస్‌వారి పాలసీకి రాజాజీ వ్యతిరేకమనేది అప్పుడు అందరికీ తెలుసు. నపూహాల్‌లో జనాన్ని కంట్రోల్ చేయడానికి వీల్లేనంతగా చెలరేగిపోతున్నారు. అధికారిక కాంగ్రెస్ పాలసీని వ్యతిరేకించే ఈ పెద్దమనిషి నోరు మూయించాలని అక్కడి వారిలో కొందరికి బలంగా వుండింది.

సభా నిర్వాహకులు రాజాజీని వెంటబెట్టుకొని సభాస్థలికి వచ్చారు. తన నల్ల కళ్ళద్దాలతో, సన్నటి బక్కపల్చటి రాజాజీ లోనికి వచ్చాడు. హాలులో ప్రవేశిస్తున్నప్పుడే సభికుల నుండి పిల్లికూతలు, వెర్రికేకలు వినవస్తున్నై. అక్కడి పరిస్థితినంతా తిన్నగా గమనించి రాజాజీ నెమ్మదిగా వేదిక వైపు నడిచాడు; రాత్రి 8.30 గంటల వేళ.

రోడ్ల మీద పరచే తారుతో నిండిన ఒక కాగితం ఉండను ఎవరో కుర్రాడు రాజాజీని గురిచూచి కొట్టాడు. అది వచ్చి సరిగ్గా రాజాజీ కణత మీద గట్టిగా తగిలింది. మొహంమీద తారు, కళ్ళద్దాల మీద తారు, ఆయన తెల్లటి దుస్తుల మీద తారు కారటం మొదలెట్టింది. 'వెనక్కు వెళ్ళు రాజాజీ, రాజాజీ ముర్దాబాద్' అనే కేకలు వినిపించసాగినై.

రాజాజీ చలించలేదు. వేదిక దిగలేదు. మొహంమీద తారును తుడుచుకోలేదు. అంతా గందరగోళం. వ్యతిరేక నినాదాలు చెలరేగుతూనే వున్నాయి. సభను విరమించేస్తే సరిపోతుందని పెద్దమనుషులు కొందరు సూచించారు. కానీ రాజాజీ చెక్కుచెదరకుండా, తబ్బిబ్బు పడకుండా మైకు ముందర అలాగే నిలబడ్డాడు. ఓ అరగంట అనంతరం,

అరిచీ అరిచీ అలుపొచ్చిందో, విసుగొచ్చిందో ఏమో, వారంతటవారే అరవడం మానేశారు.

మెల్లగా ఆచితూచి మాట్లాడ నారంభించాడు రాజాజీ. "మిత్రులారా, తారుముద్దను అంత బాగా గురిచూచి నా మీదకు సంధించిన ఆ యువకుణ్ణి ముందు అభినందిద్దాం. అతడు నాతో విభేదిస్తున్నాడు అనేది కనిపిస్తూనే వుంది. ధైర్యం వున్నవాడు కాబట్టి మనస్సులో కలిగిన ఆ భావానికి కార్యరూపం కలిగించాడు. నేడు మన భారతదేశానికి ఇలాంటి కార్యదీక్ష, పట్టుదల గల్గిన యువకుల సేవ ఎంతైనా కావలసి వుంది – ఇలాంటి వారి ద్వారానే మనపైకి ముంచుకు వస్తున్న జపాను సేనలను మనం వెనక్కు నెట్టగలం. ఇలాంటివారే మన దేశ స్వాతంత్ర్యాన్ని ఆర్జించగలరు; వీరే దేశాన్ని శత్రువుల నుండి రక్షించ గల్గినవారు."


ప్రేక్షక సమూహంలో మార్పురావడం ప్రారంభమైంది. అక్కడి రాజాజీ వ్యతిరేకులు అతడి మాటలను శ్రద్ధగా ఆలకించ నారంభించారు. ఆనాటి మీటింగ్‌లోనే కాదు. ఆగస్టు ఏడున జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశంలో కూడా అధ్యక్షత వహిస్తున్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ రాజాజీని తక్కువ చూపు చూస్తూ 'మీకిస్తున్నది ఐదు నిమిషాలు. అంతకు మించకుండా ముగించండి' అని ఆజ్ఞాపించాడు. కానీ ఆ ఐదు నిమిషాలు గడిచినప్పుడు, ప్రతి నిమిషానికి ఆజాద్ వారిస్తున్నప్పటికీ, 'మరొక్క నిమిషం అధ్యక్షా' అని బ్రతిమాలుతూ అవమానాన్ని ఓర్చుకుంటూ మరి రెండుసార్లు బ్రతిమాలుకొని తాను చెప్పదలుచుకున్నదంతా చెప్పాడు రాజాజీ.

ఆనాటి రాజకీయ వాతావరణంలో రాజాజీ ప్రతిపాదనలు సరైనవా కాదా అనేది అట్లా వుంచి, అంతటి వైరుధ్యం, నిరసన ప్రకటిస్తున్న ఆ సమయంలో రాజాజీ వైఖరి ఎలా వుండెను అనేది చెప్పడానికే ఈ వృత్తాంతమంతా చెప్పవలసి వచ్చింది.

★ ★ ★ ★

రాజాజీని ఆయన తొంభై మూడవ ఏట, ఈ దేశం మొత్తాన్ని మీ చేతుల్లో పెట్టి నిర్వహించమని బలవంతం చేస్తే, మీరేం చేస్తారు? అని అడిగితే, 'ముందు డాక్టరు వద్దకు వెళ్ళి, నన్ను కాస్త చిన్నవాడిగా చేయగలడేమో కనుక్కుంటాను' అన్నాడు.

# మన గాయం మానాలంటే...



జోసెఫ్ కాంప్‌బెల్

ఆధ్యాత్మిక విషయాలను గురించి రాసే జోసెఫ్ కాంప్‌బెల్ అనే గ్రంథకర్త ఇద్దరు పాశ్చాత్య పోలీసులను గురించి ఓ వృత్తాంతం చెప్తాడు. వారిద్దరూ హవాయ్‌లో ఓ కొండ గుహగుండా కారులో వెళ్తున్నారు. ఆ ప్రాంతంలో ఒక వంతెన వున్నది. ప్రకృతి దృశ్యాలను వీక్షించేవారూ, ఆత్మహత్యలు చేసుకోదల్చిన వారూ, ఈ రెండు రకాలవారు ఆ వంతెన వద్దకు వస్తుంటారు. పోలీసు వారిద్దరూ ఆ వంతెన వద్దకు వచ్చేసరికి అక్కడ నుంచుని వున్న యువకుడు క్రిందనున్న అగాధంలోకి దూకడానికి సిద్ధమవడం చూశారు. కారు డ్రైవ్ చేస్తున్న పోలీస్ కాక, రెండవ పోలీస్, కారు ఆగకముందే రోడ్డుమీదికి దూకి, దూకుతున్న యువకుణ్ణి వారిస్తూ వాటేసుకున్నాడు. ఆ యువకుడు అప్పటికే ఒరగిపడి పోతూ, ఒక తృటిలో ఈ వాటేసుకున్న పోలీస్‌ని కూడా తనతోబాటే అగాధంలోకి తీసుకు వెళ్ళే పరిస్థితిలో, కారు డ్రైవ్ చేస్తున్న పోలీస్ కిందికి దిగి పరిగెట్టి, అదృష్టవశాత్తు వారిద్దరినీ పడకుండా అడ్డుకోగలిగాడు.

"ముక్కూమొహం తెలియని ఆ యువకుడిని, అందులో ఆత్మహత్యా పాపానికి ఒడిగట్టిన అతణ్ణి కాపాడ్డానికి ఆ పోలీసాయన చేసిన ప్రయత్నం, చావు కోరి తెచ్చుకోడమే అనిపించుకుంటుంది" అంటాడు కాంప్‌బెల్. మరి ఆ పోలీస్ జీవితంలో అతడి వ్యక్తిగత విషయాలన్నీ ఆ క్షణంలో రాలిపడిపోయినై. తన కుటుంబం యెడల, తన వృత్తియెడల బాధ్యత ఎగిరిపోయింది. తన ప్రాణం అంతమవుతుంది అనేది గుర్తులేదు. జీవితంలో తనకంటూ వచ్చిన ఆశలు ఆశయాలు అన్నీ క్షణకాలంలో అంతమైపోయినై. మరణం అన్నిటికీ తెరదింపేసి వుండేది. మరి ఎందుకు రక్షించబూనుకున్నట్లు?

**మార్పు ఉన్నది కానీ మరణం లేదు**

వేదాంతి షోపెన్‌హోవర్ అన్నట్లు, ఇటువంటి విపత్కర సమయాల్లో మనిషిలోకి ఓ తత్వ విచార పూరిత సత్యం, రివ్వుమని దూసుకు వచ్చేస్తుంది – నువ్వూ, అవతలి వ్యక్తీ ఇద్దరూ వేర్వేరు కాదు, ఒకటేననే ఆ ప్రత్యక్ష సత్యం, బాణంలా వచ్చి గుచ్చుకుంటుంది. నీవూ, 'పరాయి'గా కనిపిస్తున్న ఆ వ్యక్తీ, ఒకే ముఖానికి చెందిన రెండు చెంపలు. మన అసలు వాస్తవం, ఈ ప్రపంచంలోని జీవరాశి మొత్తంతో మనకున్న తాదాత్మ్యం, ఐక్యత కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది.

ఆ పరమ సత్యాన్ని ఏదో ఒక స్థాయిలో కనుగొనడానికి తన భౌతిక జీవితాన్ని, తన మొత్తం సామర్థ్యాన్ని అంకితం చేసినవాడే 'వీరుడు'. అలా అంకితం చేసినవాడి భౌతిక జీవనం, లేక అహం, విస్తృతమై, అది ఇప్పుడనుభవిస్తున్న పెద్ద గాయం దానంతటది ఏదో విధంగా మానడం ప్రారంభమవుతుంది.

## ఉత్సాహం

*పాప కార్యాన్ని చేయడానికి దుర్మార్గుడు ఎంత ఉత్సాహంగా పూనుకుంటాడో, అంత ఉత్సాహంతోనూ సజ్జనుడు సత్కార్యాన్ని చేయుగాక.*

*–హాసిడిక్ వాక్యం*

# జెన్ తీరు

**ఒ**క కొత్త సన్యాసి జోషూ అనే జెన్ గురువు వద్దకొచ్చాడు. "నిన్ను ఇంతకుముందు ఎప్పుడైనా చూశానా?" అని అడిగాడు జోషూ.

"లేదండి."

"ఐతే ఒక కప్పు టీ తీసుకో" అన్నాడు జోషూ.

మరో సన్యాసి వైపు తిరిగి "నిన్ను ఇంతకు మునుపు చూశానా?" అని అడిగాడు జోషూ.

"చూశారు మహాశయా" అన్నాడు ఆ సన్యాసి.

"అయితే ఓ కప్పు టీ తీసుకో" అన్నాడు జోషూ.

ఇదంతా అయిన తర్వాత, ఆ సన్యాసాశ్రమ నిర్వాహకుడు, జోషూని "అయ్యా, అవతలివాడు సమాధానం ఏది చెప్పినా, మీరు యథావిధిగా, టీ అందిస్తూనే వున్నారు. ఇదేమిటో నాకు అర్థం కావడం లేదు" అన్నాడు.

ఈమాట అడగగానే, "ఆశ్రమాధికారీ, నువ్వింకా ఇక్కడే వున్నావా?" అని కేక పెట్టాడు జోషూ.

అదిరిపడిన ఆశ్రమాధికారి "అయ్యా, ఇక్కడే వున్నాను" అన్నాడు.

"అయితే, ఇదుగో ఈ కప్పు టీ తీసుకో" అన్నాడు జోషూ.

జ్ఞాని వద్దకు వెళ్ళినప్పుడు మనం ఏ సమాధానం చెప్పినా ఒకటే. అతడి ప్రతి ఒక్క చర్యా, ఒక విధంగానే వుంటుంది. మన ప్రశ్నలకూ మన సమాధానాలకూ అర్థం వుండదు, అవి పరిస్థితికి తగినట్లుండవు. అందుచేత జ్ఞాని ఒకే విధంగా స్పందిస్తూ వుంటాడు. కారణమేమిటంటే, జ్ఞాని తానున్న జ్ఞాన స్థితి నుండి ఏ కాస్త కూడా అవతలికి ఇవతలికి జరగడు. ఏ పరిస్థితి కూడా అతణ్ణి చలింప చేయలేదు.

మనం పరిస్థితులకు లోనై బ్రతుకుతుంటాం. పరాయివాణ్ణి కలిసినప్పుడు మనలో ఓ రకమైన అనుమానం, భయం కలుగుతుంటై. ఇతడు మనకేదైనా హాని చేస్తాడేమోనని పిస్తుంటుంది. మిత్రులైతే వారి ముందు మన వాలకం ఓలాగా వుంటుంది. అన్యులు,

అధికార గణాలు, నౌకరీ చాకిరీ చేసేవారు, మనకు తటస్థపడితే ఒక్కొక్క వర్గంతో ఒక్కో రకమైన ముఖ కవళికలు ప్రదర్శిత మవుతుంటై. మనకు ఆత్మ మేల్కొనలేదు; మనలో ఐక్యత నెలకొనలేదు.

జోషూ తన చుట్టూవున్న పరిస్థితుల కారణంగా ప్రభావిత మవడు. అతడు కూచున్న చోట పరిస్థితులను మార్చేస్తుంటాడు.

జెన్ బౌద్ధం నేర్పేదంటూ ఏమీ వుండదు. కేవలం మనల్ని మేల్కొల్పి, ఎఱుకను కలగజేస్తుంది. అది బోధించదు; సూచిస్తుంది. జెన్ బౌద్ధం ఉపదేశించదు; కారణమేమిటంటే, ఉపదేశాలు అనుగ్రహ భాషణలు కేవలం మాటలుగా మిగిలిపోతై కాబట్టి.

మనుషులకు ఊపిరాడని స్థితి వచ్చేంతవరకు, తనకు ఎక్కడా ఏ విధమైన మానసిక భద్రత లేదనేది తెలిసి వచ్చేవరకూ, ఏదో ఒక రహస్యమైన బలీయమైన గాఢమైన జీవిత వాంఛ అతడిలో తోసుకు వచ్చేవరకూ, జెన్ ఓర్పుతో నిరీక్షిస్తూ చూస్తుంటుంది.

సుజుకీ రోషీ అనే జెన్ మాస్టర్ వద్దకు ఒక శిష్యురాలు వచ్చి, జెన్ ధ్యానం ద్వారా తన ఆగ్రహ లక్షణం తగ్గుతుందా అని అడిగింది. జెన్ ధ్యానం ఏ ఒక్కటీ పోగొట్టదని సుజుకీ సమాధానమిచ్చాడు. మనుష్యుల మూలకర్మలో వున్న శక్తిని మనం పోగొట్టుకో జాలం. ఆగ్రహ రూపంలో వెలువడుతున్న శక్తిని సృజనాత్మకమైన మార్గాల్లోకి మళ్ళించ గలుగుతాము.

అందువల్ల, సుజుకీ ఆవిడలో, ఆన ఆగ్రహానికి సంపూర్ణ బాధ్యత స్వీకరించ మన్నాడు. అలా స్వీకరించడమంటే, మరెవరో ఈ ఆగ్రహానికి కారణమని అనకూడదన్న మాట. ఈ విధంగా చేసినట్లయితే, తన ఆగ్రహం మరొకరికి హాని చేసే అవకాశముండదు. పిల్లవాడితో, 'ఇలాంటి వెధవ పనిచేసి, నాకెంత కోపం తెప్పిస్తున్నావోరా నాయనా' అని అనే బదులు, "అయ్యో నాకెంత కోపం వచ్చింది! నన్ను మన్నించు. ఈ కోపం నా తప్పే కానీ నీదికాదు' అని అనడం నేర్చుకో. ఈ విధంగా, ఆ క్షణంలో కలిగిన కోపం, మన కర్మకు మరింత కాలుష్యం జత కాకుండా, దానంతట అదే బయటికి వెళ్ళిపోతుంది. పిల్లవాడు చేసిన పనిలో ఏదైనా దోషముంటే, దానిని విధిగా పరిష్కరించడానికి ప్రయత్నించ వచ్చుగాక. ఆ విధంగా పిల్లవాడు కూడా తన తప్పులకు పూర్తి బాధ్యత వహించడం నేర్చుకుంటాడు.

★ ★ ★ ★

**జెన్ విధానం**

ఏదైనా పనిచేయవలసి వుంటే ఉన్నపళంగా చేసేయడమే. హృదయోద్వేగాలు, అనుభూతులు, ప్రవేశించక మునుపే, అనుకున్న పని చేసేయడం. ఇప్పటికిప్పుడు ఇది సుమూహూర్తమే; ఎందుకంటే, ఈ క్షణాన గనక చేస్తే, మన ఇష్టాఇష్టాలతో గానీ, ఉద్దేశాలతో గానీ కోరికతో గానీ చేయడమంటూ ఉండదు.


ఏమి పనిచేశావనేది జెన్‌కు ముఖ్యంకాదు; ఎలా చేశావనేదే ముఖ్యం.

## *నిజాయితీ నాకెలా వచ్చింది?*

*పీట్ సీగర్ అనే 'ప్రఖ్యాత జానపద గాయకుడు తన చిన్నతనపు అనుభవమొకటి చెప్తాడు. 'నా ఐదేళ్ళ వయసులో అమ్మ ఒకసారి నాకో పది సెంట్ల నాణెం ఇచ్చి దుకాణానికి వెళ్ళి, ఓ అయిదు సెంట్లకు ఏదో కొనుక్కురమ్మని పంపించింది. నేనా దుకాణానికి వెళ్ళినప్పుడు, అక్కడ నా మిత్రుడొకడు తారసిల్లి, 'ఆ మిగిలిన అయిదు సెంట్లతో మనమిద్దరం పిప్పరమింట్లు కొనుక్కు తిందాం' అన్నాడు. 'మిగిలిన అయిదు సెంట్ల చిల్లర ఇంటికి తీసుకువెళ్ళాల్సి ఉంటుంది' అన్నాను నేను. 'పోనియ్యవోయ్, నువ్వు కొన్న వస్తువే పది సెంట్లయింది అని చెప్పు' అన్నాడు వాడు. సరేనని, మిగిలిన అయిదు సెంట్లకు పిప్పరమింట్లు కొనేశాను.*

*ఇంటికి వెళ్ళి, కొన్న వస్తువుకు దుకాణదారు పది సెంట్లు తీసుకున్నాడు అని తండ్రితో చెప్పినప్పుడు, ఆయన నా వంక జాగ్రత్తగా చూచి అబద్ధం చెప్తున్నానని గ్రహించాడు. అటు తర్వాత, నా తండ్రి చేసిన పని నేనెన్నటికీ మరువలేను. ఆయన తన మోకాళ్ళను నేలకానిస్తూ, మృదువుగా నాతో 'నాయనా, మాతో నీవేనాడూ అబద్ధం చెప్పాల్సిన అవసరం లేదు. నిన్ను మేము ప్రేమిస్తున్నాం బాబూ' అన్నాడు. తెరలు తెరలుగా నాకు ఏడుపు తోసుకొచ్చింది. ఏడ్చాను. ఆయన కూడా ఏడ్చినట్టే గుర్తు. కానీ ఆనాటి నుండి నేను సాధ్యమైనంత నిజాయితీతో బ్రతకనేర్చాను.'*

# సదా సమాధి స్థితి



దైవ స్ఫురణ కలగడానికి మనిషికి సున్నిత స్వభావం, కోమలమైన స్పృహ ఎంతైనా అవసరం. అది లేకుండా ఎవరూ దైవాన్ని కనుగొనలేరు. కానీ ఈ స్వభావంగల మనిషి తన సమతౌల్యాన్ని తల క్రిందులు చేసుకుంటే, కొంత ఇబ్బంది ఏర్పడు తుంది. రామకృష్ణ పరమహంస జీవితంలో అడపా దడపా ఇలాంటి ఘట్టాలు కానవస్తుండేవి. ఒక్కొక్క మత సిద్ధాంతా న్ననుసరించి, దైవ దర్శనం సాధించాలనుకున్నప్పుడు, ఇస్లామ్ మతాన్ని అనుసరిస్తూ వారి మతాచారాలు పాటించేప్పుడు రామకృష్ణ ఎంతగా తాదాత్మ్యం చెందాడంటే, తాను అంత కాలం తీసుకున్న శాకాహారంకాక, మాంసాహారమే పెట్టమని పట్టుబట్టాడు. ఇది కొఱకరాని సమస్యగా తయారై, చివరకు వంటవాడి చేత శాకాహారాన్నే మాంసాహారం లాగా రూపుదిద్ది, పళ్ళెంలో తెచ్చి రామకృష్ణుడి ముందు పెట్టించారు! రామకృష్ణ, తానెప్పుడు సమాధి స్థితిలోకి జారుకుంటాడో ఆయనకే తెలిసేది కాదు. తనకు దానిపై అదుపు లేదని ఆయన స్వయంగా చెప్పుకునేవాడు. చాలా చిన్నతనం నుండి గదాధర్ (శ్రీ రామకృష్ణ యొక్క పూర్వ నామం) ఈ సమాధికి అలవాటుపడ్డాడు.

తొమ్మిదవ ఏట గదాధర్ ఉపనయనమైంది. మరి కొద్దికాలానికి శివరాత్రి పర్వదినంనాడు శివుణ్ణి ప్రార్థించడానికి గదాధరుడు ఉపోషమున్నాడు. ఆ రాత్రి సీతానాథ్ ఇంటిపైన శివపురాణం నుండి ఒక ప్రకరణం నాటకంగా ప్రదర్శించ నున్నారు. నడిరేయప్పుడు గయవిష్ణు, మరికొందరు మిత్రులు వచ్చి గదాధర్‌ని కలిశారు. పైన వేస్తున్న నాటకానికి శివ పాత్రధారిగా నటించ వలసిన వ్యక్తి జబ్బుపడ్డాడని, 'నువు వచ్చి ఆ పాత్ర ధరించమని'


పాల్‌ముని

అన్నారు. ఇలాంటి పాత్ర ధరించడం కూడా శివపూజే అవుతుందని గయవిష్ణు గదాధర్‌ను ఒప్పించాడు. తొమ్మిదేళ్ళ గదాధర్‌కు, మిత్రులు రుద్రాక్ష మాల వేసి వొంటికి విభూతి రాస్తూ, వేషం వేయిస్తూ వుండేసరికి, గదాధర్ మనస్సు ఇక్కడి లోకాన్ని వదలి, ఇతర లోకాల్లో విహరించ సాగింది. తాను స్టేజిమీదకు వెళ్ళేవేళకు, మెల్లగా అడుగులు వేస్తూ నడుస్తుంటే, అతడిలో శివ చైతన్యం నిండి పోయింది. ముఖం తేజస్వంత మైపోయింది. కళ్ళల్లో నీళ్ళు. శివుడే వేదిక మీదికి వచ్చాడా అని భ్రమించారు ప్రేక్షకులు. నాటకం మానేజర్, అతడి మిత్రులు, నాటకం సవ్యంగా సాగాలనే ఉద్దేశంతో గదాధర్‌ను మామూలు చైతన్యంలోకి తీసుకు రావడానికి ఎంతగానో ప్రయత్నించారు. కానీ వాళ్ళ ప్రయత్నాలు ఫలించలేదు. నాటకం ఆపేయవలసి వచ్చింది. గదాధర్ ఆ సమాధి స్థితిలో అలానే వుండిపోయాడు. మర్నాడు ఉదయానికి గానీ, మామూలు మనిషి కాలేదు.

ఇక్కడ రామకృష్ణ, నాటకంలో నటించబోయి తననితాను మరచిపోవడం ఒకటైతే, గొప్ప నటనా సామర్థ్య మున్నవారు, మనుష్యుల్ని తమనితాము మరచిపోయేట్లు చేయగలరు. వెనకటి తరంలోని ప్రఖ్యాత యూదు నటుడు టొమోషావ్‌స్కీ నటించే వేళలో అక్కడి హృదయోద్వేగ సన్నివేశాలు ఒక్కోసారి అతణ్ణి పూర్తిగా భావోద్వేగంలో ముంచేసేవి. అలాంటి వేళలో అతడు స్టేజిమీద చెప్పాల్సిన వాక్యాలు మరచిపోయేవాడు. ఒక దఫా అతడు జడ్జి వేషం వేశాడు. నాటకంలో కార్మికుడొకడు 'స్ట్రైక్'లో పాల్గొంటూ, ఏదో నేరం చేశాడనే ఆరోపణ వచ్చింది. ఆ కార్మికుడి తరఫున పాల్‌మునీ అనే ఓ ప్రఖ్యాత హాలీవుడ్ స్టార్ నాటకంలో న్యాయవాదిగా నటించాడు. ఈ పాల్‌మునీ నటనకు ఎంతగా అంకితమైనవాడో ప్రస్తావిస్తాను. సినిమాలో నటించమని ఎవరడిగినా ఆ పాత్ర తనకిష్టమైతేనే ఒప్పుకునేవాడు. ఇక ఆనాటి నుండీ, ఆ పాత్రను గురించిన సమస్త వివరాలూ లైబ్రరీల నుంచి సేకరించే వాడు. ఆ పాత్రలో లీనమై పోయేవాడు. ముఖ వైఖరి దగ్గరి నుంచి, వైయక్తిక శైలి వరకూ అన్నిటినీ స్వాధీనం చేసుకునేవాడు. అతడి మరణానంతరం అతడి భార్య మాట్లాడుతూ 'పాల్‌మునీతో కలిసి జీవించడం ఎన్నో వింత అనుభవాలు కలగజేస్తుండేది అని చెప్పుకున్నది. అతడా పాత్ర ధరించే కాలంలో ఇంట్లో కూడా దాదాపు అలాగే ఆ వ్యక్తిత్వంతోనే తిరుగు తుండేవాడు. ఆ సినిమా షూటింగ్ జరుగుతున్నంత కాలం ఇంటా

బయటా ఆ తీరులోనే ప్రవర్తించేవాడు. ఆ సినిమా షూటింగ్ అయింతర్వాత, మళ్ళీ మామూలు పరిస్థితికి వచ్చే వాడు. కొంతకాలం అయింతర్వాత, మరో పాత్ర స్వీకరిస్తే మళ్ళీ దాని విషయంలోనూ ఇంత శ్రమపడేవాడు. ఆ చారిత్రాత్మక పాత్రయొక్క చహరాకు ఇంట్లోవారు అలవాటు పడాల్సి వచ్చేది. మళ్ళీ కొత్త జీవితం ఆరంభమైనట్లుండేది. 'కొన్నిసార్లే పాల్‌మునీతో జీవించేదాన్ని; ఇతర సందర్భాల్లో ఆ పాత్రలతో జీవించడం, వింత అనుభూతి కలిగిస్తుండేది' అంటుంది. ఆవిడకు అతడిమీద అమితమైన ప్రేమ వుండేది. తాను నటించే పాత్రలకు ప్రాణంపోసినవాడు పాల్‌మునీ.

కార్మికుడి తరఫున న్యాయవాదిగా ఇరవై నిమిషాలపాటు కోర్టులో తన వాదం వినిపిస్తాడు. పతాకస్థాయి వద్దకు చేరినప్పుడు, 'మనిషియొక్క అభిజాత్యాన్ని, గౌరవాన్ని మంట కలుప దలుచుకున్నారా? ఈ కోర్టువారు అంతటి విపరీతమైన న్యాయోల్లంఘన చేయబూనుకున్నారా? ఈ భూమిపై ఈ కార్మికుడు జీవించరాదనే ఇక్కడి వారంతా భావిస్తున్నారా? అని ఉద్వేగపూరితంగానే అయినప్పటికీ, హద్దులు మీరకుండా, కోర్టు మర్యాద నతిక్రమించకుండా, అతి శక్తివంతంగా ప్రసంగించాడు. జడ్జి పాత్ర పోషిస్తున్న టొమోషావిస్కీ కళ్ళల్లో నీరు నిండినై. కన్నీటి చుక్కలు చెంపల మీదగుండా జారి కిందపడ జొచ్చినై. రుద్ధకంఠంతో ఏడ్పు నిండిన స్వరంతో, 'లేదు, లేదు' అనేశాడు. నాటకం రసాభాసగా ముగిసింది. నాటకంలో జడ్జి పాత్రధారి అనాల్సిన మాటలు, కఠినంగా వున్నప్పటికీ 'అవును' అనాల్సి వుంది.



బళ్ళారి టి. రాఘవ

తెనుగు వారిలో బళ్ళారి టి. రాఘవ ధరించిన కొన్ని పాత్రల్లో, ప్రహ్లాదుణ్ణి తన పంతం మానుకోమని నచ్చచెప్పడానికి తండ్రి పడే మానసిక క్షోభనంతా ఎలా ప్రదర్శించేవాడంటే, ప్రేక్షకులందరూ హిరణ్య కశిపుడు క్రూరుడు, రాక్షసుడనే మాట మరిచి, హిరణ్యకశిపుడి వైపే మొగ్గేవారు. ఒక విధంగా తన నటనా వైభవంతో అద్భుత ప్రతిభతో హిరణ్యకశిపుణ్ణి మనందరిలాంటి మానవుడే అన్నట్లు చూపించి నప్పటికీ, నాటకం యొక్క పరమోద్దేశం ప్రహ్లాదుడి హరిభక్తిని సమర్థించడం కాబట్టి, ఆ ఉద్దేశానికి భంగం వాటిల్లేట్లు చేస్తున్నాడు, ఈ మహానటుడనే విమర్శలు కూడా వినవచ్చేవి.

# దర్శకుడు దార్శనికుడై వుంటే?



సత్యజిత్ రాయ్

"దేవుణ్ణి మనిషి సృష్టించాడని నా నమ్మకం. దేవుణ్ని విశ్వసించమనేది అంతగా ఉపయోగపడేది కాదు" అన్నాడు ప్రసిద్ధ భారతీయ సినిమా డైరెక్టర్, సత్యజిత్ రాయ్ 1970లో. మార్క్సిస్ట్ సిద్ధాంతంలో మునిగితేలే పశ్చిమబెంగాల్‌లో పెరిగిన సత్యజిత్ 1970లో అలా మాట్లాడడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ ఇరవై ఏళ్ళ అనంతరం పెద్ద జబ్బునపడి మళ్ళీ కోలుకున్న తదుపరి, ఆయన ఏర్పరచుకున్న దృఢమైన అభిప్రాయం సళ్ళివ్వనారంభించింది. దేవుడి మాట ఎలావున్నా 'మనల్ని మించిన శక్తి ఏదో వున్నదని ఒప్పుకోక తప్పదు' అనే వరకూ అభిప్రాయం మార్చుకున్నాడు.

కానీ ఒక్కసారి దిగివస్తే తన అహం దెబ్బతింటుందనే భయంతో, "అయితే దేవుడు అని అందరూ అనుకునే వాదాన్ని నేను శిరసావహి స్తున్నానని కాదు. నేనంటున్నదల్లా మనకు కనిపించని, మనకు అర్థంకాని ఆ శక్తిని కొట్టి పారేయడానికి వీలు లేదంటున్నాను. ఆ శక్తి కొన్ని సందర్భాల్లో మన మానవ జీవితాన్ని, తన మార్గదర్శకత్వంతో నడిపిస్తుంటుందని పిస్తుంది. మా తండ్రి తాతల జీవితాల్లో అనేక అద్భుత సంఘటనలు చోటు చేసుకున్నై. మా తండ్రి, తాను త్వరలోనే చనిపోతాననే విషయం ముందే తెలుసుకో గలిగాడు; తనకు వ్యాధి రాకముందే ఈ విషయం గురించి ఆయనకు అనుమాన ముదయించింది. ఈ సంగతిని ఆయన ప్రశాంత మహలనోబీస్ (ప్రఖ్యాత ఫిజిక్సు సైంటిస్టు, కలకత్తాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, పంచవర్ష ప్రణాళికలు సిద్ధం చేయడంలో పండిట్ నెహ్రూకు తోడ్పడిన మేధావి)కు ఉత్తరం రాశాడు. తన బుద్ధి కోల్పోతున్నాననే సందేహం మా తండ్రికి కలగ నారంభించింది. అంటే మరణ మాసన్న మవుతున్న

దన్నమాట అని నిశ్చయించుకున్నాడు. తాను మహలనోబీస్‌కు రాసిన ఉత్తరం బెంగాలీ లిపిలోనే రాసినా, 'డెత్' అనే పదం మాత్రం రోమన్ లిపిలో రాసి, దాని కింద గీటుగీశాడు. తన మరణానంతరం ప్రశాంత్ తనకు (రాయ్ తండ్రికి) సంబంధించిన కొన్ని బాధ్యతలు స్వీకరించుమని కోరాడు. ఇవన్నీ అనుకున్నట్లే జరిగినై. ఈ సంఘటనను ఎలా అర్థం చేసుకోవాలి?

ఇప్పటికైనా భగవంతుణ్ణి గురించి నేనేమీ చెప్పజాలను. అవుననలేను, కాదనలేను. ఒకప్పుడైతే అలాంటి వ్యక్తి ఎవరూ లేరని నిర్ధారణగా చెప్పి వుండేవాణ్ణి. కానీ నేటి నా మానసిక స్థితిలో 'చివరి సమాధానం' కోసం వేచి వున్నాను. ఈ ఆధ్యాత్మిక విషయాన్ని గురించి మరింత ఆలోచిస్తున్నాను. తఱుస్తున్నాను. ఇవాళ లేదు, కాదు అన్నది రేపటి రోజున 'ఉన్నది', 'అవును' అని అనవలసి రావచ్చు. నేడు నా భావాలు స్థిరీకరించుకునే ముందు మరింత జాగ్రత్త పడుతున్నాను. బహుశ నాలోని ఈ మార్పు వయసువల్ల వచ్చిందనుకుంటాను. సత్యజిత్, సైన్సు విజ్ఞానాన్ని మాత్రమే నమ్మేవాడు. "అయినప్పటికీ మానవ జీవితాన్ని కానీ, మనిషి శరీరంలోని రహస్యాలన్నింటినీ సైన్సు విశదీకరించగలిగి లేదు. నా అయిదు నెలల మనవణ్ణి జాగ్రత్తగా పరిశీలిస్తుంటాను. ఆ శిశువు చైతన్యంలో, తెలివిలో, శరీరం పెరుగుతున్న తీరులో సంభవించే మార్పులు ఏ రోజుకారోజు అద్భుతంగా కనిపిస్తుంటై. దినదిన ప్రవర్ధమానమయ్యే ఆ ప్రక్రియే ఒక మహా రహస్యంగా తోస్తుంది. డాక్టరైన వాడికి మరింత బాగా అర్థమవుతుంది. ఇకపోతే, ఆ శరీర నిర్మాణం, పెరుగుదలలో జరిగే మార్పులన్నిటికీ సైన్సు సరియైన కారణాలు చెప్పలేదని వారికి తెలుసు. అందుకనే కాబోలు వారు మతధర్మం వైపు మళ్ళి, భగవంతుణ్ణి మరింతగా ఆరాధిస్తుంటారు. మొదట్నించీ హేతువాదిగా వుండిన సత్యజిత్‌రాయ్ 1990 నాటికి, కొంత మారక తప్పలేదు. మత సిద్ధాంతాలను మూర్ఖంగా పట్టుకు వ్రేళ్ళాడడం, ఛాందసం ప్రకటించడం మొదలైన వాటిని వ్యతిరేకిస్తూనే వుండేవాడు. కానీ ఎవరైనా ఒక విషయం గురించి బలమైన విశ్వాసం కలిగివుంటే దానిని నిరసించేవాడు కాదు.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సత్యజిత్‌రాయ్ తల్లి, తాను బాగా విశ్వసించే ఒక జ్యోతిష్కుడి వద్దకు, కొడుకుకు తెలియకుండా వెళ్ళి, జాతకం చెప్పించుకుంది. జ్యోతిష్కుడు చెప్పినవి ప్రధానంగా మూడు విషయాలు. రాయ్ చేసే వృత్తిలో మార్పు సంభవిస్తుంది. కొత్త వృత్తిలో వెలుతురు ప్రాధాన్యమెక్కువగా ఉంటుంది. చేసే పనికి అంతర్జాతీయంగా చాలా గుర్తింపు వస్తుంది.

'అప్పటికి నేను ఒక ఎడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీలో పనిచేస్తున్నాను. నా మనసులో సినిమాలు తీయాలనే ఆలోచనే లేదు. అసలు ఫిలిం పరిశ్రమలో చేరతానని అనుకోనే లేదు. నే తీసిన 'పథేర్ పాంచాలి' వివిధ దేశాల్లో ప్రశంస లందుకునేసరికి, మా అమ్మ నన్ను 'ఇప్పటికైనా జ్యోతిష్కుడు సత్యమే చెప్పాడని ఒప్పుకుంటావా?' అని అడిగితే విస్తుపోయా నంటాడు సత్యజిత్. సత్యమింత ప్రత్యక్షంగా ఎదుట వచ్చి నిలిచినా సత్యజిత్ రాయ్ మనసు మాత్రం దీనిని అంగీకరించడానికి ఇష్టపడలేదు. జ్యోతిష్యాన్ని మాత్రం అతడు తర్వాతి కాలంలో కూడా అంగీకరించ దలచుకోలేదు. "మనిషి భవిష్యత్తును ఎలా నిర్ధారించి చెప్పగలరో నాకు అర్థం కావడంలేదు. తుఫానులో చిక్కుకొని చనిపోయేవారూ, ఏదో ప్లేను కూలినందువల్ల ఒకే క్షణంలో చనిపోయేవారూ, వీరంతా ఇలా చనిపోతారనేది ముందే ఎవరు చెప్పగలరు? ఇది ఎలా సంభవం? చాలా దీర్ఘంగా ఆలోచించాను. కానీ నాకు సమాధానం చిక్కలేదు."

జ్యోతిషానికి ప్రాతిపదిక ఏమిటో, మనిషి జీవితాన్ని గ్రహాలు ఎలా ప్రభావితం చేస్తాయో, వేరే ప్రలోభాలతో నిమిత్తం లేకుండా శాస్త్రాన్ని మాత్రమే అధ్యయనం చేసి జ్యోతిష్కుడు విశుద్ధ జీవనుడైతే మనిషి భవిష్యత్తును దరిదాపుగా నిర్దుష్ట రీతిలో ఎలా చెప్పగలడో, ఇవన్నీ సత్యజిత్ తెలుసుకోడానికి ప్రయత్నించకుండా, తన ఆలోచనే సరైనది అనుకోడం అర్థరహితం.

"భగవంతు డనేవాడు ఉన్నట్లైతే, అతడు సర్వశక్తిమంతుడైతే, మొత్తం మానవాళిని కనుమూసి కనుతెరిచే లోగా సృష్టించి వుండవచ్చు కదా! ఈ దీర్ఘకాలపు ప్రణాళిక ఎందుకట?" అనే ఆలోచన తనకు తరచూ కలుగుతుందని మిత్రునితో చెప్పుకున్నాడు సత్యజిత్. ఏకాంతంలో స్నేహితునితో ఎలాపడితే అలా మాట్లాడవచ్చు; కానీ ఇవి సీరియస్‌గా అన్నమాటలైతే మాత్రం హాస్యాస్పదం. దినదిన ప్రవర్ధమానమయ్యే శిశువును చూచి, ఆశ్చర్యాద్భుతమైన పెరుగుదలను చూచి, తాను సంభ్రమా నందాలకు గురయినానని చెప్పుకున్నాడు. సృష్టిక్రియ మానవుడికి అంత ఆనందదాయకమై వుండటం ఎందుకో అర్థం కనుక్కోలేకుండా వున్నానంటాడు. తాను అత్యద్భుతమైన చలనచిత్రాలు సృష్టించి నప్పుడు కానీ, కాగితం మీద చిత్రాలు గీసినప్పుడు గానీ, ఎంత ఆనందానుభూతిని చెంది వుంటాడో తనకు స్వయంగా తెలుసు. మరి ఇవన్నీ ఒక్కసారి ఆకాశంలో నుండి ఊడిపడ్డట్టు పడితే, తాను ఒక్కొక్కరోజు శ్రమించి, ప్రేమతో వాటన్నిటినీ సరిదిద్దుతూ రూపొందించిన దానితో సమానమైన ఆనందం తనకు కలిగేనా?

### మార్పు ఉన్నది కానీ మరణం లేదు

మానవ జీవితంలో శైశవం నుండి బాల్యం, కౌమారం, యవ్వనం, మధ్యవయస్సు, వృద్ధాప్యం, ఒక్కొక్క దశలో కనిపించే వికాసం, చూడనెంత ముచ్చటగా వుంటుంది? ఒకరు ప్రపంచ ప్రజల ప్రశంసలతో మునిగిపోయిన మేటి చిత్ర నిర్మాత అవడం, వేరొకరు ప్రపంచానికి మార్గం చూపించగల్గిన ప్రబోధకుడవడం, ఇవన్నీ హృదయానికి ఎంత సంతోషాన్నిస్తాయి? సైన్సును మాత్రమే నమ్ముతానని శపథం పూనిన సత్యజిత్, ఆ సైన్స్ క్షేత్రంలో అగ్రగణ్యుడైన ఐన్‌స్టీన్ ఒకసారి ఏమన్నాడో చూద్దాం. “మానవ జీవితానికి అర్థమేమిటి? ఆ మాటకొస్తే ఏ జీవి యొక్క జీవనానికైనా అర్థమేమిటి? ఈ ప్రశ్నకు సమాధానం దొరకాలంటే మత ధర్మాన్ని శోధించక తప్పదంటాను. మీరనేదేమిటంటే, మరి అటువంటప్పుడు ఈ ప్రశ్న వేయడమే బుద్ధితక్కువ కదా? అని అంటారు. అందుకు నే చెప్పే సమాధానం: ‘ఏ మనిషైతే తన జీవితం కానీ తన తోటివారి జీవితం కానీ అర్థ రహిత మనుకుంటాడో, అలాంటివాడు దుఃఖితుడే కాక, అసలు జీవించేందుకే పనికిరాడు అంటాను. మానవ జీవితాన్ని కళ్ళకు కట్టేట్లు అత్యంత ప్రతిభావంతంగా తన సినిమాల్లో చూపించిన ఈ మహా దర్శకుడు సత్యజిత్, దార్శనికు డవడానికి ప్రయత్నించి వుండవచ్చు. తన దృష్టి గనక సత్యంవైపు మళ్ళి వుంటే, తన సునిశిత గమనికకు, సున్నిత హృదయానికి అది గోచరించకపోయి వుండేది కాదు. జీవితం చివరిలో పరోక్షంగా ఏదో కొంత గ్రహించాడు కానీ, అపరోక్షంగా తెలుసుకో లేకపోయాడు సత్యజిత్‌రాయ్.

# భగవంతునిపై భారం వేయడం

**ఆర్.** హెచ్. బ్లిత్ అనే పాశ్చాత్య రచయిత జెన్ సన్యాసిగా శిక్షణ పొందుతున్న కాలంలో, జెన్ ఆలయ ప్రధాన సన్యాసిగా వుంటుండేవాడు. అక్కడి మిగతా శిష్యులందరూ నిద్రిస్తున్న వేళ, తాను తెల్లవారుఝామునే లేచి, తనకు అప్పజెప్పిన పనులు చేయ నారంభించేవాడు. ఆ సమయంలో నిద్రిస్తున్న జెన్ సన్యాసులకు తమ మతాన్ని అభివృద్ధి చేయడం గురించి శ్రద్ధ లేనందుకు, తమ దైనందిన విధులను నిర్లక్ష్యం చేస్తున్నందుకు, బ్లిత్‌లో నిరసన పెల్లుబుకుతుండేది. "వారూ వారి సోమరితనమూ గురించి తప్పితే, నాకు మరో ఆలోచన వుండేది కాదు. నేనింత కష్టించి పనిచేస్తున్నానే, వారేమో ఇట్లా దర్జాగా నిద్రిస్తున్నారే, అనే మాటే తోస్తుండేది. ఈ విషయంలో నేనిలా అభిప్రాయపడు తున్నానని తెలుసుకున్న ఆలయ ప్రధానాధికారి, నాతో ఇలా అన్నాడు. 'ఈ ఆలయాన్ని ఎవరి కోసం శుభ్రపరుస్తున్నావ్?'

నాకు ఆ ప్రశ్న ఏమిటో అర్థంకాలేదు. నిరుత్తరుణ్ణై చూస్తూ నుంచున్నాను. అప్పుడు ఆయనే ఇలా వివరించాడు. "ఇది నీ కోసమే శుభ్రపరచుకుంటున్నావ్. నువ్వు "పనిచేసేప్పుడు, మరొకరి కోసం కాకుండా అచ్చం నీ కోసమే చేయడం నేర్చుకో" అన్నాడు. పనిచేసేప్పుడు కేవలం ఆ పని మీద శ్రద్ధపెట్టి చేయడమే నీ కర్తవ్యం. ఇంతరులందరూ చేస్తున్నారా లేదా అనే విషయం పట్టించుకోకు; ఈ జెన్ ఆలయం పైవారం నాటికి ఇలాగే వుంటుందో, లేక ఏ అగ్నిప్రమాదానికో గురై తగలబడిపోతుందో నీకనవసరం. నీవు నిద్రించేటప్పుడు ఒక్క నిద్రపోవడమే చేయాలి. మరే వ్యర్థమైన ఆలోచనకు తావివ్వరాదు. నువ్వు ఏదైనా పుస్తకం రాసేప్పుడు అది ప్రచురింపబడుతుందా, అసలు ఎవరైనా చదువుతారా చదవరా అనే ఆలోచనను దరి రానివ్వకు. ఆ చింత యావత్తూ దేవుడికి వదిలెయ్; ఆ అవస్థనంతా ఆయననే పడనీ. భగవంతుడి మీద భారంవేయడం అంటే ఇదే" అని విడమర్చి చెప్పాడు.

## మార్పు ఉన్నది కానీ మరణం లేదు

'ఈ చేసేది నేను' అనే దృష్టిని విసర్జించిన వైఖరి జపాన్ దేశపు 'సమురాయ్' వీరుల సంప్రదాయంలో ఎలా వర్ణింపబడిందో చూద్దాం.

"నాకు తల్లిదండ్రులు లేరు; పైన ఉన్న ఆకాశాన్ని, క్రిందనున్న భూమాతను, నా తల్లిదండ్రులుగా భావిస్తున్నాను.

నాకు దివ్యశక్తిలేదు; నా నిజాయితీనే నా శక్తిగా రూపొందించుకున్నాను.

నాకే సాధనం లేదు; విధేయతనే నా సాధనంగా చేసుకున్నాను.

నాకే ఆకర్షణ శక్తీ లేదు; నా అంతర్గత బలాన్నే నా ఆకర్షణగా రూపొందించుకున్నాను.

నాకు జీవనమూ లేదు, నాకు మరణమూ లేదు; శావ్వతమైన దానినే నా జీవన మరణాలుగా చేసుకున్నాను.

నాకు శరీరం లేదు; ధీరోదాత్తతనే నా శరీరంగా చేసుకున్నాను.

నాకు నేత్రాలు లేవు; మెరుపుతో వచ్చే పిడుగునే నా నేత్రాలుగా చేసుకున్నాను.

నాకు వీనులు లేవు; ఇంద్రియ జ్ఞానాన్నే నా వీనులు చేసుకున్నాను.

నాకు అవయవాలు లేవు; సత్వరతనే నా అవయవాలుగా చేసుకున్నాను.

నాకు ఏ పథకమూ లేదు; అవకాశాన్నే నా పథకంగా చేసుకున్నాను.

నా వద్ద ఏ మహిమలు, అద్భుతాలు లేవు; అన్నిటి యెడలా సరిపెట్టుకుంటూ సర్దుకుపోవడమే నా సూత్రంగా చేసుకున్నాను.

నాకు మిత్రులు లేరు; నా మనసునే మిత్రునిగా చేసుకున్నాను.

నాకు కవచం లేదు; సౌహార్దం, ధార్మికతను, నా కవచంగా రూపొందించుకున్నాను.

నాకు కోట లేదు; కదలని నా మనసును కోట చేసుకున్నాను.

నాకు కరవాలం లేదు; 'నిద్రించే మనసును నా కత్తి చేసుకున్నాను'

★ ★ ★ ★

## మా అనుభవం

భౌతిక సంపదలు తరచూ అసంతృప్తిని పెంచడం కనిపిస్తుంటుంది; కారణం, ఇది దుఃఖమూ, బాధా మూలాలకు వెళ్ళి వాటిని తగ్గించగలగడం గానీ, తొలగించడం కానీ చేయజాలవని మరింత స్పష్టంగా తెలియ నారంభించడమే.

# అయితే ఏమిటిట?

ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా నిత్య సమచిత్తత్వాన్ని కలిగుండమని శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పాడు. ఫలితం ఏదైనా ప్రశాంతంగా స్వీకరించమన్నాడు. 'అనుకోకుండా ఏదైనా ప్రమాదం ఘటిల్లితే, సమచిత్త్వంతో నీ పరిస్థితి అంచనా వేసుకొని, ఏది అవసరమో ఆ పనిని జాగ్రత్తగా చేయి. వాస్తవాలను పరిశీలించు, వాటి నుండి నేర్చుకో గలిగిందేదో నేర్చుకో, ఆ విషయంలో ఇప్పుడు చేయగలిగిందేదో చూడు అంటారు గంగాధరేశ్వర్ ట్రస్ట్ స్థాపకుడు స్వామి దయానంద. అన్ని సన్నివేశాలను, వాస్తవ దృక్పథంతో వీక్షించి, మనసును భావోద్వేగానికి గురికానివ్వకుండా ఆ పరిస్థితుల్లో చేయదగినదేమిటో కచ్చితంగా నిశ్చయించి తదనుగుణంగా చేయడం సబబుగా వుంటుంది. కలిసొచ్చిందని పొంగిపోవద్దు; నష్టపోయామని కుంగిపోవద్దు. సమచిత్తత్వం అంటే ఇటుగానీ అటుగానీ మొగ్గకుండా మనసును సమంగా ఉంచుకోడమన్నమాట. వాస్తవాలను అంగీకరించ గలిగితే, వైయక్తిక దృష్టిని ప్రవేశపెట్టడం వుండదు. కానీ అనేక సందర్భాల్లో మనం ఉన్నది ఉన్నట్లు చూడలేము. వాస్తవాలను అంగీకరించకపోతే, ఆ పరిస్థితి, సమస్య అయి కూచుంటుంది. మనకెవరైనా ఏదో వార్త చెప్తే, అది మనకయిష్టమైనదో దిగులు జనింపజేసేదో అయితే, ఆ వార్తనే నమ్మలేకపోతాం. 'అబ్బే నిన్ననే కదండీ నాతో టెలిఫోన్‌లో నవ్వుతూ మాట్లాడాడు' అని డీలాపడతాం. లేదా 'ఏమిటీ?' అని షాక్‌తో అదిరిపడతాం. ఆ వినిన దుర్వార్తను మనసు వెంటనే ఒప్పుకోలేక 'ఏమిటీ?' అనే ప్రశ్నతో కాస్త వ్యవధిని కల్పించుకుంటుంది. ఒక గొప్ప స్టోయిక్ (stoic) (పూర్వ కాలంలోని గ్రీకు విరాగ సిద్ధాంతి) వేదాంతిని గురించి, ఒక కథ చెప్తారు. విషాద భరితమైన వార్తను స్వీకరించడంలోనూ, వాస్తవాన్ని గుర్తించడంలోనూ ఇతడు తనకున్న శక్తిని ప్రదర్శిస్తాడు. సముద్రంలో ఒక ఓడ తన భార్యా పిల్లల్ని, భాగ్యాన్ని తీసుకువస్తూ తుఫాను కారణంగా మునిగిపోయింది. ఆందోళనతో ఈ వార్త మోసుకొచ్చిన వ్యక్తి ఇంటి తలుపు తట్టాడు.

"అయ్యా, మీ కుటుంబాన్ని, మీ భాగ్యాన్ని మోసుకువస్తున్న ఓడ దురదృష్టవశాత్తూ సముద్రంలో మునిగి పోయిందండి" అని దుఃఖంతో విన్నవించుకున్నాడు.

'ఏమిటీ?'...

'ఓడ మునిగిపోయిందండీ.'

'అయితే ఏమిటిట?'

'ఓడలోని మీ భాగ్యమంతా కోల్పోయారండీ'.

'అయితే ఏమిటిట?'

'అయ్యా, ఆ ఓడలోని వారెవరూ బ్రతికి బయట పడలేదు. మీ భార్యాపిల్లలు కూడా అందరితోపాటు నీటిలో మునిగిపోయారు.'

'ఏమిటీ?'...

'మీరు సంతానం లేని విధురులయ్యారని చెప్తున్నాను'

'అయితే ఏమిటిట?'

విరాగి వేదాంతి, వార్త వినగానే ప్రథమంలో 'ఏమిటీ' అని ప్రశ్నవేసినప్పుడల్లా, అతడి కామాటలు వినిపించకా కాదు, ఆ వాక్యం అర్థమవకా కాదు. విన్నాడు, అర్థమైంది; కానీ ఆ మాటలు అందిస్తున్న సందేశాన్ని మనసు ఒల్లడం లేదు. అందులోని వాస్తవాన్ని అతడు జీర్ణించుకో లేకపోతున్నాడు కాబట్టి, 'ఏమిటీ' అని చిన్న కేక పెట్టాడు. అది ఆ వార్తాహరుణ్ణి ఉద్దేశించి అన్న మాట కూడా కాదు. ఆ ప్రశ్న తనకు తానే వేసుకున్నాడను కోవాలి. ఆ దుర్వార్త అతడు సహించ లేనందువల్ల, మనసు సమాధానపడని కారణాన, మొదట్లో 'ఏమిటీ' అని అప్రయత్నంగా అనేశాడు. కానీ తాను వైరాగ్యాన్ని సాధించన వేదాంతి కాబట్టి, త్వరగా తేరుకొని, ఈ అసమ్మతి వైఖరికి అంటిపెట్టుకోకుండా దానిని జారవిడిచాడు. 'ఓడ మునిగిపోయింది. అయితే ఏమిటిట? తాను చేయగలిగిందేమీ లేదు. తత్ఫలితంగా బికారి అయిపోయాడు. అయితే ఏమిటిట? తన చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. ఒకప్పుడు తాను ఎంత భాగ్యమో సంపాదించాడు; ఇప్పుడు పోగొట్టుకున్నాడు. మళ్ళీ పూనుకుంటాడు, సంపాదిస్తాడు. తన పెళ్ళామూ పిల్లలు అంతా పోయారు. దుఃఖ పడినందువల్లా, నిరాశ చెందినందువల్లా వాళ్ళని తిరిగి తీసుకురాలేదు. అయితే ఏమిటిట? వాస్తవమిలా ఉన్నది. ఈ వాస్తవాన్ని పూర్తిగా గ్రహించి ఈనాటి ఈ పరిస్థితుల్లో తాను చేయగలినదేదో చేస్తాడు.

# అనుభవాల్ని అడ్డుకోకు : అర్థం చేసుకో

"**నా** మిత్రుడెవరైనా విందు భోజనమొకటి ఏర్పాటుచేసి, దానికి నన్ను ఆహ్వానించకపోయినా నేనేమనుకోను. కానీ నా మిత్రుడు దుఃఖంలో మునిగి వున్నప్పుడు, ఆ దుఃఖాన్ని నన్ను పంచుకో నివ్వకుండా ఆటంకపరచి నట్లయితే, చాలా బాధపడతాను.

ఈ లోకపు అత్యద్భుత సౌందర్యం తిలకిస్తూ, దాని దుఃఖాన్ని కూడా పంచుకుంటూ, ఈ రెండింటి ఆశ్చర్యానుభవాన్ని సాక్షాత్కరించుకో గలిగినవాడు, ఆ దివ్యానుభూతితో ప్రత్యక్ష సంబంధం కలిగుంటాడు. ఆ విధంగా భగవద్రహస్యానికి మనిషి ఎంత చేరువ అవగలడో అంత చేరువవుతాడు" అంటాడు. ఆంగ్ల సాహిత్యంలో శాశ్వత స్థానం సంపాదించుకున్న ఆస్కార్ వైల్డ్. బ్రతికింది, పాపం నలభై ఆరేళ్ళైనప్పటికీ (1854–1900) చాలా చక్కటి రచనలు చేసినవాడు.

జీవితం సుఖదుఃఖమయం: అయితే సుఖంకన్నా, దుఃఖమే అధికంగా నేర్పుతుంటుంది అనేది ఒక కఠిన సత్యం. ఆస్ట్రేలియా దేశానికి చెందిన ఒక వ్యక్తి, భారతదేశంలోని ముంగేరి యోగి ఇన్‌స్టిట్యూట్‌లో స్థిరపడి స్వామి ముక్తానందగా పేరు మార్చుకున్నాడు. తన జీవితానుభవాన్ని గురించి రాస్తూ, "నిత్య జీవన సరళి నుండి పెఱికివేయబడడం ఒక రకమైన వేర్పాటుగా భావించవచ్చు. ఏదైనా పెద్ద వ్యాధో, అంగవైకల్యామో సంభవించిన కారణాన అంతకుమునుపు తన పాటికి తాను స్వతంత్రంగా అన్ని పనులు స్వయంగా చేసుకోగలిగి వుండి, ఇప్పుడే నూతన స్థితిలో అన్నిటికీ – అంటే తినడం, స్నానమాచ రించడం, వస్త్రం ధరించడం – మొదలైన నిత్యకృత్యాలకు మరొకరిపై ఆధారపడవలసి రావడం, ఎంతో మానసిక వైకల్యం, నైరాశ్యం కలిగిస్తుంది. మనిషి జీవన విధానం, ఆలోచన అన్నీ తలక్రిందులైపోతై. ఈ దశలో తనకిష్టమున్నా లేకపోయినా మరొకరిపై ఆధారపడక తప్పదు; పరిస్థితులకు తల ఒగ్గక చేయగలిగిందేమీ లేదు. పూర్వపు జీవన విధానానికీ ప్రస్తుత జీవన విధానానికీ పోలికే వుండదు. ఏదో పెద్ద అగాధంలో పడినట్లు వుంటుంది. ఆ అగాధం విపరీతమైన భయం గొల్పిస్తుంది.

## మార్పు ఉన్నది కానీ మరణం లేదు

కానీ నిజాని కదొక గర్భాశయమై వుండవచ్చుగాక. ఈ స్థలంలో ఓ నూతన జీవితం ఆరంభ మవుతున్నదేమో! ఆ నూతన జీవితానికి ఇక్కడ తయారీ తినవలసి వస్తున్నదేమో? ఆ కొత్త జీవితానికి ఇక్కడే అన్నీ సిద్ధమవుతున్నాయేమో. అప్పుడా కొత్త జీవితంలోకి సులువుగా ప్రవేశించవచ్చు.

వేర్పాటు సంభవించిన తర్వాత సంధికాలం ఒకటి ప్రారంభమవుతుంది; మార్పు సంభవించనున్నది, స్థిత్యంతరం జరగనున్నది. ఈ దశలో మనసంతా గందరగోళంలో పడిపోతుంది. ఏమి చేయాలో తోచదు. జరిగిన అంగవైకల్యం జరగలేదనీ, ప్రవేశించిన వ్యాధి ప్రవేశించలేదనీ, వాస్తవాన్ని తిరస్కరిస్తూ ఊహల్లో జీవించా లనిపిస్తుంది. 'అంతా అయిపోయింది' అనే భావన ప్రబలుతుంది. దారి గానక ఏదో చీకట్లో తిరుగాడు తున్నట్లని పిస్తుంది. కొన్ని సందర్భాల్లో పెను నిరాశ అలముకుంటుంది. కానీ ఈ సమయంలోనే, ఆ చీకటికి అలవాటుపడుతూ, దానితో సర్దుకుపోయే విధానాలు కనిపించ నారంభిస్తాయి. ఆ మారిపోయిన జీవనంలో కలుగుతుండే ఇబ్బందులకు సరితూగే విధానాలు మెల్లమెల్లగా అలవడుతై.

కొత్తగా ఏర్పడిన పరిస్థితులనుబట్టీ, ఆ వ్యక్తియొక్క ఎఱుక స్థాయినిబట్టీ, ఈ మారిన జీవితానికి సర్దుకుపోగలిగిన లక్షణాలు అలవరచుకునే ఈ దశ కొన్ని నిమిషాలపాటు కానీ, ఒక జీవిత కాలమంతా గానీ, సాగిపోవచ్చు. తరచూ కొత్త జీవితం ప్రారంభం కాకుండానే, ఇంతకుమునుపటి స్థిత్యంతర దశలోనే కొనసాగుతూ, మరణించవచ్చు. అప్పుడు ఈ జన్మలోనే అనుభవించి పూర్తిచేసుకోవలసిన కర్మను, సంస్కారాలను మరో జన్మకు వదిలేసినట్లవుతుంది."

"సంభవించిన మార్పును ఈ జన్మలోనే అరమరికలు లేకుండా కలిపేసుకొని, దానికి సరిపడే విధానాలతో నూతన మార్గంలో పయనిస్తూ, దానివలన విచారం చెందకుండా ఎఱుకతో జీవించగలిగితే మనకో మహాభాగ్యం లభిస్తుంది. ఈ భాగ్యం, మేల్కొన్న చైతన్య రూపంలో దర్శనమిస్తుంది. మన పూర్వపు జీవితాన్నుండి విడగొట్టి, మరొక రకమైన, జీవితాన్ని మన మీదకు నెట్టిన, ఆ సంఘటనకు ఒక అర్థమున్నదనీ, అది విలువైనదనీ మనకు తెలియ నారంభిస్తుంది. వినూత్న పద్ధతులతో జీవితాన్ని అందంగా ఎలా జీవించాలో కనుగొన నారంభిస్తాం. మనమెవరో మనం తెలుసుకోడానికి వీలుకలుగు తుంది. జీవితం తన రహస్యాలను ఒకటొకటిగా నీకు అగుపించేట్లు చేస్తూ వుండడం,

నీకొక కొత్త ఆనందాన్ని ఒక కొత్త జీవితార్థాన్నీ సమకూరుస్తై. మనకు కలిగిన అఘాతం నిజానికి మన జీవితాలను సరియైన మార్గంలో పెట్టడానికే వచ్చిందనే సత్యం మనకు గోచరిస్తుంది. మనమెవరో మనమసలు ఎందుకు జన్మించామో తెలియ నారంభిస్తుంది.

ఇక ఇప్పుడీ దశలో ఈ నూతన జ్ఞానాన్ని మన జీవితంలో ఒక భాగంగా చేసు కుంటాము. దీని అర్థం మనం వ్యాధి నుండి విముక్తి పొందామని గానీ, కలిగిన అంగవైకల్యం నుండి బయట పడ్డామనీ కాదు. వాటి విషయంలో మనం చేయవలసింది ఇంకా ఎంతో వుండవచ్చు. కానీ మన జీవితంలో ఆ సంఘటన ఎందుకు జరిగిందో మనకర్థమయింది; సందేశ మందింది. మనకు సంభవించిన 'విపత్తు' అనే దాని ద్వారా ఏమీ నేర్చుకోకుండా జీవితం సాగించనూ వచ్చు. అలా అయ్యే పక్షంలో, మనకు 'నేర్పడానికి' జీవితం మళ్ళీ మళ్ళీ అలాంటి సంఘటనలను వేర్వేరు రూపాల్లో అనుగ్రహిస్తూ వుంటుంది – మనం ఆ సందేశం అందుకునే వరకూ అలాంటి అఘాతాలు పునరావృత్త మవుతూనే వుంటై.

నా జీవితానుభవాల ద్వారా నే తెలుసుకున్నదేమంటే, ఈ పాఠాలు నేర్చుకోవడం కూడా మూడు దశల్లో జరుగుతుందని; మొదట్లో ఇది మేధాపరమైన ఆలోచన. దాని వాస్తవం నాకర్థమవుతుంది గానీ, అది ఇంకా నాలో సహజంగా, నాలో భాగంగా ప్రవహించడం లేదు. ఈ పాఠాన్ని మరికొన్నిసార్లు అనుభవించిన తర్వాత, అది నా హృదయంలోకి ప్రవేశిస్తుంది. అప్పుడు దాని సత్యాన్ని నేను గ్రహిస్తాను. ఇంత అయిన తర్వాత కూడా అది నాలో సహజంగా ప్రవహించకపోతే ఆ గుణపాఠం మళ్ళీ మళ్ళీ నా ముఖాన్ని చరిచినట్లుగా వచ్చిపోతూ వుంటుంది. అప్పుడు అది హృదయ స్థానం నుండి ఇంకా దిగువకు వెళ్ళి ఉదర ప్రవేశం చేస్తుంది. ఆ సమయాన ఆ సత్యం నా సొంతమయిందని, నాలో భాగమయిందని నాకు తెలిసి వస్తుంది. ఇక దానిని అక్కడి నుండి నేను తొలగించ లేనని కూడా తెలుసుకుంటాను. అదొక సహజ జ్ఞానంగా మిగిలిపోయింది. ఇక ఇప్పుడు దాని గురించి ఆలోచించాల్సిన అవసరంలేదు. గుర్తుంచుకోడానికి నన్ను నేను బలవంత పెట్టుకో నక్కరలేదు. ఆ గుణపాఠాల ద్వారా సిద్ధించిన వాస్తవాలు ఇప్పుడు నాలో సహజంగా ప్రవహిస్తున్నాయి.

జీవితం అని మనం పేరుపెట్టుకున్న ఈ శక్తి, అంతిమ లక్ష్యం అందుకోమని సతతము ప్రేరేపిస్తూనే వున్నది. మనమిది గుర్తించినా గుర్తించకపోయినా దాని పని అది

చేస్తూనే వుంటుంది. మన జీవితంలో సంభవించే ఘటనలు, మానసిక శారీరక గాయాలను మనం తప్పించుకో చూడడం, వాటన్నిటినీ తిరస్కరించడం భగవంతుడు చూపుతున్న అనంతానుగ్రహాన్ని తిరస్కరించడమేనని గుర్తుంచుకోండి. అతడి ప్రేమ ఎల్లప్పుడూ మనపై వర్షధారగా కురుస్తూనే వుంది. అనురాగ పూరితమైన తన హృదయం లోని మన నివాసానికి తిరిగి రమ్మని ఆహ్వానిస్తూనే వున్నది.

★ ★ ★ ★

మన పునాదులే కదలిపోతున్నప్పుడు సహాయం కొరకై భగవంతుడి వైపు మళ్ళుతాం. కానీ వాటిని కదిలిస్తున్నది సాక్షాత్తూ ఆ భగవంతుడేనని తెలిసివచ్చినప్పుడు మొదట ఆశ్చర్యానికి గురవుతాం. ఆ తర్వాత కొత్త జీవితానికి అలవాటుపడ నేర్చుకుంటాం.

'అనామధేయం'

# దైవం సేవలో హకీమ్ సనాయ్

**"నా** ఆస్థాన కవీంద్రుణ్ణి మించినవాడు లేడు. ఈ రాజ్యంలోనే కాదు మొత్తం ఈ ప్రపంచంలోనే ఇతడికన్నా గొప్ప కవివరేణ్యుడు ఉండజాలడు" అని రాజు బహరాంషా సగర్వంగా ప్రకటిస్తూండేవాడు. ఎక్కడ ఏది ఉత్తమం, శ్రేష్ఠం అయినది కనిపిస్తే అది తన ఆస్థానంలో వుండాలని అతడి పట్టుదలగా ఉండేది. రాజు కాబట్టి, అనుకున్నది సాధించేవాడు కూడాను. రాజాస్థానంలోని కవీంద్రుడు హకీమ్ సనాయ్ చాలా పేరు ప్రఖ్యాతులు గడించినవాడు. అతడు ఏ విషయాన్ని గురించైనా కవిత్వం ఇట్టే అల్లేవాడు. కాదేదీ కవితకనర్హం అని అనకపోయినా, ఆ విషయాన్ని అక్షరాలా నిరూపించినవాడు. ఒక విధంగా ఇది అతడి మేలుకే ననుకోవచ్చు. ఎందువల్లనంటే, మిగతా ఆస్థాన కవులలాగే, సనాయ్ కూడా రాజుగారిని గురించి పలు రకాల సందర్భాల్లో ఏదో ఒకటి ప్రశంసా పూర్వకంగా రాయవలసి వచ్చేది. రాజు పుట్టినరోజైనా, వివాహమహోత్సవ దినమైనా, రాజుగాని పుత్రుడు జన్మించిన రోజైనా, బహరామ్‌షా మరో రాజుపై విజయం సాధించినా, సనాయ్ అందుకు పరిపడే కవిత్వం రాయక తప్పదు మరి. సనాయ్ పెద్ద భాగ్యవంతుల కులీన వంశం నుండి వచ్చినవాడు. అందుకుతోడు రాజుగాని మన్నన పొంది ఆస్థాన కవీంద్రుడైనాడు కాబట్టి, అతడు చాలా సుఖమయమైన జీవితం గడుపుతుండేవాడు. నివాసానికి చక్కని భవనం, కావలసినంత మంది నౌకర్లు, చాకర్లు, విలువైన దుస్తులు, మంచి ఆహారం అన్నీ వుండేవి. ప్రజలందరూ అభిమానించేవారు. అనేకమంది మిత్రు లుండేవారు. ఇన్నీ వుండి కూడా తన జీవితంలో ఏదో వెలితి ననుభవిస్తుండేవాడు సనాయ్. బహరాంషా ఎల్లప్పుడూ ఏ రాజ్యంమీద దండెత్తి విజయం సాధిద్దామా అని తలపోస్తుండే వాడు – మరిన్ని రాజ్యాలు తన స్వాధీనంలోకి రావాలని అతడి తహతహ. అందుచేత పర్షియాకు తూర్పున ఉన్న భాగ్యవంతమైన ఇండియాపై దండెత్తాలని నిశ్చయించు కున్నాడు. పర్షియన్ మహారాజు ఈ ప్రపంచానికే మహారాజు అని ప్రశంసిస్తూ ఆయన్ని గురించి కవిత్వ మల్లవలసిన పని సనాయ్ పాలిట పడింది.

## మార్పు ఉన్నది కానీ మరణం లేదు

బహరాంషా తాజా ఆకాంక్ష ననుసరించి కవిత్వం కట్టి, సనాయ్ అది చేతనిడుకొని, రాజ ప్రాసాదానికి బయలుదేరాడు. 'ఈ కవనంతో రాజు ఎంతైనా సంతోషిస్తాడు. అందుకు తగిన బహుమానం వుండనే వుంటుంది' అనే ఆనందంతో, దోవంట నడిచి వెళ్తున్నాడు. దారిలో ఏదో మధురమైన సంగీత ధ్వని వినిపించింది. ఇది ఎక్కడి నుంచి వస్తున్నదో అని చూస్తే, అక్కడ ఒక పూటకూళ్ళ ఇంటి నుండి, అని కనుగొన్నాడు. కాసేపు అక్కడ ఆగి, ఈ గాన మాధుర్యాన్ని గ్రోలుతూ, కాస్త విశ్రాంతి తీసుకుందామని నిశ్చయించుకున్నాడు. లోన ఓ సూఫీ వృద్ధుడికి అక్కడి మనిషి ఎవరో, పానీయాలు అందిస్తున్నాడు. ఆ వృద్ధుడు ఆ మనిషితో ఇలా అంటున్నాడు: 'ఈ పాత్రలోని పానీయం ఆ గొప్ప మూర్ఖుడైన బహరామ్‌షా పేరిట తాగుతాను'. సనాయ్ ఎంత ఆశ్చర్యపోయాడో, ఆ పానీయమందిస్తున్న మనిషి కూడా అంతగానూ ఆశ్చర్యపోయి, "మన రాజుగారిని ఎందుకని పరమ మూర్ఖుడంటున్నారు?" అని అడిగాడు.

అందుకా సూఫీ, "తననితాను అదుపులో పెట్టుకోలేని ఈ పెద్దమనిసి. ఇతర దేశాల మీదికి దండెత్తి వారిపై విజయం సాధించి, వారిని అదుపు ఆజ్ఞల్లో పెట్టాననుకుంటే, అతణ్ణి మూర్ఖుడనక మరేమంటారు?" అన్నాడు. ఈ మాటలు వింటూ ఆలోచనలోపడిన సనాయ్ మౌనంగా కూచుండిపోయాడు. ఆ మాటలు సనాయ్ హృదయంలో గాఢంగా నాటుకున్నై. సూఫీ చేతుల్లోని పాత్ర ఖాళీ అవగానే, అక్కడి మనిషి ఆ పాత్రను మళ్ళీ నింపాడు. ఈసారి ఆ సూఫీ, "ఈ పానీయం, పిచ్చివాడైన ఆ సనాయ్ పేరిట తాగుతాను" అన్నాడు. ఈ మాటలు సనాయ్ చెవిన పడ్డాయి.

ఈసారి కూడా ఆశ్చర్యంలో మునిపోయిన, లోపలి సహాయకుడు, ఆ వృద్ధ సూఫీతో "మన ఆస్థాన కవీంద్రుణ్ణి కూడా పిచ్చివాడని ఎందుకంటున్నారండీ?" అని అడిగాడు.

"ఇహ పరలోకాలతో సహా ఈ భూమండలాన్ని యేలెడి ఆ పరమప్రభువును కీర్తించడానికి అవకాశముండగా, భగవంతు దనుగ్రహించిన తన ప్రజ్ఞాపాటవాలను కేవలం ఈ భూపతిని పొగిడేందుకై వినియోగించే ఉన్మాదంలో వున్న ఆస్థాన కవీంద్రుని అలాగాక ఏ పేరుపెట్టి పిలవమంటావ్?" అని అడిగాడు.

ఈ మాటలన్నీ వింటున్న సనాయ్ ఇక ఉండబట్టలేక, అక్కడ మాట్లాడుకుంటున్న వారిద్దరి వద్దకు పరిగెట్టుకు వెళ్ళాడు. "మీరు ఏ ఉన్మాదిని గురించి మాట్లాడుతున్నారో ఆ 'పిచ్చి సనాయ్'ని నేనే. ఇన్నాళ్ళుగా నేను వెర్రివాణ్ణిగా తిరిగిన మాట నిజమే. కానీ ఇక

నుండి నేనలా వుండదలుచుకోలేదు. భగవంతుడి పిలుపు నాకు వినిపించేట్లు చేసినందుకు మీకు ధన్యవాదాలు. ఇవాళ్టి నుండి ప్రభువులకెల్ల ప్రభువైన ఆ మహాప్రభువు ఆశ్రయాన్నే పొందుతాను. ఆ రాజాధిరాజుకే నా కవిత్వాన్ని అంకితం చేస్తాను. అతడినే కీర్తిస్తాను" అని ప్రకటించాడు.

అక్కడి నుండి ఆస్థాన కవి హకీమ్ సనాయ్, బహరామ్‌షా రాజప్రసాదానికి వెళ్ళకుండా, తన స్వగృహంవైపు మళ్ళాడు. తనకున్న ఆస్తిపాస్తులన్నీ తెగనమ్మి బీదసాదలకు దానం చేసేశాడు. రాజుగారికి, తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి పంపించి, ఒక సాధారణ సూఫీ జీవన మారంభించాడు.

తన ఆస్థాన కవీంద్రుడికి ఏదో పిచ్చిపట్టి ఉంటుందని, రాజుగారు అనుకున్నాడు. "నే రమ్మంటున్నానని, వెళ్ళి పిలుచుకురాండి" అని తన మనుష్యుల్ని సనాయ్ వద్దకు పంపాడు. "మీరు తిరిగివచ్చి ఆస్థాన కవిగా కొనసాగితే, మీరు ఏనాడూ ఊహించనంత ధనం ఇస్తానంటున్నాడు మహరాజులవారు" అని వారు విన్నవించుకున్నారు. రాజుగారికి తన కృతజ్ఞతాభివందనాలు తెలుపమని అంటూ, తానీ భూలోక సుఖాలు కోరుకోడంలేదనీ తానిప్పుడు రాజులకెల్ల రాజైనవాని సేవలో నిమగ్నమై వున్నానని సమాధానం పంపించాడు సనాయ్. బహరామ్‌షా పట్టుదల మనిషి, సనాయ్‌లాగా మరెవ్వరూ తనను గురించి రాయలేరని అతడెరుగును. సనాయ్ అంటే, అతను చాలా ఇష్టపడేవాడు; అదీకాక సనాయ్ ఇచ్చే సలహాలు కూడా రాజుకు చాలా నచ్చేవి. అందుచేత సనాయ్‌ని బలవంతంగా తన సమక్షంలోకి తెప్పించాడు.

"సనాయ్, నువ్వు తిరిగి వచ్చి నా ఆస్థాన కవీంద్రుడిగా వుండాల్సిందే. మున్ను మరే రాజూ ఏ ఆస్థాన కవివరేణ్యుడికి ఇవ్వనంత ఆస్తీ, గౌరవమూ నేను నీకు ఇచ్చే ఏర్పాటు గావిస్తాను. నా చెల్లెలునిచ్చి వివాహం చేస్తాను. నాకెంతో పెద్ద రాజ్యమున్నది. వివాహ సందర్భంలో బహుమానంగా నేను జయించిన రాజ్యంలో కొంత భాగం నీకు కట్నకానుకలుగా ఇస్తాను' అన్నాడు.

రాజుగారి బావగా, సనాయ్ తనవద్దనే వుంటాడని బహరామ్‌షా భావించాడు. కానీ సనాయ్ ఇంత ఉదారమైన ప్రతిపాదనను కూడా వద్దనడం చూచి, బహరామ్‌షా ఆశ్చర్యచకితుడైనాడు. 'నేను సూఫీని అయిన రోజునే, దరిద్ర దేవతను సతిగా స్వీకరించాను. అందువల్ల నా స్థితిలో రాకుమార్తెలు, రాజ్యాలు, నన్నాకర్షించగలిగి లేవు' అని విన్నవించు

కున్నాడు. సూఫీగా సనాయ్ ఆనందాన్ని దర్శించాడు. భగవంతుణ్ణి ఆరాధిస్తూ అతడు రాసిన రాతలు, కవిత్వం, ప్రథమంలో భూపతులను పొగుడుతూ వ్రాసిన కవిత్వంకన్నా, చక్కగా వెలువడ నారంభించింది. సూఫీగా సనాయ్ రాసిన కవిత్వంలో అనేకార్థాలు గోచరించేవి అంటారు. అతణ్ణి ఈ తత్వంవైపు మళ్ళించిన ఆ పూటకూళ్ళ ఇంటిలోని ఇద్దరు వ్యక్తులూ దేవతా పురుషులని కొందరి విశ్వాసం. ధనికుడైనప్పటికీ, సర్వం త్యజించి పేదరికాన్ని వరించిన సనాయ్, ఒక ముతక శాల్వా కప్పుకు తిరిగేవాడు. కాళ్ళకు పాద రక్షలు కూడా ఉండేవి కాదు. అయినప్పటికీ అతడి శత్రువులు కొందరు, అతణ్ణి ముస్లిమేతరునిగా ప్రకటించేందుకు కుట్ర పన్నారు. పూర్వాచార పరాయణులైన ఆ ముస్లిములకు సనాయ్ ధోరణి నచ్చేది కాదు. కానీ వారు నెగ్గలేకపోయారు. హకీమ్ సనాయ్ కృషి చాలామంది సూఫీలను, ప్రధానంగా ఆ తర్వాత వచ్చిన జలాలుద్దీన్ రూమీని గొప్పగా ప్రభావితం చేసింది. సనాయ్ రాసిన పార్లమెంట్ ఆఫ్ బర్డ్స్, డెర్విష్ గీతాలు, ది వాల్డ్ గార్డెన్ ఆఫ్ ట్రూత్, అతడి రచనల్లో ప్రధానమైనవి.

★ ★ ★ ★

సూఫీ అయిన తర్వాత సనాయ్ పలికిన సూక్తులు:

“ఈ సాధారణ ప్రపంచంలో అందరూ నిద్రిస్తూ వుంటారు. నిత్య జీవితంలో వారు అనుసరించే మతమనేది కేవలం వ్యర్థమైనది, సారహీనమైనది.”

“భగవంతుని తత్వం మనిషి మెదడు అర్థం చేసుకోగలిగి లేదు.”

“ఆఖరికి ఒక చీమ కాలు కదిపినా, నీటి కింద ఒక రాయి కదలినా భగవంతునికి అనుభూతి కలుగుతుంది.”

“కడుపునిండా ఆరగించిన వారికి కూడా ఇంకా ఆకలే; మరేదో కావాలి.”

# సన్యాసి ఆహారం

స్వామి ప్రకాశానంద పూర్వము కాషాయ వస్త్రములు ధరించినంత కాలమూ, మధుకరమో, ఎవరి ఇంటనయినను భిక్ష చేయుటయో జరిగెడిది.

స్వామి నిరంజనానంద : అప్పుడప్పుడు ఆకలితో నుండవలసిన పరిస్థితులు మీకు కలుగలేదా?

ప్రకాశ : ఎప్పుడైనను ఆకలితోనున్నను, ఇప్పటివరకు రెండు రోజుల కంటే నెక్కువ ఆకలితో ఉండవలసిన స్థితి కలుగలేదు. మూడవరోజున ఆహారము దొరికెడిది.

నిరంజ : ఆకలిగానున్నప్పుడు నిధిధ్యాసనకు విఘ్నము కలుగలేదా?

ప్ర : ఆహారము లేనందున మనసు బాధపడు చుండెడిది. వృత్తి ఏకాగ్రత చెందుటకు బదులు స్తబ్ధమయి మూఢత్వమును చెందుచుండెడిది.

ని : అప్పుడు మీకు దుఃఖము కలిగెడిది కాదా?

ప్ర : ఎరిగియుండి అట్లు చేయుటవలన నాకు దుఃఖము కలిగెడిది కాదు.

ని : ఇద్దరు ఫకీరులు; ఒకడు వృద్ధుడు రెండవవాడు, యువకుడు. వృద్ధుడు యువకుని అడిగెను: 'నీకు అన్నము దొరకనప్పుడు నీకేమగును?' యువకుడు 'దేవుడు నాయందు ఈ రోజు దయచూపలే దనిపించును'.

అనంతరము యువ ఫకీర్ వృద్ధ ఫకీర్‌ని అడిగెను. "మీకు అన్నము దొరకని రోజున ఎట్లుతోచును?" వృద్ధుడిట్లు బదులిచ్చెను. 'నేడు దైవము నాయందు దయచూపెను' అనుకొనెదను. ఏలనన, నాకు మనోనిగ్రహమునకు వలయు అవకాశము ఇచ్చెను.

రుచికొరకు భుజించక, శరీర పోషణమునకు ఆహారమును గ్రహించుటలో తప్పు లేదు. భాగవతమునందు ఇట్లు చెప్పబడినది.

ప్రాణవృత్త్యైవ సంతుష్యేన్మునిర్నైవేంద్రియ ప్రియైః

జ్ఞానం యధాన నశ్యేత నా వకీర్యేత వాఙ్మనః– మనన స్వభావము కల ముని శరీర నిర్వహణమునకు చాలినంత ఆహారముతో సంతుష్టి పడవలెను. ఇంద్రియములకు

ప్రియములగు విషయములను సేవింపరాదు. అట్లు చేయుట వలన జ్ఞానము (వివేకము) నశించదు. మనోవాక్కులు స్థలనము చెందవు ('వార్తాలాపము' నుండి)

మిత్రశ్రీ వ్యాఖ్యానిస్తూ 'ఆహారము లేనందున మనసు బాధ పడుచుండెడిది. వృత్తి ఏకాగ్రతను చెందుటకు బదులు స్తబ్ధమయి మూఢత్వమును చెందుచుండెడిది' అని స్వామి ప్రకాశానంద స్పష్టంగా చెప్పడంలో, గ్రహించివలసిన ముఖ్య విషయమొకటున్నది. దైవ భక్తునికి, సర్వమూ దైవేచ్ఛ అనుకున్నవానికి ఎప్పుడైనా ఆహారం లభ్యంకాకపోవచ్చు. అప్పుడతడు చేసే ప్రయత్నమంతా ఆహారం కోసమే అవచ్చు. అతడి దైవభక్తికి అది ఏమాత్రం ఆటంకం కాదు. క్షుద్బాధ తీరడం అవసరం; సన్యాసికైనా అది అవసరమే. ఈ సమాజంలో ఎవ్వరికీ, ఏ ఒక్కరికీ క్షుద్బాధ లేకుండా చూడడం మనందరి కర్తవ్యం. మానవతా దృష్టితోనే కాదు; ఆ బాధ అనుభవిస్తున్న వారిలో ఒక్క దైవభక్తుడున్నా, మనం దైవద్రోహానికి పాల్పడినట్లు అవుతుంది అని ముగించాడు మిత్రశ్రీ.

**సంఘజీవితో సాధుజీవి సంభాషణ**

ఖ్యాతి గడించిన దౌత్యోద్యోగి సీ కుంగ్, చిరిగిన బట్టలతో పేదరికంలో జీవిస్తున్న సాధు పురుషుడు యువాన్ హిసియాన్‌ను, మర్యాదపూర్వకంగా చూచిపోదామని అతడి వద్దకు వచ్చాడు. "ఏమిటి మీ బాధ?" అని అడిగాడు.

"నాకే బాధాలేదు. డబ్బులేకపోవడం పేదరికమంటారని నేను విన్నాను. కానీ సత్యమెరిగి కూడా దానిన అనుసరించ లేకపోవడం అనేది చాలా పెద్ద బాధ. నేను పేదవాణ్ణే కానీ, బాధితుణ్ణి కాదు." ఈ మాటలు సీ కుంగ్‌కు కాస్త ఇబ్బందికరంగా తయారైనై. ఒక నిమిషం పాటు అటూ ఇటూ పచార్లు చేస్తూ వుండిపోయాడు. సాధువు యువాన్ హిసియాన్ నవ్వుతూ, "కొన్ని పనులు నేను చేయలేనని మీకు తెలుసు. నలుగురిలోకి వెళ్ళి వారు మెచ్చుకునే రీతిగా పనులు చేపట్టి నిర్వహించలేను. సంఘ మర్యాదలకు అనుగుణంగా పదిమందిలో తిరుగుతూ స్నేహాలు నెరపలేను. ఇతర్లు శ్లాఘించే పాండిత్యం సేకరించడం, తన పబ్బం గడుపుకోడానికి ప్రబోధం చేయడం, మానవత్వం న్యాయం అనే పేరిట పాపాకార్యాలు చేయడం నావల్ల కాదు. నాలుగుచోట్లకు నన్ను తీసుకువెళ్ళే సుఖవంతమైన వాహన సదుపాయం కూడా, నాలాంటి వాడికి ఉండే అవకాశంలేదు" అన్నాడు. దౌత్యోద్యోగి సీ కుంగ్, వెళ్ళివస్తానని సెలవు తీసుకొని, తలవంచుకు తిరిగి వెళ్లాడు.

# జగమంతటి హిందువుల నాథుడు

దక్షిణ అమెరికాలోని చిలీ దేశవాసి, ఇరవై మూడేళ్ళ సెబాస్టియన్ అనే యువకుడు హిందూ మతం పుచ్చుకున్నాడు. శాస్త్రోక్తంగానే అయి వుండాలి – సాధువు వేషధారణలో, ముఖంమీద తిలకం దిద్దుకొని, పూరీ జగన్నాథ్ ఆలయాంలో విగ్రహాన్ని కళ్ళారా చూడాలనే కోరికతో వచ్చి దర్శనం చేసుకున్నాడు. మెయిన్ గేట్ వద్ద అతణ్ణి ఎవరూ ఆపలేదు. గర్భగుడి వద్దకు వస్తున్నప్పుడు అక్కడి పోలీసులు ఆపారు. అతడు విదేశస్థుడని అక్కడ తేలింది. ఆగ్రహించిన పూజార్లు అతడు వెళ్ళిపోగానే, గర్భగుడినీ, విగ్రహాన్నీ పరిశుద్ధం చేయనారంభించారు.

"ఒక్క ఇండియన్ హిందువులనే గుడిలోకి రానిస్తారని నాకు తెలుసు. కానీ నేను ఐదేళ్ళ క్రితం హిందూమతం పుచ్చుకున్నాను. నేను ఫలాని స్వామి శిష్యుణ్ణి. గేట్‌వద్దనున్న పోలీస్‌వారు తమ విధులు సరిగా నిర్తర్వించలేదని పూజార్లు ఆరోపిస్తున్నారు" అంటాడు. సెబాస్టియన్. ఇంతకు మునుపు కూడా జగన్నాథ్ ఆలయంలోకి ఎవరిని రానివ్వవచ్చు, ఎవర్ని రానివ్వకూడదు అనే నిబంధనల ననుసరించి, భారతదేశ ప్రధాని ఇందిరాగాంధీనే అడ్డుకున్న సందర్భమున్నది. హిందూమతంలోని విగ్రహారాధనను విమర్శించే హిందువు లున్నారు. ఆత్మదర్శనానికి విగ్రహారాధన ఆటంకం అనే వరకూ తమ విమర్శను కొనసాగిస్తారు. కానీ అన్ని వైరుధ్యాలను సమన్వయించుకున్న హిందూ మతం యొక్క విశిష్టతను గుర్తించడానికి మనిషికి తెలివి వుండాలి. అలాంటి తెలివిగల కొద్దిమంది పాశ్చాత్యులు – నేటి తరంలో డేవిడ్ ఫ్రాలీ అనే అమెరికన్, పాత తరంవారిలో ఆస్ట్రియన్ సన్యాసి అగేహానంద భారతి, కృష్ణాకాన్షస్‌నెస్ ఉద్యమంలో పండితులైన పాశ్చాత్యులూ – వీరంతా హిందూమతం స్వీకరించినప్పుడు, "మా దేవుళ్ళ విగ్రహాలను మీరు చూడరాదు మీరీ మతంలో రెండవ మూడవ శ్రేణి వాళ్ళు" అన్నట్లుగా వ్యవస్థ కొనసాగితే, ఆధునిక కాలంలో ఎలా కుదురుతుంది అనేది ఆలోచించాలి" అన్నాడు మిత్రశ్రీ.

"హిందూమతం నుండి, మరో మతంలోకి వెళ్ళవద్దు. మత మార్పిడులను అరికట్టాలి, అనేదీ మనమే. ఈ హిందూమతాన్ని స్వీకరించి దీని ఆచారాలను అమలు జరుపుతాం

అనే ఇతర దేశీయులను ఆటంకపరిచేది మనమే. జన్మతః హిందువైనవాడే హిందువా? లేక క్షుణ్ణంగా తర్కించి, దీర్ఘంగా ఆలోచించి, విశ్వాస మేర్పరచుకొని, ఈ మతం పుచ్చుకున్న వాడు హిందువా? విశ్వాసం ప్రధానామా? లేక ఎన్ని తప్పుడు పనులు చేసినా, జాతిరీత్యా హిందు వవడమే ప్రధానమా? ఇంతకీ అడగవచ్చిందేమంటే, ఆధునిక కాలంలో హిందూమతం అంతర్గ్రాహ్యత కలిగుండాలా – అనగా చేరిక, కూడిక, కలయిక కలిగుండాలా లేక ప్రత్యేక సురక్షిత, అనితర మతంగా మిగిలిపోవాలా? "నేనెందుకు హిందువుని కాదు?" అనే ప్రశ్న హిందూ వర్గాల నుండే బయలు దేరుతున్నదంటే, మనం హిందూమతాన్ని అంతర్గ్రాహ్యతవైపు మళ్ళించాలా లేక 'నా జోలికి రాకు, నన్ను ముట్టుకోకు' అనే పద్ధతిలో ముడుచుకు కూచోవాలా? ఇలాంటి విధానం అవలంబిస్తే, హిందూమతం యొక్క ప్రభావం విస్తరిల్లుతుందా? లేక ఇలాంటి విచిత్రమైన 'మడి'పాటించి నందువల్ల, హిందూ మత ప్రభావం సన్నగిల్లుతుందా? ఇండోనేషియా అంతటా, ఇస్లామ్ ప్రబలంగా వున్నప్పటికీ, పేర్లన్నీ హిందువుల పేర్లే. సుకర్నో, రామ, లక్ష్మణ, చివరకు ఘటోత్కచ – మనుషుల పేర్లే కాదు, హోటళ్ళు, మ్యూజియములు, పెద్ద పెద్ద భవనాల పేర్లు కూడా మహా భారత, రామాయణ కాలానికి చెందినవి. ఇరవై శతాబ్దాల క్రితం గ్రేట్ బ్రిటన్‌లో ప్రభవిల్లిన డ్రూయిడ్ నాగరికత భారతీయ ద్రవిడ సంస్కృతిని ప్రతిఫలిస్తూ వుండేది. మెక్సికన్ సంస్కృతిలో హిందూమతాన్ని స్పష్టంగా చూడవచ్చు; కార్లోస్ కాస్టనీడా రాసిన పుస్తకాలు చదవండి. మెక్సికో దేశం పేరు మక్షక దేశం నుండి వచ్చింది అంటాడు ఆచార్య రజనీస్, అమెరికాను కనుగొన్నప్పుడు అక్కడ నివసించిన రెడ్ ఇండియనుల ఆచార వ్యవహారాలు చూస్తే అవన్నీ హిందూ సంప్రదాయాన్నే పోలి వుంటాయి. యూరప్‌లో నివసించే అనేక చిన్న చిన్న జాతులవారు 'మేము తెల్ల హిందువులమండీ' అని ఢిల్లీలో కొంత కాలం కిందట జరిగిన అంతర్జాతీయ హిందూ సమ్మేళనంలో చెప్పుకున్నారు. అంటే హిందూ సంస్కృతి హిందూ మతం, ప్రపంచవ్యాప్తంగా ఒకనాడు విస్ఫోటనం చెంది, నేటికీ గౌరవింపబడుతున్న దన్నమాట. జగన్నాథుడు ఈ జగానికంతా నాథుడు, విశ్వనాథుడు ఈ విశ్వానికంతా నాథుడు, కేవలం ఒక వర్గానికి చెందినవాడు కాడు" అన్నాడు మిత్రశ్రీ.

# సభా మర్యాదల అతిక్రమణ

అమెరికన్ ప్రెసిడెంట్ ఒబామాకు అబ్రహాంలింకన్‌పై అమిత అభిమానం. ఆయన అడుగుజాడల్లో నడవాలని అతడి ఆశయం. లింకన్ జీవితంలో ఒక ఘట్టం తెలుసుకుందాం.

అబ్రహాంలింకన్ తన ప్రథమ రాజకీయోపన్యాసం చేస్తున్నాడు. వేదికపై ఆయన వెనకాల స్థానిక ప్రముఖులు, రాజకీయవాదులు ఆసీనులై వున్నారు. లింకన్ సభనుద్దేశించి మాట్లాడే కొద్ది నిమిషాలకే, శ్రోతల్లోని ఒక వ్యక్తి – అందరూ అతణ్ణి జిమ్మీ పాంట్యిన్ అంకుల్ అనేవారు – గుంపు మధ్యగుండా తోసుకుంటూ వేదిక వద్దకు వచ్చాడు.

అంకుల్ జిమ్ గ్రామీణుడు; అతడు వస్త్రధారణ ఒకింత వింతగా ఉండేది. ఇక్కడ నగరంలో అతడు ధరించిన దుస్తులు మరింత విడ్డూరంగా కనిపించినై. కానీ జిమ్‌కు అబ్రహం అంటే తగని అభిమానం; పైపెచ్చు అతడి మిత్రుడు కూడాను. అందువల్ల మిత్రుణ్ణి కలిసిపోదామని పది మంది వుండే ఈ సభకే వచ్చేశాడు. ప్రసంగాలంటే ఏమిటో వాటి విషయంలో తాను పాటించవలసిన మర్యాదలేమిటో ఎరుగని జిమ్, స్నేహితుణ్ణి మిగతా వేళల్లో పలకరించినట్లే, లింకన్ ప్రసంగానికి అడ్డం తగులుతూ, "బాగున్నావా, అబ్?' అని  కుశల ప్రశ్న వేశాడు.

లింకన్ తన ప్రసంగం మధ్యలో ఆగాడు. వేదిక ముందుకు వచ్చి కిందికి వంగి, జిమ్మీతో కరచాలనం చేస్తూ 'ఎవరు జిమ్మీ అంకులా? నువ్వెలా వున్నావు అంకుల్?' అని తానూ  కుశల ప్రశ్న వేశాడు. ఆ తర్వాత జిమ్మీ చేతిని అలాగే పట్టుకొని, మనిషిని వేదిక మీదికి ఎక్కించి, వేదికపై తాను అంతకు ముందే ఖాళీచేసిన కుర్చీలో, ఇద్దరు స్థానిక ప్రముఖుల మధ్య కూచోపెట్టాడు. అంకుల్ జిమ్ కాసేపు ఆ కుర్చీలో కూచొని, తనని ఏదో కలవర పెడుతున్నందువల్ల, లేచి నుంచొని, "అబ్, మేరీని గురించి, పిల్లల్ని గురించి అడగడం మరిచాను' అన్నాడు.

లింకన్ తన ఓర్పును ఏమాత్రం కోల్పోలేదు. ఇందరి ప్రముఖులు, పెద్దల మధ్య, ఇతరడిట్లా ప్రవర్తిస్తున్నాడే అనే ఇబ్బందిపడలేదు. తనకన్నా తక్కువ స్థాయిలోని వానితో,

ఈ పల్లెటూరి బైతుతో, తాను మాట్లాడవలసి వచ్చిందనే భావం ప్రకటించకుండా, అతడి వైపునకు తిరిగి 'అందరూ బాగున్నారు, అంకుల్' అని సమాధానమిచ్చి, అటు తర్వాత తన ప్రసంగం కొనసాగించాడు.

★ ★ ★ ★

ఇరవైయవ శతాబ్దపు ఆధ్యాత్మిక పురుషుల్లో, ప్రముఖుడైన శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారు 1984 నవంబరు ఒకటిన, వారణాశికి వచ్చి ప్రసంగించవలసి ఉండెను. అందుకని నేనూ నా భార్యా, ముందుగానే వారణాసి చేరుకున్నాం. రైలు అలహాబాద్ చేరినప్పుడే, అక్కడ రైలెక్కిన ఒక వ్యక్తి "బి.బి.సి. న్యూస్, ప్రధాని ఇందిరాగాంధీని హత్యచేశారు" అని ఉద్రేకంగా చెప్పుకొచ్చాడు. కృష్ణమూర్తిగారి ప్రోగ్రామును ఇది తారుమారు చేస్తుందని మేమనుకోలేదు. కానీ అమెరికా నుండి అంతర్జాతీయ విమానంలో ఢిల్లీ వచ్చిన కృష్ణమూర్తి, ఢిల్లీ నుండి కలకత్తాకు, అటు తర్వాత వారణాశికి వచ్చే వీలులేకుండా పోయింది. ఆ వైపు విమానాలన్నీ అధికారులు రద్దుచేశారు. చివరకు ఆయన విమానంలో మద్రాసు వెళ్ళి, అక్కణ్ణుంచి చేసిన ప్రయత్నాలు కూడా సఫలంకాక, ఆఖరిన నవంబర్ పది అక్కడికి వచ్చారు. అసలు సంగతి అది కాదు. ఆయన వారణాశిలోని రాజఘాట్ వచ్చి, ప్రసంగం పెట్టుకున్న మర్నాడు ఉదయాన, ఒక విదేశీ యువకుడు - పాతిక ముప్ఫై ఏళ్ళుంటై- ఆయన ఎదురుగా శ్రోతల్లో కూచొనే చోటు లేక, వేదిక ఎడంవైపున ఓ బండ రాయి మీద కూర్చొని, జారిపోతూ ఇబ్బంది పడుతున్నాడు. కృష్ణమూర్తిగారు అటువైపునకు చూచినప్పుడు అతడు పడుతున్న అవస్థను గమనించారు. తన ప్రసంగం మధ్యలో ఆపి, "ఎందుకలా ఇబ్బంది పడుతున్నావ్?'' అని అడిగారు. తాను కృష్ణమూర్తికి సమీపంగా ఉండి వినాలని కాంక్షిస్తున్నానని, అక్కడ చోటు కనిపించక ఆ రాయిమీద తంటాలు పడుతున్నాననీ చెప్పాడు.

"ఇలా వచ్చి ఈ వేదిక మీదనే కూర్చో. సమీపంగా ఉండి వినవచ్చు"నన్నాడు కృష్ణమూర్తిగారు. ఆ అమాయకుడు, సభామర్యాద నతిక్రమిస్తున్నాననే స్పృహ లేక, వేదిక మీదకు వచ్చి ఒకవైపు కూర్చున్నాడు. "ఇక వేదికపై మీకిద్దరు గురువులు" అని కృష్ణమూర్తి చమత్కరించాడు. ఆయన ప్రసంగం పూర్తయ్యే వరకూ, ఆ దృశ్యం అలాగే కొనసాగింది.

# దేవుణ్ణి చూడాలని ఉందా?

దైవానుభవం పెనుచీకటి వంటిది; అది మాటలలో వర్ణించనలవి కానిది. అందు వల్ల దానిని అలా వదిలేయడమే మంచిది. మనం వర్ణించ గలగినదల్లా దైవం వైపు మళ్ళడానికి మనిషి, ఏకైక లక్ష్యంతో ఎలా బ్రతుకుతున్నాడు, అతడి జీవితం ఎలా గడుస్తున్నదీ అనేవి మాత్రమే. ఏ అద్భుతాన్ని వాంఛించకుండా ఏకాంతంగా అతి సాధారణమైన జీవితాన్ని సాగించే ఎడారి యోగుల్ని గురించి పాచోమియస్ (Pachomies) అనే మహనీయుడు ఇలా అంటాడు: 'పరిశుద్ధుడైన, వినమ్రుడైన మనిషి గనక నీకు తారసిల్లాడంటే, అదొక మహాదర్శనమని గుర్తించు. కనిపించని దైవం ఈ కనిపించే మనిషిలో దర్శన మివ్వడంకన్నా గొప్ప దర్శన మేముంటుంది?

ఈ పాచోమియస్, మొదటి క్రిస్టియన్ సన్యాసుల సంఘం స్థాపించిన మహానుభావుడుగా పరిగణింప బడుతున్నాడు. ఒకరోజున ఒక వ్యక్తి, సన్యాసాశ్రమం వద్దకు వచ్చి "నాకూ ఈ సంఘలో చేరుదామని ఉన్నది" అన్నాడు. "భగవంతుణ్ణి చూచేందుకు నువ్విక్కడికి రాదలుచుకున్నావా?" అని అడిగాడు పాచోమియాస్.

"అవును, నేనేమి చేయాలో చెప్పండి. ఎన్నిమార్లు మోకరిల్లాలి, ఎన్ని శ్లోకాలు పఠించాలి, ఎన్నిసార్లు ప్రార్థించాలి, ఎన్ని ఉపవాసాలు చేయాలో సెలవివ్వండి" అన్నాడు.

పాచోమినియాస్ అతడి మాటలకు అడ్డం వస్తూ 'నువ్వు దైవాన్ని దర్శించదలుచు కుంటే, ప్రార్థనలూ, ఉపవాసాలూ చేయనక్కర లేదు. ఆఖరికి ఇక్కడ సంఘంలో కూడా సభ్యునిగా చేరనవసరం లేదు. ఉత్తిగా నాతోరా, దైవాన్ని చూపిస్తాను' అన్నాడు. ఆశ్రమం లోనికి తీసుకువెళ్ళి, అక్కడున్న వారిలో అందరికన్నా అతి దీనుడు, మురికిబట్టలు ధరించిన వాడు, అపరిశుభ్రంగా వున్నవాడు, మతి చలించిన ఓ సన్యాసిని చూపించి, వచ్చిన వాడితో 'అడుగో భగవంతుడు, చూడు' అన్నాడు.

సభ్యత్వం ఆశించి వచ్చినవాడు మండిపడుతూ! ఆ నికృష్టుడు భగవంతు డంటున్నారా? అన్నాడు. 'అతనిలో నీకు భగవంతుడు కనిపించకపోతే, నీకు భగవంతు డెక్కడా కనిపించడు' అన్నాడు పాచోమియస్.

# మురికి

**1936**వ సంవత్సరంలో డాక్టర్ ఏ.ఓ. జోర్డన్, లండన్‌లో ప్రచురించే ఆనాటి బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో రాస్తూ, డాక్టర్ డబ్ల్యు.జి. ఏయిట్‌చిసన్ పాశ్చాత్యుల అలవాట్లను గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నాడని రాశాడు. 'ప్రాచ్య దేశాలలోని మన మిత్రులు కొందరు పశ్చిమ దేశవాసుల మురికి అలవాట్లు చూసి అసహ్యించుకుంటూ వుంటారు. మల విసర్జనానంతరం పృష్ఠభాగాన్ని కానీ, చేతుల్ని కానీ మనం కడుక్కోకపోవడం, వారికి తగని రోత కలిగిస్తుంది. పదేళ్ళ క్రితమే అంటే 1926లో ఆరోగ్యానికి సంబంధించిన ఓ పత్రికలో రాస్తూ నేనిలా అన్నాను. 'ఇండియా నుండి మనం నేర్చుకోదగ్గ విషయాలు కొన్ని వున్నై. మలవిసర్జనకై టాయిలెట్‌కు వెళ్ళినప్పుడు మన పాశ్చాత్యులు పరిశుభ్రం చేసుకోవడానికి పొడి కాగితాన్ని తప్ప మరేదీ ఉపయోగించక పోవడం, అక్కడ నుండి నేరుగా ఇంట్లోకి వచ్చేయడం వారికి చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎప్పుడో 1900 సంవత్సరంలో నాతో ఓ ఇండియన్ డాక్టర్ ఈ విషయాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ వివరంగా చెప్పాడు. ఆనాటి నుండీ, నేనా క్రియకు బయలుదేరేటప్పుడు బాగా తడిచేసిన కాగితాన్ని సమకూర్చుకొని వెళ్తుంటాను. ఈ చిన్న సంస్కరణను అలవరచుకోమని మన పాశ్యాత్యు లందరికీ సూచిస్తూ వుంటాను."

భారతదేశాన్ని పరిపాలించిన షాజహాన్ చక్రవర్తి కూడా, బ్రిటిష్‌వారు ఇతర పాశ్చాత్యులు తన సమ్ముఖంలోకి వచ్చి, వర్తకవాణిజ్యాలను అభివృద్ధి పరచుకోవడానికి, వంగి సలాములు పెడుతూ వుంటే, "ఈ విచిత్ర వేషధారణలో బిగుతు గుడ్డల్లోని ఈ పాశ్చాత్యులు, మల విసర్జనానంతరం జలంతో శుభ్రపరచుకోరని విన్నాను. ఏమి విచిత్రమైన జాతి ఇది!" అని తన సరసన కూచున్న వారితో వ్యాఖ్యానించాడని చరిత్రకారులు రాశారు. ఈనాటికీ పాశ్చాత్యులు ఈ విషయంలో ఏది పరిశుభ్రతో, ఏది నాగరీకమో తెలియక అవస్థపడుతూనే వున్నారనే మాట అటుంచి, ఆస్ట్రేలియా దేశంలో ఎవరో ఒకరు ఇందుకై జలాన్ని ఉపయోగిస్తున్నాడని తెలిసి, అతడి 'అలవాటు' ఆస్ట్రేలియన్ ప్రజలకు తగని అలవాటుగా (దురలవాటు!) పేర్కొన్నారు. నలభై మూడేళ్ళ అమేదార్ బెర్నేబీ అనే మెషీన్

ఆపరేటర్ ఫిలిప్పీన్స్ దేశం నుంచి 'వర్కింగ్ వీసాపై' వచ్చి, ఆస్ట్రేలియా దేశంలోని టేన్స్‌విల్‌లో పనిచేస్తున్నాడు. బెర్నేబ్ టాయిలెట్‌కు వెళ్ళినప్పుడు, అతడిపై ఉద్యోగియైన ఫోర్‌మన్ అతడు టాయిలెట్ వరకూ నీళ్ళు తీసుకెళ్తున్నట్లు గమనించాడు. 'అట్లా టాయిలెట్‌కు నీళ్ళు తీసుకెళ్ళకూడదు' అని బెర్నేబ్‌ను హెచ్చరించాడు. 'అది నా వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన విషయ'మన్నాడు బెర్నేబ్. అటు తర్వాత అతడు పనిచేస్తున్న టేన్స్‌విల్ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్ 'ఆస్ట్రేలియాకు విరుద్ధమైన టాయిలెట్ అలవాట్లు కలిగి ఉన్నందుకు గాను' అతణ్ణి ఉద్యోగం నుండి తొలగించింది. అని మొన్న ఈ మధ్య జనవరి (2009) మాసంలో న్యూస్‌పేపర్లలో ప్రకటించారు.

అంటే శతాబ్దాల కాలం గడుస్తున్నా విజ్ఞులైన పాశ్చాత్యులు అజ్ఞులైన తమతోటి వారిని 'ఈ అలవాటును సంస్కరించుకోండి, కనీసం మనకన్నా చాలా శతాబ్దాల క్రితమే నాగరీకులు, సంస్కారవంతులైన ఇండియన్లను చూచి నేర్చుకోండి' అని చెప్తున్నప్పటికీ నిర్లక్ష్యం చేయడమేకాక, పైపెచ్చు, అలాంటి పరిశుభ్రమైన అలవాటు కలిగున్న వారిని ఉద్యోగం నుండి ఊడబెటికేశారంటే, పాశాత్య సంస్కృతి ఏ స్థాయిలో కొనసాగుతున్నదో అర్థంచేసుకోవాలి. ఇండియాలో మురికివాడల దరిద్రాన్ని సినిమాల ద్వారా ఎత్తి చూపించే పాశ్చాత్యులు, తమ వ్యక్తిగత ఆరోగ్యాన్ని గురించిన అవగాహన ఏపాటిదో గ్రహించాలి. ఇండియాలో మురికివాడల్లో నివసించే క్రిందిస్థాయి వర్గాలు కూడా ఓ డబ్బాతో నీళ్ళు తీసుకునే టాయిలెట్‌కు బయలుదేరుతారు.

**అసలు కిటుకు**

మిసెస్ రేపాపోర్ట్ ఓ కొత్త కాడిలాక్ కారును వంద డాలర్లకు అమ్ముతానని ప్రకటించింది. ఆ ప్రకటన చూచి వచ్చినతడు అడిగిన మొదటి ప్రశ్న: 'కార్‌కు వున్న దోషమేమిటి?'

'ఏమీలేదు. మీకు కొనుక్కోవడం ఇష్టంలేకపోతే వెళ్ళండి. నా కాలాన్ని వృధా చెయ్యద్దు' అన్నది ఆవిడ. వచ్చినాయన, ఆవిడవద్ద కారు తాళపుచెవి తీసుకొని గరాజ్‌లోకి వెళ్ళి కార్‌ని వెనక్కు తోలుకుంటూ వచ్చి, ఇంటిముందు నిల్పి, వంద డాలర్లు తీసి, ఆవిడ చేతికిచ్చాడు. "మీ డబ్బు చేతికి వచ్చిందిగా? ఇక ఇప్పుడు చెప్పండి కిటుకేమిటో' అన్నాడు.

"ఏమీ లేదు. నా భర్త ఈ మధ్యనే మరణించాడు. అతడి వీలునామాలో ఈ కొత్త కారును అమ్మి వచ్చిన డబ్బును తన సెక్రటరీగా పనిచేసిన ఆవిడకు ఇచ్చేయమని రాసి పోయాడు."

# అక్బర్ భారతం

అక్బరు పాదుషా వద్దకొక వ్యక్తి వచ్చి మహాభారతం నుండి కొన్ని ఘట్టాలు, కథలు చెప్పాడు. కౌరవ పాండవుల కథలు దాదాపు అందరికీ తెలిసినవే అయినప్పటికీ, ఎవరైనా మరోసారి చెప్తున్నా వినాలనే ఆసక్తి వుంటుంది. చెప్పడం ముగియగానే అక్కడి రాజాస్థానంలోని ఒక సదస్యుడు అక్బర్ పాదుషాతో, ఆయన మెప్పును పొందడానికి, "మహారాజా, మిమ్మల్ని గురించి కూడా ఒక మహాభారతం రచియింపజేస్తే బాగుంటుంది కదా. మీ వంటి చక్రవర్తి మరొకరు లేరు కాబట్టి, నూతనంగా రాసే ఈ మహాభారతం బ్రహ్మాండంగా వుంటుంది" అన్నాడు.

"నిజమే. కాని రాసేవారెవరు?"అని ప్రశ్నించాడు బుట్టలోపడిన అక్బర్.

బీర్బల్ అంటే ద్వేషంకక్కే ఒక వయస్కుడు కలగజేసుకొని "మహారాజా, బీర్బల్ ఒక్కడే మిమ్మల్ని గురించి మీ జీవిత చరిత్ర గురించీ, చక్కగా రాయగలిగిన తెలివిగలవాడు" అన్నాడు. ఈ వయస్కుడి దురుద్దేశ మేమిటంటే, బీర్బల్ గనక నానా అవస్థాపడీ రాస్తే అతడి పేరును పాదుషా వారికి ప్రథమంగా సూచించింది తానేననే కీర్తి తనకు దక్కుతుంది. రాయలేనని బీర్బల్ గనక అంటే పాదుషాకు ఆగ్రహం జనించి, బీర్బల్‌ని దేశం నుండి బహిష్కరిస్తాడు. అంతకన్నా తనకు కావలసిందేముంది?' అనుకొని ఈ ప్రతిపాదన చేశాడు. అక్బర్, బీర్బల్‌తో ఈ గ్రంథరచన సంగతి ప్రస్తావించినప్పుడు, అలాంటి పుస్తకం అక్బర్‌ను గురించి రాయడం అసాధ్యం, అనుచితం అని బీర్బల్‌కు తెలుసు. కాని బయటికి మాత్రం "మహరాజా, అలాంటి పుస్తకం రాయడానికి కనీసం ఒక సంవత్సరం పడుతుంది. నేను ఎన్నో ప్రాంతాలకు వెళ్ళి, మీరు సలిపిన యుద్ధాలను గురించీ, గెలిచిన రాజ్యాల గురించీ, సమాచారం సేకరించాల్సి వుంటుంది. మీరు పరిపాలించే ప్రాంతాలన్నింటిలోని ప్రజలను గురించి తెలుసుకొని అదంతా ఈ పుస్తకంలో పొందుపరచాల్సి వుంటుంది. నే తిరగడానికి కొంత ధన సౌకర్యం కూడా కావలసి వుంటుంది" అన్నాడు. అలాగేనని అక్బర్, ఖర్చులకు గాను ఓ పది లక్షల రూపాయలు ఉదారంగా మంజూరు చేశాడు. బీర్బల్ ఆ డబ్బుతో

అక్బర్ ఏలెడి ప్రాంతాలన్నీ తిరిగి కొన్నిచోట్ల రోడ్లు వేయించాడు, మరికొన్ని చోట్ల అక్కడ అవసరమైన నీటి కాల్వలు, బావులు తవ్వించాడు. ఒక సంవత్సర కాలం గడిచిన తర్వాత ఓ పెద్ద బరువైన పుస్తకంతో రాజసభకు తిరిగి వచ్చాడు. నిజానికి ఆ పుస్తకంలో ఒక అక్షరంముక్క కూడా లేదు. కానీ పాదుషాతో "పుస్తకం రాయడం దాదాపు ముగిసినట్లే" అని అంటూ 'ఇక ఒకే ఒక్క కథ రాయాల్సి వుంది. కానీ అది రాసేలోగా మహారాణీ వారి అనుమతి తీసుకోవాల్సి వుంటుంది' అన్నాడు. బీర్బల్ రాణీవారి అనుమతి పొందేవరకు, అక్బర్ పాదుషా వేచి వుంటానని అంగీకరించాడు. బీర్బల్, రాణీవారి వద్దకు వెళ్ళి "మహా రాజులవారు తమ జీవితచరిత్రనంతా మహాభారత కథ రూపంలో వ్రాయమని నన్ను ఆదేశించారు. మహాభారత కథలోని వీర వనిత ద్రౌపదిని, ఆవిడ శత్రువులు ఖైదుచేసి దుర్యోధనుడి సభలోకి తీసుకువెళ్ళారు. మరి ఇప్పుడు నే రాసిన అక్బర్ పాదుషా మహా భారతంలో కూడా మీరే కథానాయిక. అక్కడ మహాభారతంలోలాగే ఇక్కడ ఈ గ్రంథంలో మీ శత్రువులందరూ మిమ్మల్ని వేళాకోళం చేశారనీ, చెప్పరాని అవమానాలకు గురిచేశారనీ రాయదలుచుకున్నాను. అనుమతి అనుగ్రహిస్తే వెళ్ళి రాసేస్తాను' అని సవినయంగా మనవి చేసుకున్నాడు. మహారాణికి చెడ్డకోపమొచ్చింది. "నన్ను గురించి అలాంటి కథలు గనక రాస్తే, మీ తల తీయించేస్తాను. ముందు ఆ పుస్తకాన్ని తగలబెట్టండి" అని ఆవేశంగా కేకవేసింది. బీర్బల్ ఆ తెల్లకాగితాల పెద్ద పుస్తకాన్ని అక్కడికక్కడే ఆవిడ సమక్షంలోనే అగ్నికి ఆహుతి చేశాడు. అటు తర్వాత అక్బర్ పాదుషా వద్దకు వెళ్ళి, జరిగినదంతా ఆయనతో విన్నవించుకున్నాడు. "మీరు కోరినట్లయితే, ఆ పుస్తకాన్ని మళ్ళీ కూచొని రాస్తాను మహారాజా" అని సవినయంగా చెప్పాడు. "దాని సంగతి మరచిపో బీర్బల్" అన్నాడు అక్బర్ పాదుషా.

ఒకసారి అక్బర్ పాదుషా, బీర్బల్‌ను హాస్యం పట్టించడానికి, తాను వొలిచిన పండ్ల తొక్కలను గోప్యంగా పక్కనే కూచున్న బీర్బల్ పళ్ళెంలో పడేసి, అక్కడున్న వారందరితో, 'ఇవాళ బీర్బల్ ఎంత ఆకలితో వున్నాడంటే, మామూలుగా మనందరమూ తినే పళ్ళకు రెండింతలు తిన్నట్లున్నది. ఆయన పళ్ళెం చూడండి, ఎన్ని పళ్ళ తొక్కలు కనిపిస్తున్నాయో! అన్నాడు. బీర్బల్ తడుముకోకుండా, "కానీ చక్రవర్తిగారి ఆకలి మా ఆకలికి ఇబ్బడిముబ్బడిగా వుండుండాలి. ఆయన పళ్ళెం చూడండి. పండ్లతోబాటు వాటి తొక్కలు కూడా మాయమైపోయినై. మొత్తం తినేసి వుండాలి" అన్నాడు.

# కఠిన నియమావళి

క్రైస్తవ మతంలో మెథడిస్టులు అనే శాఖవారున్నారు. జాన్ వెస్లీ అనే క్రిస్టియన్, తన అనుయాయులతోబాటు, కాలాన్ని వృథాపరచకుండా సదుపయోగం చేయాలని ఒక పద్ధతి ప్రకారం జీవించేవాడట. రోజురోజూ ఒక్కొక్క పనికి ఇంతకాలం అని కేటాయించి, ఇలా పద్ధతిగా జీవించిన వీరిని చూచి, వీరంతా ఒక 'మెథడ్' పాటించడంవల్ల, వీరికి మెథడిస్టులని పేరు పెట్టారు. కాలక్రమేణా ఈ మెథడిస్ట్‌ల వర్గం క్రిస్టియన్లలోనే ఒక ప్రత్యేక వర్గంగా రూపొందింది.

కాలాన్ని వృథాచేయరాదనే నియమం మిత్రశ్రీకి కూడా చాలా నచ్చినందువల్ల, తాను కూచునేచోట తన వెనకాల గోడ మీద ఒక బోర్డు కట్టించాడు. 'నేను మీతో మంచిగా, మర్యాదగా వున్నాను కాబట్టి, కాలక్షేపంగా ఎంతసేపైనా ఇక్కడ కూచోవచ్చునుకో వద్దు.'

క్రైస్తవ వర్గాల్లో ఎనాబాప్టిస్టులనే వారు ఒక వర్గం. శిశువులను బాప్టైజ్ చేయడం బైబిల్‌కు విరుద్ధమైన చర్య అని వారి అభిప్రాయం; అది మౌఢ్యమని వారి నమ్మకం. పదిహేడు పద్దెనిమిది ఏళ్ళ వయసులో గానీ,మనిషికీ క్రైస్తవమతమంటే ఏమిటో బోధ పడదని, వారి వాదన. ఆ వయసులో ఆ యువకుడు తన విశ్వాసాన్ని దృఢపరచుకొని, ప్రీస్ట్‌చే 'బాప్టైజ్' చేయించుకోవచ్చునంటారు. తమ అభిప్రాయాన్ని బలపరచడానికి, వారు బాప్టిస్టు జాన్‌ను, సైంట్‌పాల్‌ను, తుదకు జీసస్‌నే పేర్కొంటారు.

సున్నితమైన ఈ సైద్ధాంతిక తేడాయేకాక ఈ వర్గంవారికుండే ఒక లక్షణం యుద్ధ విముఖత్వం. తమ దైనందిన జీవన విధానంలో రాజకీయలను దరిజేరనివ్వరు. ఈ కారణాల చేత ఈ వర్గంవారిని, క్రైస్తవుల్లో అధిక సంఖ్యాకులు ఎంతగా వ్యతిరేకించారంటే, వీరిలో కొందర్ని మొదట్లో, మరణశిక్షకు గురిచేయడానికి కూడా సంకోచించలేదు.

అమీష్ వర్గంగా పేర్కొనబడే వీరు బైబిల్‌ని ఎంత పట్టుదలగా అనుసరించారంటే, యుద్ధంలో సైనికులు తమ యూనిఫారాల్లో ఎక్కువ సంఖ్యలో గుండీలు కలిగి వుంటారు

కాబట్టి, తమ వస్త్రధారణలో అసలు గుండీలే వుండరాదని నిషేధించుకున్నారు. దుస్తులు ధరించడంలో ఆడంబరం పనికిరాదు, అతి సాధారణ దుస్తులే ధరించాలి. ఇంట్లో పెట్టుకునే బల్లలు కుర్చీలు చాలా సామాన్యమైనవే ఉంచుకోవాలి. మనిషి తన చేతులతో తాను చేయగలిగిన ఏ పనైనా, యంత్ర సహాయంతో చేయాలనుకోకూడదు. (విద్యుచ్ఛక్తితో రేజర్లు, బాటరీ సహాయంతో టూత్‌బ్రష్‌లు వాడుకునే స్థితికి వచ్చారు ఆధునిక అమెరికనులు; ఆ మాటకొస్తే భారతదేశంలోని పైవర్గాల వారంతా కూడాను) అది భగవంతుణికి ఇష్టం కాదని అమీష్ వర్గం వారి అభిప్రాయం. నేటి విద్యావిధానాన్ని కూడా నిరసించారు. పొలం పని చేసుకోడానికి విద్య అవసరం లేదు కాబట్టి, మానవ జీవితంలోనూ దాని ఆశక్యకత లేదని వారి నమ్మకం. పైపెచ్చు, ఈ విద్య వినయము నొసగకపోగా, మనిషిలో గర్వమూ, అతిశయమూ పెంచుతుందని వారంటారు.

గత సంవత్సరం అమెరికాలోని ఈ అమీష్ వర్గంలోని ఇద్దరు విద్యార్థులను ఎవరో అక్కడి సాధారణ బడిలో తుపాకీతో కాల్చి చంపినప్పుడు కూడా ఆ పిల్లల శవాలను సమాధి చేయడానికి తీసుకువెళ్ళే సమయాన, అక్కడికి వచ్చిన తల్లిదండ్రులు విలపించు కుండా నిబ్బరంగా నుంచున్నారంటే, ఆనాటికీ ఈనాటికీ ఆ అమీష్ వర్గానికి చెందినవారి అచంచల భగవద్విశ్వాసం ఎటువంటితో మనం గ్రహించవచ్చు.

మెన్నొనైట్స్ అని మరొక క్రిస్టియన్ వర్గమున్నది. వారు అమీష్ వర్గమంతటి కఠిన నియమాలు పాటించరు, కొంత సడలించి, దుస్తులకు గుండీలు పెట్టుకోవడం తప్పు కాదంటారు. చర్చ్‌లో సంగీత వాయిద్యాలను నిషేధించ నవసరం లేదంటారు. పొలం పనిలో యంత్రాలను వాడడం దోషంగా పరిగణించ నక్కరలేదని, అలాగే అమీష్ వర్గం వారు కార్లు వాడరాదని భావిస్తే, ఈ ఆధునిక సౌకర్యాన్ని అవసరానికి వాడుకోక తప్పదని మెన్నొనైట్లు వాదిస్తారు.

# ప్రశ్న ఉదయించడమే ప్రారంభం

"ఆంగ్లభాషలో, మన భాషలోని 'పాప'మనే పదానికి 'సిన్' అనే పర్యాయపదం ఉన్నది. అలాగే 'నాస్తిక' అనే పదానికి 'ఎతియిస్ట్' అనే పదమున్నది' కానీ సంస్కృతంలో పుణ్యం అనే పదానికి ఇంగ్లీష్‌లో పర్యాయ పదమనేది లేదు. మరే పదమూ లేక 'మెరిట్' అనే పదం వాడతారు. కాని సాధారణంగా 'మెరిట్' అనే ఆంగ్లపదం వేరే అర్థాన్ని సూచిస్తుంది. ఒక్క పుణ్యమనే పదానికే కాక, 'ఆస్తిక' అనే పదానికి కూడా సరియైన పర్యాయ పదం ఆంగ్లంలో లేదు. ఏదో 'గాడ్ బిలీవర్' అనే ఒక జత కలిసిన పదాన్ని వాడుతుంటారు" అని ప్రారంభించాడు ఉత్కళరావు.

'ఇకపోతే దేశ భాషల్లో ఆంగ్లంలో వాడే 'సెక్యూలార్' అనే పదానికి సరియైన పర్యాయ పదం దొరకదు. ఈ సెక్యూలార్ అనే పదం పట్టణాల్లో కొన్ని వర్గాలకు అర్థమవు తుందేమో కానీ, పట్టణ ప్రాంతంలోనే అధికాధికులకు ఏదేదోగా అర్థమవుతుంటుంది; ఇక పల్లె ప్రాంతాల్లోని వారికి ఈ పదాన్ని ఎలా అర్థంచేసుకోవాలో తెలియదు. ఇది అక్కడ వాడినా, వాడిన మనిసి కూడా వారికి అర్థంచేసి సరిగా చెప్పలేదు. బహుశా నాస్తిక, లేక అధర్మ లేక ధర్మ నిరపేక్ష అనే పదాలే వాడాల్సి వుంటుంది. హిందూ సంప్రదాయమంతా 'పవిత్రత' (ఆంగ్లంలో సేక్రెడ్) అనేది అన్ని రంగాల్లోనూ, విస్తృతంగా వాడబడుతుంటుంది. ఈ సెక్యూలార్ అనే పదానికి స్థానమే లేదు.

వ్యవహారంలో కానీ, ఆధ్యాత్మిక సాధన మార్గంలో కానీ పదాలను సరిగా, అర్థ వంతంగా ఉపయోగించాల్సి వుంటుంది. పదాలను ఎలా పడితే అలా వాడడం ఆత్మకు హానిచేసినట్లవుతుంది; జాతికి, మానవాళికి కూడా హాని జరుగుతుంది.

'ఫలాని అమృతాన్ని గనక సేవిస్తే అది మనిషికి శాశ్వత జీవితం ప్రసాదిస్తుంది' అనే ప్రాచీన క్రిస్టియన్ కథ ఒకటి వుంది. ఒక రాజ్యం ప్రబలమైన కఱువు కాటకాలతో బాధపడుతుండెనట. మనుషులు, గొడ్డూ గోదా ఆకలితో అలమటించి మృతి చెందు తున్నారు. సహజంగా మనుషుల బుద్ధులు భ్రష్టుపట్టి, ప్రతిచోటా అనేక పోట్లాటలు

చెలరేగుతుండేవి. ఆ దేశపు రాజు చాలా చింతాక్రాంతుడయ్యాడు. అలాంటి సమయంలో ఒక వృద్ధుడు రాజు వద్దకు వచ్చి, ఆ అమృత భాండాన్ని గురించి తెలియజేస్తాడు; దాని అద్భుత ఫలితాలను వివరించి చెప్తాడు. రాజు ఆ మాటలన్నీ శ్రద్ధగా విని వృద్ధుణ్ణి ఇలా ప్రశ్నించాడు. 'అసలా అమృతమంటే ఏమిటి?' కానీ వృద్ధుడు ఆ ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానమివ్వడు.

అయితే, రాజు అమృతభాండాన్ని గురించి ఆ ప్రశ్న వేశాడో లేదో, వెన్వెంటనే పరిస్థితులు కొద్ది కొద్దిగా మార్పు చెందనారంభిస్తై. కొన్ని వారాలు తిరిగేలోగా అక్కడి భూమిమీద వర్షాలు పడతై. నేల తడుస్తుంది. పంటలు పండుతై. ధాన్యపు గింజల సమృద్ధి, ప్రజల సంతృప్తి వెల్లివిరుస్తుంది.

ఇంతకీ కథ సారంశమేమంటే, రాజ్యానికి నేత అయినవాడు జీవితాన్ని, సత్యాన్ని గురించి మౌలికమైన ప్రశ్న అడగ నేరిస్తే, సమాధానం కొరకై అన్వేషించనారంభిస్తే, అందుకు అవసరమైన ధర్మ మార్గాన్ని తొక్కితే, అదే ప్రజాశ్రేయస్సుకూ, వారి భాగ్య సంపదలకూ దారితీయ నారంభిస్తుంది, అని.

★ ★ ★ ★

హల్కలీ అనే సూఫీ వేదాంతిని ఎవరో ఇలా అడిగారు. "జీవితంలో మీకు తటస్థ పడిన మనుషుల గుణగణాలు నిర్ధారించుకోడానికి మీరవలంబించిన పద్ధతి ఏమిటో సెలవియ్యండి."

హల్కలీ ఇలా చెప్పాడు: అందరికీ బహు అణకువగా ఉన్నట్లు కనిపించేవాణ్ణి. దౌర్జన్యపరులు నా అణకువను చూచి నా జోలికి ఎలాగూ వచ్చేవారు కాదు. నా అణకువను చూచి నన్ను గౌరవించాలనుకున్న వారి నుండి, నేను తప్పించుకు పరిగెట్టేవాణ్ణి."

నిజమైన అధ్యాతికుణ్ణి, ప్రజలు పలు రకాలుగా వేధిస్తుంటారనేది, అధ్యాత్మికులకు అనుభవమే.

★ ★ ★ ★

1885 నుండి 1951 వరకూ జీవించిన లూయీ సింక్లేర్ అనే పాశ్చాత్య రచయిత – నవలాకారుడ్ని గురించి మరో రచయిత రాసిన ముక్కలు: 'రచయిత సింక్లేర్ త్రాగేవాడనడం సబబే కానీ, అనేకులు అంటున్నట్లు, త్రాగుబోతు సింక్లేర్, రచయిత కూడాను, అనడం అంత సరికాదు'.

# పిలిచిన పలికెడివాడు

కొందరు వయసు మీదపడినప్పటికీ, ఎంత పనైనా చేస్తూ వుంటారు. ఇంత వయసులో ఇంత పని వీరెలా చేయగలిగి వున్నారా అని మన కనిపిస్తుంటుంది. వీరి అసాధారణ శక్తికి మూలమేమిటి? ఆ రహస్యమేమిటో తెలుసుకోవాలని మనకుంటుంది.

చాలా ఏళ్ళక్రిందట, జపనీస్ క్రిస్టియన్ నాయకుడు కగావా, అమెరికాలోని వాషింగ్టన్‌కు వెళ్ళినప్పుడు, యువకుడైన ఒక అమెరికన్ పాదిరీ, కారు తాను నడిపి, కగావాను నాలుగుచోట్లకు తీసుకు వెళతానని అన్నాడు. మొదటి రోజు వృద్ధుడైన కగావాను పలు ప్రముఖుల వద్దకు తీసుకువెళ్ళి సమావేశ పరిచినప్పుడు, ఈయన ఈ వయసులో ఇలా ఈ పనంతా ఎలా నిర్వహిస్తున్నాడా, అయినా ఇంత తాజాగా ఎలా కనిపిస్తున్నాడా అని ఆశ్చర్యపోయాడు. ఆ మర్నాడు కగావా వుంటున్న గృహానికి తెల్లవారుఝామున ఐదింటికి వెళ్ళి, ఆయన్ని టైడల్ బేసిన్ అనే చోటికి తీసుకువెళ్ళాల్సి వుంటుందని చెప్పి నప్పుడు, పాదిరీకి కగావా తన శక్తిని ఎలా సంపాదించు కుంటున్నాడో అర్థమయింది.

సుమారు గంటకుపైగా కగావా అక్కడి ఓ బెంచి మీద నిశ్చలంగా కూచున్నాడు; బహుశా భగవంతుడితో సంభాషించా డనుకోవాలి; కారణం, కగావా మొహంమీద ఆ క్షణాన ఓ దివ్యమైన వెలుగు కనిపించింది. ఆ శక్తే అతణ్ణి, ఆనాటి ఊపిరి సలపని కార్య క్రమాలనన్నిటినీ ప్రశాంతంగా నిర్వహింపజేసింది.

★ ★ ★ ★

అమెరికాలో నల్లజాతివారు బానిసలుగా వుండే కాలంలో జన్మించిన జార్జి వాషింగ్‌టన్ కార్వర్, ఆ బానిసజాతికి చెందినవాడే. అయితే అతడు ప్రఖ్యాతిగన్న సైంటిస్టు; వేరుశెనగ, చిలకడదుంప మొదలైన వాటిపై ఎన్నో పరిశోధనలు సలిపి, అమెరికాలోని దక్షిణ ప్రాంతంలోని వ్యవసాయ రంగంలో విప్లవాన్నే సాధించాడనవచ్చు. కార్వర్ ప్రతి రోజూ ప్రొద్దుపొడవకముందే, తన ఇంటి సమీపాన వుండే వనంలోకి వెళ్ళేవాడు. సైంటిస్టుగా అతడి పరిశోధనల ద్వారా కనుగొన్న అనేక కొత్త విషయాలను గురించి

ఎవరైనా ప్రస్తావించినప్పుడు, అంతా ఆ పరమాత్ముడి అనుగ్రహమేనంటూ, 'భగవంతుడు నన్నిలా చేయమని చెప్పాడండీ' అనేవాడు. తాను కనుగొన్న విషయాల ద్వారా, తాను ఏ కాస్త లాభం కూడా ఆశించేవాడు కాదు. తన ప్రేరణ కొరకై, మార్గదర్శకత్వానికై సాక్షాత్తూ ఆ భగవంతుడిపైనే ఆధారపడుతూ, ప్రాతఃకాలం నుండి రాత్రి పడుకునే వరకూ అలుపు లేకుండా శ్రమించేవాడు. 'నువ్వెక్కడ వున్నా నీకున్న వాటితో సాధ్యమైనంత బాగా పనిచేయి' అంటుండేవాడు కార్వర్. ఆ మహాశక్తితో తన శక్తిని అనుసంధానం చేసినందుకే, ఆ గొప్ప సైంటిస్టు విరామం లేకుండా రోజల్లా లోక కళ్యాణార్థం శ్రమించ గలిగేవాడనుకోవాలి.

★ ★ ★ ★

## వేర్వేరు స్వభావాలు

తాము నివసించే వాడల్లో గుండా నడిచి వెళ్తున్న జీసస్‌ను చూచి, కొందరు వెక్కిరించారు. అందుకు సమాధానంగా జీసస్ ఆనాటి తన ప్రార్థనలో, వీరి పేర్లను కూడా ఉదహరించి, వారిని కాపాడమని భగవంతుణ్ణి వేడుకున్నాడు. ఎవరో జీసస్‌తో "వీరిని రక్షించమని భగవంతుణ్ణి ప్రార్థించావు. వీరి మీద నీకు కోపం లేదా?" అని అడిగారు. అందుకు జీసస్ ఇలా సమాధానం చెప్పాడు. "వారికి చేతనైనది వారు చేశారు. నాకు చేతనైనది ఇదే కాబట్టి నేనిది చేశాను. నా వద్దనున్న సొమ్ము నేను వెచ్చించగలను కానీ, వారి సొమ్మును అరువు తెచ్చుకోలేను కదా?" అనే కథ చెప్తాడు సూఫీ అత్తర్ మహాశయుడు.

## వేర్వేరు ఆలోచనలు

అహ్మద్ ఇబ్న్‌హన్‌బల్ ప్రఖ్యాత సూఫీ వేదాంతి; గొప్ప న్యాయశాస్త్ర కోవిదుడు కూడాను. వద్ధాప్యంలో అతడు చాలా బలహీనుడైనప్పుడు బాగ్దాల్‌లోని ఒక రాజకీయ పక్షంవారు అధికారం చేజిక్కించుకొని, తమ విధానం సరియైనదని అతడి చేత ప్రకటింప చేయాలని ప్రయత్నించారు. ఇమామ్ హన్‌బల్ తానలా వారిని సమర్థించ జాలనని నిరాకరించాడు. ప్రతీకారంగా వారు అతడికి వేయి కొరడా దెబ్బల శిక్ష విధించారు. ఆ భయంకరమైన శిక్ష పూర్తికాక మునుపే, కొన్ని దెబ్బల అనంతరం మరణించాడు. మరణించే ముందు, ఎవరో అతణ్ణి, 'నిన్ను హింసించడానికి పూనుకున్న వారిని గురించీ నీ అభిప్రాయమేమిట'ని అడిగారు. 'నా ఆలోచనా సరళి తప్పనీ తమ ఆలోచనా విధానమే సరియైనదని సంపూర్ణంగా విశ్వసించేవారి నుంచి నేను న్యాయమెలా ఆశించగలను?' అని వూరుకున్నాడు.

# జీవితానికి ఆభరణం

ఓ పాశ్చాత్య శిష్యుడు తనకొక భారతీయమైన పేరు పెట్టమంటే, 'దేవాలంకార' అని పేరు పెట్టాడు ఆచార్య రజనీష్. దీని ఆంగ్లానువాద మేమిటని అతడడిగితే, రజనీష్ ఇలా చెప్పాడు: 'నువ్వు భగవంతుడికి అలంకారమవాలి. లేదంటే మనసు తృప్తి చెందదు, దాని తనివి తీరదు. దైవానికీ, ఈ ఉనికికీ నువ్వు యశస్సువవాలి. అప్పుడే నీలోని నీ ఆనందం అనుభవించగలవు. ఈ ఉనికి మొత్తం నిన్ను చూసి ఆనందిస్తుంది. అప్పుడే నీ జీవితం ధన్యమవుతుంది. అదే దేవుడికి అలంకార మవడం; నువ్వు లేకపోతే, ఈ ఉనికీ, ఆ దేవుడూ కూడా 'అయ్యో నువ్వు లేకపోతివే!'అనేట్లు జీవించు.

మౌనంగా, సంతోషంగా ఆనందంగా జీవించడం నేర్చుకో. ప్రేమతో జీవించు. ఎన్నాళ్ళకెన్నాళ్ళకు నీలాంటి మనిషి పుట్టాడు అని ఉనికి ఆశ్చర్యపోవాలి, మురిసిపోవాలి. ప్రతి మనిషికీ ఈ ప్రేమతో ఈ ప్రత్యేక జీవితాన్ని, జీవించే అవకాశమున్నది.

యూదు ప్రవక్త మోజెస్ మరణించే సమయాన్ని గురించి ఓ కథ చెప్తాను. అతణ్ణి తీసుకువెళ్ళడానికి వచ్చిన దూతలతో అతడు 'నేను మరణించను. వెళ్ళి దేవుడికి చెప్పండి. నేను అతడికి ఈ భూతలంపై ఎంతో సేవ చేశాను. నన్ను చంపడం న్యాయమా? నే చావదలచుకోలేదని ఆ దేవుడికి చెప్పండి! అన్నాడు మోజెస్.

మోజెస్ నిజంగానే దైవ ప్రేమికుల్లో ప్రథమ శ్రేణిలో నిలుస్తాడు. అది ఆ మరణ దూతలకీ తెలుసు. ఇలాంటి వాణ్ణి, కాదు కూడదని తీసుకువెళ్తే, ఆ దైవం ఆగ్రహిస్తాడేమోనని సంకోచించి, వారు దైవం వద్దకు వెళ్ళి, జరిగినదంతా చెప్పారు. ఇలాంటి సంఘటన మున్నెన్నడూ జరుగలేదు. దేవుడు కూడా ఒకింత తటపటాయించాడు. చివరకు తానే దిగి వచ్చాడు; మోజెస్‌ను స్వయంగా తాను ఒప్పిద్దామని "బాబూ మోజెస్, మీ తండ్రి ఎక్కడున్నాడు?' అని అడిగాడు.

'చనిపోయాడు' అన్నాడు మోజెస్.

'ఆయన తండ్రి ఎక్కడున్నాడు?'

'అతడూ చనిపోయాడు'

ఇలా చెప్పుకుంటూ ఆదామ్ తాత వరకూ వెళ్ళారు.

'అవును, అందరూ చనిపోయారనే మాట వాస్తవమే. అయితేనేమి? ఆదామ్ తాత దొంగ అయినందువల్ల మరణించాల్సి వచ్చింది. నేను దొంగని కాదు'. అదే విధంగా తన తాత ముత్తాతల దోషాలన్నీ ఏకరువు పెట్టి ఆ కారణంగా వారు మరణించాల్సి వచ్చింది అన్నాడు. ఇతడితో ఏమనలో తెలియక దేవుడు కాస్త తికమకపడ్డాడు. మోజెస్ అంతటి పవిత్రుడు అనే మాట కూడా నిజమే మరి.

దేవుడు చాలా ఆలోచించాడు. మోజెస్ తన జీవితంలో ఏనాడో ఓ ఈజిప్షియన్‌ని చంపాడన్న సంగతి దేవుడికి గుర్తుకొచ్చింది. ఆనాడు ఒక ఈజిప్షియన్ ఒక యూదు జాతీయుణ్ణి చావ చితక బాదుతున్నాడు. ఆ దృశ్యం చూసిన మోజెస్ అది సహించ లేకపోయాడు; ఆ ఈజిప్షియన్ దౌర్జన్యాన్ని ఆపడానికి అతణ్ణి ఒకటి వేశాడు. దెబ్బ పెద్దది కాకపోయినా, ఏ కారణం చేతనో ఆ ఈజిప్షియన్ మరణించాడు. మోజెస్ అతణ్ణి చంపాలని చంపలేదు కానీ, ఆ యూదును రక్షించడానికి గాను ఈజిప్షియన్‌ని ఆటంకపరచ బోయేసరికి, ప్రమాదవశాత్తూ, అతడు చనిపోయాడు.

'నువ్వు ఆనాడు చంపిన ఈజిప్షియన్ మాటేమిటి?' అన్నాడు దేవుడు.

'నువ్వు రోజూ చంపే వేలాది మంది మాటేమిటి?' అని దేవుణ్ణే ప్రశ్నించాడు మోజెస్. "నేను ఒకణ్ణి చంపానంటున్నావ్. నువ్వు శతాబ్దాల తరబడి ఎందరో మనుష్యుల్ని చంపుతూనే వున్నావ్ మరి' అన్నాడు.

'మరణమనేది మానవుడికి సహజమయ్యా. ఈ ధర్మాన్ని ఎలా ఉల్లంఘిస్తాం?' అని దేవుడు, మోజెస్‌కు ఎంతగానో నచ్చచెప్పాడు. చివరకు మోజెస్ మరణం సామాన్య మానవుల మరణంలాగ కాక, విశిష్టమైన మరణంగా రూపొందించాలని నిశ్చయించి, ఉన్నపళంగా మోజెస్ మేఘాలలో అంతర్ధాన మవుతాడని, స్వర్గంలో అతణ్ణి స్వాగతించడానికి ఘనంగా ఏర్పాట్లు జరగాలని తీర్మానమయింది. ఈ మోజెస్, ఆ క్రీస్తు, ఆ బుద్ధుడు ఈ భూమిమీద జన్మించి మహా ప్రేమికులుగా జీవించడం, భగవంతుడికి ఎంతో ఆనంద దాయకం. వారిని తన ఆభరణాలుగా ధరించి మురిసిపోతుంటాడు.

> ప్రతి ఒక్కరి ముఖమూ ఎంత ప్రత్యేకంగా రూపొందించ బడిందో, ప్రతి వాని మనసు కూడా అతడికంత ప్రత్యేకమైనది. మరి నేను అతడిలాగా వుండాలనుకుంటే నాలాగా మరెవరుంటారు?
>
> –యూదు సామెత

# ఆత్మలు దేహం ధరించక ముందు

'ఆత్మలు దేహధారణ చేయని కాలాన్ని గుర్తించి చెప్తాను' అని ప్రారంభిస్తాడు సూఫీ వేదాంతి, అత్తర్ మహాశయుడు. ఆ కాలం కొన్ని ఏళ్ళైనైనప్పటికీ, ఒక్కొక్క ఏడు ఒక్కొక్క యుగంతో సమానం. ఆత్మలన్నీ ఒక వరుసలో నుంచున్నై. ప్రపంచాన్ని వాటి ముందుకు తీసుకువచ్చారు. పదింట తొమ్మిది ఆత్మలు ప్రపంచాన్ని చూచి ఆకర్షణకు లోనై, అటువైపు పరుగిడినై. మిగిలిన ఆత్మల ముందు స్వర్గాన్ని తీసుకువచ్చి నిలిపారు. అక్కడ ఉన్న ఆత్మల్లో పదింట తొమ్మిది వంతు ఆత్మలు స్వర్గంవైపు చేతులు చాచినై. అటు తర్వాత, అక్కడ మిగిలిన ఆత్మలకు, నరకాన్ని తెచ్చి చూపించారు. పదింట తొమ్మిది వంతులు, భయంతో అక్కడి నుండి అతి వేగంగా పరుగెత్తినై. వీటి వేటివల్లా చలించకుండా, కొన్ని ఆత్మలు మాత్రం అలాగే వుండిపోయినై. ప్రపంచం కానీ, స్వర్గం కానీ వాటిని ఆకర్షించలేకపోయినై. నరకం, వాటిని భయపెట్టలేకపోయింది.

అప్పుడు దివ్యవాణి పలికింది: 'మూర్ఖంగా కనిపిస్తున్న ఓ మిగిలిపోయిన ఆత్మల్లారా, మీకేం కావాలని అలా పడి వున్నారు?' అని ఆ ఆత్మలన్నీ ముక్తకంఠంతో ఇలా ప్రకటించినై. "సర్వజ్ఞులైన మీకు మేము చెప్పాల్సిన అవసరం లేదు. మీరు తప్పితే, మీ సాన్నిధ్యం తప్పితే, మాకు మరేమీ అక్కర్లేదని మీకు తెలియనిది కాదు." దివ్యవాణి ఇలా అన్నది "మమ్మల్ని కోరడం, మీకు అనేక ఇక్కట్లు తెచ్చిపెడుతుంది. అనేక ఇడుమలకు గురిచేస్తుంది. అనుక్షణ ప్రమాద భరితం సుమా" అందుకు ఆత్మలు ఇలా సమాధానం చెప్పినై. "మీతో కలిసి వుండేందుకు మేము ఏదైనా అనుభవించడానికి సిద్ధమే. మీ సాన్నిధ్య భాగ్యానికై ఎన్ని నష్టాలనైనా భరిస్తాం" అని వ్రాస్తాడు అత్తర్, ఇల్లాహి–నామాలో.

'అసలు ఈ ఆత్మ సంగతి ఎవరికి కావాలండీ?' అని దూకుడుగా మొదలెట్టాడు ఉత్కళరావు. 'ప్రాచీన గ్రీకు వేదాంతి ప్లేటో, అకాడమీలో తాను ఆత్మను గురించి రాసిన సిద్ధాంత వ్యాసం చదివేవేళ, ఒక్క అరిస్టాటిల్ మాత్రమే చివరంటా వింటూ కూచున్నాడ'ని అంటాడు డయజినిస్ అనే వేదాంతి.

'వార్తాలాపం'లో ఓ నలుగురు మిత్రుల్ని గురించి ఒక దృష్టాంతం ఇలా చెప్తారు. మిత్రుల్లో ఒకడు గాయకుడు, ఒకడు వైద్యుడు, ఒకడు జ్యోతిష్కుడు, మరొకడు తార్కికుడు. వేరొక వూరికి వెళ్ళినప్పుడు వంట చేయడానికి నలుగురూ పనులు పంచుకున్నారు. గాయకుడు వంట పాత్రలతో వంట మొదలెట్టాడు. కొంచెం సేపట్లో గుడ గుడ శబ్దం వచ్చింది. గాయకుడు సరిగమ స్వరములతో తాళ లయ సమన్వితంగా గానం చేయసాగాడు. ఉడికే శబ్దం తన గానానికి శ్రుతి కలపడం లేదు. తాళం భేదిస్తున్నది. రాగ తాళాల్ని సరిగా చూడమని ఒకటి రెండు మారులు చెప్పాడు. పొయ్యి అతడి మాటల్ని పెడచెవిన పెట్టింది. గాయకునికి కోపమెక్కువై దుడ్డుకర్రతో గట్టిగా కుండల్ని కొట్టాడు.

కూరలు తీసుకు రావడానికి వెళ్ళిన వైద్యుడికి ఏ కూరా నచ్చడంలేదు. కూరలు రుచిగానే ఉంటైె కానీ ఒకటి పైత్యము, మరొకటి వాతము, ఇంకొకటి శ్లేష్మమును ప్రకోపింప జేస్తై. ఇటువంటి కూరలు కొనడం తప్పని తలచి ఖాళీ సంచితో తిరిగి వచ్చాడు. జ్యోతిష్కుడు విస్తరాకులు కుట్టడానికి మఱ్ఱిచెట్టు వద్దకు వెళ్ళాడు. చెట్టు ఎక్కడానికి సిద్ధమయ్యాడు. ఇంతలో బల్లి మూడుమారులు కూసింది. చెట్టు ఎక్కితే ఏదో ప్రమాదం సంభవించవచ్చునని తలచి, జ్యోతిష్కుడు ఆకులు కోయకుండా వెనక్కు మరలాడు. తార్కికుడు నెయ్యి, పాలు తెచ్చుటకు వెళ్ళాడు. నేతికి గిన్నె ఆధారమా, లేక గిన్నెకు నెయ్యి ఆధారమా అనే సందేహం కలిగింది. ఈ సంశయం నివారించు కొనుటకై అతడు చేతిలోని పాత్రలను బోర్లించి చూశాడు; వాటిలోని నెయ్యి, పాలు కింద పడిపోయినై. అతడు కూడా రిక్తహస్తాలతో తిరిగి వచ్చాడు. అయినా ఈ ఆత్మతో చాలా చిక్కులున్నై. ఇది ఉన్నదని అనాలంటే వారూ వీరూ చెప్పిన వినికిడి జ్ఞానం కాదు – పరిశీలించి, పరిశోధించి, ప్రయత్నించి స్వయంగా తెలుసుకున్నవాడికే దీని సత్య స్వరూపం ప్రత్యక్షమవుతుందని అంటుంది శాస్త్రం. సుఖంగా బ్రతుకుదా మనుకున్న మనబోటి వారి వల్ల ఇదంతా అయేనా? అని తేల్చేశాడు ఉత్కళరావు.

# పరిశీలించనిది జీవితమే కాదు

శ్రీ ప్రేమ్ భాటియా ఖ్యాతి గడించిన ఎడిటర్. 1965–69లో కెన్యాలోనూ, 1969–73 మధ్య కాలంలో సింగపూర్‌లోనూ ఇండియన్ హైకమీషనర్‌గా పనిచేశాడు. 'జీవితాన్ని గురించి నా అవగాహన' అనే వ్యాస సంచయన పుస్తకంలో ఇలా అంటాడు. "వృద్ధాప్యం చాలా వేసరిక కలిగించే కాలం, అందువల్ల ఓ ప్రసిద్ధ కవివర్యుడు, తన అమాయకత్వంలో చేసిన ఈ ఉద్బోధతో నేను ఎంతమాత్రం ఏకీభవించను.

'నాతోబాటు వృద్ధాప్యంలోకి అడుగిడు–మేలైనదంతా ముందున్నది మిత్రమా'.

నిజానికి నీకు అరవై నిండేలోగానే మేలైనదంతా గడచిపోయింది. కొందరికైతే ఇంకా ముందుగానే అయిపోయి వుంటుంది. కానీ వయసు మీద పడుతున్నకొద్దీ ఇప్పటికే చెల్లిపోయిన కాలాన్ని తలచుకొని దుఃఖించడంకన్నా మూర్ఖం మరొక టుండదు. అరవైయవ పడిలోగానీ, లేక అదృష్టంకొద్దీ మరికొంత కాలం గనక జీవిస్తే, మొత్తం జీవితాన్ని ఒకటిగా వీక్షించాలిగానీ, అందులో ఒక్కొక్క భాగాన్ని తీసుకొని, విడిగా దృష్టి సారించరాదు.


ఏదిఏమైనప్పటికీ ఏక మొత్తంగా వీక్షించినా, విడివిడి భాగాలపై దృష్టి నిలిపినా, మరణఘోష వినరాక మానదు. కోట్లాది ఇతరుల వలెనే నా మనసు కూడా మరణాగమనంతో సమాధాన పడగలిగి లేదు. అయితే ఈ అనాహుత ఘట్టాన్ని నివారించేందుకు నేను చేయగలిగిందీ ఏమీ లేదు" అని రాసి ముగిస్తాడు.

ఏ కపటమూ లేకుండా, ఏ ఆదర్శం జోలికి జోకుండా తన నిజ మానసిక స్థితిని ఉన్నది ఉన్నట్లుగా ప్రకటించినందుకు శ్రీ భాటియా అభినందనీయుడు. అలాగే కోట్లాది ప్రజాసామాన్యం వలెనే, తనకూ జరామృత్యువులను తలచుకుంటే భీతి కల్గుతున్నదని, ఆ విధంగా ఆ సామాన్య జనంలో తానొకడినేనని చెప్పుకోడం కూడా బాగానే వుంది. కానీ కోట్లాది మంది కేవలం తిండి బట్ట వసతి సంపాదించుకోడానికే జీవితాన్ని వెచ్చిస్తుంటారు. మనకు ఆ మూడూ ఎలాగూ వున్నాయి. అవికాక మనకింత ధనం, హోదా, కీర్తి, అహం యొక్క సంతృప్తి లభిస్తుంటుంది. మరి వీటి విషయంలో వారికీ మనకూ వున్న అగాధం

పొద్దులేనిది. వారందరూ చాలీచాలని బ్రతుకులు ఈడుస్తూ వుంటే, మనలో చాలామంది భోగభాగ్యాలతో పలు సదుపాయాలతో జీవిస్తున్నప్పుడు వారూ మనమూ ఒకటెట్లా అవుతాము? మనకు 'తీరిక' అనే మహా సదుపాయం, తద్వారా లోతుగా ఆలోచించగలిగిన సమయం, వారికెక్కడి నుండి లభించాలి? వారి జీవన సరళిలో రెక్కాడితే గానీ డొక్కాడదు. జీవన పోరాటమే వారి కళ్ళముందు కనిపిస్తుంటుంది. జరామరణ భయం వారికుండడం అసహజం కాదు. మరి మనకు అన్నీ వున్నాయి. ఆకాశమంత మన ఆశ తీరదనే మాట నిజమే కానీ, మనకు రేపు మర్నాడు మరొక రేపు మర్నాడులైనా, ఎలా గడుస్తాయో అనే చింతలేదు. ఈ చింత లేనప్పుడు, ఈ జరామరణాలేమిటో వీటి గురించి ఈ భయమేమిటో అర్థం చేసుకోడానికి అవసరమైన చింతన చేపట్టాలి కదా?

పరిశీలించని జీవితం అసలు జీవితమేకాదని విజ్ఞుల ఉవాచ. విద్యాధికులమైన మనం, అట్టే ఆర్థిక లోపం లేని మనం కూడా ఈ విషయంగా పూనుకోకపోతే, ఆర్థికంగా మానసికంగా బలహీనమైన వర్గాలకు మనమేమి చెప్పగలిగి వున్నాము? గౌతమ బుద్ధుడు ఈ జరామరణాల పరిశోధనకే తన జీవితాన్ని అర్పించాడు కదా? మనకు ఆయన మాట కానీ, అలాంటి వారి మరెవరి మాట కానీ వినిపించలేదా? ప్రేమ్ భాటియా ఉదహరించిన కవి వాక్యం గొప్ప స్ఫూర్తి కలిగినది. అవగాహన లోపంవల్ల ఆ కవితో తానేకీభవింపక పోవచ్చు. కానీ కవి అంటున్నదేమంటే, ఆ మహాశక్తి అనుగ్రహించిన ఆయుష్షు గనక వుంటే, ఇంతకాలంగా దక్కని ఆ నవనవోన్మేషం, ఆ అనిర్వచనీయం, ఆ అపరిమితం, మన అదృష్టం బాగుంటే, ఈ వృద్ధాప్యంలోనైనా దక్కుతుందేమోననే ఆశతో, తనతో చెట్టపట్టాల్ వేసుకొని, వార్ధక్యంలోకి సంతోషంగా ప్రవేశించమని ఆహ్వానిస్తున్నాడు. వృద్ధాప్యంలో వుండే బాధలు కష్టాలు మానవాళి మొత్తం ఎరిగున్నవే. అవి ఏకరువు పెట్టుకోదలుచుకుంటే పుణ్యకాలమంతా దానితోనే చెల్లిపోతుంది. జీవితాన్ని అవగాహనా పూర్వకంగా జీవించి వుంటే, తననితాను గమనించుకుంటూ బ్రతికి ఉంటే, ఆయుష్షు తీరిపోయేలోగా, కాలం కూడా కలిసివచ్చినప్పుడు, వినూత్నమైనది తనకు దర్శనమివ్వ వచ్చు. అది ఒక నూతన అవగాహన రూపంలో ఆవిష్కరింపబడవచ్చు.

# 'రక్తమివ్వండి: స్వాతంత్ర్యం అందుకోండి'



'ఢిల్లీ ఛలో' అనే నినాదంతో, "మీ రక్తమివ్వండి, అందుకు బదులు నేను మీకు స్వాతంత్ర్యమిస్తాను" అని ఘోషిస్తూ, భారతీయ యువతను మేల్కొల్పి స్వాతంత్ర్య సమరంలోకి దూకించినవాడు నేతాజీ సుభాష్ చంద్రబోస్. 6 జూలై, 1944 రేడియో ప్రసంగంలో (విదేశాల నుండి) "ఓ జాతిపితా, భారతదేశ విముక్తికై చేస్తున్న ఈ పవిత్ర ధర్మయుద్ధంలో, మీ దీవెనలు, శుభాకాంక్షలను అర్థిస్తున్నాను" అని మహాత్మాగాంధీని సంబోధిస్తూ, "నా మీద మన శత్రువు (బ్రిటిష్ పాలకులన్నమాట) ఎలాంటి దుష్ప్రచారం సాగిస్తున్నారో నాకు తెలుసు. ఆత్మగౌరవం, మానము లేని మనిషి మాత్రమే కీలుబొమ్మగా వుండగలడు. కానీ నేను జాతి గౌరవాన్ని గానీ, ఆత్మగౌరవాన్ని గానీ, అమ్ముకునేవానినని నా పరమ శత్రువు కూడా అనజాలడు.

ఆజాద్ హింద్ ఫౌజు సైనిక దళాలు ధైర్యంగా భారతదేశం గడ్డమీద పోరాడుతున్నై. ఎన్ని కష్టాల నెదుర్కొన్నప్పటికీ, మెల్లమెల్లగా ముందుకు తోసుకువెళ్తున్నై. భారతదేశాన్నుండి చివరి బ్రిటిషర్‌ను తరిమి కొట్టేవరకు, ఈ సాయుధ పోరాటం సాగక తప్పదు. ఢిల్లీలోని వైస్రాయి భవనంమీద మ జాతి జండా సగర్వంగా ఎగిరేంత వరకూ, ఈ పోరిలా సాగుతూనే వుంటుంది."

చిన్నతనంలోనే స్వామి వివేకానందుని గ్రంథాలు చదివిన సుభాష్ ఆ బోధల ద్వారా ప్రేరణ పొందాడు. ఆయన మాటల్లో చెప్పాలంటే, "నా ముక్తిని నేను సాధిస్తూ, ప్రాపంచిక కోర్కెలనన్నీ త్యజించి, మనిషిని నిర్బంధించే సంకెళ్ళనన్నిటినీ బ్రద్దలుచేసి, మానవాళిని సేవించడమే నా కర్తవ్యమని బోధపడింది."

'సుభాష్ మరణం అతి విషాద పరిస్థితుల్లో సంభవించింది' అని రాస్తాడు శ్రీ పి.డి. టాండన్. అతడు ప్రయాణిస్తున్న ఏరోప్లేను నిప్పంటుకున్నప్పుడు కూడా ఆయన ఆశను విడనాడలేదు. శత్రువులతో ఎలా పోరాడేవాడో, అగ్నికీలలతోనూ అలానే పోరు సలిపాడు. ఆగస్టు 16, 1945లో ఏరోప్లేను టైకూ అనచోట మధ్యాహ్నం రెండు గంటలకు కూలిపోయిన సమయాన, సుభాష్ చివరి క్షణాలను, ఆయనతో ప్రయాణించిన కర్నల్ హబీబూర్ రహిమాన్ ఇలా వర్ణిస్తాడు. నేతాజీ ఏమాత్రం చలించలేదు. విమానం కూలేసరికి, ఆయన తలకు గాయమయింది. ఆయన శాయశక్తులా ప్రయత్నించాడు; రెండు చేతులతోనూ అటూ ఇటూ అడ్డంగా వున్న వాటిని నెట్టుకుంటూ ఎలాగో విమానం బయటపడ్డాడు. కానీ వొళ్ళు బాగా కాలిపోయింది. విమానం కూలినప్పుడు ఆయన వేసుకున్న నూలు ఖాకీ సూటు మీద కొంత పెట్రోలు పడింది. ఆయన ఆ విరిగిన విమానం నుండి బయటికి తోసుకొచ్చేవేళ ఆ సూటు నిప్పంటుకుంది. తాను వేసుకున్న బుష్‌కోట్ యొక్క బెల్టుల గుండీలు ఊడదీయడానికి వేగిరపడుతున్న సమయంలో ఆయన వొళ్ళంతా కాలిపోయింది. ఇనుమువల్ల, అగ్నివల్ల మొహం గాయపడింది. కొన్ని నిమిషాల అనంతరం ఆయన నేలకొరిగాడు. హాస్పిటల్‌కి తీసుకువెళ్ళిన జపనీయులు ఆయన ప్రాణం కాపాడేందుకు సాధ్యమైనంత ప్రయత్నం చేశారు. కానీ ఫలించలేదు.

హబీబుర్ చెప్పిన దానినిబట్టి, నేతాజీ చివరి వాక్యాలు: 'హబీబ్, నా అంత్యం సమీపిస్తున్నది. నా జీవితమంతా నా మాతృదేశ విముక్తికై పోరాడాను. ఈ స్వాతంత్ర్య పోరాటాన్ని ఇలాగే కొనసాగించమని నా దేశవాసులకు చెప్పు. అనతి కాలంలోనే భారతదేశం స్వాతంత్ర్యం బడయగలదు."

నేతాజీ ఆధ్యాత్మికుడు, అతడికి ఏకాంతం, శాంతి అంటే చాలా ఇష్టం. ఆయనలో కొంత సన్యాసి లక్షణం వుండేది. సింగపూర్‌లో ఉండే కాలంలో చాలాసార్లు రామకృష్ణ మిషన్‌వారి స్వామీజీని, పిలిపించుకొని ఆయనతో కొన్ని గంటలు గడిపేవాడు. అప్పుడ్పుడూ బాగా పొద్దుపోయిన తర్వాత పూజార్లు ధరించే సిల్కు ధోవతి కట్టుకొని, తాను ఫలానా అని ఎవరికీ తెలియకుండా, రామకృష్ణా మిషన్‌వారి వద్దకు వెళ్ళి, అక్కడి ప్రార్థనా మందిరంలో తలుపువేసుకొని కూచునేవాడు; ఓ రెండు గంటలపాటు ప్రార్థన చేసేవాడు. అలాంటి సమయాల్లో ఆయన వద్ద ఓ చిన్న తోలు సంచి వుండేది; అందులో భగద్గీత యొక్క చిన్నకాపీ ఒకటి, ఒక తులసి మాల, చదవడానికి ఉపయోగించే కళ్ళద్దాలు వుండేవి. ఈ చిన్న తోలు సంచి సంగతి ఆయన ఆంతరంగిక సహాయకుడికి తప్పితే మరెవరికీ తెలియదు.

# 'తాళగతిని భంగపరచకు'

"ఓ ముతక వృత్తాంతం నా చెవిన వేసినవాడు, నాకెంతో హానిచేస్తున్నాడు" అంటాడు జె.టి. ఫీల్డ్స్. నీతిని ప్రతిపాదించే ఏ రచనైనా, అది ఎంతటి వైవిధ్యంతో పాఠకుల ముందుంచినా, 'మహాబోర్ అండీ' అనే వారున్నారు. పవిత్రత, నీతి, శీల సంపద మొదలైన గుణాలను కోల్పోయిన తర్వాత, భారత జాతికి చెందినవారమని చెప్పుకో డానికి ఏమి మిగులుతుంది? మాట వరసకు, ఈ కథే తీసుకోండి. ఓ రాజుగారు పరమ లోభి. ఏ ఖర్చుపెట్టవలసి వచ్చినా అతిగా వెనకాడేవాడు. నట విట గాయకుల బృందమొకటి, ఆ రాజ్యానికి వచ్చింది. రాజుగారి సమక్షంలో ప్రదర్శనకు అనుమతి ఇప్పించమని కోరారు. ఇదేదో ఖర్చుతో కూడిన వ్యవహారమని రాజు అంగీకరించలేదు. మంత్రి కలగజేసుకొని, 'ప్రేక్షక ప్రజానీకం ఆ ప్రదర్శకులకు ఏదో కొంత ముట్టచెప్తారు; వారు దానితో సంతృప్తి చెందుతారు' అని రాజుగారినిని ఒప్పించి, ప్రదర్శనకు అనుమతినిప్పించాడు.

ఆనాటి సంధ్యవేళ, ప్రదర్శన ప్రారంభమయింది. రాత్రి గడచిపోతున్నది. కానీ ఏ రకమైన బహుమతులు కానీ, నగదు కానీ వారికి అందలేదు. నిరాశ చెందిన ఒక నృత్య కారిణి తన బృంద నాయకునికి అర్థమయ్యేట్లుగా, సంకేత భాషలో 'రాత్రి వెళ్ళిపోతున్నది మనమెంత ఆడినా, ఎంత పాడినా, ఏమీ దక్కడంలేదు. అందుచేత విరమిద్దాం' అని తెలియజేసింది. కానీ బృంద నాయకుడు, సంకేత భాషలోనే విరమించవద్దని తెలియ జేశాడు. 'నువ్వు చెప్పినమాట నిజమే. చాలా సమయం గడిచిపోయింది. ఇక మిగిలిన కాలం కూడా గడచిపోనున్నది. కానీ మన నృత్య సంగీత కళాప్రదర్శన యొక్క తాళ గతిని, లయను భంగపరిచే వీలు లేదు' అని అన్నాడు.

ఈ సంకేత సంభాషణ జరిగిన కొద్ది క్షణాల్లోనే, ప్రేక్షకుల మధ్య కూచోనున్న ఒక సన్యాసి లేచి నుంచొని, తనవద్దనున్న ఒకే వస్తువు – తన కంబళీ ఆ ప్రదర్శకులకు బహుకరించాడు. అటు తర్వాత రాజకుమార్తె లేచి నుంచొని, చేతి నుండి కడియం తీసి వారికి బహుకరించింది. రాజకుమారుడు లేచి నుంచొని తాను మెళ్ళో వేసుకున్న బంగారు హారం వారికి బహుమతిగా ఇచ్చాడు.

ఈ బహుమతులు ఇలా కురుస్తూ వుండడం చూచిన రాజుకి చెడ్డ ఆశ్చర్యం వేసింది. సన్యాసిని, రాకుమార్తెను, రాకుమారుణ్ణి ఒకరి తర్వాత ఒకరు తన గదికి రమ్మన్నాడు. ఏ కారణం చేత వారంతా ఈ బహుమానాలు అందించారో తెలియజేయ మన్నాడు. సన్యాసి సమాధానమిస్తూ తాను చాలా కాలంగా తపశ్చర్య ఆచరిస్తున్నప్పటికీ, చెప్పుకోదగినదేదీ సాధించలేకపోయాననీ, ఇప్పటికీ మనశ్శాంతి ఏర్పడలేదని ఇక్కడ ఈ రాజభవనంలో భోగభాగ్యాల్ని చూసినప్పుడు ఈ సన్యాసి పంథా వదిలేసి, జీవితాన్ని భోగభాగ్యాల వైపు మళ్ళిస్తే బాగుండు ననిపించిందట. కానీ ప్రదర్శక బృంద నాయకుడి, “తాళగతిని తప్పించ రాదు” అనే మాటలు వినేసరికి, ఎవరో తట్టిలేపినట్లయింది. అప్పుడు నాకున్న సమస్తమూ త్యాగంచేసి, నా తపశ్చర్యను ద్విగుణీకృతం చేయ నిశ్చయించాను. అందుకని నాకున్న ఒక్క కంబళీ కూడా ఇచ్చివేశాను” అన్నాడు. రాజకుమార్తె, తాను యవ్వనవతి అయి వివాహానికి సిద్ధంగా వున్నప్పటికీ, రోజులు నెలలూ గడుస్తున్నవే కానీ, ఖర్చుకు వెఱచి రాజు, కూతురు వివాహాన్ని పట్టించుకోకుండా ఉండిపోయాడని అర్థంచేసుకున్నది. అందు వల్ల మంత్రి యొక్క కొడుకుతో ఆ మర్నాడు లేచిపోయి, ఎక్కడో వివాహ మాడుదామనుకున్న దిట. కానీ బృంద నాయకుడి మాటలు వినేసరికి వృద్ధుడైన రాజుకు తాను అపకీర్తి తెస్తానని భయపడి, లయలో భంగం వాటిల్లరాదని మనసు మార్చుకున్నదట. ఆ కారణం వల్ల, ఆ ప్రదర్శకులకు బహుమాన మిచ్చిందట. రాకుమారుడు గది లోపలికి వచ్చీ రావడంతోటే రాజుగారిని క్షమించమని వేడుకున్నాడు. అలాగేనని ఆయన అనిన తర్వాత, “నేను పెరిగి పెద్దవాణ్ణవుతున్నాను. కానీ ఈనాటికీ మీరిచ్చే కొద్దిపాటి ధనంతో కాలం గడుపుతున్నాను. అందుకని, నా సమస్తమైన కోర్కెలు తీరాలంటే సింహాసనాన్ని కైవసం చేసుకోవాలని, మీ అవరోధాన్ని తొలగించడానికి మిమ్మల్ని హత్యచేయాలనుకున్నాను. కానీ తాళగతిని భంగపరచరాదు అనే నట నాయకుడి మాటలు వినేసరికి, నా తలపు ఎంత పాపిష్ఠిదో నాకర్థమైంది; అందుకని మెళ్ళోని హారం ఇచ్చేశాను.” ఈ ముగ్గురి మాటల నాలకించిన రాజుకు హృదయ పరివర్తన కలిగింది. అప్పటికప్పుడు రాజ్యాధికారం పుత్రుడికి అప్పజెప్పేశాడు. కుమార్తెకు మంత్రి కొడుకుతో వివాహం జరపడానికి నిర్ణయం చేశాడు. అటు తర్వాత తానొక ఏకాంత ప్రదేశానికి వెళ్ళి సన్యాసి జీవితం ప్రారంభించాడు.

# నేర్వడానికి అర్హతలు

**సూ**ఫీ గురువు బయాజిద్ శిష్యుల్లో ఒకరు, తన గురువువద్ద తాను నివసించిన పదమూడేళ్ళ కాలంలోనూ, తనతో ఆయన ఒక్కమాట కూడా మాట్లాడలేదని అన్నాడు.

అంటే ఆయనతో జీవిస్తూ, ఆయన మరెవరితోనో మాట్లాడుతున్నప్పుడు, తనతో ఉపదేశ రూపంలో ఒక్క పలుకు పలుకక పోయినప్పటికీ, ఆ నిశ్శబ్దంలో నుండే తాను 'నేర్వవలసి' వుండెను. ఇలా నేర్చుకోడం ఎంత కష్టమో గ్రహించవచ్చు. నేర్చుకోడం మొత్తమూ చూచి నేర్చుకోవాలి అన్నమాట. దీనికెంత సున్నితమైన స్పృహ వుండాలో ఊహించుకోవచ్చు. గురువు బోధిస్తుంటేనే విద్య వస్తుంది అని గుంపులు గుంపులుగా గురువు చుట్టూ చేరడమనేది ఎంత అసందర్భమో దీనినిబట్టి తెలుసుకోవచ్చు. సూఫీ గురువులు అనేకమంది ఏకాంతంగా, తమ పేరు బయటికి రానివ్వకుండానే, సాధన కొనసాగిస్తుండేవారు. అజ్మీర్‌లో జీవించి, తరించిన మొహినుద్దీన్ ఛిష్టీ వారిలో ఒకరు. తాను ఎక్కడైనా ప్రయాణంకట్టి బయలుదేరినా, ఎవరో ఒక్క శిష్యుణ్ణి తప్పితే, మరొకరిని తనతోనే రానిచ్చేవాడు కాడు. వెళ్ళినచోట కూడా జనం తిరుగాడని, పాడుపడిన ఇళ్ళల్లో ఎక్కడో ఒకచోట కూచొని కాలం గడిపేవాడు. ప్రజల మధ్యకు వచ్చేవాడు కాదు. ఒక్కొక్క సారి శ్మశాన వాటికల్లో నివసించేవాడు.

తానున్నచోట తనని గుర్తుపట్టారు అని తెలియగానే అక్కడి నుండి వైదొలగేవాడు. అతడికి పబ్లిసిటీ అంటే అంత ఏవగింపు. ఈ విద్య నేర్వడానికి కొందరు సమూహాలుగా ఏర్పడడంలో వచ్చే చిక్కేమిటంటే ఆ సమూహం ఒక చిన్న కుటుంబంగా తయారై, పరస్పరం కలుసుకోవాలనే కోరిక కలిగుండడం, సంఘపరంగా సంబంధాలు పెరగడం మాత్రమే జరుగుతుంటుంది గానీ, నిజంగా విద్య నేర్వడమనేది అట్టే సాగదు. ఇక అవగాహన కలగడమనే ప్రశ్న ఎక్కడ ఉదయిస్తుంది?

ఈ కారణాలను దృష్టిలో వుంచుకునే అబ్దుల్లా అన్సారీ అనే సూఫీ గురువు ప్రార్థన అంటే కేవలం 'ఆ పూట తిండి మానేయడం'గా పరిణమించిందనీ సామూహిక ప్రార్థనలు

వృద్ధులైన స్త్రీ పురుషులు ఒకేచోట చేరి ఏదో వల్లించడంగానూ పుణ్య స్థలా యాత్రల పేరిట, ప్రపంచంలోని పలు ఊళ్ళను దర్శించే వినోదంగానూ, మారిపోయినై అంటాడు.

భక్తజనావళి, చిన్న చిన్న కూటములుగా ఏర్పడి 'విద్య'ను శ్రద్ధాసక్తులతో నేర్వాలంటే, వారు నాలుగురకాల గోతుల్లో పడకుండా జాగ్రత్త వహించాలి అంటారు అన్సారీ.

సంపద సమకూరినప్పుడు మనిషిలో కృతఘ్నత వుండరాదు. సంపద కోల్పోయి నప్పుడు ఓర్పును కోల్పోరాదు. తమ జీవితాల్లో తమకు లభించిన ఆర్థిక వనరులు ఎటు వంటివైనా, అసంతృప్తి వుండరాదు. తోటి వారిని సేవించడానికి వెనకాడరాదు. ఇలాంటి శీలమున్న సభ్యులతో కూడుకున్న కూటమి అయితేనే, వారు 'నేర్వ'గలిగి వుంటారు. అవగాహన సాధించగలుగుతారు.

ఇప్పుడు మనం చెప్పుకున్న అబ్దుల్లా అన్సారీ అనాటి హీరాట్ రాజ్యంలో నివసించిన గొప్ప సూఫీ. 'విద్యాసక్తివున్న తన శిష్యుల్లో ఎవరైతే బీదరికం నుండి మానసికంగా విముక్తి చెందలేదో వారే అసలు పేదలు అని నిర్వచించాడు. (అంటే దరిద్రాన్ని అనుభవిస్తున్నామే అని చింతించేవారే అసలు పేదలు అన్నమాట) ఆయన ఇంకా ఇలా అన్నాడు; 'భౌతికంగా కొన్ని వస్తువులు లేకపోవడమే పేదరికం అని అనుకుంటారు.'

మిత్రశ్రీ వ్యాఖ్యానిస్తూ 'నిజానికి మొదటిది పేదరికమూ కాదు, రెండవది భాగ్యమూ కాదు. ఆధ్యాత్మిక దారిద్ర్యం అన్నింటికన్నా భయంకరమైనది; అతడే నిజమైన నిర్భాగ్యుడు."

సూఫీల దృష్టిలో, తగినంతగా 'ఎదగనివారు' చక్కని హాస్యాన్ని ఆస్వాదించే గుణాన్ని అణగద్రొక్కినవారు, ఎంతో పోగొట్టుకున్న వారిలో జమ అవుతారు; ఇలాంటివారు ఆధ్యాత్మిక రంగంలో కూడా ఏమీ నేర్వగలిగి వుండరు.

# శస్త్ర చికిత్స ముందు యోగాభ్యాసం

**1979**లో ముంగేరీ యోగా సంస్థకు చెందిన స్వామి నిరంజనానంద సరస్వతి, స్పెయిన్ దేశంలోని బార్సిలోనాలో యోగా నేర్పుతూ ఉండేవాడు. ఆ సమయంలో అక్కడి ఒక సర్జన్‌కు ఓ ఆలోచన వచ్చింది. ఆ విషయాన్ని స్వామితో ప్రస్తావించాడు.

సామాన్యంగా అపరేషన్‌కై సర్జన్ వద్దకు వచ్చే పేషంట్లు కొంత ఆదుర్దాతో వస్తారు. ఆపరేషన్‌కు ముందు మత్తుమందు ఇస్తారనీ, అవయవాలను తెగ్గోస్తారనీ, బ్రతుకుతానా బ్రతకనా అనీ, సర్జన్ ఒక కన్నుకు బదులు ఇంకో కన్ను తీసేస్తాడేమోననీ, ఇట్లా అనేక భయాలతో కొట్టుమిట్టాడుతుంటారు. అందుచేత ఇలాంటి పేషంట్లకు మానసిక భయాందోళనలను తొలగించడానికి, వారిని ఆపరేషనుకు సిద్ధంచేయడానికి ముందు చర్యలుగా యోగా విధానాలు ఏవైనా అవలంబించడానికి వీలుందా అని చర్చించాడు. శస్త్ర చికిత్స యెడల ప్రతికూలత తగ్గించి, అనుకూల వైఖరి కలగజేయడమే దీని ఉద్దేశం.

అంతకుమునుపు యోగా విద్యతో ఏ సంబంధమూ లేని, అదేమిటో ఏమాత్రం ఎరుగని, పదిమంది పేషంట్లను పోగుచేశారు. జి.యస్.ఆర్., ఇ.ఇ.జి. ఇ.సి.జి. మొదలైన పలు బయో ఫీడ్ పరికరాలతో కొలుస్తూ వారిచేత ఐదు నిమిషాలపాటు ఓంకార జపం చేయించారు. మరో గదిలో వారి మెదడు యొక్క తరంగాలు ఎలా వున్నాయో స్క్రీన్‌మీద చూస్తూ సర్జన్, స్వామి కూచున్నారు. పేషంట్లు మొదట్లో చాలా భయ సంకోచాలతో, నరాల దౌర్బల్యం ప్రకటించారు. శస్త్రచికిత్సను గురించి వారు పడుతున్న భయమంతా ఆ మేథోతరంగాలలో ప్రస్ఫుటంగా కనిపించింది. ఐదు నిమిషాల ఓంకార ఉచ్చారణతో 'డెల్టా'తరంగాలు ప్రబలంగా వెలువడ నారంభించినై. పేషంట్ల ముఖాల్లో మార్పు కనపడ జొచ్చింది. వారందరూ గది నుంచి ఆందోళనా రహితమైన ముఖాలతో బయటికి వచ్చారు.

'వారి మనస్సుల్లో ఎలా వుందో నాకు తెలియదు కానీ, వారి మెదడు తరంగాలను బట్టి, ఆపరేషనుకు అనుకూలంగా గది నుండి వెలువడ్డారని ఖాయంగా చెప్పగలను. ఈనాటికీ ఆ ఆసుపత్రిలో ఆపరేషనుకు ముందు ఈ ఓంకార నాదాన్ని ఐదు నిమిషాల

పాటు అభ్యసించడం రివాజుగా సాగుతున్నది' అంటారు స్వామి నిరంజనానంద సరస్వతి.


★ ★ ★ ★

బాహ్య సంఘటనల యెడల మానవులు మేధనుపయోగిస్తారు కానీ, స్వవిషయం అయినప్పుడు మేధాశక్తిని ప్రయోగించరు' అంటారు శ్రీ నిరంజనానంద. 'స్వవిషయం వద్దకొచ్చేటప్పటికి, 'నేనీ అనుభూతి చెందాను' 'నాకిలా అనిపించింది' 'నా నమ్మకమేమి టంటే' అనే వాక్యాలు వాడుతారు. తనకు అన్యమైన విషయమైనప్పుడు, 'నాకు తెలుసు కోవాలని ఉంది' అంటారు. ఆ సమయాన కూడా, 'ఆ విషయం గురించి అనుభవం పొందాలని వున్నది' అని ఎందుకనలేరు? 'నాకు తెలుసుకోవాలని ఉంది' అని ఎందుకనాలి? సొంత విషయానికి వచ్చినప్పుడు 'నా అనుభూతి ఏమిటంటే – ఈ సందర్భంలో ఈ అనుభూతి కలగడం ఉచితమే, నా అనుభూతి తప్పు అయ్యే అవకాశం లేదు' అని అనుకుంటారు. కానీ ఆ అనుభూతిని, మేధాపరంగానూ, హేతుబద్ధంగానూ సమర్థించగలిగి వున్నారా? మీవల్ల కాదు. కారణమేమిటంటే, మనిషికి తలపు, నమ్మకం, దృఢ విశ్వాసం, ఇవన్నీ మనలోని భాగం. పరిజ్ఞానమనేది మీలో భాగం కాదు, బాహ్యం నుండి మీ లోనికి వచ్చేది.

మన చూపు సకారాత్మకంగా వుంటే కలిగే ప్రయోజనాలను ఇలా వివరిసస్తాడు నిరంజనానంద సరస్వతి. 'దేనినైనా చూచేటప్పుడు, సకారాత్మకంగానూ చూడాలి, నకారాత్మ కంగానూ చూడాలి. ఆకర్షణ, నకారాత్మకమైనప్పుడు అది పరిమితమైనదవుతుంది; ఆకర్షణ సకారాత్మకమైనప్పుడు అది స్వేచ్ఛను కలిగిస్తుంది. అది వేరొక దృష్టిని అనుగ్రహిస్తుంది.

సకారాత్మకమైన ఆకర్షణలో వశపరచుకొనే గుణముండదు; ఎదురుగా వున్న పరిస్థితిని చూచి, నకారాత్మక ప్రతిక్రియ భావనలు పెంచుకోకుండా, పరిస్థితులకు సమ్మతించడం జరుగుతుంది.

# సమస్యలు సృష్టించే మనసు



తన సన్యాసులకు బోధ చేసిన అనంతరం జెన్ గురువు యాకుసాన్ వద్దకు ఒక సన్యాసి వచ్చి 'నాకో సమస్య ఉన్నదండీ. దానికి పరిష్కారం సూచిస్తారా?' అని అడిగాడు.

నిజానికి ఎవరూ, మరొకరి సమస్యను పరిష్కరించ గలిగి లేరు. సమస్యల్ని జనింప జేసేది తన 'స్వ'యే కాబట్టి, తన 'స్వ' వద్దనే సమాధానం కూడా వుంది. 'సమస్యను సృష్టించేది మనమే. దానిని తీర్చమని వారిని వీరినీ అడిగేది మనమే. మనసుకు అనేక సమస్యలు, కానీ నీ మనసు నీ యొక్క సత్య స్వరూపం కాదు కదా?' అంటారు శ్రీ రజనీష్.

యాకుసాన్, "తర్వాతి ప్రసంగంలో పరిష్కరిస్తాను" అని సమాధానం చెప్పాడు. గురువు ఆ సన్యాసికి ఓ అవకాశ మిస్తున్నాడన్న మాట. ఏ మనిషైనా తన సమస్యకు తానే సమాధానం కనుక్కోవాలి. ఇంకొకరి సమాధానం కోసం, అందులో ఆ గురువు వాయిదా వేస్తున్నప్పుడు, అసలు సమాధానమిసాడో లేదో అనే పరిస్థితిలో పడేస్తున్నప్పుడు, సమస్య నుత్పన్నం చేసుకున్నవాడు తనకు తానే తెముల్చుకోవాలి సుంటుందని సూచిస్తున్నాడు. అంటే, 'సమస్యను తక్షణం వదిలెయ్'మని అంటున్నాడు.

ఆ సాయంత్రం సన్యాసులందరూ హాలులో సమావేశ మైనప్పుడు, యాకుసాన్, 'సమస్య ఉండిన సన్యాసి వెంటనే నావద్దకు రావలసింది' అని బిగ్గరగా అన్నాడు. ఆ సన్యాసి ఆయన ఎదురుగా వచ్చి నుంచోగానే, గురువు కూచున్న చోటి నుండి గభాల్న లేచి, ఆ సన్యాసిని ఒకింత కఠినంగా భుజం పట్టుకొని, "అందరూ చూడండి. ఈ సన్యాసికి ఏదో సమస్య ఉన్నదిట" అని అంటూ, అతణ్ణి హాలు బయటికి నెట్టేశాడు. తిరిగి వచ్చి బోధ కొనసాగించకుండా హుటాహుటిన తన గదికి వెళ్ళిపోయాడు.

ఇక్కడ గమనించాల్సిందేమంటే, 'మనిషికి సమస్య వుంటానికి వీల్లేదు' అని సూచిస్తున్నాడు గురువు; మనిషిగా భూమిపై జీవించడం, ఒక్కటే ముఖ్యం. సమస్యలనుకున్నవన్నీ ఇతరులు నీ తలపై మోపినవి. నువ్వు అమాయకంగా పుట్టావు. అమాయకత్వానికి అన్నీ స్పష్టంగా తేటతెల్లంగా కనిపిస్తై. అందుచేత, తన చుట్టూ అద్భుతాశ్చర్యాలతో నిండిన ఈ ప్రపంచం అంతటినీ, చూస్తుంటుంది. అప్పటికి సమస్యలేవీ వుండవు. ప్రశ్నలు తర్వాత మెల్లగా ప్రవేశిస్తై. ప్రశ్నలు లేకపోతే మనసు వుండదు. మనసంటే ప్రశ్నలు లేవదీయడమే'నంటాడు రజనీష్.

'బాల్యంలోకి వెళ్ళు. అప్పుడు ఆశ్చర్యం, అద్భుతం మాత్రమే చూస్తుంటేవాడివి. కాలక్రమేణా నీ చుట్టూ వున్నవారు నీకెన్నో నేర్పారు. ప్రశ్నలుదయించినై. దానితోబాటు మనసూ ఉదయించింది. మనసుకు సహజంగా ఎప్పుడూ సమస్యలే.

అదుగో అటు చూడండి. ఆ చెట్టు మొక్కలకు ఏ సమస్యాలేదు. ఇతడ్ని చూడండి. ఇతడికేవో సమస్యలు అని గురువు నలుగురి ముందర అరిచి మాట్లాడేసరికి, చివరకా ప్రశ్న లేవదీసిన సన్యాసి కూడా తనకో సమస్య ఉన్నదనే సంగతి మరచిపోయి వుంటాడు.

సన్యాసిని కఠినంగా హాలు బయటికి తోసేయడంలో గురువు ఉద్దేశం 'మనసును ఇలాగే నీ నుండి తోసెయ్. మనసుతోపాటు సమస్య కూడా ఆ దారినే పడిపోతుంది' అంటున్నాడు.

గురువు సాయంత్రం ప్రసంగం చేయకుండా నేరుగా తన గదికి వెళ్ళిపోయాడంటే, ఆయన తన అంతఃకరణలోనికి వెళ్ళిపోయాడన్న మాట. మనసును, సమస్యను అవతలకు నెట్టేసిన తర్వాత, ఏ మనిషైనా సరే, తన అంతఃకరణలోకి వెళ్ళిపోవాలి అని సూచిస్తున్నాడు.

అలా అప్పటికప్పుడు తక్షణ చర్య గనక గైకొంటే, మనసు సమస్యల్ని సృష్టించగలిగి వుండదు. 'సత్య స్వరూపమైన నీ సత్త యొక్క రుచి నీకు తెలిసి వస్తుంది' అంటాడు శ్రీ రజనీష్.

# వివేకానందుని అసాధారణ మేధ



స్వామి వివేకానందకు ఏదో అసాధారణమైన మేధాశక్తి వుండేది. 1901 సంవత్సర ప్రాంతంలో 'ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా' సంపుటాలు బేలూరు మఠానికై తెప్పించారు. వాటి కొత్తదనం ఏమాత్రం మాయకుండిన స్థితిలో, వాటిని చూచిన ఒక శిష్యుడు 'ఈ సంపుటాలన్నిటినీ ఒక జీవిత కాలంలో పఠించడం అసాధ్యమనవచ్చు' అని వివేకా నందుడితో అన్నాడు. స్వామిజీ అప్పటికే అందులో పది సంపుటాలను ముగించి, పదకొండవది ప్రారంభించాడని అతడు ఎరుగడు.

'నువ్వేమన్నావ్? ఆ పది సంపుటాలలో, మీకు ఎవరికి ఏది కావాలన్నా, అది అడగండి. మీ అందరికీ బదులు చెప్తాను' అన్నాడు వివేకానందుడు. ఆశ్చర్యపోయిన శిష్యుడు, "ఆ పుస్తకాలన్నీ మీరు చదివేశారా?" అని అడిగాడు. అందుకు స్వామి "లేకపోతే నన్ను ప్రశ్నించండని మీతో ఎలా అంటాను?" అన్నాడు.

వారు ప్రశ్నించగా, ప్రతి సంపుటంలోని క్లిష్ట విషయాలను, అందలి భాషతోనే, భావాలు తెలపటమే కాక, నిర్దుష్టంగా అప్పజెప్పాడు. శిష్యుడు ఆశ్చర్యంలో మునిగిపోయి, పుస్తకాలు అవతలపెట్టి, "ఇది మనుష్యశక్తి కాదు" అన్నాడు. అందుకు వివేకానందుడు, "నిష్ఠుర బ్రహ్మచర్య భావన మొక్క దానిచేతనే ముహూర్త మాత్ర కాలములో సర్వవిద్యలను ఆర్జించవచ్చును. ఒకేసారి విన్నదియు కన్నదియు అమోఘముగా జ్ఞప్తియందుండును. ఈ బ్రహ్మచర్యము లేకపోవుట చేతనే మనదేశమునందు సర్వమును ధ్వంసమైపోవు స్థితికి వచ్చుచున్నది."

అందుకు శిష్యుడు, "అయ్యా, మీరు ఏమైనా చెప్పండి. కేవలం బ్రహ్మచర్య ఫలితంగా ఇట్టి అమానుష శక్తి విజృంభించగలిగి లేదు. మరేదో ఉండి తీరవలెను."

స్వామీజీ ఈ మాటకు బదులు చెప్పలేదు. "శిష్యుడి మాటే చాలావరకు నిజమని తోస్తుంది" అని ప్రారంభించాడు మిత్రశ్రీ. "బ్రహ్మచర్యం విలువను తగ్గించకుండానే, అదే ఇంతటి జ్ఞాపకశక్తికి మూలం అని అనగలిగిలేము. కానీ ఈ ప్రజ్ఞ వివేకానందుడు మరో సందర్భంలో కూడా ప్రదర్శించాడు."

జర్మనీకి వెళ్ళినప్పుడు వివేకానందుడు డ్యూషెన్ అనే జర్మన్ పండితుడి అతిథిగా వున్నాడు. ఇతడు భారతదేశ ప్రాచీన వేదాంత సంపదను తఱచి చూచినవాడు. ఈ డ్యూషెన్ పండితుడు, మరొక ప్రఖ్యాత భారత వేదాంత అధ్యయనపరుడైన మాక్స్‌ముల్లర్‌తో సమానుడే కాక, అంతకన్నా మరికొన్ని సూక్ష్మ విషయాలను గూర్చి కూడా పరిశోధన సల్పినవాడు. ఉపనిషత్తులను, భగవద్గీతను సంపూర్ణంగా అర్థంచేసుకున్న మొదటి పాశ్చాత్య పండితుడిగా పరిగణించవచ్చు. ఈ డ్యూషెన్ పండితుడు జర్మన్ భాషలోకి అనువదించిన ఉపనిషత్తులను చదివి, వేదాంతి షోపెన్ హోవర్ వొళ్ళు ఎంతగా పులకరించి పోయిందంటే, ఆ పుస్తకాన్ని అక్షరాలా శిరస్సుపై నిడుకొని, బజార్లో  నృత్యం చేశాడంటారు.

ఓ ఉదయాన డ్యూషెన్ తన ఇంట్లోని అధ్యయన గదిలో కూచొని, జర్మన్ భాషలోని ఏదో గ్రంథం జాగ్రత్తగా పఠిస్తున్నాడు. ఆ గ్రంథాన్ని కొంతకాలంగా ఆయన అధ్యయనం చేస్తున్నాడు. అందులో సగ భాగమే అప్పటికి పూర్తిచేశాడు. అతిథి వివేకానందుడు అటు వెళ్తూ, ఆయన గదిలోకి తొంగి చూచి, 'గుడ్‌మార్నింగ్' అన్నాడు. డ్యూషెన్ తాను చదువుతున్న పుస్తకం పేరు చెప్పి, ఇది గొప్ప పుస్తకమని వివేకానందుడితో అన్నాడు. "నాకో గంటసేపు ఆ పుస్తకాన్ని ఇప్పించండి" అన్నాడు. నిజానికి వివేకానందుడికి జర్మన్ భాషతో చాలా స్వల్ప పరిచయం. అందువల్ల "దానిని చదివి అర్థంచేసుకోడం మీకు కష్టమవుతుందన్నాడు" డ్యూషెన్. "జర్మన్ భాష బాగా తెలిసినవాడైతే దానిని అర్థంచేసుకో గలడని ఎవరైనా గ్యారంటీ ఇస్తారా?" అని చమత్కరించాడు వివేకానందుడు. డ్యూషెన్ నవ్వి, 'అలాంటిదేమీ లేదు' అని అంగీకరించాడు. "అలాగైతే జర్మన్ భాష సరిగ్గా రానివాడు బాగా అర్థం చేసుకోగలడేమో, చెప్పలేము కదా? ఏదిఏమైనా, ఆ పుస్తకం నాకో గంటసేపు ఇప్పించండి" అన్నాడు.

"మీరు నాతో వుంటున్నది రెండు రోజులే అయినప్పుడు, మీరీ కొద్దికాలంలో ఈ పుస్తకం ఎలా పూర్తిచేస్తారు? నేనీ పుస్తకాన్ని చదవనారంభించి ఇప్పటికి పదిహేరు రోజులయింది. కానీ సగం పుస్తకం పూర్తిచేయడానికి గగనమయింది" అన్నాడు డ్యూషెన్.

"నేను వివేకానందుణ్ణి కదండీ?" అని సరసోక్తులాడుతూ, ఆ పుస్తకం తన గదికి తీసుకువెళ్ళాడు. ఓ గంట గడినిచ తర్వాత, వివేకానందుడు తిరిగి వచ్చి ఆ పుస్తకాన్ని డ్యూషెన్‌కు తిరిగి ఇచ్చాడు.

"పుస్తకం మొత్తం చదివారా?" అని అడిగాడు డ్యూషెన్, ఆశ్చర్యంగా.

"చదవడమే కాదు. అర్థం చేసుకున్నాను కూడాను" అన్నాడు వివేకానందుడు. అంతటితో పోనివ్వక, "ఆ పుస్తకంలో మీరడుగదల్చిన అంశాల గురించి అడగండి" అన్నాడు డ్యూషెన్‌తో.

ఆ పుస్తకంలో తాను చదివిన సగ భాగంలోని కొన్ని విషయాల మీద, సూక్ష్మమైన ప్రశ్నలు వేశాడు డ్యూషెన్. వాటన్నిటికీ వివేకానందుడు సవివరంగా సమాధానాలు చెప్పాడు.

"గంటలోగా ఎలా చదవగలిగావయ్యా, అంతేగాక దీని సారసంగ్రహమంతా ఎలా గ్రహించవయ్యా?" అని ఆశ్చర్యపోతూ అడిగాడు డ్యూషెన్.

"చదవడంలో సాధారణ పద్ధతులూ వుంటై: అసాధారణ పద్ధతులూ వుంటై అండీ. అతీంద్రియ శక్తి ద్వారా పుస్తకంలోని సారాంశమంతా గ్రహించగల్గిన శక్తి వుంటుంది" అన్నాడు వివేకానందుడు. ఈ మహానుభావుడికి ఈ అతీంద్రియ శక్తి వుండుండాలి; లేకపోతే శ్రీరామకృష్ణుడు నరేంద్ర అనే ఈ కుర్రవాడికోసం అంతగా తపించి వుండేవాడు కాదు. ఇతడే రామకృష్ణుని దివ్య సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా వినిపించగలవాడని అంత దృఢవిశ్వాసం పెట్టుకోనుండేవాడుకాదు. నలభై ఏళ్ళ వయసులోగానే తన జీవితాన్ని పరిసమాప్తం చేసుకున్న ఈ మహనీయుడు, ఎంత కొద్దికాలంలో అంతటి మహత్తర కృషి సల్పాడో లోకమెఱుగును.

నాకు తెలిసినంతవరకూ శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి సీనియర్ మిత్రుడు శ్రీ పెమ్మరాజు వెంకటరావుగారు (చాలాకాలం వి.వి. గిరితోపాటు తానూ ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల్లోనూ, కొంతకాలం జనరల్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్, పదవిలో కొనసాగారు) చెప్పిన విషయమొకటి తెలియజేస్తాను. రాధాకృష్ణన్ ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌గా వుండేటప్పుడు, ఓ చిన్న సూట్‌కేస్ నిండా పెంగ్విన్, పెలికన్ ప్రచురణలు సుమారు ఇరవై పాతిక పుస్తకాలు పెట్టుకొని, వైజాగ్‌లో రైలెక్కితే, మర్నాడు ఉదయం మద్రాసుకు చేరేలోగా, వాటన్నిటినీ పఠించడం ముగించేవారట. పూర్తిగా చదివి వుంటారా అంటే, పుస్తకాలలో  వుండే చివరి ఖాళీ పేజీల్లో పుస్తకంలోని ముఖ్య

విషయాలన్నీ పాయింట్స్ రూపంలో సంగ్రహంగా రాసిపెట్టేవారిని చెప్తుండేవారు పెమ్మరాజువారు.

జీవితమంతా లేమితో బ్రతుకు వెళ్ళదీసిన స్వామి వివేకానందుడి పూర్వీకుల గృహం ఉత్తర కలకత్తాలో వున్నది. వివేకానందుని జ్ఞాపకార్థం దానిని తమ స్వాధీనం చేసుకోవాలని రామకృష్ణ మిషన్‌వారు అందులో నివసిస్తున్న వారిపై కోర్టులో దావా నడపవలసి వచ్చింది. ఆ గృహంలో అప్పటికే వుంటున్నవారు ఆ ఇంటిపై చట్టరీత్యా తమకు న్యాయపరమైన హక్కులున్నట్లు కోర్టులో వాదించారు. దీర్ఘకాలంపాటు ఈ తగాదా పరిష్కారం కాకుండా, చివరకు వివేకానందుని జన్మదినం 21-1-1997 ముందు వారంలో, ఆ ఇంటిని మిషన్ వారికి స్వాధీనం చేశారు. ఈ గృహంలో నివసిస్తున్న వారికి, రామకృష్ణ మిషన్ వారు, వేరే వసతి చూపించాల్సి వచ్చింది. అందుకుగాను మిషన్‌వారు ఆ 1997లోనే ఎనిమిది కోట్ల రూపాయల వ్యయం భరించాల్సి వచ్చింది.

**మరణ స్పృహ**

సర్వదా మరణమును జ్ఞప్తి యందుంచుకొన్నచో, మన ఆత్మశక్తి పునరుద్భవమగు చుండును.

***-స్వామి వివేకానందుడు***

# భాషలు వేరైనా పలికింది ఒక్కరే

బ్రిటిష్‌వారు భారతదేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో (1937) వారు మెచ్చుకున్న కొందరు భారతీయులకు 'నైట్‌హుడ్' (Knight hood) బిరుదం అనుగ్రహించేవారు. అంటే వీరి శూర కులీనత్వం, కొన్ని రంగాల్లో ప్రజ్ఞ, పాలకుల యెడల విధేయతను తాము గుర్తించినట్లుగా ఆ బిరుదు ప్రదానం చేసేవారు. అలాంటి ఒక ముసల్మాన్ 'నైట్' అమిత మతావేశంతో హిందువులను తక్కువ చూపుచూస్తుండేవాడు. కానీ తర్వాతి కాలంలో అతడొక హిందువుతో మాట్లాడుతూ: "కొన్నేళ్ళ క్రితం నా ఒక్కగానొక్క కొడుకు రోగ పీడితుడై మంచానపడినప్పుడు, నేనేమనుకుంటుండే వాణ్ణంటే, "నేను చేసిన తప్పంటూ ఏమీలేదు. మహాదయాళువైన అల్లా, నా కొడుకును మృతి చెందించి, నన్ను శిక్షిస్తాడని నేననుకోను.' అయినప్పటికీ నా కొడుకు మరణించడంతో నేను దేవుడిపై విశ్వాసం పూర్తిగా కోల్పోయాను. దేవుడే లేడనే తలపుతో, అవిశ్వాసిగా కొంతకాలం తిరుగుతుండేవాణ్ణి–

ఒకనాడు ఎవరో మీ శాస్త్రాల్లోని శ్లోకమొకటి చెప్పారు – బహుశా భగవద్గీతలోని దనుకుంటాను. అందులో భగవంతుడు "నా భక్తుల్ని నేను అనేక రకాలుగా, ధన నష్టంతోనూ, పదవీచ్యుతి ద్వారానూ సంతాన మరణంతోనూ, మరెన్నిటితోనో పరీక్షిస్తుంటాను" అంటాడు. ఈ వాక్యం నా మనసును ఎంతగానో శాంతింపజేసింది. ఇది నాపై ఎంతటి ప్రభావం చూపించిందో మీకు వివరించ గలిగిలేను. ఇది నా విశ్వాసహీనతను పూర్తిగా తొలగించింది. అటుపైన ఖురాన్‌లోని ఒక భాగం గుర్తుకొచ్చింది. అదీ ఇదీ రెండూ ఒకటిగా అర్థమైనై. కాకపోతే ఒకటి అరబిక్ భాషలో వుంది. రెండవది సంస్కృతంలో వుంది. ఖురాన్‌లోని భాగం ఇలా వుంటుంది. 'నేనెవరినైతే పరీక్షకు గురిచేస్తానో వారి ధనాన్ని తొలగిస్తాను. హోదా తీసేస్తాను. సంతానాన్ని మరణింపజేస్తాను.' రెండు భాషల్లోని ఈ రెండు భాగాలను కలిపి చదువుతూ వుంటే, ఒక్కరి నోటి నుండే, ఈ రెండు భాషల్లోని వాక్యాలు వెలువడ్డాయని స్పష్టంగా అనిపించింది. తన రాజ్యంలోని ఒక ప్రాంతంలో ఆ 'చక్రవర్తి' అరబిక్ భాషలో ప్రసారం చేసినట్లూ, మరొక ప్రాంతంలో సంస్కృత భాషలో ప్రసారం చేసినట్లూ తోచింది.

మా ముస్లిములలో ఎవరైతే హిందువుల విగ్రహారాధనను గురించి మాట్లాడుతారో, వారికి తాము ఏమి మాట్లాడుతున్నారో తెలియదని నా అభిప్రాయం. రెండు ప్రాంతాల్లోనూ మాట్లాడింది ఒక కంఠం నుండి వచ్చిన వాక్యాలనేది నిర్వివాదం" అన్నాడు.

అప్పుడా హిందువు అతడితో ఇల అన్నాడు: 'విగ్రహారాధన గురించి ఉపనిషత్ ఏమంటుందో ఒకసారి చూడండి.'

'చిన్మయస్యా దృతీయాస్య నిష్కళస్యా శరీరిణాః ఉపాసకానాం కార్యార్థ బృహణీ రూప కల్పనా'. భగవంతుని జ్ఞానం, భగవంతుడు తక్క మరొకడు లేడు. భగవంతుడు రూప రహితుడు, శరీరము లేనివాడు. కేవలం తన భక్తుల కొఱకే, వారు తనని అందుకోడం కొఱకే, తనతో మమైక్యమవడం కోసమే అతడు మనిషికి కనిపించే శరీర ధారణ చేస్తాడు. శ్లోకమంతా ఆ ముసల్మాన్ 'నైట్'కు వివరించి చెప్పినప్పుడు, ఆ కులీనుడి కళ్ళు చెమర్చినై. 'మరి, దీనిని విగ్రహారాధన అంటున్నారా! ఔరా! అన్నాడు.

★ ★ ★ ★

## ప్రపంచీకరణ

రామ్‌సే క్లర్క్ అనే అమెరికన్, మాజీ ఎటార్నీ జనరల్ 2007 సంవత్సరంలో ఇలా అన్నాడు.

"పూర్వకాలపు సామ్రాజ్యవాదానికి, ప్రపంచీకరణకు ఉన్న తేడా నేటి ఇండియాలో స్పష్టంగా కానవస్తున్నది. ఒకప్పుడు ఈ దేశం విదేశీ ఆధిపత్యం యొక్క కర్కశ విధానాలతో, తద్వారా సంభవించిన పేదరికంతోనూ బాధపడింది. కానీ ఈ ప్రపంచీకరణ ప్రక్రియ ప్రవేశించిక ముందు భారతీయత బ్రతికే వుంది. మాటవరసకు భారతదేశ సినిమా పరిశ్రమను గమనిస్తే తెరమీద కనిపించిన ముఖాలన్నీ భారతీయంగా కన్పట్టేవి. ఇప్పుడీ ప్రపంచీకరణ అన్ని భారతీయ రంగాల్లోని మూల మూలలకు ప్రాకడంతో, ఆ పరిశ్రమలోని హస్యగాళ్ళ హాస్యరీతులు, సంగీత బాణీలు అన్నీ మారిపోజొచ్చినై. సమాజంలో వస్తు సామాగ్రి యొక్క విపరీత వాడకం, ఆహార పదార్థాల అధిక వినియోగం, భౌతిక విలువలు పాతుకుపోవడం వీటన్నిటినీ చూస్తుంటే, సాయుధ సైనికులు దేశాన్ని అక్రమించి పరిపాలించిన దానికన్నా, ఈ ప్రపంచీకరణ ఫలితంగా ఏర్పడిన విపరీత పరిస్థితులే మరింత ప్రాణాంతకంగా పరిణమించాయేమోననిపిస్తున్నది."

# కోరిక

"మీతో ఉంటున్నప్పటి నుండీ, నా జీవితంలో నాకు సంతృప్తి లభించింది. ఇతర్లతో సంబంధాలు మంచిగా ఉంటున్నై. కాని జ్ఞానోదయం ఆనందాబ్ది దక్కకుండా వచ్చినై; ఈ కోరికను మాత్రం కాదనలేకుండా ఉన్నాను. ఇది ఆటంక మంటారా? కానీ 'వాస్తవం' దక్కేవరకూ ఇది ఉండక తప్పుతుందా?" అని అడిగాడు ఓ శిష్యుడు శ్రీ రజనీష్‌ను.

"అవును, ఇది ఆటంకమే. బాహ్యామైన విషయానికైనా అంతరమైన విషయానికైనా, కోరిక కోరికే ననిపించుకుంటుంది. ప్రాపంచిక కోరికలు వేరు, దానికి అతీతమైన విషయం వేరు అని విభజించకు. భౌతికేతరమైన దానిపై కోరిక ప్రాపంచిక కోరికతో సమానమే. 'కోరిక' అనేది ప్రాపంచికమే.

కోరిన వస్తువు ప్రధానం కాదు. రాజమహల్ కోరినా, దేవుణ్ని కోరినా, కోరిక కలిగున్నావా అనేదే ముఖ్యం. కోరికతో సత్యం సాక్షాత్కరించదు. మరేం చేయాలి? చేయ వలసిందేమీ లేదు. కోరిక దుఃఖాన్ని తెస్తుంది అని గుర్తించాలి.

నీ పూర్వపు కోర్కెల్ని మదిలేశావు కాబట్టి నీ మనసు సంతృప్తిగా వుంది. మనుష్యులతో సంబంధాలు తిన్నగా వున్నై. కానీ, నీ కొత్త కోరిక మళ్ళీ అలజడి రేపింది. అప్పుడు కోర్కెలు వున్నప్పుడు నీకు సంతృప్తి వుండేది కాదని గుర్తించు. వైఫల్య భావం, కోపం, అసూయ మొదలైనవి అన్నీ నిన్ను బాధిస్తుండేవి. ఆ రంగంలో, కోరిక ఎప్పుడైతే నిన్ను వదిలేసిందో, ఆ రంగం శాంతియుతంగా తయారయింది. ఇప్పుడీ కొత్త కోరిక మళ్ళీ నిన్ను వేధిస్తున్నది. నేనెప్పుడు బుద్ధుణ్ని అవుతాను? అనే అరాటం, తత్ఫలితంగా అలజడి ప్రారంభయింది.

నాగార్జునుడనే గొప్ప బౌద్ధుడు, "బుద్ధుడవాలనే కోరికే, బుద్ధు డవడానికి అన్నిటికన్నా పెద్ద అవరోధ"మన్నాడు. ఎందుకంటే బుద్ధుడవాలనే కోరిక విరమిస్తే తప్పితే,

నువ్వు ఇప్పటికే బుద్ధుడవని గ్రహించలేవు–ఈ కోరిక కరిగిపోతుంది. నీ బుద్ధ లక్షణం వెలువడు తుంది; ఇది ఇప్పటికే నీలో వున్నది.

ప్రతి కోరికా కొత్త దుఃఖాన్ని తెచ్చిపడేస్తుంది. చేయాల్సిందేమీ లేదు – ప్రతి కోరికా దుఃఖం తెస్తుందని ఎఱుక కలిగివుండు. ఇది గ్రహించావంటే, బాహ్యాంతర కోరికలన్నీ అంతరిస్తై. ఇది తెలియగానే ఆనంద పరవశత్వం సిద్ధిస్తుంది. ఇప్పుడే ఇక్కడే నీ లక్ష్యం, నీవయిపోయావు, దుఃఖం వుండజాలదు.

ఓ గొప్ప రాజకీయ నాయకుడు, ముల్లానసీరుద్దీన్‌ను కోర్టుకీడ్చి. 'ఇతడు నన్ను గాడిద అన్నాడండీ' అని ఫిర్యాదు చేశాడు. 'నసీరుద్దీన్, ఇది చాలా తప్పు సుమా' అన్నాడు జడ్జి. 'నాకు నాయకుణ్ణి గాడిద అని సంబోధించడం తప్పని తెలీదండీ. క్షమించండి' అన్నాడు. సరేనన్నాడు జడ్జి. నాయకుడు కూడా ఆ విషయాన్ని వదిలేశాడు.

'కానీ గాడిదను నేను నాయకా అని సంబోధిస్తే, మీకేమైనా అభ్యంతరమా?' అని అడిగాడు నసీరుద్దీన్ అమాయకంగా.

'ఏ అభ్యంతరమూ వుండదు. గాడిద, కోర్టుకొచ్చి ఫిర్యాదు చేయదు కదా? అందువల్ల నీకెలా అనిపిస్తే అలానే కానీ' అన్నాడు జడ్జి నవ్వుతూ.

వెన్వెంటనే, నసీరుద్దీన్ నాయకుడి వంకకు తిరిగి, 'నాయకా, ఎలా వున్నావు?' అని అడిగాడు.

మనసు మారదు. అది ఒకలాగే ప్రవర్తిల్లుతుంటుంది. నాయకుణ్ణి గాడిద అన్నా గాడిదను నాయకుడని సంబోధించినా ఒకటే. కోరిక ఏదైనా బాహ్యమైనా అంతరమైనా ఒకటే. బాహ్య కోరికలను ఎలా వదిలేశావో, అలాగే దీనిని వదిలెయ్.

కోరిక తొలగింపబడిందంటే, నువ్వు స్వర్గంలో వున్నట్లే. నువ్వు స్వర్గధామానివే. నువ్వు మోక్షానివే. కోరికలతో నువ్వు దానిని నాశనం చేస్తున్నావు. కోరికలో నీ మనసు ఎంత సతమతమవుతున్నదంటే, నీ అసలు కేంద్రాన్ని నీవు స్పృశించలేకుండా వున్నావు" అన్నాడు శ్రీ రజనీష్.

# నిజానికి మనం ఆత్మలం



**జే**మ్స్‌వాన్‌ప్రాగ్ అమెరికాలో ఓ స్పిరిట్ మీడియమ్‌గా వ్యవహరిస్తుంటాడు. అంటే పరలోకాల్లోని ఏదో ఒక లోకంలో తిరుగాడే 'స్పిరిట్స్'ని (అశరీర, సూక్ష్మ శరీర) తన మనసులో దర్శించి, అవి ఇక్కడ భూలోకంలో వున్న బంధుమిత్రాదులను గురించి ఏమను కుంటున్నై అనే విషయం ఇక్కడి వారికి తెలియజేస్తుంటాడు. ఇహలోకం, పరలోకం, అందులోని కొన్ని విభాగాలు మొదలైన వాటిని నమ్మనివారు, ఇవన్నీ కట్టుకథలు, ఉట్టుట్టి కబుర్లు అని కొట్టిపారేయవచ్చు. కానీ తాను భూలోకంలో పుట్టి జీవిస్తున్నందుకు, ఈ విజ్ఞానం వెదజల్లడం, అక్కడి స్పిరిట్స్ భావననుబట్టి నరలోకవాసులు తమ ప్రవర్తనను ఎలా తీర్చిదిద్దుకుంటే బాగుంటుందనే విషయం – తనకు భగవంతుడనుగ్రహించిన ఈ ప్రత్యేక శక్తితో – పదిమందికీ తెలియజేయడమే పనిగా పెట్టుకున్నాడు ప్రాగ్. ఆత్మలు సంచరించే మరో లోకాన్ని గురించి తెలియజేస్తూ. భూమి మీది భౌతిక జీవనం, అక్కడి స్పిరిట్స్ జీవనం మధ్య వారధి నిర్మించడం తన పవిత్ర కర్తవ్యంగా భావించాడు ప్రాగ్. భౌతిక శరీరంలోని ప్రతి స్పిరిట్, వ్యక్తిగతంగా తన ప్రత్యేకతతో, సరియైన కాలమాసన్నమై నప్పుడు తాను ఎరుగగల్గిన సత్యాన్ని కనుగొంటుంది అంటాడు. "మన జీవాత్మలను మనం బలవంతంగా ఎదిగేటట్టు చేయలేము. కానీ పూలమొక్కల లాగా మన జీవాత్మకు తగిన ఎఱువు వేస్తూ పెంచి పోషిస్తూ, వాటిని పుష్పించి వికసింపచేసే వీలుంది" అంటాడు. "మన జీవితంలో భగవంతుని కంఠస్వరం మనకు వినిపించడం అత్యంతావశ్యకం. అంతర్ముఖులమై, ఆ స్వరాన్ని గనక మనం విన్నామంటే మన జీవితాలు అర్థవంత మవుతాయి. మనం కోల్పోయిన ఆత్మస్ఫురణను మనం తిరిగి పొందగలగాలి."

అసలు ఆధ్యాత్మిక జీవనమంటే ఏమిటో, ఆత్మ అయిన మనం, ఒక భౌతిక శరీరంలో జీవిస్తూ భూమిపై సంచరించడమంటే ఏమిటి, మన మనసు తన అనుభవాలనన్నిటినీ

ఎలా సృష్టించుకుంటుందో తెలియజేస్తాడు. ఆత్మయొక్క అనేక పొరలను పరిశీనగా చూసి, అది కాలక్రమేణా ఎన్ని జన్మలెత్తిందో, ఏమేమి అనుభవాలు సంతరించుకున్నదో తెలియ పరుస్తాడు. మరణానంతరం కూడా ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగుతుంటుంది. స్పిరిట్స్ నివసించే లోకంలో అనేక తరగతులుంటై అనీ, మనిషి భూలోకంలో 'నేర్చుకున్న' స్థాయిని బట్టి తదనుగుణమైన లోకానికి అతడి ఆత్మ చేరుతుంది అంటాడు. మరణం అనేది బాధారహితమైనది, సహజమైనదీను; దానిని గురించి భయపడనవసరం గానీ, చింతించాల్సిన పనిగానీ లేదు.

నిత్య జీవితంలో మనము ఎదుర్కొని పరిష్కరించ వలసిన సవాళ్ళు, సమస్యలు ఎంతగా మనల్ని కమ్మేస్తుంటై అంటే, నిజానికి మనం ఆత్మలమనీ, ప్రతి ఒక్కరం కూడా జ్ఞానోదయానికై మన మన విడివిడి మార్గాలు ఎన్నుకొని కృషిచేస్తున్న వారమనీ, మనసు కుదుటపరచుకొని ఆలోచించే అవకాశమే లేకుండా పోతున్నది అంటాడు. మన వ్యక్తిగత జీవితాలు ఎంత ప్రత్యేకమైనవో, మన మరణ సంఘటన కూడా అంత ప్రత్యేకమైనదే. ఒకరి చావు మరొకరి చావుతో పోలదు. మరణం అనేది జీవితంలో ఒక సహజ ప్రక్రియ. మనం పుట్టిన క్షణం నుండీ మరణిస్తూనే వున్నాం. చనిపోయినవాడు గ్రహించేదేమంటే, తాము ధరించిన భౌతిక శరీరం తమ 'నిజస్వరూపం'లోని అతి స్వల్పభాగమనీ, నిజానికి తాము మొత్తం ఉనికిలో ఒక భాగమనీ తెలుసుకుంటారు. భూమిమీద శరీరాన్ని వదిలేసిన ఆత్మలు ఈ విశ్వపటంలో తమ స్థానమేమిటో సంపూర్తిగా అర్థం చేసుకుంటారు. మొత్తం పటంతో తమ సబంధమేమిటో తెలుసుకొని ఇతర్లు తనకు పరాయి వారనే భావం వదలుకుంటారు. అందరిలోనూ ఆ భవవచ్ఛక్తినే దర్శిస్తారు.

'సహజ కారణాలవల్ల లేక ఏదో వ్యాధి ముదిరినందువల్ల చావు సమీపిస్తున్నదని తెలిసినవారు, కొన్ని విలక్షణమైన స్థిత్యంతరాలని అనుభవిస్తారు అంటాడు ప్రాగ్. చనిపోయే కొన్నాళ్ళముందే వాళ్ళ చైతన్యం వ్యాకోచించ నారంభిస్తుంది. తమ ఇంద్రియాలన్నీ మరింత పదునుగా పనిచేస్తై; ముఖ్యంగా కంటిచూపు, వినికిడి మరింత స్పష్టంగా వుంటై. (బహుశా భారతీయులు దీనిని చావు తెలివి అంటారేమో అన్నాడు మిత్రశ్రీ.) చాలామందికి తమ జీవితంలోని పాత ఘట్టాలేవో స్పష్టంగా కనిపిస్తై. ఈ పాత సంఘటనలు హఠాత్తుగా మెరుపు మెరిసినట్లు (ఫ్లాష్–బాక్) కనిపించే సమయంలో, ప్రతి జీవితానుభవానికి గల కారణమేమిటో తేటతెల్లమవుతుంది. ఇలా సంభవించే జీవిత సమీక్షా క్షణాలలో మనిషి

లోని ఆత్మ భాగం ఆ జీవితం గురించి ఒక నిర్ణయం చేస్తుంది. ఇతర్ల యెడల తాను సవ్యంగా ప్రవర్తించానా, లేక అపసవ్యంగా వ్యవహరించానా అనేది నిష్పక్షపాతంగా తెలిసి వస్తుంది. అలా అపసవ్యంగా కాక ఇలా ప్రవర్తించి వుంటే సవ్యంగా ఉండి వుండేది అనేది అక్కడికక్కడే తెలిసిపోతుంది. తాను ఎవరియెడలనైనా మంచిగా ప్రవర్తించి వుంటే అది కూడా కానవస్తుంది. ఈ జీవన సమీక్ష యావత్తూ కొన్ని క్షణాల్లో పూర్తవుతుంది. ఇది మనిషి యొక్క ఆధ్యాత్మిక భాగంలో శాశ్వతంగా ఉండిపోతుంది.

అనేక సందర్భాల్లో, మరణించే మనిషి ఆ క్షణంలో, ఇతర్లకు కనిపించని తనకు మాత్రమే కనిపిస్తున్న ఓ గతించిన బంధువునో, మిత్రుణ్ణో పేరుపెట్టి పిలవచ్చు; లేదా ఏదో దృశ్యాన్ని వర్ణించవచ్చు. ప్రఖ్యాత సైంటిస్టు థామస్ ఎడిసన్ మరణ సమయాన 'కోమా'లో వున్నప్పుడు ఒక క్షణంపాటు తెలివిలోకి వచ్చి, పైకి చూస్తూ 'అక్కడెంతో సుందరంగా వుంది' అన్నాడు.

ఆత్మహత్య చేసుకునేవారు, నిజానికి ఆత్మను హత్య చేయలేరు. బలవన్మరణం ద్వారా తాము చేసేదల్లా శ్వాసక్రియతో కూడిన శరీరాన్ని వదిలించుకోడమే. అటు తర్వాత ఆ ఆత్మ సజీవంగానే వుంటూ, ఏ సమస్యల నుండి విముక్తి చెందడానికి తాను ఆ అఘాయిత్యం చేసిందో, ఆ సమస్యలు సృష్టించిన మానసిక భావోద్వేగాలు దానిలో భాగం గానే కొనసాగుతున్నై అని గమనిస్తుంది.

మరణించిన తన సమీపస్థులు మనతో మాట్లాడడానికి ప్రయత్నిస్తుంటారు; వారు చెప్పేది మనం వినగలిగిలేమని వారికి తెలియక భంగపడతారు. భూమిమీది మనం వాళ్ళ మాట వినలేము గానీ మనం మాట్లాడేది ఆలోచించేది వాళ్ళకు అన్నీ తెలుస్తూనే వుంటై.

ఆత్మ ఏమాత్రం చెక్కుచెదరకుండా భూలోక యాత్ర పూర్తిచేసి, పరిపూర్ణ స్థితిలో అవతలి లోకాలకు చేరినప్పటికీ, పోగేసుకున్న తన జ్ఞాపకాలు, స్మృతులతో, దురభి ప్రాయాలతో, బలమైన కోర్కెలతో కూడుకున్న మన 'పర్సనాలిటీ' మాత్రం ఈ భూమి మీద తిరుగాడేప్పుడు ఎలా వుండెనో, అలాగే వుండిపోతుంది. నిజానికి మన మానసిక భావోద్వేగ స్థితి ఏమాత్రం మార్పు చెందదు. భూమిమీద అనుభవించినదంతా, ఆత్మపై ముద్రింపబడుతుంది.

'భూలోకవాసులమై వున్నప్పుడు మన మనసు ఎలా ప్రవర్తిల్లుతున్నదీ, ఏ కోప తాపాలకు గురవుతున్నదీ ఎలాంటి పోటీ గుణం, స్పర్థ ప్రదర్శిస్తున్నదీ, మరొకరి బాగు

చూసి ఎలా ఓర్వలేకపోతున్నదీ, ఇలాంటి గుణాలన్నీ కూడా ఏ కొద్ది మార్పు కూడా లేకుండా అవతలి లోకంలోనైనా, అంటిపెట్టుకునే వుంటై' అంటాడు ప్రాగ్.

"ఈ అవగుణాలన్నీ ఈ కర్మభూమి మీద పరిశీలింపబడి అంతమైతే తప్పితే, ఈ వ్యక్తిత్వం (పర్సనాలిటీ) మరో జన్మ ఎత్తినప్పుడు ఆ గుణాలతోనే జన్మిస్తుంది. ఈ గుణాలు వదిలితే గానీ దైవశక్తి ఆ మనిషి వంక చూపు సారించదు. ఈ గుణాలు ఇలాగే వుంచుకొని చేసే దేవుళ్ళ పూజలన్నీ ఆడంబరానికి, ఆత్మవంచనకు పనికొస్తాయే కానీ మరెందుకూ కొఱగావు. భూమిపై జీవించేటప్పుడు, మనిషి వీటిని వదిలించుకోడానికి ప్రయత్నించాలి గాని ఇతర విషయాలపై శ్రద్ధ పెంచుకుంటే మిగిలేదేముంది? బూడిద' అని వ్యాఖ్యానించాడు మిత్రశ్రీ.

'పరలోకంలోకి కొత్తగా ప్రవేశించే ఈ సూక్ష్మ శరీరి, దాని శీల సంపదను బట్టీ, భూలోకంలో దాని అనుభవాలను బట్టీ, అది ఏ లోకంలో వుంటానికి అర్హత నందుకున్నదో ఆ పొరలోకి చేరుతుంది; దాని శ్రద్ధాసక్తులు దేనిమీద వుంటాయో, ఆ గుణాలను లక్షణాలను ఆదరించే చోటుకు చేరుకుంటుంది అంటాడు జేమ్స్‌వాన్ ప్రాగ్.

పరలోకానికి వెళ్ళీవెళ్ళడంతోటే కాలమనేది ఒక పెద్ద భ్రమ అని ఈ మానవ శరీరం తెలుసుకుంటుంది. అయినప్పటికీ చనిపోయేనాటి వరకూ సంవత్సరాలు, నెలలు, వారాల పేరుగల దినాల మధ్య గడియారాల తోడ్పాటుతో కాలం గడిపిన కారణాన, అలవాటుకొద్దీ ఆ లోకంలో కూడా 'ఇవాళ ఏమి వారం?' అని ఆలోచిస్తుంది. భూలోకం లోని కాలమానాన్ని అనుసరించి అప్పటికి చనిపోయిన మూడు రోజులైనప్పటికీ, జీవాత్మ తాను శరీరం నుండి విడివడింది కొన్ని క్షణాల కిందటే ననుకుంటుంది. జీవాత్మలు సంచరించే ప్రదేశంలో సూర్యుడు నక్షత్రాలు కనుపించే దానిని బట్టికాక, అనుభవిస్తున్న దానిలో తానెంత పాలుపంచుకున్నదీ, అనే దానినిబట్టి కాల నిర్ణయం జరుగుతుంది అని తెలుసుకుంటుంది. జీవాత్మకు అక్షరాలా తనకు కావలసినంత కాలం లభ్యమవుతుంది. తనకు ఏమిచేయాలనిపిస్తున్నదో దానిని గురించి శ్రద్ధేకానీ, ఆ పనిచేయడానికి ఎంతసేపు పడ్తుంది అనే విషయం దానికంత ముఖ్యం కాదు" అంటాడు ప్రాగ్.

మిత్రశ్రీ వ్యాఖ్యానిస్తూ "భూలోకంలోనైనా ఆత్మకు ప్రాధాన్యమిచ్చి జీవించేవారు తమ శ్రద్ధను ఏ విషయమైతే చూరగొంటుందో, అందులో నిమగ్నమైపోతారు. ఆ సంగీతమో, సాహిత్యాభిలాషో, శాస్త్ర విజ్ఞాన పరిశోధనో, భగవత్ సంకీర్తనమో, దేనివైపు

ఆకర్షితులైతే, అందులోనే మునిగి తేలుతుంటారు. అలాంటి వేళలో కాలం గుర్తుకురాదు. 'ఇంత టైమ్ గడిచిపోయిందా?' అని ఆశ్చర్యపడతారు. ఇక్కడ భూలోకంలో నిత్య వ్యవహారాలు నిర్వహించేప్పుడు కాల నియయం పాటించకపోతే అంతా అస్తవ్యస్తమవుతుంది. కాబట్టి, మనిషి సృష్టించుకున్న కాల నియమం పాటించాల్సిందే; కానీ నిజానికి కాలమనేది లేదు."

"పరలోకంలోకి కొత్తగా వెళ్ళే ఈ అశరీరులకు మరొక విషయం కూడా ఒక పట్టాన అర్థంకాదు" అంటాడు ప్రాగ్. "ఆ లోకంలో ఇక్కడ వుండే భూమ్యాకర్షణశక్తి, శబ్దం, వేగం మొదలైనవి భూప్రపంచంలో వున్నట్లు వుండవు. ఈ సూక్ష్మ శరీరాలన్నీ ఒకేసారి అనేకచోట్ల కనిపించడం తరచూ జరుగుతుంటుంది. అవి ఒక చోటి నుంచి మరొక చోటికి వెళ్ళాలనే తలపు కలిగితే చాలు; మరుక్షణం అక్కడ వుంటై. ఈ సూక్ష్మ శరీరులు సంభాషించాల్సిన అవసరం లేదు. ఎదుటి సూక్ష్మ శరీరి యొక్క ఆలోచన ఇవతలి సూక్ష్మశరీరికి తెలుస్తూనే వుంటుంది. పరలోక వాసంలో ఏర్పడే అన్ని సన్నివేశాలు మన ఆలోచనలపైనే ఆధారపడి వుంటై.


పరలోకానికి వెళ్ళిన జీవాత్మలకి అన్ని విషయాలు తెలిసి వుంటై అనీ, ఇక్కడ తమ ఆప్తులైన భూలోకవాసులకు అవసరమైన సమాచారం అందజేయవచ్చు గదా అని ఇక్కడివారు భావిస్తారు. ఆ స్పిరిట్స్‌కి తమపై ప్రేమాభిమానాలుంటే, అన్ని సమస్యల పరిష్కారాలు తమకు ముందే అందజేయవచ్చుగదా అని అనుకుంటారు. కానీ ఇక్కడి వారిపై వాత్సల్యంవున్న కారణం చేతే, అశరీరులకు ఏదైనా ముందే తెలిసినా, ఇక్కడ వీరికి తెలియజేయకుండా వుంటారు అంటాడు ప్రాగ్.

తమకు తెలిసినా భూలోకంలోని తమ ఆప్తులకు తెలియజేయక పోవడానికి కారణ మేమంటే, ఈ భూలోకవాసులు స్వయంగా ఎదిగి తగిన ఆధ్యాత్మిక ప్రగతి సాధించడానికి అవసరమైన అనుభవాలన్నిటినీ పొంది, వాటిలో విజయమెలా సాధించాలనేది గ్రహించాల్సి వుంటుంది కాబట్టి, కొన్ని సన్నివేశాలనర్థం చేసుకొని పదును పెట్టుకోవలసిందే కానీ మరొకరిపై ఆధారపడి సులభోపాయాలు అమలు చేయరాదు. స్వయంగా కష్టించి నేర్చుకొన్నదే ఇంకా పైకి వెళ్ళే మార్గాన్ని సుగమం చేస్తుంది.

అదీకాక అన్ని జీవాత్మలకు సమస్తమైన సమాచారం అందుబాటులో వుండదు. జీవాత్మ ఎంత ఆధ్యాత్మికతను సాధించి వుంటుందో, ఆ స్థాయిని బట్టే దాని సమాచారం, అవగాహన వుంటుంది. ఆత్మ వికసించినకొద్దీ జీవితం ఏ రూపంలో ఆవిష్కరింపబడినా,

దానితో తనకున్న సంబంధాన్ని గ్రహిస్తుంది. అన్ని విషయాలను సాధ్యంచేయగలిగింది, అంతులేని అప్రతిహతమైన ప్రేమ ఒక్కటేననే విషయం తెలియనారంభిస్తుంది" అంటాడు ప్రాగ్.

మిత్రశ్రీ వ్యాఖ్యానిస్తూ "ఈ ప్రేమ లక్షణాన్ని శ్రీ రజనీష్ వర్ణిస్తూ 'ఆ ప్రేమ నొక సంబంధంగా అనుకోకూడదు. అది మనిషి సత్త యొక్క స్థితి. మనసు అవధులు దాటిన



తర్వాత దేనికీ ఏదీ వ్యతిరిక్తమైన రెండవది వుండదు. మనసుకావల అన్నీ ఒకటిగానే వుంటై. మనసులోన అన్నీ రెండుగా విభజించే వుంటాయి. అయితే నువ్వు మనసులోనే వుంటూ వుంటే, ఉన్నది ఉన్నట్లుగా వుండు, కపటంగా మాత్రం ప్రవర్తించకు. ఉన్నది ఉన్నట్లు నిజాయితీతో బ్రతికావంటే, ద్వంద్వాల మీద విసుగు జనిస్తుంది.

తనలోని 'అవగుణా'లనుకున్న వాటిని అణగతొక్కేసిన మనిషి, తానీ ద్వంద్వంలో చిక్కుకున్నానని ఎప్పటికీ గ్రహించలేడు. సంపూర్తిగా తన ఆగ్రహాన్ని గానీ, ప్రేమనుగానీ ఏనాడూ దర్శించడు. అందుచేత మనసును నిజంగా అనుభవించి వుండడు; సంపూర్తిగా అనుభవించలేదు కాబట్టి, అనుభవం ఎప్పుడూ అసంపూర్ణంగానే వుండిపోతుంది.

లోపల ఏది ఉన్నదో, అచ్చం అలాగే వుండు. వాస్తవంగా నీలో ఉన్నది ఏవి బాధలు తెస్తుందో వాటన్నిటినీ అనుభవించు. స్వభావరీత్యా వాస్తవంగా నీవెలాంటి వాడివో, అలానే వుండు, ఇక మనసులో ఉండజాలవు. కపటివై బ్రతికి చూడు; ఎన్ని జన్మలకైనా మనసును తప్పించుకు జీవించగలిగిన సామర్థ్యం నీకు కలగదు.

ఉన్నదానితో ఉంటే, కొంతకాలానికి విసుగు జనిస్తుంది. కానీ కపటంతో 'మంచి వాడి'గా నటిస్తూ వున్నావంటే, ఈ చెడ్డతనం బయటికి రాకుండా అణచి పెడుతుంటే విసుగు ఎట్లా జనించాలి? మనసుకూ శరీరానికీ చెందిన ఈ 'ప్రేమ' అనబడేది ఒక వ్యాధి అని తెలుసుకో. కాని అది ఎప్పుడూ నిన్ను ఆవరించి వుంటూనే వుంటుంది – దాని పనే అది. అది లేకపోతే లోకంలో నువ్వేమీ చేస్తున్నట్లుండదు. మొత్తం జీవితం వృథా అయిపోతున్నట్లుంటుంది. అందువల్ల ఈ ప్రేమ వ్యాధిలో తిరుగాడుతూనేవుంటే, జీవితం నిండుగా జీవిస్తున్నట్లు భ్రమ సాగుతుంది.

అసలు మనసే ఒక వ్యాధి; అందువల్ల మనసుకు చెందినదేదైనా ఒక వ్యాధే.

# అనుభవాన్ని పూర్తిగావించడం

మనసు అవధులు దాటి అవతలికి వెళ్తేనే, ద్వంద్వాతీతువైతేనే, మరో నిజమైన ప్రేమ దర్శనమిస్తుంది. జీసస్ దానికి ప్రేమ అని పేరుపెట్టాడు. బుద్ధుడు దానిని కరుణగా పేర్కొంటాడు. అందుచేత ఉన్నది ఉన్నట్లు నిజాయితీతో బ్రతుకుతూ, వాస్తవాన్ని కప్పి పుచ్చకుండా జీవించు, కపటాన్ని ఆశ్రయించవద్దు. నీలో నిజంగా వున్నదేదో గుర్తిస్తూ జీవిస్తే, దానిని దాటగలవు కానీ, కప్పిపుచ్చి అబద్ధంగా నటిస్తూ వుంటావనుకో, ఆ అబద్ధాన్ని దాటే ప్రశ్న ఎలా ఉదయిస్తుంది? అని అడుగుతాడు శ్రీ రజనీష్.

ఆత్మ తననితాను చూసుకున్నప్పుడు మిగతా సృష్టితో తనకొక అవిచ్ఛిన్నమైన సంబంధం వున్నదని తెలుసుకోడమేకాక తన ఆత్మలో వున్న జన్మల అనుభవం ఏరకమైనవి వున్నాయో అనే విషయం కూడా తెలుసుకుంటుంది అంటాడు జేమ్స్ వాన్ ప్రాగ్. ప్రతి అనుభవం యొక్క మంచీ చెడూ పరీక్షించి, ఏ అనుభవాలు తన ఆత్మవికాసానికి తోడ్పడినై, ఏవి తన ఆత్మను దెబ్బతీసినై అనేది కనుగొంటుంది. తన ఆత్మ నిర్వహించవలసిన కార్యాలను అది ఎంతవరకూ నిర్వహించింది, ఎంతవరకూ విఫలమయినదీ కనుక్కుంటుంది.

ఇలా బేరీజు వేసుకోడంలో ఒకరకమైన అనుభవసారం పూర్తిగా గ్రహించలేక పోయాననీ, మరోసారి ఇంకో జన్మలో ఆ అనుభవాన్ని మళ్ళీ పొందక తప్పదనీ తెలుసు కుంటుంది. ఇదే, కర్మానుభవమనే దానిని ప్రారంభింపజేస్తుంది. ఆ అనుభవంయొక్క సారం పూర్తిగా గ్రహిస్తే గానీ ఆధ్యాత్మిక వెలుగు కలగదు.

ఏదో తప్పుచేసినందువల్ల ఇదొక శిక్షగా వచ్చి పడిందని అనుకోరాదు. ఆ అనుభవం కేవలం ఆధ్యాత్మిక వెలుగు కలగడానికే. అలాంటి అనుభవాన్ని ఈసారి బాగా నిర్వహిస్తాను అని ఆత్మ అనుకుంటే, భూమిమీదికి తిరిగివచ్చి, ఆ అనుభవాన్నే పూర్వంకన్నా భిన్నంగా నిర్వహిస్తుంది. ఆధ్యాత్మిక జీవి తాను అమృత పుత్రుణ్ణి/పుత్రికనని తెలుసుకుంటుంది. పూర్వ జన్మల్లో తాను ఏరకమైన పరిస్థితులను సృష్టించుకున్నదీ ఇకముందు ఏ పరిస్థితులను కల్పించుకోనున్నదీ, దానికి తెలుస్తూనే వుంటుంది" అంటాడు ప్రాగ్.

మిత్రశ్రీ వ్యాఖ్యానిస్తూ, 'మనిషి తన ధ్యానావస్థలోనే, తన తపశ్చర్య ద్వారా, తనకు కలుగుతున్న అనుభవాలు, పూర్వ వాసనాబలంవల్ల తన మనస్సు ఎటు లాగుతున్నదీ తెలుసుకొని, మానసికంగా ఆ అనుభవాలనన్నిటినీ కొసదాకా పరీక్షగా చూచినట్లయితే, ఈ అనుభవ పరంపరను ఇప్పుడే ఈ జన్మలోనే అంతంచేసి ఇక్కడే పరిశుద్ధమయిన వాసనా రహితమైన పునర్జన్మ సాధించవచ్చు. అప్పుడిక విడిగా ఆ అనుభవాన్ని పూర్తి చేయడానికి భూమిమీద మరో జన్మ అవసరముండదు. కానీ అంతటి తెలివి మనుషుల కుంటుందా అనేది చర్చనీయాంశమే' అన్నాడు.

పరలోకంలో మానవ శరీరాలన్నీ, ఇక్కడ భూమిమీద ఎలా చరించాయో, అక్కడ కూడా అదే స్థాయిలో వ్యవహరిస్తూ తిరుగుతూ వుంటై. అక్కడ కొంత కాలం అలవాటయిన తర్వాత, బోధ సలిపెడి ఆత్మ ఈ సూక్ష్మ శరీరిని తారసిల్లి, తోటే పెట్టుకొని ఆధ్యాత్మిక జీవనంలో ఏ స్థాయిలో ఎలా సాగుతుంటుందో చూపించడం సంభవిస్తుంది. అప్పుడు కొత్తగా అక్కడికి వెళ్ళిన సూక్ష్మ శరీరి తాను ఏ స్థాయికి ఎదిగింది ఇంకా ఎంత ఎదిగే వీలున్నదీ, దానికి తెలిసివస్తుంది.

"మనిషి తనకున్న అలవాట్లను భూమిమీద జీవించేప్పుడు ఒక పట్టాన వదులుకోడు. ఇక్కడ ధ్యానావస్థలో వాటిని పరీక్షించి వదిలించుకోకపోతే, అవి ఆ జీవిని పరలోకానికి కూడా వెంబడిస్తై. ఇక్కడి తాగుడే అక్కడా కొనసాగుతుంది. ఇక్కడి పొగాకు పీల్చడం కానీ నమలడం కానీ, అక్కడా అనూస్యూతంగా సాగిపోతుంటై. తనకు అత్యంత ప్రియమైన ఏ వస్తువైనా, ఆలోచనా చూపంగా సిద్ధింపజేసుకొని, దానిని అనుభవిస్తూ ఆనందం పొందుతూ వుండటం జరుగుతుంది. వాటిమీద ఇష్టం తొలిగే వరకూ జీవాత్మ వాటిని స్వీకరిస్తూనే వుంటుంది" అంటాడు ప్రాగ్.

'కోరిక – అనుభవం' బరువుతో మనిషి ఆధ్యాత్మికంగా పురోగమించలేడు. అందువల్ల ఈ కోరికయొక్క భావాన్ని పరలోకంలోకి కూడా మోసుకుపోకుండా, దానిని ఇక్కడ భూమి మీదే అనుభవం ద్వారా కాక, 'తెలివితో' గమనించి 'పూర్తిచేసేయాలి' అన్నాడు మిత్రశ్రీ.

"పరలోకంలో కొన్ని జీవాత్మల జీవితం కొద్దికాలం మాత్రమే వుంటుంది. భౌతిక పరమైన కోర్కెలతో బాధపడేవారికి, అక్కడ ఆ లోకంలో చాలా కాలం వుండక తప్పదు. జీవాత్మ మరింత పైలోకాలకు వెళ్ళడానికి సిద్ధమైనప్పుడు. ఈ మధ్య లోకంలో ఒకరకమైన మరణాన్ని పొంది, ఇంకా పై లోకాలకి వెళ్తుంది" అంటాడు ప్రాగ్. ఒక జీవాత్మ పరలోకానికి

వెళ్ళి ఎంతకాలమయింది అనే విషయం ప్రాగ్‌కు, ఆ జీవాత్మల ఆలోచనా సరళి, వారు వాక్యాన్ని పలికే తీరునుబట్టి తెలుస్తుంటుంది. మాటవరుసకు, కొత్తగా అక్కడికి చేరిన జీవాత్మ తన ఆలోచనలు, అనుభూతులను, తొందర తొందరగా ఉద్వేగంతో తెలియజేస్తుంది. అంటే భూమిపై జీవించినప్పుడు ఎట్లా ఆలోచిస్తుందో, ఎట్లా తొందరపడుతుందో, ఆ లోకం నుండీ అదే పద్ధతిగా మాట్లాడుతుంది. కానీ ఆ లోకంలో ఎక్కువ కాలం జీవించిన జీవాత్మ మాట్లాడే తరహా వేరుగా ఉంటుంది. అలాంటి జీవాత్మ చెప్పదలచుకున్న విషయం నెమ్మదిగా, హుందాగా, చక్కగా మనందరికీ అర్థమయ్యేట్లు తెలియజేస్తుంది. తాను ప్రేమాదరాలు చూపించే వ్యక్తికి చెప్పే మాటలు అర్థవంతంగానూ, సమతూకంగానూ వుంటాయి. జీవాత్మ మరింత ఉన్నతమైన లోకానికి వెళ్ళే ముందు, సర్పం తన కుబుసం విడిచేసినట్లు, భూమిపై తన పాత జ్ఞాపకాలను, ఆలోచనా సరళిని విసర్జించనారంభిస్తుంది" అంటాడు ప్రాగ్. మిత్రశ్రీ వ్యాఖ్యానిస్తూ "భూమి మీద మనం దర్శించే మహనీయుల్లోనూ ఈ లక్షణాలను చూడచ్చు. కొద్దిపాటి అనుభవమున్న వారు ప్రతి చిన్న విషయానికి చాలా పెద్దగా ప్రతి క్రియా భావాలను ప్రకటిస్తారు. తొందరపాటు చర్యలు గైకొంటారు. అనుభవజ్ఞులైన వారు ఆచితూచి మాట్లాడుతారు. ఉత్తమ ఆధ్యాత్మికుడైతే స్పష్టంగా చక్కగా ఏరకమైన గందరగోళం లేకుండా వివరించి చెప్తాడు."

ఉన్నత లోకాల్లోని స్పిరిట్స్, ప్రతి గడ్డిపరక యొక్క ప్రాణశక్తినీ అనుభూతిపరంగా గ్రహిస్తై అనీ, చెట్టులోని ప్రతి ఆకుయొక్క ప్రాణశక్తినీ, ప్రతి పుష్పంయొక్క రేకులోని ప్రాణశక్తినీ, అలాగే అనుభూతి చెందుతాయనీ అంటాడు ప్రాగ్. అదేవిధంగా గానాన్ని వినడమే కాక, తమ యావత్తూ సత్తతోనూ, దాని అనుభూతిని పొందుతాయని అంటాడు ప్రాగ్.

"ఈ విషయాన్ని ఎవరైనా ఇట్టే నమ్మవచ్చు" అన్నాడు మిత్రశ్రీ. ఇక్కడ భూమిమీద సున్నితమైన మనస్సుగల మనుష్యులు కూడా, పువ్వుల్ని గనక ఎవరైనా నిర్దాక్షిణ్యంగా కోసి పడేస్తుంటే ఎంత బాధపడతారో మనమందరం ఎరిగి వున్నాం. సంగీతాన్ని కేవలం చెవులతో కాక, తమ హృదయాలతో తమ నరనరాలతో, మొత్తం సత్తతో విని అందులో లీనమైపోయే రసజ్ఞులను చూచే వుంటాం. అంటే, భూమి మీదనే వారి 'స్పిరిట్' ఆ ఆత్మానందాన్ని అనుభవించిందని, ఉన్నత లోకాల్లోని స్పిరిట్స్ అన్నీ ఇలానే అనుభవిస్తాయని నమ్మడానికి చిక్కేమున్నది?"

"పై లోకాల్లోని ప్రతి మూల పదార్థమూ అమిత శుభ్రంగా వుంటుంది. అన్ని స్పిరిట్స్ యొక్క కాంతి, దివ్యకాంతిలో మిళితమై వుంటుంది; అన్నీ కూడా ఈ కాంతితో ఒకటై వుంటై. అందువల్లే ఈ ఉన్నత లోకాల్లో చాలా కాలంబట్టి ఉండిపోయిన స్పిరిట్స్ నుండి, వారికి సంబంధించిన భూలోక యాత్రలోని విషయాలు సక్రమంగా వివరంగా తెలుసుకోడం చాలా కష్టం. ఆ స్పిరిట్స్ ఈ భూలోక సంబంధిత చైతన్యానికి చాలా ఎడమయిపోయి వుంటాయి" అంటాడు ప్రాగ్.

మిత్రశ్రీ వ్యాఖ్యానిస్తూ "భూలోకంలో మానవాకారంలో సంచరించి వెళ్ళిన మహా జ్ఞానులందరూ తరచూ మరందరికీ గుర్తుచేసేదేమంటే, జ్ఞాపకాల బరువును దించేయ మంటారు. అంటే మనకు కలిగిన విలువలేని అనుభవాలను చాలా గొప్పవిగా పరిగణించి వాటిని గురించి తలుచుకుంటూ, రచన చేతైతే రాసి పడేస్తూ, ప్రతి సభావేదికలోనూ వాటన్నిటినీ అపురూపంగా వివరిస్తూ కాలక్షేపం చేయడం మంచిది కాదంటారు. వాటి వల్ల చెప్పేవారికి గానీ వినేవారికి గానీ ఒరిగేదేమీ వుండదు. కేవలం వినోదం, ఒకింత మానసికోల్లాసం మాత్రమే.

అలాకాకుండా మన ఆత్మకథ చెప్పగలిగితే చెప్పాలి. ఆత్మకథ అంటే, చదివిన స్కూలు చేసిన ఉద్యోగం, వైరాలు, కోర్టు కేసులు కాదు; భగవత్ స్ఫురణ ఎప్పుడు కలిగిందీ, ఏ పరిస్థితుల్లో సంభవించిందీ, మనలోని అరిషడ్వర్గాలను ఎప్పుడు గుర్తించాము, ఒక్కొక్కటీ ఎలా వదిలించుకున్నాము, వాటిల్లో కొన్ని సులభంగా వదిలి, మరి కొన్ని వదలకుండా ఎలా బాధించినై, అందుకై మనమేరకంగా కృషి చేశాము తత్ఫలితంగా మనకు లభించిన శాంతి ఎలాంటిది? ఇదీ ఆత్మకథ అంటే. బాహ్య జీవన పరిస్థితుల్లో మార్పు ఏదైనా ఆధ్యాత్మిక జీవనాన్ని ఒక మలుపుతిప్పి వుంటే, అది ఉదహరించదగిందే.

మనిషి పుట్టింది ఈ ఆత్మవిచారం కోసమే. లేకపోతే ఈ మానవ జన్మకు అర్థం లేదు. హాయిగా ఏదో జంతువుగా జన్మిస్తే, ఈ మానసిక సంఘర్షణ లేకుండా సుఖంగా బ్రతకవచ్చు; ఆత్మవిచార మెరుగనివారు, ఏదో ఒక దశలో ఈ మనస్సులోని సంఘర్షణ తట్టుకోలేక, ఏ చెట్టుగానో, జంతువుగానో పుట్టుంటే ఎంతో సుఖంగా వుండి వుండేదని అనుకుంటారు.

కాబట్టి శుష్కమైన ఈ జ్ఞాపకాల స్థూల అనుభవాల బరువును దింపేయమని, ఆత్మను తేలికగా చేసుకోమని దివ్యమైన కాంతితో నింపుకోమని ఈ జ్ఞానులు చెప్తున్నారంటే,

ఇక్కడ భూమిమీదనే తర్ఫీదు కమ్మంటున్నారు; డ్రెస్ రిహార్సల్స్ ఇక్కడ చేయనేర్చుకో మంటున్నారు. ఈ భూలోక యాత్రలోనే ఆ నేర్పుగలిగినదంతా నేరిస్తే, శాశ్వత సంతోష దాయకంగా వుంటుంది. లేకపోతే అక్కడా మధ్య లోకాల్లో వుంటూ కిందా మీదా పడుతూ నేర్చుకుంటూ వుండాల్సిందే."

మూర్ఛావస్థ (Trance) లోని ప్రాగ్‌కు పరలోకంలో ఒక వింత అనుభవం కలిగింది. దానిని గురించి చెప్తూ, "ఈ స్పిరిట్ లోకంలో జంతువులుంటాయా అనే తలపు నాకు కలిగింది. ఆ తలపు నన్ను ఓ కొండ ప్రాంతానికి తీసుకువెళ్ళింది. అక్కడ ఆశ్చర్యం గొలిపే విధంగా పులులూ, సింహాలూ, ఇక్కడ, భూలోకంలో అవి ఆహారంగా స్వీకరించే జంతువులూ ఒకచోట కనిపించినై."

మిత్రశ్రీ వ్యాఖ్యానిస్తూ, "కణ్వాశ్రమంలో పులులూ మేకలూ ఒకచోట పడుకొని వుండేవి అన్నప్పుడు, మనమందరమూ అలాంటి వృత్తాంతాలు విని నవ్వుకుంటాం. మన కావ్యాలు పురాణాలు ఏమైనా చెప్తాయ్, నమ్మమంటాయ్; అదీ వాటి లక్షణం, అని తిరస్కరిస్తాం."

ఇక్కడి మన భూలోకం పరలోకానికి, మచ్చలతో కూడిన ప్రతిబింబం అనే మాట మహానుభావులంటూనే వున్నారు. అంటే ఇక్కడి అద్దం నిర్మలమైతే ఇంతకన్నా చక్కగా ప్రతిబింబిస్తుంది. ఇక్కడ అనేక రకాల కల్మషం, స్వార్థం, కాపట్యం, క్రౌర్యం ప్రబలంగా వున్నందువల్ల ఎక్కడైనా ఒకచోట పరిశుద్ధులైనవారు నివసించేచోట, పైన నెలకొని వున్న పరిస్థితి కింద యథాతథంగా ప్రతిబింబిస్తుంది. భూతలంమీద శకుంతల తిరుగాడిన ఆశ్రమ మటువంటిది. ఆ కాస్త పరిమిత స్థలంలో, అనగా ఆయన ఆశ్రమ ప్రాంతంలో మాత్రం, పులి మేక ఒకచోట పరుండే అవకాశముంది" అన్నాడు మిత్రశ్రీ.

ప్రాగ్, ఆ జంతువులు కలిసుండడం చూచి దిగ్భ్రాంతి చెందినప్పుడు, ఆ జంతువుల ఆలోచనలు అతనికి 'వినిపించినై.' మనుష్యుల ఆలోచనలు అర్థమైనట్లే ఆ మృగాల ఆలోచనలూ అర్థమైనై. ప్రకృతిలో సహజంగా వున్నట్లు కనిపించే 'హింస' అనేది సామరస్యంతో నిండిన ఈ వాతావరణంలో ఉండే వీలులేదు. అంటున్నై. ఎలా బ్రతకాలి, ఏమి తిని బ్రతకాలి అనేది వాటి చైతన్యంలో భాగం కాదు' అని ప్రాగ్‌కు అర్థమయింది.

స్పిరిట్, తల్లి గర్భంలో ప్రవేశించే తరుణంలో తాను పరలోకాల్లో గడిపిన ఆనంద మయ జీవితం, కాంతివంతమైన జీవితం, మెల్లగా అంతర్ధానమై, వాటి స్థానంలో ఓ

విధమైన బరువు, మైత్రీభావ శూన్యత ప్రవేశించ నారంభిస్తే. ఈ భౌతిక ప్రపంచంలోకి వచ్చిపడే వేళకు, కొంత గందరగోళం ఏర్పడుతుంది. తాను ఇంతకాలం ఉండి వచ్చిన లోకంలో ఒక గొప్ప నియతి పాటింపబడేది; తానిప్పుడు ప్రవేశిస్తున్న లోకంలో క్రమ రాహిత్యం దర్శనమిస్తున్నది. ఆ లోకంలో 'తాను' దానికి చెందిన భావం బలంగా వుండేది. ఇక్కడ ఈ భూలోకంలో అభద్రతా భావం, ఒంటరితనం అలముకోడానికి సిద్ధంగా వున్నాయి. ఆ లోకంలో అన్నీ కాంతివంతమే, అంతా వెలుగే. ఇక్కడ ఈ లోకంలో సూర్యుడొక్కడే వెలుగునివ్వగలవాడు" అంటాడు ప్రాగ్.

మిత్రశ్రీ వ్యాఖ్య: ఆ లోకంలో వున్న క్రమాన్ని గురించి ప్రాగ్ చెప్పినప్పుడు ఇక్కడ ఈ లోకంలోనైనా, ఆ మహాశక్తి ప్రకృతి ద్వారా ప్రవేశపెట్టిన నియతిని గుర్తించండి. ఏదైనా విపరీత పరిస్థితి ఎప్పుడైనా ఏర్పడి ప్రకృతి బీభత్సం సంభవించవచ్చు కానీ, సాధారణంగా ప్రకృతి తన నియమానుసారంగా తాను సాగిపోతూ వుంటుంది. మనిషి కలుగజేసుకున్న చోటే క్రమరాహిత్యం ప్రారంభమవుతుంది. మనిషి తోటి జీవరాశి మొత్తానికి హాని చేయగలడు. ప్రకృతి వినాశానికే దారితీయగల పనులు తలపెట్టగలడు."

"జీవి, తన జీవితావసరాలను ఈ భూలోకంలో ఏదో విధంగా తీర్చుకుంటుంది. కానీ తన పూర్వజన్మల కర్మనంతా మోసుకొచ్చిన ఈ మనిషి ఎలా జీవిస్తాడు, తోటి మానవులతో ఎలాంటి సంబంధం నెఱపుతాడు, ఎలా ప్రేమిస్తాడు, మనసు ఎలాంటి గాయాలకు గురవుతుంది, అప్పుడు ఆ గాయాలను తగిన అవగాహనతో ఎలా చికిత్స చేసుకుంటాడు, ఆ విధంగా ఎలా ఎదుగుతాడు అనేది ముఖ్యం" అంటాడు జేమ్స్ వాన్ ప్రాగ్. మిత్రశ్రీ వ్యాఖ్యానిస్తూ 'స్పిరిట్స్ భూమిమీదికి రాక, చేయగలిగింది లేదు. పరిణతి ఇక్కడే సాధించాల్సి వుంటుంది. ఇతర లోకాల్లో నేర్వడానికి వీల్లేని గుణపాఠాలు భూమి మీద నేర్వక తప్పదు.

ఇందుకై మనిషికిచ్చిన శరీరావయవాలతో కర్మనాచరించడానికి ఇదే సదవకాశం. ప్రారబ్ధాన్ని అనుభవిస్తూ దహించేయడానికి ఇదే మహదవకాశం. పుట్టకమునుపు వున్న ఈ సదాలోచన పుట్టగానే మరిచిపోవడం జరుగుతుంది. దీనిని గుర్తుకుతెచ్చుకోగలిగితే ప్రతి మనిషీ తన జీవితంలో ధర్మాచరణకే ప్రాధాన్యమిస్తాడు. భోగభాగ్యాలుండకూడదని కాదు, ఉన్నతోద్యోగాలు చేయరాదని కాదు, కీర్తిమంతమైన పనులు నిర్వహించ కూడదని కాదు. కానీ ప్రతి ఒక్కరికీ కూడా ధర్మాచరణ తర్వాతనే" అన్నాడు మిత్రశ్రీ.

# మానవ స్వభావం

**1987** సంవత్సరంలో అమెరికాలోని పెనిసల్‌వేనియా నగరంలో ఓ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్ ఏజెంటు రెండువేల డాలర్లు ఆఫీసు డబ్బు అపహరించి, ఆ డబ్బుతో అట్లాంటిక్ సిటీలో జూదమాడి ఆ డబ్బు పోగొట్టుకున్నాడు. ధనం అపహరించిన నేరానికి అతణ్ణి వెంటనే ఉద్యోగం నుండి తీసేశారు. అతడు కోర్టులో అప్పీలు చేశాడు. అతడి తరఫున లాయర్ వాదిస్తూ తన కక్షిదారు జూదమాడటం అతడి మానసిక వైకల్యం అనీ, మరొకరి డబ్బుతోనైనా సరే జూదమాడకుండా ఉండలేని ఆ ఏజంటు యొక్క 'అత్యవసర చిత్తవైకల్య' సమస్యను కోర్టువారు అర్థంచేసుకోవాలనీ వాదించగా, ఫెడరల్ చట్టాల కింద అంగవైకల్యం వున్న వారికి రక్షణ కల్పించవలసి వుంది కాబట్టి, అతణ్ణి ఉద్యోగం నుండి తొలగించ రాదని, తిరిగి నియమించ వలసిందని కోర్టు తీర్పు ఇచ్చింది.

1978 సంవత్సరంలో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్‌కో నగరంలో, సూపర్‌వైజర్ డాన్ వైట్, మేయర్ జారిజమోస్కోన్‌ను, తోటి సూపర్‌వైజరు హార్వే మిల్క్‌ను హత్యచేశాడు. వైట్ కేసును విచారణ చేసే సమయంలో అతడి లాయర్ ఓ విచిత్రమైన వాదన వినిపించాడు. డాన్ వైట్ చాలాకాలంగా బజారు తిండి (జంక్‌ఫుడ్) తినిన కారణం చేత అతడి విచక్షణ శక్తి నశించిందని, అందువలన ఆ ఇద్దరినీ హత్య చేయడం జరిగిందని కోర్టువారికి విన్నవించాడు. జూరీ సభ్యులు సానుభూతి ప్రకటించారు. ఆ కారణంగా డాన్ వైట్‌కు కోర్టు ఆరేళ్ళ జైలుశిక్ష మాత్రమే విధించింది.

1980లో న్యూయార్క్ సిటీలో ఒక మనిషి ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతో, ఒక సబ్‌వేట్రైన్ వస్తూ వుంటే, దాని ముందుకు దూకాడు. చావలేదు కానీ, అధికంగా గాయపడి, అవయవాలన్నీ నుగ్గునుగ్గయినై. ఈ మనిషి లాయర్ల ప్రోద్బలంతో రైల్వే అధికారులపై దావా వేశాడు. రైలు సకాలంలో ఆగకపోయినందుకు, ఆ విధంగా అతడికి అతి తీవ్రమైన హాని జరిగిందని, కోర్టువారు రైల్వే అధికారులను 6,50,000 డాలర్లు నష్టపరిహారంగా అతడికి ఇప్పించారు.

'మానవతావాదం' ఈ దశకు చేరుకుంటే తప్పూ ఒప్పూ అనే వాటికి తేడా వుండదు; దోషి లేడు, అపరాధి లేడు, నేరస్థుడుండడు. అందరూ విధి ప్రేరితులే.

కానీ మానవుడు విధివశాత్తూ బలవంతుడు గానూ లేక బలహీనునిగానూ, భాగ్య వంతుని గానూ, భాగ్యహీనుని గానూ, జ్ఞానిగానూ లేక బుద్ధిహీనుడిగానూ జన్మించవచ్చు. కానీ నీతిమంతుడిగానూ అవినీతిపరునిగనూ గుణవంతునిగానూ గుణహీనునిగానూ పుట్టడానికి విధి నిర్ణయమే కారణమంటే, ఇక నీతి శాస్త్రాలెందుకు, నైతిక నియమావళులు ఎందుకు? మనిషి, తనకుతాను ఈ విషయంలో – ముఖ్యంగా ఈ విషయంలో – 'నిస్సహాయుడు, ఇది ఇంతేనంటే', ఇక మానవ ప్రయత్నం అనే దానికి మన జీవితాల్లో ఉన్న స్థానమేమిటి?

'తన దుష్ప్రవర్తనకు మరొకరు కారణమని వారిని నిందించడం, పిల్లవాడి హక్కు అయితే అయివుండవచ్చు. పెద్దవాళ్ళు గనక తమ చర్యలకు మరెవరో, మరేదో బాధ్యత వహించాల్సి వుంటుందని అనడం, వివేక శూన్యుని లక్షణం' అంటాడు నాజీ కాన్‌సెన్ ట్రేషన్ కాంపుల్లో జీవితం గడిపిన బ్రూనో మిట్టర్‌హీమ్.

కాన్‌సెన్‌ట్రేషన్ క్యాంపులో జీవించిన విక్టర్ ఫ్రాంకెల్ : 'మనుషులకు ఏనాడైనా ఎట్టి పరిస్థితులలోనైనా కొంత స్వేచ్ఛ వుంటుంది. ఆ క్యాంపు గుడిసెల్లో జీవిస్తున్న వా వద్దకు వచ్చివెళ్ళే తోటి ఖైదీలు కొందరు, మాతో ఊరట గొలిపే మాటలు మాట్లాడుతూ, ఒక్కోసారి తమ వద్దనున్న ఆఖరి రొట్టెముక్క కూడా ఇచ్చి వెళ్ళడం చూస్తుండేవాళ్ళం. వారి సంఖ్య స్వల్పమే అవచ్చుగాక. కానీ ఈ ప్రవర్తన మానవ స్వభావంలో ఒక విషయాన్ని రుజువు చేస్తుంది. మనిషి నుండి ఎన్నయినా తీసివేయవచ్చు కానీ, ఒకరకమైన స్వేచ్ఛను మాత్రం ఎవరూ తీసేయలేరు; పరిస్థితు లెటువంటివైనా, తన పంథా తాను ఎన్నుకునే స్వేచ్ఛను మాత్రం ఎవరూ తొలగించలేరు" అని రాస్తాడు.

# నిరాధార జీవితం

**జ**పనీస్ సాధువు టెంకో-సాన్ భిక్షాటనతో పొట్టపోసుకునేవాడు. మనిషి నిజంగా స్వతంత్రంగా బ్రతకాలంటే, మనిషికి అత్యవసరమైన కనీస సదుపాయాలు – తిండి బట్ట వసతి అడగానికి సంకోచించ కూడదంటాడు. అచ్చమైన స్వాతంత్ర్యమంటే ఎవ్వరినీ ఏదీ అడగకూడదని మనమనుకోడం కద్దు. కానీ మన కనీసావసరాల కోసం అడిగే స్థితి దాపురిస్తే తప్పితే, మనల్ని గురించి మనకేదో కొలమానమున్నదనీ, 'నేనిలాంటివాణ్ణి, అలాంటివాణ్ణి, తిండి బట్టకైతే మాత్రం నేనడిగేనా?' అనే అభిమానంతో బాధపడుతున్నానన్నమాట.

తిండి బట్ట వసతి మాత్రమే మన కనీసావసరాలు కాదు; వీటిలో మరొకటి కూడా వున్నది. మన అంతరంగంలోని గాఢమైన నివేదన, ప్రార్థనను కనుగొని, దానిని దృఢతరం చేయడానికి ఏమికావాలో దానికై అడుక్కోక తప్పదు. మన నిజమైన అంతర్గత ప్రార్థన ఏమిటో కనుగొనడానికి జాజెన్ లేక జెన్ మనకు దోవ చూపిస్తుంది. మన కనీసావసరాన్ని గుర్తించిన తర్వాత, దానికై అడుక్కునే విధానం మనకు జాజెన్ నేర్పిస్తుంది; అడుక్కోడం ఆ జాజెన్‌నే అడుక్కుంటాం.

ఇలా మన భిక్షుక మనస్సును మనం మేల్కొల్పితే తప్పితే, మన అసలు స్వభావాన్ని మేల్కొల్పజాలము అన్నాడు టెంకోసాన్.

డోగెన్ అనే జెన్ సన్యాసి, "నీ ఆహార వస్త్ర సదుపాయాలకు ముందుగా ఏర్పాట్లు గావించుకోకు. ఉన్న తిండి యావత్తూ అయిపోతే, అప్పుడు అడుక్కోడానికి బయలుదేరు. ఎవరెవర్ని అడుక్కోవాలి అని ముందే లెక్క వేసుకొని ప్రణాళికాబద్ధంగా వారి వద్దకు వెళ్ళి అడుక్కోడం అంటే, ఆహార ధాన్యాలు నిలువ వేసుకున్నట్లే అవుతుంది. అప్పుడు బౌద్ధ నియమాలను ఉల్లంఘించిన వాడవవుతావు. ఆకాశంలోని మబ్బులాగ శాశ్వత చిరునామా లేకుండా బ్రతుకు" అంటూ నిరాధార జీవితం జీవించమంటాడు.

కేవల దైవాధార జీవితమే సర్వస్వతంత్ర జీవితమేమో! అందుకు శ్రీ జిడ్డు కృష్ణమూర్తి గారు ఎవరితోనో మాట్లాడుతూ, చటుక్కున "భిక్షువుగా జీవించడానికి గొప్ప తెలివి కావాలండీ"

(It requires great intelligence to be a baggar, sir) అని వూరుకున్నాడు. భాష్యం చెప్పడానికి మనమెవరం? గౌతమ బుద్ధుడు తాను భిక్షువుగా బ్రతుకుతూ, తన అనుయాయులకు భిక్షువు పేరెందుకు పెట్టాడో, పరమ శివుడు ఆదిభిక్షువుగా ఎందుకు అవతరించాడో, అతడే తన భర్త కావాలని హిమ తనయ ఎందుకంత గాఢంగా కోరుకున్నదో, అన్నీ ఆలోచించదగిన విషయాలు.

'జెన్ సాధన మొదలెట్టినప్పుడు కొండలు నదులు తోడేళ్ళు సాధారణ కొండలు, నదులు తోడేళ్ళుగానే వుంటాయి. బౌద్ధం అనుగ్రహించిన కళ్ళతో ప్రపంచాన్ని చూడ నేర్చినప్పుడు, కొండలు, నదులు తోడేళ్ళు సాధారణమైనవిగా తోచవు. అవన్నీ అసాధారణంగా కనిపిస్తై. కానీ జెన్ సాధన పూర్తిచేసిన తర్వాత కొండలు నదులు తోడేళ్ళు కేవలం కొండలు నదులు తోడేళ్ళే; కానీ సాధారణమైనవీ కాదు, అసాధారణమైనవీ కాదు.'

(మొదట్లో చూసిన ఈ రూపాలు అన్నీ స్వతస్సిద్ధంగా ఇలా వున్న వస్తువులు అని మన మెదడు నిర్ణయిస్తుంది. సాధన మొదలెట్టినప్పుడు, ఇదంతా సృష్టి వైచిత్ర్యం అనీ, ఆ మహాశక్తి ఎన్ని రూపాలు ధరించిందోననే ఆశ్చర్యం, అద్భుతం పెనవేసుకుంటై. అప్పుడివన్నీ అసాధారణమైనవని తెలిసి వస్తుంది. సాధన సంపూర్ణమయ్యేసరికి సృష్టి కర్త చేదోడువాదోడుగా తయారవుతావు కాబట్టి, వీటి వెనకాలనున్న అద్భుత శక్తి తెలిసినప్పటికీ, సామాన్య నేత్రాలకు కనిపించినట్లే, మళ్ళీ చూస్తావు. ఇవి నువ్వే సృష్టించావు; వీటిలో నీవే వున్నావు; అనేది తెలుస్తుంటుంది.

'ఈ జెన్ వాక్యాలకు నేను నాకు తెలిసిన అర్థం చెప్పాను. మరెన్నో అర్థాలుంటై. నువ్వు జెన్ చేసి చూడు. నీకెలా అర్థమవుతుందో నీకే తెలుస్తుంది. నీకు చెప్పడానికి నేనెవర్ని? నువ్వే నాకు చెప్పగలిగి వుంటావు' అన్నాడు మిత్రశ్రీ.)

# పలక తుడిచెయ్

బహాఉద్దీన్‌షా అనే సూఫీ గురువు వద్దకు వచ్చిన ఓ పెద్దమనిషి ఆయనతో ఇలా అన్నాడు: "ప్రారంభంలో ఆ గురువనీ, ఈ గురువనీ అనేక మందిని అనుసరించాను. అటు పిమ్మట ఏవేవో, ఎన్నెన్నో గ్రంథాలు పఠించాను. మీరెవరో మీ బోధ ఏమిటో నాకు తెలియక పోయినప్పటికీ, నా గతానుభవం యావత్తూ నన్ను మీ వద్దకు తీసుకురావడానికి, మీ శిష్యునిగా రూపొందడానికే ఉపయోగపడిందని భావిస్తున్నాను" అన్నాడు.

"మీరు పూర్వం నేర్చినదేదీ ఇక్కడ అక్కఱకు రాదు. మీరు మాతో కలిసి వుండాలను కుంటే గతాన్ని గురించిన మీ అతిశయం యావత్తూ విసర్జించాల్సి వుంటుంది" అని బహ ఉద్దీన్ సమాధాన మిచ్చాడు.

"ఆహాహా, మహాద్భుతంగా సెలవిచ్చారు. నేను పూర్వం సాధించిన విద్యను ఏ ఒక్క గురువూ కూడా ఇంతక్రితం ఈ విధంగా తిరస్కరించలేదు. మీరీ విధంగా ఆ మొత్తాన్ని, ఒక్క ముక్కతో కొట్టిపారేశారంటేనే, మీరెంతటి మహాత్ములో ఎంతటి ఉన్నతమైన గురువరేణ్యులో తెలుస్తూ వున్నది" అన్నాడు ఆ వచ్చిన పెద్దమనిషి.

"ఈ భావన కూడా యోగ్యమైనది కాదు, నే చెప్పేదేమిటో తెలుసుకోకుండా, నన్ను నువ్వు అర్థంచేసుకోకుండానే, నీవీ విధమైన ఉత్సాహోద్రేకంలో నన్ను గురువుగా స్వీకరిస్తున్నావంటే, ఇతరుల ఔన్నత్యాన్ని గుర్తించగలశక్తి నీలో ఏదో ఉన్నదని భ్రమపడు తున్నావన్న మాట; నీలో శక్తిలేకపోయినప్పటికీ ఉన్నదని నిన్ను నీవు అభినందించుకుంటు న్నట్లున్నది. ఇదీ అతిశయమే సుమా" అన్నాడు షా.

"భేష్, భేష్, బహాఉద్దీన్‌షా అదే గురువు ఔన్నత్యాన్ని గుర్తించగలిగాను, కాబట్టి నాలో ఏదో కొంత ప్రతిభ ఉన్నదని మీరు అంగీకరిస్తున్నట్లే కనిపిస్తుంది. చాలా సంతోషం" అని తనదే పైచేయి అయిందన్నట్లు భుజాలెగరేసుకుంటూ వెళ్ళిపోయాడు ఆ పెద్దమనిషి.

తాను గతంలో సేకరించిన ఏ అనుభవమూ, ఏ జ్ఞానమూ, సత్యాన్వేషణలో ఎందుకూ అక్కఱకురావనే విషయం సాధకుడికి తెలియడం ఎంతైనా అవసరం. ఇది

తెలిసిననాడు, సాధకుడిలో ఎంతైనా వినయం నెలకొంటుంది. అలాంటివాడే గురువు వద్ద విద్య నేర్వగలడు. పలక పూర్తిగా చెరిపెయ్యకుండా, కొత్తగా దానిమీద ఏది లిఖించినా పూర్వం రాసిన రాతల్లో కలిసిపోతుంది, అని సూఫీల బోధ.

★ ★ ★ ★

అడవిలో నడుస్తున్న ఒక వేటగాడు, ఒకచోట 'రాళ్ళు తినడం నిషేధం' అని ఓ బోర్డు కట్టి వుండడం చూశాడు. ఈ విచిత్రమైన నిషేధమేమిటా, అని ఆశ్చర్యపోతూ ఆ బోర్డు పక్కనే ఉన్న కాలిబాట ననుసరించి నడిచినప్పుడు, ఒక కొండ గుహవద్దకు వచ్చాడు. అక్కడొక సూఫీ వేదాంతి కూర్చొని ఉన్నాడు.

ఆ సూఫీ, ఈ వేటగానితో, "రాళ్ళు తినడాన్ని నిషేధించటం అనేది నువ్వెప్పుడూ విని వుండవు. వాటిని తిని, అరిగించుకోలేమని మనుషులందరికీ తెలుసు కాబట్టి ఎవరూ తినరు; అందువల్ల రాళ్ళు తినడాన్ని నిషేధించాల్సిన అవసరంలేదు. మనిషి పొట్టకు రాళ్ళెట్లా ప్రమాదకరమో, అదే విధంగా మనిషి మనసుకు ఈర్ష్యాసూయలు, మదమాత్సర్యాలు, పలు దుర్వ్యసనాలు అంతే ప్రమాదకరమని మనిషికి తెలుసా? నిషేధిస్తేనే గానీ వాటిని మానేది లేదు అన్నట్లుగా ప్రవర్తిస్తూ, 'మా పరిస్థితి ఇంత దీనంగా ఉన్నదే' అని విచారించి ఏమి లాభం?

రాళ్ళెట్లానైతే ఎవరూ ఆహార పదార్థంగా స్వీకరించరో, అదే విధంగా మానవాళిని బాధిస్తున్న ఎన్నో అలవాట్లను తొలగించుకుంటే గానీ, తమ దైన్యాన్నుండి బయటపడరు" అన్నాడు.

★ ★ ★ ★

"నేర్చుకోదలిచిన వానికి, భగవంతుడి సృష్టిలో, ప్రతి ఒక్కటీ పనికి వస్తుంది, పనికి రానిదంటూ లేదు" అన్నాడు ఉత్కళరావు. ఇది అతిశయోక్తిగా భావించిన మా బృందంలో ఒకరు 'అయితే రైలు నుండి ఏమి నేర్చుకోవచ్చునో చెప్పండి అన్నాడు.

ఒక్క నిమిషం ఆలస్యమైతే, ప్రయత్నమంతా నిష్ఫలమైనట్లేనని తెలిసి వస్తుంది.

టెలిగ్రామ్ నుండి? 'ప్రతి ఒక్క పదానికి మూల్యం చెల్లించక తప్పదని'.

టెలిఫోన్ నుండి? 'మనమిక్కడ పలికే పలుకులు, ఆవల అక్కడ వినిపిస్తున్నవని' అన్నాడు ఉత్కళరావు.

# మనిషి దేనియెడల మరణించాలి?

**1972** డిసెంబరు రెండో పక్షంలో జిడ్డు కృష్ణమూర్తిగారిని చూడడానికి, అప్పుడు ఆయన తాత్కాలికంగా నివసిస్తున్న రిషీవ్యాలీకి వెళ్ళాను. ఆ కాలంలో కాంగ్రెసు నాయకుడు శ్రీ చక్రవర్తి రాజగోపాలాచారిగారు మద్రాసులో చనిపోయారు. న్యూస్ పేపర్లు ప్రముఖంగా వార్తను ప్రచురించినై. రిషీవ్యాలీలోని కొందరు టీచర్లు తమకు పెద్దగా సంబంధం లేకపోయినా, ఆ వార్తను చూచి భావోద్వేగానికి గురయ్యారు. ఈ వార్త తమ కెంత ఉద్రేకం కలిగించిందో, కృష్ణమూర్తిగారికి కూడా అంతే కలిగిస్తుందని, ఆయన తన గదిలో నుండి బయటకు రాగానే అతి వేగంగా ఆయనకు ఈ వార్తనందించారు. ఆయన సరేసని, అక్కడి పూలచెట్లవద్దకు వెళ్ళాడు. ఆయన పెద్దగా స్పందించనందుకు వారికొకింత ఆశాభంగం కలిగింది.

ఈ ఘట్టం ఎంతో నయం. 1935లో ఐదవ జార్జి మహారాజు లండన్‌లో మరణించాడన్న వార్త వెలువడింది. మనదేశంలోని బ్రిటిష్ పాలకవర్గం, అధికార గణాలు పెను విచారంలో మునిగిపోవడం సహజమే. వారి జాతీయ గీతమే 'గాడ్ సేవ్ ది కింగ్' – పరమాత్ముడు మా రాజును రక్షించుగాక – అని ఆశిస్తూ వుంటుంది. కానీ రమణాశ్రమం లోని నలుగురైదుగురు ఆశ్రమవాసులను కూడా ఈ వార్త ఉద్రిక్తపరచింది. ఉద్రిక్త వార్తల కోసం మనమందరం ఎదురుచూస్తుంటా మనుకుంటాను. వాళ్ళు తమ ఉద్రిక్తతను శ్రీ రమణులవారి వద్దకు మోసుకు వెళ్ళాలా అనే ఆలోచన సరిగా చేయకుండా వారితో కూడా ఈ మాట ప్రస్తావించారు.

"ఎవర్ని కోల్పోయినా, ఎవరు చనిపోయినా అది మీకేమి సంబంధం? మీరు 'చనిపోయి', మిమ్మల్ని మీరు కోల్పోయి ప్రేమతో ఏకమవండి" అని సలహా ఇచ్చాడు శ్రీ రమణులవారు.

లోక సంబంధం అతిగా పెంచుకున్న వారికి ప్రతి సంఘటనా తరతమ భేదాలతో ఉద్రేక పూరితంగానే కనిపిస్తుంది. ఈ ఉద్రిక్తతను పెంచి పోషించడం, న్యూస్ పేపర్లు

విధిగా చేస్తూనే వుంటుంటై. కానీ అంతర్లోకాన్ని ఎడతెగకుండా వీక్షిస్తుండేవారు, అక్కడ సంభవించే ఆశ్చర్యకరమైన అద్భుత విషయాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. వెలుపలి ప్రపంచంలో జరిగే ఘట్టాలు వారి దృష్టికి రావని కాదు. కానీ వాటి యెడల, మనం స్పందించినట్లుగా వారు భావోద్వేగం ప్రదర్శించరు. తమ సమక్షంలో ఎవరికైనా ఏదైనా నిజమైన ఇక్కట్లు కలిగినప్పుడు, వారి స్పందన సంపూర్ణంగా వుంటుంది. అక్కడి పని తీరిపోగానే ఇక ఆ విషయాన్ని గురించి ఆలోచించరు.

వారి ఉద్దేశం ప్రపంచంలోని ఘటనలకు మనిషి స్పందించాల్సిన తీరు ఎలా వుండాలంటే 'రాజుకైనా మరణం తప్పదు, మనకైనా ఇవాళో రేపో ఇది తప్పనిసరే. కానీ అసలీ మరణమంటే ఏమిటి? మనిషి ఆశలు, ఆశయాలు అనంతమైన ఆకాంక్షలు, అన్నిటికీ తెరదించడమే కదా? మరి వాటి యెడల చనిపోకుండా, వాటినలాగే కొనసాగిస్తూ, మరణం అనే పేరుతో ఉత్త శరీరాన్ని మాత్రం వదిలేసినందువల్ల, అసలు 'శరీరధారి' ఏమవుతాడు? ఎక్కడికి వెళ్తాడు? ఆ ఆశలన్నీ తీరడానికి మళ్ళీ భూమిపై ప్రవేశించక తప్పదు కదా? ఈసారి రాజుకాకపోవచ్చు, భిక్షుకుడవచ్చు, నిజానికి ఇప్పుడే తన ఆశలు ఆలోచనలు, ఆకాంక్షల యెడల చనిపోగలిగితే, దేహంవున్నా ఒకటే, లేకపోయినా ఒకటే. జీవన్ముక్తుడై శక్తిసంపన్నుడై సంపూర్ణ స్వేచ్ఛతో బ్రతికే వీలుంది. అదే ధన్య జీవితం.

కాబట్టి ఆధ్యాత్మిక నిలయమైన రమణాశ్రమంలో, ఆయన అనుచరులు నేర్వాల్సింది ఉన్నపళంగా ఈ మనసు యెడల ఎలా మృతి చెందాలి? మనసును హృదయంతో ఎలా లయం చేయాలి? ఈ తరుణోపాయాన్ని విస్మరించి, వారు చచ్చిపోయారు, వీరు చచ్చి పోయారు అనే ప్రస్తావనతో కాలక్షేపం చేసుకుంటూ వుంటే, మిగతా లోకుల లాగా, లోక వ్యవహారంలో చిక్కుకున్నట్లే. శ్రీ రమణులు చెప్పిన 'నేనెవరు?' అనేది కనుక్కోకుండా మరణిస్తే, ఈ జీవితం వ్యర్థం. అష్టావక్ర గీతలో 'అహంకర్తేహం మానమహా కృష్ణాహిదం శీతః/నాహంకర్తేతి, విశ్వాసామృతం పీత్వాసుఖీభవ' తేట తెనుగులో అర్థం, 'అహం మృతితో సమానం. అహమున్నవాడు మృతి చెందినవాడే. అధ్యాత్మికత కలవాడే ప్రాణమున్నవాడు. నా కర్తృత్వం ఏమీలేదన్న విశ్వామృతం త్రాగినవాడే సజీవంగా వున్నాడు.' 'ఈ లెక్కన మనమందరం మృతజీవులమే' అని తేల్చాడు మిత్రశ్రీ.

# ధ్యానమంటే?



'మనసులో ఉదయించే ప్రశ్నలకు సమాధానాలను ఆశించడంవల్ల లాభం లేదని బుద్ధుడు గ్రహించాడు' అంటాడు ఖోగ్యామ్‌ట్రుంపా అనే జెన్ మాస్టర్. 'ఇందుకై తాను పడే ఆరాటం, సలిపే పోరాటం నడుమ సంభవించిన విరామ సమయాల్లోనే, అంతర్ వీక్షణ సంభవించేదని కనుక్కున్నాడు. మనసు ఏ సమాధానం కొఱకై వెంపరలాడకుండా ఉన్నప్పుడే, తనలో మేల్కొని వున్న ఒక స్వస్థతతో కూడిన గుణం అంతరిస్తున్నదని గ్రహించాడు. అందువల్ల ధ్యానించడంలో వుండే ప్రధాన లక్షణం, మనసును గమనించడమే కానీ, దానిని ఇలా మార్చాలని ప్రయత్నించడం కాదు.

ధ్యానమంటే అదేదో ఒక మూర్ఛపోయిన స్థితి వంటిదని కొందరి అభిప్రాయం. మరికొందరి దృష్టిలో అది మానసిక వ్యాయామ శిక్షణా కార్యక్రమం. కానీ ధ్యానమంటే ఇవేవీ కాదు; నరాల దౌర్బల్యంవల్ల ఏర్పడిన మానసిక స్థితిని సరిచేసి, స్వస్థత చేకూర్చడం అనేది, ధ్యానంలో ఒక భాగమైనప్పటికీ, ధ్యానం యొక్క ఉద్దేశం మాత్రం అది కాదు. ధ్యానంలో ప్రధానాంశం, 'ఉన్నదాని'తో జోక్యం చేసుకోకుండా, ప్రవాహాన్ని గమనిస్తూ సాగనివ్వడం. అది ఏ నమూనా ననుసరించి సాగిపోతున్నదో, అదే వేగంతో అదే శక్తితో దానితో సాగుతూ ఉండడం. వాటితో జతగా గమనిస్తూ సాగుతూ వుంటే, వాటితో మనకున్న సంబంధం తెలియ నారంభిస్తుంది. మనం గమనించే అంశాలను మనమనుకున్నట్లు మలచాలి అని గానీ, ఈ విధంగా పరిపక్వత చెందించాలని గానీ, ఆలోచన లేకుండా, వాటిని ఉన్నవి ఉన్నట్లుగా గమనిస్తూ సాగుతూ వుంటే, అవి వాటంతట అవే మారుతూ వస్తై.

నిజమైన ధ్యానంలో, ఆలోచనలు గానీ ఆవేశాలు గానీ రేకెత్తించడమనేది వుండదు; సంభవిస్తున్న ఆలోచనలను, ఆవేశాలను అణగతొక్కాలని వుండదు. వాటిని ఉన్నవి

ఉన్నట్లుగా స్పష్టంగా తేటతెల్లంగా చూడడం మాత్రమే జరుగుతుంటుంది. అప్పుడు అవి మనకు ఏ విధమైన వినోదం కలగజేయవు. తత్కారణంగా ఎవర్నీ ఎటూ దారి మళ్ళించవు. ఆ విధంగా వాటి ద్వారా కోల్పోయే మన శక్తి యావత్తూ మన నిక్షేపశక్తిగా మారి, అహంకార శూన్యమైన మన చర్యలకు వినియోగపడుతుంటుంది.

ఆలోచనలు, ఆవేశాలు ఆగిపోయినప్పుడు, వస్తుగత ప్రపంచమొకటి కనిపిస్తుంటుంది. వాటికేవో పేర్లు పెట్టి వాటిని గురించి ఏవో సిద్ధాంతాలు చేస్తుంటాము. ఇలా ఘనీభవించిన గట్టి ప్రపంచాన్ని తలుచుకున్నప్పుడు, మనం కూడా దాని లాగానే గట్టిగా దృఢంగా వున్నామనీ, అలాగే కొనసాగుతామనీ అనుకుంటాం. ప్రపంచంయొక్క ఉనికి కనిపిస్తున్నది కాబట్టి, దానిని చేస్తున్న 'నేను' కూడా ఉన్నట్లేననుకుంటాం.

కానీ ఈ తలపులన్నీ కూడా మనిషి మెదడు నుండి జనించినవేనని గ్రహిస్తే, విముక్తికై విడిగా పోరాడనక్కరలేదు. పోరాటం తొలగిపోవడమే స్వేచ్ఛ. మనసులో ఇప్పుడున్న పదార్థాల్ని (అనగా ఆలోచనలు, ఆవేశాలు, సిద్ధాంతాలు) అహంయొక్క బలీయమైన కాంక్షల అభివ్యక్తీకరణకై కాకుండా, ధ్యానం ద్వారా స్వస్థ చిత్తం, జ్ఞానోదయం యొక్క అభివ్యక్తీకరణకు గాను వినియోగిస్తే అది ఆధ్యాత్మిక మార్గంపై నడిచినట్లవుతుంది.

★ ★ ★ ★

## తుది కోరిక

నా సమాధి కట్టే వేళ నే కోరేదల్లా, సజీవంగా కట్టవద్దని మాత్రమే.

చెస్టర్ ఫీల్డ్.

# అహం వదలాలంటే

ఛో గ్యామ్‌ట్రుంగ్‌పాను ఎవరో అడిగాడు. "మీరు కొద్దో గొప్పో ఎవర్ని అనుసరి స్తున్నారు?"

ఛో : సన్నివేశాలు నా గురువుయొక్క కంఠస్వరం, పరిస్థితులే నా గురువు అక్కడ ప్రవేశించినట్లు భావిస్తాను.

మరెవరో ఛోగ్యామ్‌ను ఇలా అడిగారు: 'మీ మార్గాన మిమ్మల్ని నడిపించే మార్గదర్శి ఎవరు?' అందుకు ఛోగ్యామ్: 'నిజానికి ప్రత్యేకంగా ఏ మార్గదర్శకత్వమూ లేదనుకుంటాను. ఆ మాటకొస్తే ఎవరైనా మీకు మార్గదర్శకత్వం వహిస్తున్నట్లుంటే, మీరు బాహ్యమైన దానిపై ఆధారపడుతున్నారు కాబట్టి, అది శంకించదగినదే అవుతుంది. మీలో మీరు సంపూర్తిగా నెలకొంటే, అదే మీకు మార్గదర్శి అవుతుంది. అయితే ఈ మార్గదర్శి మీ ముందున నడుస్తూ మీకు బాటను చూపిస్తున్నట్లు భావించరాదు. మీరు ఎవరి తోక పట్టుకొని ఈదక్కర లేదు; మీపాటికి మీ ప్రయాణం మీరు సాగిస్తూ వుంటారు. మరో విధంగా చెప్పాలంటే ఈ మార్గదర్శి మీకు బాటను దర్శింపజేస్తూ ముందున నడుస్తున్నాడు అనుకోనక్కరలేదు; అతడు మీతోబాటే, తోడుతోడుగా జతగా నడుస్తూ వుంటాడు.

ప్రశ్న : బుద్ధుడికి జ్ఞానోదయమయిన తదుపరి, తన బోధను పదిమందికీ అందించ డానికి కొద్దిపాటి అహం ఆయనలో మిగిలి ఉండెనంటారా?

ఛో : బోధ అనేది దానంతట అదే సంభవించింది. బోధించాలని గానీ, బోధించ రాదనీ గానీ ఆయన తలపోయలేదు. ఆయన ఏడువారాలపాటు ఓ చెట్టు నీడకింద కూర్చున్నాడు, ఒక నదీతీరం మీద నడుస్తూ వుండిపోయాడు. అటుపైన ఎవరో తటస్థ పడ్డారు; అంతటితో మాట్లాడ నారంభించాడు. ఇందులో ఆయన ఎంపిక చేసుకున్నదంటూ ఏమీ లేదు. మనిషిగా సర్వులకూ చెప్పడానికి అతడక్కడ సిద్ధంగా వున్నాడు. అప్పుడక్కడ ఓ పరిస్థితి ఉదయించింది; అంతటితో బోధ సంభవించింది. దానిని బుద్ధుని 'చర్య'గా పరిగణిస్తాం.

ప్రశ్న : మనుష్యులు తమ ఆహాన్ని ఎందుకంత జాగ్రత్తగా రక్షించుకుంటూ వుంటారు? దానిని వదిలేయడానికి ఎందుకంత సంకోచం?

ఛో : మనుష్యులకు ఖాళీగా వుండే శూన్యాన్ని చూస్తే తగని భయం, తోడు ఎవరూ లేకపోతారేమోననీ. తోడుగా వుండే నీడ కూడా మాయమవుతుందనీ భయం – ఎవరితోనూ దేనితోనూ ఏ సంబంధమూ లేకుండా వుండే అనుభవం మనుషులకు భీతావహంగా కనిపిస్తుంటుంది. నిజానికి ఆ అనుభవం భయంకరమైనది కాకపోయినప్పటికీ దానిని తలపోసిన వానికి అది మహా భయంకరంగా అనిపిస్తుంది. సాధారణంగా ఖాళీగా వుండే ప్రదేశాన్ని చూచినప్పుడు కలిగే భయం; కాళ్ళూని నిలవడానికి ఎక్కడా గట్టి నేల కనిపించదనీ, ఒక పేరు ఊరు కల మనిషిగా మనకుండే వ్యక్తిత్వం, అస్తిత్వం కోల్పోతామనే భయం ఆవరిస్తుంది. ఇది మనకు తగని బెదురు కలగజేస్తుంది.

అహం ఆధ్యాత్మికత సాధించడానికి ప్రయత్నిస్తూ వుంటుంది; అంటే మనిషి తన దహన సంస్కారాలను స్వయంగా చూడనభిలషించినట్లే అని చెప్పవచ్చు.

అహాన్ని గురించి వారి నుండీ వీరి నుండీ విని వుంటుంది కాబట్టి అహంయొక్క బాహ్య లక్షణాలు ఇవీ అని తెలుసుకొని, ఆ బాహ్య లక్షణాలను వదిలించుకుంటుంది గానీ, అసలు అహం మాత్రం వదిలిపోదు. అది కరిగిపోవాలంటే అహాన్ని మనిషి తనకు తాను ప్రత్యక్షంగా దర్శించాలి. అహంయొక్క నిజస్వరూపం పెనగులాట.

మనిషి తననితాను సంపూర్ణంగా అర్థంచేసుకోవలసిన అవసరాన్ని గుర్తు చేస్తూ ఛోగ్యామ్ ఇలా అంటాడు. 'పదాలను, సిద్ధాంతపరంగా చేసే భావనలను దాటి, నీవు నిజంగా ఎవరో అందులోకి నువ్వు ప్రవేశించాలి, లోనికి, అట్టడుగు లోతుల్లోకి వెళ్ళాలి. కేవలం మొదట్లో కలిగిన క్షణిక దృష్టి చాలుననుకోడానికి వీలులేదు; అక్కడున్న వాటినన్నిటినీ సవివరంగా చూడాలి – ఆ చూచేటప్పుడు మనసులో ఓ రకమైన తీర్మానాలు, తీర్పులు చేయరాదు. పదాలతో, భావాలతో కూడిన ఏ వర్ణనా పనికిరాదు. తన ఎడల తాను సంపూర్తిగా తలుపులు తెరుచుకుంటే, ప్రపంచం యెడల సంపూర్తిగా తెరుచుకున్నట్లే.

# హృదయ సౌందర్యం

'మిస్ ఇండియా' అందాల పోటీల ప్రస్తావన చేస్తూ, హాస్యపరంగానే అయినప్పటికీ, నీతిస్ఫోరకంగా, రాబర్ట్ క్లెమెంట్స్ అనే రచయిత ఇలా అంటాడు. భగవంతుడే గనక ఈ అందాల పోటీకి న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తే ఎలా వుంటుందా అనే ఆలోచన కలిగింది. ఈసారి పోటీకి ఆయనొక్కడే నిర్ణేత.

ఓ ఖాళీ కుర్చీని చూపించి, అక్కడి పోటీ నిర్వాహకురాలు, 'లేడీస్ అండ్ జెంటిల్ మెన్, మన అందాల పోటీకి సాక్షాత్తూ ఆ భగవంతుడే న్యాయ నిర్ణేతగా వ్యవహరించడం మన అదృష్టంగా భావించాలి. కానీ ఆయన్ని చూడగలిగి లేము' అని ప్రారంభించింది. కొద్దిపాటి వలువలతో సరిపుచ్చుకున్న భామలు సైడ్ స్టేజ్ నుండి గమనిస్తున్నారు.

"విశ్వసించండి. ఆయన ఆ సీటులో వున్నాడు" అంటున్నది నిర్వాహకురాలు. భామ లందరూ వయ్యారంగా తమ వొంపుసొంపులను ఆకర్షణీయంగా ప్రదర్శిస్తూ స్టేజి మీద తిరుగాడుతున్నారు.

"వారందరికీ తమ తమ దుస్తులు ధరించమని చెప్పండి" అన్నాడు భగవంతుడు నిర్వాహకురాలితో.

అతి వయ్యారాలకు పోతున్న ఒక యువతి, "ఏం ఎందుకుట!" అని ఎదురు ప్రశ్న వేసింది.

"ఎందుకంటే, వారు గుడ్డలు వేసుకున్నా, నేను వారి అందాలను చూడగలిగే వున్నాను" అన్నాడు భగవంతుడు.

"నా వొంపుల సంగతేమిటి?" అని గునిసింది ఒక భామ.

"నా వక్షస్థలం సంగతి?" అన్నది మరో యవ్వని.

"నా సుందరమైన పొడుగుకాళ్ళు" అన్నది మరో వనిత.

"మీ హృదయం?" అని ప్రశ్నించాడు భగవంతుడు.

"ఏమిటీ, భగవంతుడే మంటున్నాడు?" అని అక్కడి అందాల పోటీ యువతీ మణులందరూ ఒక్కసారిగా అడిగారు.

"ఆయన మీ హృదయం వంక చూస్తున్నాడట" అని చెప్పింది నిర్వాహకురాలు.

"కానీ ఈ పోటీ నిర్వహణలో అది భాగం కాదుగదండీ?" అని ముక్త కంఠంతో అందరు లలనలు అభ్యంతరం పలికారు.

"ఎవరామాట అన్నది?" అని భగవంతుడి కంఠస్వరం.

"నిర్ణేతలు."

"నిర్ణేతను నేనే. మరి నేనేమో చక్కని హృదయంకన్నా ఆకర్షణీయమైనదీ అలంకరించేదీ మరొకటి లేదని భావిస్తున్నాను. అటు ఆ ద్వారంగుండా వెళ్ళిపోతున్న ఆ ఆడమనిషిని ఇలా రమ్మనండి" అన్నాడు భగవంతుడు.

"అదేమిటండీ? ఆ అమ్మాయి ఈ హాలు ఊడ్చే మనిషి."

"అయితే?" కనిపించని కంఠస్వరం.

"ఆవిడ దుస్తులు చూడండి" అని ఒకరూ, 'ఆవిడ వొంటి ఛాయ చూడండి' అని మరొకరూ, 'ఆవిడ కేశాలు' అని ఇంకొకరు, తలా ఒక వ్యాఖ్య.

"ఒక్కమారు ఆవిడ హృదయం వంక చూడండి. అమ్మాయి, నువ్వు ఇలా స్టేజి మీదికి రా. నిన్న రాత్రి నీవెక్కడ వున్నావో వీరందరికీ చెప్పు' అంటున్నాడు భగవంతుడు.

"మా పొరుగింటివారి తల్లితో" అన్నది ఆ అమ్మాయి.

"భగవాన్, ఇప్పటికింకా ప్రశ్నలు సమాధానాల ఘట్టం రాలేదు" అని అభ్యంతరాలు.

"మీ పొరుగింటివారి తల్లితో నీవేమి చేస్తున్నావమ్మా?" అని భగవత్ స్వరం.

"వారి తల్లి హాస్పిటల్‌లో వున్నది. అక్కడ ఆవిడ బాగోగులు చూస్తున్న పెద్ద కూతుర్ని ఇంటికి పంపి, నేను హస్పిటల్‌లో వుండిపోయాను."

"నిన్న రాత్రి నువ్వు నిద్రించావా అమ్మా?"

"లేదు భగవాన్. ముసిలావిడ రాత్రంగా భయపడుతున్నది, బాధపడుతున్నది. ఆవిడ చేయి పుచ్చుకొని ఓదారుస్తూ వుండిపోయాను."

"హాస్పిటల్ నుండి నేరుగా ఇక్కడి వచ్చేశావ్?" 'అవును, భగవాన్'.

'నిద్ర మైకంగా లేదా అమ్మా?'

"సంతోషంగా వుంది భగవాన్, హాస్పిటల్ నుడి నేను బయలుదేరుతున్న వేళ, ముసిలావిడ హాయిగా పసిపిల్లలాగా నిద్రపోతున్నది."

"ఈవిడ హృదయం దివ్యంగా వెలిగిపోతున్నది" అంటూ భగవంతుడు లేచి వెళ్ళిపోయాడు.

"ఈ పనిమనిషే విజేత" అంటూ నిర్వాహకురాలు, బంగారు కిరీటం, ఆవిడ తలమీద పెట్టింది. విజేత హృదయకాంతులు చూస్తూ, సభాసదులు చప్పట్లు చరిచారు.

# ఛోనీ దీర్ఘ నిద్ర

మిత్రశ్రీ ఒక కథ చెప్పడం మొదలెట్టి "ఈ కథలోని ప్రథమ భాగం చాలా మందికి తెలిసే వుంటుంది. కానీ తర్వాతి భాగం, దానిపై వ్యాఖ్య జాగ్రత్తగా వినదగింది" అన్నాడు.

ఛోనీ అనే రబ్బై (యూదుల మత గురువు) నడుస్తూ నడుస్తూ ఓ మనిషి ఒక మొక్క నాటుతూ వుండడం చూశాడు. "ఈ చెట్టు కాయలు కాచి ఫలాలివ్వడం ఏనాటికి జరుగుతుందంటావ్?" అని అతణ్ణి అడిగాడు.

"డెబ్భై ఏళ్ళు" అన్నాడా మనిషి.

"నువ్వింకో డెబ్భై ఏళ్ళు బ్రతుకుతా ననుకుంటున్నావా? (అతడి ఉద్దేశం, 'నీకు దక్కని ఫలితం, ఎవరికో దక్కేటువంటి దానిపై నీ కాలాన్ని ఎందుకు వృథాపరచుకుంటావ్?' అని.)

కానీ ఆ మనిషి, 'నేనీ లోకంలోకి వచ్చేటప్పటికి, ఇలాంటి చెట్లు ఎన్నో వున్నై. వాటి ఫలాలను నేను ఆరగించాను. నా పూర్వీకులు 'నా కోసం' నాటినట్లే, నేనిప్పుడు నా సంతతి కోసం నాటుతున్నాను' అన్నాడు.

ఈ మాట విని, ఛోనీ అక్కడే కూచొని ఒక రొట్టె తిన్నాడు. నిద్ర మత్తు ప్రవేశించింది. ఆ నిద్ర సుదీర్ఘకాలం కొనసాగింది. కాలక్రమేణా అతడి శరీరం చుట్టూ బండరాళ్ళు పేరు కున్నై. బాహ్య ప్రపంచానికి కనిపించకుండా, ఛోనీ ఆ విధంగా డెబ్భై ఏళ్ళు నిద్రపోయాడు. నిద్ర లేచి కళ్ళు తుడుచుకొని, ఆ బండల చాటు నుండి బయటికి వచ్చేసరికి, తాను నిద్ర పోకముందు మొక్క నాటుతున్న మనిషే, పెరిగిన చెట్టు నుండి ఫలాలు కోసుకొని తింటున్నట్లు కనిపించింది.

ఛోనీ అతడితో 'ఆ మొక్కను నాటిన వాడివి నువ్వేనా?' అని అడిగాడు.

'కాదు. నేతతడి మనవణ్ణి' అన్నాడా వ్యక్తి.

"అయితే నేను డెబ్భై ఏళ్ళపాటు నిద్రపోయానన్నమాట." అనుకుంటూ, అక్కడి నుండి నడిచి వెళ్ళిపోయాడు ఛోనీ. ఒకప్పటి తన ఇంటివద్దకు వెళ్ళి, 'ఛోనీ కొడుకు బ్రతికి వున్నాడా?' అని అడిగాడు.

"అతడి కొడుకైతే చనిపోయాడు. కానీ ఛోనీ మనవడున్నాడు' అన్నారు, అక్కడి వాళ్ళు.

"నేను ఛోనీని" అన్నాడు వాళ్ళతో. వాళ్ళు అతడి మాట నమ్మలేదు.

ఛోనీ అక్కడి నుండి బయలుదేరి పూర్వం తాను తరచూ వెళ్ళే అధ్యయన కేంద్రానికి వెళ్ళాడు. అక్కడ ఒక రబ్బై, "ఈ బోధలు ఆనాడు ఛోనీ కాలంలోని వారికి ఎంత స్పష్టంగా వుండేవో ఈనాటికీ మనకూ అంత బాగానూ అర్థమవుతున్నై" అని అన్నాడు. కారణమేమిటంటే, ఛోనీ కాలంలో అప్పటి రబ్బైల మధ్య బోధను గురించి వాద వివాదాలుండగా, ఛోనీ వచ్చి వాటిని విమర్శగా అర్థంచేసి చెప్తే అందరూ అంగీకరించేవారట.

వారితో ఛోనీ, "నేను ఛోనీని" అన్నాడు. వారు నమ్మలేదు. అందుచేత అతడికి చూపవలసిన గౌరవం చూపలేదు. ఇతడెవరో పిచ్చివాడనుకున్నారు. ఛోనీ హృదయం చాలా బాధపడ్డది. 'నన్ను కరుణించమని' ప్రభువును వేడుకున్నాడు, మరణించాడు.

చిరకాలం జీవించాలనే కోరిక ఛోనీకి లేకపోయినా, అనుద్దేశ పూర్వకంగానే అలా జీవించడం జరిగింది. అదే విధంగా ఎవరో ఒకరు, అనుకోకుండా అలా దీర్ఘకాలం జీవించే ప్రమాదమున్నది. తోటివారు, మిత్రులు సహచరులు వారి వారి కాలం తీరినప్పుడు, రాలిపోతారు. ఒక్కొక్క ఆప్తమిత్రుణ్ణి కోల్పోయినప్పుడు, తనలోని ఓ భాగం మరణించి నట్లుంటుంది.

ఒక్క మిత్రుడే మిగులుతాడు, అయితే మనకు మధ్యవయస్సు ప్రవేశించే లోపలే ఆ మిత్రునికై వేగిర పడాలి. అతడు శాశ్వతుడు కాబట్టి నువ్వెంకాలం బ్రతికినా తోటే వుంటాడు. ఆ మిత్రుడికి వృద్ధాప్యం లేదు; ఎప్పుడూ త్రిదశుడిగానే కనిపిస్తాడు. రూప సహితంగానూ, రూప రహితంగానూ చెలిమిచేయవచ్చు. ఆ మహామిత్రుణ్ణి అలా ఆదరిస్తే, బాహ్యంగా కనిపించే రూపాలన్నింటిలోనూ అతడు దర్శనమిస్తాడు. సచేతనమైన వాటిలోనే కాదు, అచేతనమైన వాటిలోనూ, ఆ మహాచైతన్యం విలసిల్లుతూనే వుంటుంది. తిరిగే జంతువులో కనిపిస్తుంది, ఎగిరే పక్షిలో, పెరిగే చెట్టులో, పూచే పుష్పాల్లో, పక్వానికొస్తున్న పండులో, ఎదురుగావున్న కొండలో, ఆ పక్కని లోయలో, ప్రవహించే నీటిలో, ఉప్పొంగే సముద్రంలో ఎటుచూసినా అదే, అదే. ఇవన్నీ నీ మిత్రులే. నువ్వు ధర్మబద్ధంగా జీవించి గతిస్తే, నీకోసం ఓ కన్నీటి చుక్క రాల్చేది, చివరికివే.

# మన కర్మలకు మనమే బాధ్యులం

"ఈ ప్రపంచంలో జన్మించాలని నేను కోరుకోలేదు. అయినా జన్మించడం జరిగింది. ధర్మాధర్మాల పేరిట నా బ్రతుకు తీరుమీద తీర్పుచెప్పి నన్నీ ప్రపంచలోనూ శిక్షిస్తున్నారు. మరణానంతరం ఆ లోకానికి పోతావు. ఈ లోకానికి పోతావు, అక్కడ చిత్రవధలననుభవిస్తావు అని భయపెడుతూనూ వున్నారు. అసలు నన్ను పుట్టించమని నేనడిగానా? నాకివ్వబడిన స్వభావంతో నేను మెలిగితే అది తప్పంటూ ఇది తప్పంటూ ఈ శిక్షలేమిటి?" అని వాదించేవారున్నారు.

ఇలాంటి వారందరినీ దృష్టిలో వుంచుకొని పద్ధెనిమిదవ శతాబ్దపు యూదు రబ్బై యూకోవ్‌కాన్జ్ ఈ కథ చెప్తాడు. 'ఒకప్పుడు ఓ భార్యాభర్తా సంవత్సరాలపాటు ప్రశాంతంగా కాపురం చేస్తుండేవాడు. భర్త కురూపి, అందుకుతోడు బధిరుడు, భార్య గయ్యాళేకాక, పుట్టుగుడ్డి కూడాను. అంధురాలై నందువల్ల భర్త కురూపితనాన్ని ఎన్నడూ చూడనే లేదు; భర్త చెవిడివాడైనందువల్ల భార్య గయ్యాళిమాటలు, నిందలు వినిపించేవే కాదు. కాపురం సుఖంగా సాగిపోతూ వచ్చింది.

ఒక రోజున, ఎవరో ఒక గొప్ప వైద్యుడున్నాడనీ, అతడు మనిషి రుగ్మతనేదైనా అద్భుతంగా నయం చేయగలడనీ తెలుసుకొని, దంపతులిద్దరూ ఆయన వద్దకు వెళ్ళి తమ వినికిడి లోపం, చూపు లేకపోవడం గురించి చెప్పి, నయంచేసే పక్షంలో ఇంత ధనం చెల్లించుకుంటామని విన్న వించుకున్నారు.

వైద్యుడు నిజంగానే భార్యకు చూపువచ్చేట్టు, భర్తవు చెవులు వినగలిగేట్లు చేశాడు. అయితే వారి వారి అవయవ లోపాలు తొలగిపోవడం వారికి అశాంతిని, దుఃఖాన్ని తెచ్చి పెట్టినై. భర్త ఇంతటి కురూపి అని భార్య తెలుసుకోడం, భార్య తనని ఎంత కఠినంగా నిందిస్తున్నదో భర్త కనుక్కోడం జరిగింది. వైద్యుడు తనకివ్వవలసిన మొత్తం వారికి తెలియ జేసినప్పుడు, తమకు నయమవడం కారణంగా దుఃఖమే మిగిలిందని, డబ్బు ఇవ్వ నిరాక రించారు. పైపెచ్చు తమ దాంపత్య సంతోషం భగ్నం చేసినందుకు ఆయనే తమకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు.

వీరిని ఒప్పించి డబ్బు ఇప్పించుకోలేనని గ్రహించిన వైద్యుడు, నిట్టూర్చి 'నావల్ల మీకు దుఃఖమే మిగిలిందని మీరనుకుంటే, ఇంతకుమునుపు మీరనుభవించిన సంతోషమే వాంఛనీయమని అనిపిస్తే యథాపూర్వ స్థితిని సిద్ధింపజేయగలను. భార్యని అంధురాలు గానూ, భర్తని బధిరునిగానూ చేస్తాను. మళ్ళీ మీ సంతోషం మీరు అనుభవించవచ్చు'నన్నాడు.

కానీ వారందుకు ఒప్పుకోలేదు. అప్పుడు వైద్యుడు 'మీరింతగా వ్యతిరేకిస్తున్నారంటే, ఆ పాత స్థితికన్నా ఈ స్థితే మీకు ఎక్కువ అనుకూలమని అర్థంచేసుకోవాలి. అంటే నా ద్వారా మీ అవయవ లోపాలు తొలగించడం మీకు అభిలషణీయంగా కనిపిస్తున్నదన్నమాట. అయ్యే పక్షంలో, మీరు నాకివ్వల్సిన ధనమివ్వడం న్యాయమేకదా?' అన్నాడు.


"దీనిలోని నీతిని అర్థంచేసుకోండి" అంటాడు యూకోవ్‌కాన్జ్. "మనుషులు తాము ఆచరించే చర్యలకు తమకే బాధ్యత లేదని అనడం పొరపాటు. తమ చర్యలకు తాము బాధ్యత స్వీకరించక తప్పదు. విధి విధాత ఒకసారి మనిషికి ప్రాణంపోసి భూమిమీద జీవించడానికి అవకాశమిచ్చిన తర్వాత ఆ ప్రాణం తమంతట తాము వదులుకోడానికి ఒల్లక, దానినంత ప్రియంగా భావిస్తున్నట్లైతే, బ్రతికే హక్కుకై మూల్యం చెల్లించక తప్పదు. ఇకపోతే ఈ మూల్యం ఎలా చెల్లించాలయా అంటే, జీవితంలో తాము ఆచరించే కర్మలకు భగవంతుడి సమక్షంలో, వాటికి బాధ్యత స్వీకరించడం ద్వారా మూల్యాన్ని చెల్లించాలి."

# భగవంతుడిపై భారం

'కొందరు నిష్క్రియాపరులు' భగవంతుడి మీద భారం వేశామని చేతులు ముడుచుకు కూచుంటారు. వారి భారాన్ని భగవతుడు స్వీకరిస్తాడనే దాఖలా ఎక్కడా లేదు' అని ప్రారంభించాడు మిత్రశ్రీ.

"ఓ మారు ఓ పడవ సరంగు, యాభైమంది ప్రయాణీకుల్ని తన పడవలో నదిని దాటిస్తున్నాడు. పడవ నది మధ్యనున్నప్పుడు అకస్మాత్తుగా కారుమేఘాలు కమ్మి జడివాన కురియ నారంభించింది. బలమైన ఈదురుగాలులు వీయనారంభించినై. పెద్ద పెద్ద అలల మధ్య చిక్కుకొని పడవ తలక్రిందులు కానున్నదనే భీతి కలిగింది. ఆ తాకిడికి పడవ సరంగు, నిస్సహాయుడై పోయాడు. పడవ మునుగుతుందనే భయం ఎక్కువై "మీ ప్రాణాలకై భగవంతుణ్ణి ప్రార్థించండి" అని ప్రయాణీకులకు సూచించాడు. ప్రయాణీకులు భగవంతుణ్ణి హృదయ పూర్వకంగా ప్రార్థించనారంభించారు; పడవ సరంగు తన తెడ్డుని అవతలికి విసిరేసి రెండు చేతులు జోడించి దణ్ణం పెట్టుకుంటూ వారందరితోనూ ప్రార్థన కీర్తనల్లో పాల్గొన్నాడు. కానీ పడవ మునగనే మునిగింది. ప్రయాణీకులు పడవ సరంగుతో సహా నీటిలో మునిగిపోయారు. కానీ ఆ సమయాన స్వర్గం నుండి ఓ విమానం అక్కడికి వచ్చింది. దానిలో యాభై సీట్లు వున్నై; నీట మునిగిన ఆ యాభైమంది ప్రయాణీకుల్ని ఆ విమానం సీట్లలో కూర్చోబెట్టుకున్నారు. పడవ సరంగు తన ఒక్కణ్ణి వదిలేసి పోతున్నారేమని ఆత్రంగా అడగగా, మిగతా అందరితోబాటు తానూ తెడ్డువేస్తూ తననీ, తన పడవనూ, అందులోని ప్రయాణీకులనూ రక్షించకోవడంలో నిమగ్నమయ్యే బదులు, 'తెడ్డు విసిరేసి దణ్ణాలు పెడుతూ భజనచేస్తూ బాధ్యతారహితంగా ప్రవర్తించావనీ, అందువల్ల నీకీ గతి తప్పలేదనీ' తెలియజేసి ఆ విమాన చోదకులు వెళ్ళిపోయారు.

# విభిన్న సంస్కృతులు



**1898** సంవత్సరంలో బ్రిటన్‌లోని టెలిగ్రాఫ్ పత్రిక 'మార్కోనీ నిస్తంత్రి (Wireless) ని, బోస్ కనుగొన్నాడు' అనే శీర్షికతో ప్రచురించిన వార్త ఓ సంచలనాన్ని సృష్టించింది. పత్రికలోని కథనం ప్రకారం, 'కొహిరర్' అనే కనిపెట్టే యంత్రాన్ని భారతీయ శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ సృష్టించిన రెండేళ్ళకు, మార్కోనీ తన వైర్‌లెస్‌ను అభివృద్ధి పరచుకోడానికి వాడుకున్నాడు' అన్నారు.

దీని పూర్వరంగమేమిటో చూద్దాం. 1895 సంవత్సరంలో కలకత్తా నగరంలో కొందరు విజ్ఞానులకు బోస్ ఒక ప్రదర్శన ఏర్పాటుచేశాడు. రేడియో తరంగాలను, ఇటుక గోడలను కూడా ఛేదించుకొని డెబ్బై అయిదు అడుగుల అవతలనున్నచోటులో వినిపించే వీలుందని ప్రత్యక్షంగా వారికి నిరూపించాడు. ఇది చూచి, వారంతా చాలా అబ్బురపడ్డారు. బోస్ తయారుగావించిన ఈ 'కొహిరర్'ను, చాలా మెచ్చుకున్న వారిలో బ్రిటిష్ నావికాధి కారులు కూడా ఉన్నారు. ఈ పనిముట్టుని వాడుకొని ఒక టార్పిడో నావకూ, తమ మిత్ర పక్షానికి చెందిన స్టీమర్ల మధ్యకూ రేడియో సంబంధాలు పెట్టుకోగలిగారు.

మే మాసం 1901లో బోస్ ఇండియాలోని శ్రీ రవీంద్రనాథ్ టాగూర్‌కు ఉత్తరం వ్రాస్తూ, ప్రముఖ టెలిగ్రాఫ్ కంపెనీ ప్రొప్రయిటర్ పేటెంట్ హక్కు కాగితమొకటి చేత నిడుకొని నావద్దకొచ్చాడు. ఆ 'కొహిరర్' పేటెంటు హక్కు సంపాదించి, ఆ పరికరాల్ని తయారుచేసి, ఇద్దరమూ కలిసి అమ్ముకుందామనీ, ఈ వ్యాపారంలో పెట్టుబడి పెట్టడం, ఇతర ఖర్చులు భరించడం అంతా తనవంతనీ, లాభాలలో చెరిసగమని ప్రతిపాదించాడు. మిత్రమా, ఈ దేశ (ఇంగ్లాండు) వాసులకు డబ్బుమీద వున్న కాంక్ష చూసి తీరవలసిందే.

డబ్బే సమస్తం, ఇంకా డబ్బు మరింత డబ్బు. ఒకసారి గనక దీనిలో చిక్కుకున్నానంటే, ఇక దీనినుండి విడివడే అవకాశముండదు.

ధనం యెడల జగదీశ్ చంద్రబోస్ వైఖరిని చూచి విసుగుచెందిన ఇద్దరు పాశ్యాత్య వనితలు (ఇద్దరూ బోస్ అభిమానులు) మార్గరెట్ నోబెల్ (సిస్టర్ నివేదితగా ప్రసిద్ధి చెందిన స్త్రీ) అమెరికా దేశస్థురాలు మిసెస్ సారాబుల్, తమంతటతామే పూనుకొని, 1904 లో బోస్ పేరిట పేటెంట్ హక్కు సంపాదించారు.

ఈ విషయం గురించి 2002 సంవత్సరంలో భారత ప్రభుత్వ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ డైరెక్టర్ జనరల్ శ్రీ ఆర్. మషేల్కర్ ఇలా వ్యాఖ్యా నించారు. 'ఆశ్చర్యం గొలిపే విషయమేమిటంటే సిస్టర్ నివేదిత తన జీవితాన్ని అధ్యాత్మికతకు అంకితం చేసింది. మరి ఆవిడ ఈ పేటెంట్ హక్కు, బోస్ పేరిట సంపాదించి అతడికి రావలసిన కీర్తి ధనం అతడికి చెందాలని కృషి సల్పగా, ఫిజిక్స్ ప్రొఫెసర్ అయిన బోస్ ధనంమీద దృష్టి లేకుండా, శాస్త్ర పరిశోధనే ప్రధానమని ఎంచి జీవితంలో దానికొఅకే కృషిసల్పుతుండేవాడు. వీరి వీరి స్వభావాలు ఇలా వుండటానికి కారణం సిస్టర్ నివేదిత ఆధ్యాత్మిక రంగానికి చెందినప్పటికీ, జన్మించడం పారిశ్రామికీకరణకు లోనైన యూరప్ ఖండంలో జరిగింది. బాహ్యంగా ఆధ్యాత్మికత జోలికి పోకుండా శాస్త్ర పరిశోధన రంగంలో వుండిపోయి, దానికే అంకిమైన జగదీష్ చంద్రబోసేమో భారతీయ సంస్కృతిలో జన్మించాడు మరి' అంటాడు.

'ధనవ్యామోహం ఈనాడు అన్ని ఖండాల్లో అందరి దేశవాసులలోనూ కనిపిస్తూన్నది. ఈ వ్యామోహానికి గురికాకుండా కొందరు వ్యక్తులు, కొన్ని చిన్న గ్రూపులు చెదురుమదురుగా అక్కడక్కడా కనిపిస్తుంటారు' అన్నాడు మిత్రశ్రీ.

'నైమిశం' పుస్తక సమీక్ష

# ధర్మవర్తన కోసం తపన

## నరులను మానవులుగా ఉన్నతీకరించే నిజాయతీతో కూడిన ప్రయత్నం

**ఈ** మధ్య జరిపిన సర్వేలలో, ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో యువతరం ఎక్కువగా భక్తి మార్గాల్లోకి మళ్ళుతున్నట్టుగా, ఆధ్మాత్మికత పట్ల, భారతీయ సంప్రదాయాల పట్ల యోగా వంటి వారసత్వ కళల పట్ల ఆసక్తి కనబరుస్తున్నట్టు వెల్లడవుతోంది. కారణాలేమైనా ఈ పరిణామం హర్షించదగ్గదే. రోజురోజుకూ పేట్రేగిపోతున్న అతి స్వేచ్ఛ, విశృంఖలత్వంగా పరివర్తన చెందుతున్న స్వాతంత్ర్యం, అడుగంటిపోతున్న నైతిక విలువలు, అవినీతి ప్రస్తుత సమాజపు లక్షణాలుగా మారిపోయాయి. సమాజం బహిరంగ దోపిడీకి గురవుతోంది. ఇందులో ఇప్పటి తరానికి కూడా కొంత భాగం ఉంది. ఇది అన్ని సామాజిక రంగాల్లోనూ ఆందోళన కలిగిస్తోంది. అటువంటి ప్రస్తుత తరుణంలో మనిషిని మళ్ళీ ఉద్ధరించేదీ, పునర్నిర్మించేదీ కేవలం ధర్మానువర్తన, పునః సంధించుకోవాల్సిన మన పూర్వ ఆర్ష సంస్కారమేనని గ్రహించి, ఒక సామాజిక చికిత్సగా రూపొందించి ఎవరికి వారు ఆత్మానుశీలన చేసుకోవడానికి ఉపయోగించే పాఠంగా రాసి అందించిన 'మంచి మాటల కదంబం' ఈ నైమిశం. ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడంవల్ల మానవ వ్యవస్థ ఎంత సుసంపన్నమవుతుందో తెలియజేసే అరవై రెండు చిన్న కథలను ప్రపంచవ్యాప్త మూల గ్రంథాల నుంచి ఎన్నో ప్రయాసలకు ఓర్చి సేకరించి నీలంరాజు లక్ష్మీప్రసాద్ ఈ పుస్తకంలో వెలువరించారు. ఈ కథలన్నీ మనిషిలోని మూల విలులను గ్రహింపజేసి ఎవరికి వారు ఆత్మ సమీక్షతో, ఆత్మ శోధనతో, వివేచనతో తమను తాము పునర్నిర్మింపజేసుకోవడానికీ, ఉన్నతీకరించుకోవడానికీ ఉద్దేశించినవి, ఉపయోగపడేవి.

ఈ కథల సంపుటికి 'నైమిశం' అనే మకుటం కూడా లక్ష్మీప్రసాద్ లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తోంది. సూతుడు శౌనకాది మహర్షులకు ధర్మబద్ధమైన పవిత్ర జీవితాలకు సంబంధించిన పురాణ గాథలను వినిపించిన పుణ్యారణ్యమే నైమిశమని, బ్రహ్మజ్ఞానులైన కొందరు బ్రహ్మ వద్దకేగి తాము తపస్సు చేసుకోవడానికి తగిన చోటు చెప్పమని కోరినప్పుడు, బ్రహ్మ దర్భలతో రథం చేసి విసిరితే దాని 'నేమి' పడిన చోట నైమిశారణ్యం

ఏర్పడిందని స్కాంద పురాణం చెబుతోంది. ప్రశాంతతకు, జ్ఞాన సముపార్జనకు తగిన ప్రాంతమైన నైమిశం ద్వారా వర్తమాన పాఠకులకు కూడా నీలంరాజు లక్ష్మీప్రసాద్ ఈ నైతికత పునరుద్ధరణ ప్రయత్నాన్ని కొనసాగించడం ఎంతయినా అభినందనీయమైన విషయమే.

ఈ పుస్తకం యొక్క జీవధాతువు వంటి సారాన్ని ఈ ఉటంకనను పరిశీలించడం ద్వారా తెలుసుకోవచ్చు. 'వరం కోరుకోమని ఆ దేవతా పురుషుడనగానే తన భర్తకు ఆనందాన్ని అనుగ్రహించమని కోరిందామె. ఆ దేవతా పురుషుని ముఖాన విచార రేఖలు అలముకున్నాయి.' అమ్మా, దేవుడైనా మరొకరికి ఆనందాన్ని కలుగజేయలేడమ్మా. ఆనంద మనేది ఎవరికి వారు సాధించుకోవలసిందే కాని, ఒకరు మరొకరికి ఇవ్వగలిగింది కాదమ్మా. నీకు కావాలనుకుంటే భూములిస్తాను, భాగ్యమిస్తాను కానీ, నువ్వడిగింది మాత్రం నేనివ్వలేను. సాక్షాత్తూ ఆ బుద్ధుడైనా ఇలా చేస్తే ఆనందంగా జీవించగలవని త్రోవ చూపించ గలడే గానీ, మరొకరికి ఆనందం అనుగ్రహించలేడమ్మా" అని అదృశ్యమైపోయాడా దేవతా పురుషుడు.

కేవలం భారతీయ పురాణ ఉపనిషత్ వాఙ్మయం నుంచి, ఆధ్మాత్మిక గ్రంథాల నుంచే కాక అరబ్, పర్షియా, యూదు, సూఫీ, చైనా, ఇరాన్, ఇస్లాం వంటి అనేక వనరుల నుంచి కూడా సేకరించిన రెండు మూడు పేజీలకు మించని చిన్ని కథలు పాఠకులను ఎంతో ఆసక్తికరంగా చదివింపజేస్తాయి, ఆనందింపజేస్తాయి, ఆలోచింప జేస్తాయి. కొద్దిసేపు మనసులో అలజడిని రేపి ఆత్మ సమీక్షకు ప్రేరేపిస్తాయి. ఈ పుస్తక లక్ష్యం కూడా అదే కదా. ఇదివరకు *ఇతి స్మరణీయం, అతి రమణీయం. స్వేచ్ఛకై తపించిన జగద్గురువు, కాన్వర్సేషన్ విత్ జె. కృష్ణమూర్తి* వంటి ఉపయుక్తమైన ఆధ్యాత్మిక గ్రంథాలను వెలువరించిన లక్ష్మీప్రసాద్ ఇప్పుడు కొత్తగా వెలువరించిన ఈ నైమిశం కూడా ధర్మ చింతనులైన పాఠకులకు ఎంతో నచ్చుతుంది. తప్పకుండా అలరిస్తుంది.

**రామా చంద్రమౌళి**

(ఇండియా టుడే)

# రచయిత ఇతర గ్రంథాలు

| | | |
|---|---|---|
| 1. | ఇతి స్మరణీయం అతి రమణీయం (రమణ మహర్షి వృత్తాంతము) | 60/– |
| 2. | చరిత్రలో ఈ పేరు మిగిలేనా? (ఆధ్యాత్మిక ఇతివృత్తాలు) | 60/– |
| 3. | స్వేచ్ఛకై తపించిన జగద్గురువు (ఆధ్యాత్మిక ఇతివృత్తాలు) | 70/– |
| 4. | నైమిశం (ఆధ్యాత్మిక ఇతివృత్తాలు) | 70/– |
| 5. | Conversations with J. Krishnamurti | 150/– |
| 6. | Under the Bodhi Tree | 100/– |
| 7. | మూడు ముద్రణలు | 80/– |
| 8. | అమృతధార – ఖడ్గధార | 80/– |
| 9. | నీలంరాజు వేంకటశేషయ్య జీవితం | 100/– |
| 10. | జిడ్డు కృష్ణమూర్తి నాకు తెలుసా? | 150/– |
| 11. | పునర్జన్మ ఉన్నట్టా ! లేనట్టా? (రమణ మహర్షి వృత్తాంతాలు) | 150/– |
| 12. | 'కేటీ' సత్యదర్శనం | 150/– |
| 13. | శూన్యమనస్కత | 80/– |
| 14. | ఒంటరితనము...ఏకాంతము | 80/– |
| 15. | ప్రేమానుబంధం | 80/– |
| 16. | భారతీయుణ్ణని సగర్వంగా ప్రకటించు | 150/– |
| 17. | తెలిసీ ఒకటే, తెలియకా ఒకటే | 80/– |
| 18. | అంతటా...అతడే | 150/– |
| 19. | అనాయాసంగా ఆత్మజ్ఞానమా? | 150/– |
| 20. | అన్నామలైకు అర్థమైంది, మరి మనకేమైంది? | 70/– |
| 21. | మార్పు ఉన్నది కానీ మరణం లేదు | 150/– |
| 22. | జిడ్డు కృష్ణమూర్తి...కర్మాచరణ | 50/– |
| 23. | నిజ భక్తుని కులమేది? | 150/– |

# ఇతర పబ్లిషర్స్ ప్రచురించిన ఈ రచయిత గ్రంథాలు

| | పబ్లిషర్స్ : |
|---|---|
| 1. జిడ్డు కృష్ణమూర్తి జీవితం<br>2. గురువూ నీవే, శిష్యుడూ నీవే<br>3. స్వరూప దర్శనం | జిడ్డు కృష్ణమూర్తి సెంటర్<br>6-3-347/5,<br>ద్వారకాపురి కాలనీ, పంజాగుట్ట,<br>హైదరాబాద్-500082.<br>ఫోన్ : 23357889 |
| 4. సత్యాన్వేషణ (ఓషో అనువాదం) | పిరమిడ్ గ్రాఫిక్స్<br>16-11-477/బి/3<br>సి.యన్. రెడ్డి కాంప్లెక్స్,<br>దిల్‌సుఖ్‌నగర్,<br>హైదరాబాద్-60. |
| 5. పట్టుదలతో<br>సాధించలేనిదేముంది? | ప్రగతి పబ్లిషర్స్<br>33-11-275/1,<br>శ్రీశంకర్ కాలనీ, ఎల్.బి. నగర్,<br>హైదరాబాద్-500074. |
| 6. చైనాబజార్ నుండి<br>అబీద్ సర్కిల్ వరకు<br>తెలుగరవం కథలు - (ఏళుమళై) | ద్రావిడ విశ్వవిద్యాలయం<br>శ్రీనివాసవనం<br>కుప్పం - 517425. |
| 7. జిడ్డు కృష్ణమూర్తి దృక్పథంలో విద్య | విశాలాంధ్ర బుక్ హౌస్<br>4-1-435, విజ్ఞాన్ భవన్ |
| 8. ఆలోకన - 1<br>(సామాజిక - ఆధ్యాత్మిక<br>వ్యాస సంపుటి) | విద్యార్థి మిత్ర ప్రచురణలు<br>ఫ్రెండ్స్ బుక్ డిపో<br>కర్నూలు - 518001.<br>సెల్ : 9441373304 |

| | |
|---|---|
| 9. ఆలోకన – 2<br>(సామాజిక ఆధ్యాత్మిక<br>వ్యాస సంపుటి) | - do - |
| 10. దివ్యానుభవమూర్తులు | - do - |
| 11. యూరోపియన్ హిందువులు<br>సామాజిక, వైజ్ఞానిక వ్యాససంకలనం | |
| 12. నీయందె కలదోయి<br>(ఆధ్యాత్మిక వ్యాస సంకలనం) | - do - |
| 13. నీతోనే నీ నీడ<br>(సామాజిక – ఆధ్యాత్మిక<br>వ్యాస సంపుటి) | విద్యార్థి మిత్ర ప్రచురణలు<br>ఫ్రెండ్ బుక్ డిపో<br>కర్నూలు – 518001.<br>సెల్ : 9441373304. |
| 14. ఆ వేణునాదం నువ్వే<br>సామాజిక – ఆధ్యాత్మిక<br>వ్యాససంపుటి | - do - |
| 15. నీ స్వధర్మమేమిటో కనుక్కో<br>(ఆధ్యాత్మిక వ్యాస సంకలనం) | - do - |
| 16. ఇతి స్మరణీయం, అతి రమణీయం<br>(అరుణాచల శ్రీరమణులు) | - do - |
| 17. అమృతధార ఖడ్గధార<br>(నిసర్గదత్త మహరాజ్) | - do - |

మరణం లేదు. కానీ ఉనికిలో సతతం మార్పు జరుగుతూనే వుంటుంది – పునః ప్రారంభం, పునరుద్ధరణ, నవీకరణ సంభవిస్తూనే వుంటుంది. (P. 10)

'నీలో కానీ నాలో కానీ ఒక సీతాకోకచిలుక రూపం ధరించడానికి సిద్ధంగా వున్నదని, నేనెలా నమ్మాలి? కేవలం వెంట్రుకలతో కప్పేసిన పురుగు మాత్రమే నా కంటికగుపిస్తున్నది. (P. 11)

జీవితానికి దుఃఖమనేది ఒక పార్శ్వం మాత్రమే. మరో పార్శ్వం, ఆశ్చర్యాద్భుతాలున్నై. హృదయ గ్రంథులు తెగిపోతే, మనకు ఆ ఆశ్చర్యాద్భుతాలతో ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది. (P. 23)

'నువు భగవంతుడికి అలంకారమవాలి. లేదంటే మనసు తృప్తి చెందదు, దాని తనివి తీరదు. నువు లేకపోతే ఈ ఉనికీ ఆ దేవుడూ కూడా అయ్యో నువు లేకపోతివే!' అనేట్లు జీవించు. (P. 75)

నా తండ్రి నా వంక జాగ్రత్తగా చూచి అబద్ధం చెప్తున్నానని గ్రహించాడు. అటు తర్వాత, నా తండ్రి చేసిన పని  నేనెన్నటికీ మరువలేను. ఆయన తన మోకాళ్ళను నేలకానిస్తూ, మృదువుగా నాతో 'నాయనా, మాతో నీవేనాడూ అబద్ధం చెప్పాల్సిన అవసరం లేదు. నిన్ను మేము ప్రేమిస్తున్నాం బాబూ' అన్నాడు. (P. 46)

ఆధునిక కాలంలో హిందూమతం అంతర్గ్రాహ్యత కలిగుండాలా ప్రత్యేక సురక్షిత, అనితర మతంగా మిగిలిపోవాలా? (P. 69)

సభ్యత్వం ఆశించి వచ్చినవాడు మండిపడుతూ, ఆ నికృష్టుడు భగవంతుడంటున్నారా? అన్నాడు. 'అతడిలో నీకు భగవంతుడు కనిపించకపోతే, నీకు భగవంతు డెక్కడా కనిపించదు' (P. 72)



నీలంరాజు లక్ష్మీప్రసాద్

రెండు భాషల్లోని ఈ రెండు భాగాలను కలిపి చదువుతూ వుంటే, ఒకరి నోటి నుండే ఈ రెండు భాషల్లోని వాక్యాలు వెలువడ్డాయని స్పష్టంగా అనిపించింది. 'తన' రాజ్యంలోని ఒక ప్రాంతంలో ఆ 'చక్రవర్తి' అరబిక్ భాషలో ప్రసారం చేసినట్లూ, మరొక ప్రాంతంలో సంస్కృత భాషలో ప్రసారం చేసినట్లూ తోచింది. (P. 103)

"బుద్ధుడవాలనే కోరికే, బుద్ధుడవడానికి పెద్ద అవరోధ"మన్నాడు నాగార్జునుడు. (P. 105)

'సన్నివేశాలు నా గురువు యొక్క కంఠస్వరం. పరిస్థితులే నా గురువు అక్కడ ప్రవేశించినట్లు భావిస్తాను.' (P. 129)

ఛోగ్యామ్ ట్రుంపా

